

'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే అట్టడుగు వర్గాలకు చేరుతుంది. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం

వెల: ₹ 7.00

సంపుటి: 18
సంచిక: 147

SUNDAY Special

ఆదివారం 17-8-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL





### గూగుల్‌ని అడిగేస్తూ... చెప్పింది చేసేస్తూ...

ఒకప్పుడు ఏ అనారోగ్య సమస్య వచ్చినా వైద్యుడి దగ్గరికి వెళ్లేవాళ్లం. ఇప్పుడు ఇంటర్నెట్ కాలం నడుస్తోంది. ఏ సమస్య తలెత్తినా ఏం చేయాలో గూగుల్‌ను అడిగేస్తున్నారు!

- వివరాలు 5లో




### గేమ్ చేంజర్ జీఎస్టీ సంస్కరణలు

జీఎస్టీ మార్పులను 'కొత్త తరం' గేమ్ చేంజర్ సంస్కరణలుగా ప్రభుత్వాధికారులు అభివర్ణించారు. ఇవి 2047 నాటికి ఒకే శ్లాబ్ దిశగా బాటలు వేస్తాయని చెబుతున్నారు.

- వివరాలు 2లో



### నేడు స్వదేశానికి శుభాంశు శుక్లా

ఐఎస్ఎస్‌లో గడిపి చరిత్ర సృష్టించిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా ఆదివారం అమెరికా నుంచి స్వదేశానికి రానున్నారు.

- వివరాలు 6లో ▶



### అలాగైతే గందరగోళమే..

రాష్ట్రాల బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్లకు కోర్టులు టైమ్‌లైన్ విధిస్తే రాజ్యాంగవరమైన గందరగోళం తలెత్తుతుందని కేంద్రం పేర్కొంది.

- వివరాలు 6లో ▶



### రక్తపోటు పెంచేస్తున్న సూరీడు

రాత్రి పగలూ తేడా లేకుండా ఎప్పుడైనా సరే రక్తపోటును సూరీడు ప్రభావితం చేస్తాడనే కొత్త విషయం వెలుగులోకి వచ్చింది.

- వివరాలు 6లో ▶



### 'రంగు' భళా.. ఆరోగ్యం డీలా!

భోజన ప్రియులను నోరూరించే రంగుల ఆహార పదార్థాల వెనుక ఉన్న రసాయనాలు ఆరోగ్యానికి సవాలు విసురుతున్నాయి.

- వివరాలు 3లో ▶

# ఒక్కటి దాటినా కోతే!

## 'గృహజ్యోతి' ఉచిత విద్యుత్ పథకం కుదింపు యోచనలో ప్రభుత్వం

- ప్రస్తుతం 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే వారికి ఈ పథకం వర్తింపు
- ఇకపై ఏ నెలలో అయినా ఒక్కసారి 200 యూనిట్లు దాటితే లబ్ధిదారులకు ఉచిత విద్యుత్ బంద్!
- కొత్తగా ఈ పథకంలో దరఖాస్తులను అంగీకరించొద్దని నిర్ణయం
- ప్రస్తుతం 51.26 లక్షల ఉచిత విద్యుత్ కనెక్షన్లు..
- వీటికి ప్రతినెలా రూ.185-200 కోట్ల వ్యయం
- సబ్సిడీ భారం తగ్గించుకునేందుకు ఉన్నతస్థాయిలో చర్చలు




సాక్షి, హైదరాబాద్: విద్యుత్ వినియోగం నెలకు 200 యూనిట్లలోపు ఉంటే గృహజ్యోతి పథకం కింద లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ ఇస్తోంది. అయితే, ఈ పథకం లబ్ధిదారుల ఇంట్లో ఏదైనా శుభకార్యం జరిగి విద్యుత్ వినియోగం 200 యూనిట్లకు మించితే వారు పథకానికి అర్హత కోల్పోనున్నారా? అంటే అవుననే అంటున్నాయి రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు. ఈ మేరకు గృహజ్యోతి పథకాన్ని కుదించే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిశీలిస్తోందనే చర్చ జరుగుతోంది. గృహజ్యోతి పథకం కింద ఇప్పటికే ఉన్న లబ్ధిదారుల సంఖ్యను కట్టడిచేయడంతోపాటు కొత్త లబ్ధిదారులు పెరగకుండా కసరత్తు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీనికోసం ఈ పథకం కింద కొత్తగా వచ్చిన దరఖాస్తులను కూడా పక్కనపెట్టాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఉచిత విద్యుత్ వినియోగదారుల సంఖ్య ఏటా పెరుగుతూపోతే ఆర్థిక భారం భారీగా పెరిగిపోతుందన్న ఆందోళనతో లబ్ధిదారుల సంఖ్యను కుదించాలని సర్కారు యోచిస్తున్నట్లు చెబుతున్నారు.

**16 నెలల్లో 12 లక్షల మంది పెరిగారు..**

గృహాలకు ప్రతినెలా 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించింది. అధికారంలోకి వచ్చాక 2024 మార్చి నుంచి గృహజ్యోతి పథకం అమలును ప్రారంభించింది. 2023 డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమం కింద

మిగతా 2వ పేజీలో ▶

**తెల్ల కార్డులు 93 లక్షలు..**

గృహజ్యోతి పథకం మార్గదర్శకాల ప్రకారం తెల్లరేషన్ కార్డు ఉన్నవారంతా అర్హులు. రాష్ట్రంలో దాదాపు 93 లక్షల తెల్లకార్డులు ఉన్నాయి. ప్రస్తుతం ఉచిత విద్యుత్ లబ్ధిదారులు 51.26 లక్షల మంది ఉన్నారు. అయితే, 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే అర్హుల సంఖ్య పెరిగితే.. ఆ మేరకు ప్రభుత్వంపై ఆర్థిక భారం పెరుగుతుంది. సకాలంలో డిస్కంలకు ఆ నిధులు చెల్లించకుంటే ఆ సంస్థలు ఆర్థికంగా ఇబ్బందులు పడే అవకాశం ఉంటుంది. ఉచిత విద్యుత్ కోసం ప్రభుత్వం ప్రతినెలా రూ.185 కోట్ల నుంచి రూ.200 కోట్ల వరకు డిస్కంలకు సబ్సిడీగా చెల్లిస్తోంది. వినియోగదారుల సంఖ్య పెరిగితే సబ్సిడీ మొత్తం కూడా భారీగా పెరుగుతుంది. అందువల్ల 200 యూనిట్లకు మించి విద్యుత్ వినియోగించే వారిని అనర్హులుగా ప్రకటిస్తే ఖజానాపై భారం గణనీయంగా తగ్గుతుందని అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి.



చర్చల అనంతరం సంయుక్త సమావేశంలో మాట్లాడ్డానికి అలస్కాలోని జాయింట్ బేస్ ఎల్మెండార్ఫ్-రిచర్డ్‌సన్‌కు వస్తున్న పుతిన్, ట్రంప్

# ఉత్కంఠతో మొదలై.. ఉసూరుమనిపించి..

## నిష్ఫలంగా ముగిసిన ట్రంప్, పుతిన్ చర్చలు

- శాంతి ఒప్పందం దిశగా అడుగేయని భేటీ
- అలస్కా సమావేశంలో కనిపించని పురోగతి
- రష్యాలో తదుపరి చర్చలు!
- ఉక్రెయిన్‌లో కాల్పుల విరమణ సాధ్యంకాక పోవడంతో నిట్టూర్చిన ప్రపంచదేశాలు
- పుతిన్‌దే పైచేయి అంటూ ట్రంప్‌పై విమర్శలు

6లో

### పుతిన్‌దే పైచేయి!

- అలస్కాలో అడుగుపెట్టింది మొదలు వెళ్లేదాకా తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించిన పుతిన్
- యుద్ధం, శాంతి, కాల్పుల విరమణ పదాలను మాటవరసకైనా ప్రస్తావించని ట్రంప్

### రేపే ట్రంప్, జెలెన్‌స్కీ భేటీ

- వాషింగ్టన్‌లో కలవనున్న దేశాధినేతలు
- యుద్ధాన్ని ముగించడంపై చర్చ

6లో

### ట్రంప్-పుతిన్ చర్చలను స్వాగతించిన భారత్

## న్యూస్‌రీల్

### స్లీప్‌లోకి స్లిప్



కొందరు ఎక్కడుంటే అక్కడ నిద్రలోకి జారిపోతుంటారు. అయితే నిద్రకు ఉపక్రమించినప్పుడు నిద్రపట్టడానికి, తెలియకుండానే నిద్రలోకి జారిపోవడానికి చాలా తేడా ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

- వివరాలు 13లో ▶

### 'ఖజానా' దోచింది బిహార్ గ్యాంగే!




సంచలనం సృష్టించిన ఖజానా జ్యువెలరీ దోపిడీ కేసులో బిహార్‌కు చెందిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. త్వరలోనే మిగతా వారందరినీ పట్టుకుంటామని డీసీపీ వినీత్ తెలిపారు.

- వివరాలు 16లో ▶

### ఓసీ లేకుండా విద్యుత్ కనెక్షన్ కుదరదు



మున్సిపల్ అధికారులిచ్చే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ సమర్పించకుండా బహుళ అంతస్తుల భవనాలకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం కుదరదని హైకోర్టు తేల్చిచెప్పింది. ఇష్టారాజ్య నిర్మాణాలను సమర్థించలేమంది.

- వివరాలు 3లో ▶

### మేమెక్కడికి పోవాలె...



ఆ ఊళ్లో మూడు తరాల జీవనం గడిచిపోయింది. ప్రస్తుతం నాలుగో తరం జీవనం సాగిస్తోంది. 200 ఏళ్లకుపైగా అక్కడే స్థిర నివాసం ఏర్పరచుకున్న ఆ పల్లెవాసులకు ఇప్పుడు దేవాదాయ శాఖ రూపంలో ఆపద ముంచుకొచ్చింది.

- వివరాలు 5లో ▶



# పార్లమెంటు తరహాలో అసెంబ్లీ ప్రాంగణం

### చారిత్రక భవనానికి రాజసం ఉట్టిపడేలా ఏర్పాట్లు

- ప్రధాన భవనం చుట్టూ ఉన్న ఇతర నిర్మాణాల తొలగింపు
- ఉద్యానవన విభాగ స్థలాలు సేకరించి వాటిలో నిర్మాణాలు
- జూబ్లీహాలు, ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియం, బాలభవన్‌ల రీమోడలింగ్... 3 రకాల ప్రణాళికలకు రూపు..
- సీఎం ఆమోదించే తుది ప్రణాళిక ప్రకారం పనులు

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీలో పార్లమెంటు భవనం పరిసరాలు ప్రత్యేకంగా ఉన్న తరహాలోనే తెలంగాణ శాసనసభ ప్రాంగణాన్ని కూడా రాజసం ఉట్టిపడేలా తీర్చిదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం ఉభయసభలున్న ప్రాంగణం యావత్తు కొంత గందరగోళంగా ఉంది. వారసత్వ భవనం అయినప్పటికీ, ప్రధాన భవనానికి చేరువలో ఇతర భవనాలుండటంతో ఆ భవన ప్రత్యేకతకు కొంత భంగంవాటిల్లుతోందని ప్రభుత్వం భావిస్తోంది. సభ జరిగే సమయంలో వాహనాలకు సరైన పార్కింగ్ వసతి లేకపోవటంతో ప్రధాన భవనం చుట్టూరా నిలుపుతున్నారు. చారిత్రక ప్రాధాన్యం ఉన్న భవనం అయినప్పటికీ, దాని ప్రత్యేకతను ఇనుమడింపజేసేలా పచ్చిక బయళ్లు లేకపోవటం వెలితిగా ఉంది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ప్రధాన భవనానికి అతి చేరువలో ఉన్న ఇతర భవనాలను తొలగించి.. కొంచెం దూరంగా, క్రమపద్ధతిలో కొత్త భవనాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. శాసనసభ్యులు, మండలి సభ్యులు, వీఐపీలకు ఆ భవనంలో చాలినన్ని వసతులు లేవని, అందుకు ప్రత్యేకంగా మరో భవనం నిర్మించి వసతులు కల్పించాలని



మిగతా 3వ పేజీలో ▶



శనివారం ఉదయం నుంచి ఏకధాటిగా కురిసిన భారీ వర్షానికి జలదిగ్బంధంలో చిక్కుకున్న ఆదిలాబాద్ పట్టణంలోని సుభాష్‌నగర్. ఓ ఇంటిని వరదనీరు ముంచెత్తడంతో.. ఆ ఇంట్లోని వారిని డీడీఆర్ఎఫ్, ఫైర్, పోలీస్ బృందాలు రక్షించాయి - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

# వాగులు, వంకలు ఏకం

### రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు

- పలు జిల్లాల్లో పొంగుతున్న వాగులు
- నిండుకుండల్లా మారిన జలాశయాలు
- వరదలతో పలుచోట్ల తెగిన రోడ్లు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- కాలనీలను ఖాళీ చేయించిన అధికారులు
- ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్‌లో దెబ్బతిన్న పంటలు

12లో

### అప్రమత్తంగా ఉండండి



- భారీ వర్షాల నేపథ్యంలో అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం
- క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని సూచన

- వివరాలు 12లో

### పోటెత్తిన గోదావరి

- ఎగువ ప్రాంతంలోనూ భారీ వరద
- పోటెత్తుతున్న దిగువ గోదావరి ప్రాంతం
- కడెం, నిజాంసాగర్, శ్రీరాంసాగర్‌లో పెరిగిన ప్రవాహాలు

- వివరాలు 12లో




# పోలవరం కొట్టుకుపోయినా ఎన్డీఎస్ఏకు కనిపించదా?

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- పోలవరం కాఫర్ డ్యామ్‌కు రహస్య మరమ్మతులు ఎందుకు?
- 20 నెలలు కావస్తున్నా మేడిగడ్డకు మరమ్మతులు ఎందుకు లేవు?

సాక్షి, హైదరాబాద్: సాక్షాత్తు ఎన్డీయే ప్రభుత్వం జాతీయ హోదా ఇచ్చి మరీ నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు కాఫర్ డ్యామ్ రెండోసారి కొట్టుకుపోయినా ఎన్డీఎస్ఏకు కనిపించడం లేదా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. కాళేశ్వరంలోని మేడిగడ్డలో రెండు పిల్లర్లకు పగుళ్లు వస్తే 'కూలేశ్వరం'అని కారుకూతలు కూసిన కాంగ్రెస్, బీజేపీ నేతలకు పోలవరంను.. 'కూలవరం'అనే ధైర్యం ఉందా? అని శనివారం ఆయన

మిగతా 2వ పేజీలో ▶

## ఇదండీ జగత్



త్వరగా సమాధానం ఇవ్వకుంటే 'లాపతా ఈసీ' అని కూడా పెడతార్సార్!

# డిజిటల్ పునర్జన్మ!



### మరణించినా.. మాట్లాడొచ్చు

- భౌతిక మరణాన్ని జయించేలా ఏఐ టూల్స్
- సాంకేతిక వనరులతో జీవం పోసి కొన్ని రూపాల్లో కృత్రిమ మేధతో కృషి
- క్రమంగా పెరుగుతున్న 'గ్రీఫ్ టెక్' వినియోగం
- ఇది వరమా? శాపమా?

**మనకిష్టమైన వారు భౌతికంగా మరణించినా మనం వారితో మాట్లాడొచ్చు. ఇదెలా సాధ్యం? భవిష్యత్‌లో చోటుచేసుకోబోయే మార్పుల గురించి ముందుచూపుతో ఊహించే కొంతమంది శాస్త్రవేత్తలు చెబుతున్న దానిని బట్టి చూస్తే.. మనం సాంకేతిక అమరత్వాన్ని సాధించవచ్చనే అభిప్రాయం వ్యక్తమౌతోంది. ప్రస్తుతం ఆ పరిస్థితులకు మనం కొంత దూరంలో ఉన్నప్పటికీ ఆ దిశలో కొన్ని ప్రయత్నాలు మొదలయ్యాయి.**

సాక్షి, హైదరాబాద్: కృత్రిమ మేధ (ఏఐ) అనేది మరణించిన వ్యక్తులను వారి స్వరం, ప్రవర్తన, నిర్ణయం తీసుకునే విధానం తదితర అంశాల ద్వారా 'సజీవంగా'నిలిపే అవకాశాలను మెరుగుపరుస్తోంది. మీరు షేర్ చేసే ప్రతి ఫొటో, మీరు పంపే పోస్ట్, వాయిస్ నోట్ వంటివి డిజిటల్ డీఎన్ఏగా మారుతున్నాయి. ఇలాంటి సాంకేతిక వనరులకు జీవం పోసి కొన్నిరూపాల్లో చావును అధిగమించే దిశలో కృతిమ మేధ (ఏఐ) ద్వారా కృషి జరుగుతోంది. ఇది అర్థంకాని సైన్స్ ఫిక్షన్‌లాగా కనిపిస్తున్నప్పటికీ భవిష్యత్‌లో ఇలాంటివి 'గ్రీఫ్‌టెక్'ద్వారా వాస్తవరూపం దాల్చే పరిస్థితులు ఉన్నాయని నిపుణులు ఘంటాపథంగా చెబుతున్నారు. ఈ గ్రీఫ్‌టెక్ వినియోగం ఇప్పుడిప్పుడే మొదలైందని అంటున్నారు.

**ఏమిటీ 'గ్రీఫ్ టెక్'?**

2020లో దక్షిణ కొరియా టీవీషో ఒక అవాస్తవ పునఃకలయికను ప్రసారం చేసింది. శోకతప్తమై దుఃఖిస్తున్న ఓ తల్లి వర్చువల్ రియాలిటీ (వీఆర్) ద్వారా మరణించిన తన కుమార్తెతో సంభాషించింది. డిజిటల్ సాంకేతిక సహకారంతో ఆ బిడ్డ కదిలింది, మాట్లాడింది, తల్లి ప్రశ్నలకు ప్రతిస్పందించింది. ఇది వాయిస్ నమూనాలు, వీడియో ఫుటేజ్, మెషీన్ లెర్నింగ్ ఆధారంగా సాధ్యమైంది. దీనినే 'గ్రీఫ్ టెక్'అని పిలుస్తున్నారు. మరణించిన వ్యక్తి ఎలా టెక్స్ట్ చేశాడు, ఎలా జోక్ చేశాడు లేదా ఎలా స్పందించాడు తదితర అంశాల ఆధారంగా అనుకరణ బ్యాట్‌లను సృష్టిస్తున్నారు.

**ఈ అనుభూతులు ఎలా సాధ్యం?**

చనిపోయిన వారిని ఏఐ ద్వారా డిజిటల్ రూపంలో పునర్‌జీవింపచేస్తారు లేదా

మిగతా 3వ పేజీలో ▶



# అబార్షన్.. ఒకటే ఆప్షన్!

### ఐదేళ్లలో రాష్ట్రంలో 917 శాతం పెరిగిన అబార్షన్లు

- 2020–21లో 1,578 అబార్షన్లు జరగ్గా.. 2024–25 నాటికి 16,059
- రాష్ట్రంలో పెరుగుతున్న అబార్షన్ల తీరుపై ఆందోళన
- గర్భస్రావాలకు భిన్న కారణాలు

- వివరాలు 5లో

## క్లుప్తంగా...

### బీసీ రిజర్వేషన్లపై త్వరలోనే స్పష్టత

**టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్**



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల్లో బీసీ వర్గాలకు రిజర్వేషన్ల విషయంలో వెనక్కి తగ్గేది లేదని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఆయన శనివారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. కేంద్రం నాన్చుడు ధోరణి నేపథ్యంలో బీసీ రిజర్వేషన్ల విషయంలో ఏం చేయాలన్న దానిపై త్వరలోనే స్పష్టత వస్తుందన్నారు. ఈ అంశంపై పార్టీ పరంగా ఏం చేయాలన్నది రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో నిర్ణయిస్తామని వెల్లడించారు. మార్వాడీలైనా, ఎవరైనా భారతీయులందరికీ దేశంలో ఎక్కడైనా నివసించే హక్కును రాజ్యాంగం కల్పించిందని స్పష్టం చేశారు. మార్వాడీలను వెళ్లగొట్టే హక్కు ఎవరికీ లేదని చెప్పారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యవహారాన్ని క్రమశిక్షణ కమిటీకి సిఫారసు చేశామని తెలిపారు. రాజగోపాల్ ఏం మాట్లాడారో, ఎవరిని ఉద్దేశించి మాట్లాడారో తెలుసుకునేందుకు.. ఆయన వ్యాఖ్యలను పరిశీలించాలని మల్లు రవికి సూచించామని మహేశ్‌కుమార్ తెలిపారు.

### మొద్దు నిద్రలో రేవంత్ సర్కారు

**మాజీ మంత్రి హరీశ్‌రావు**



సాక్షి, హైదరాబాద్: ముసురు వానలో యూరియా కోసం రైతన్నలు రోడ్డెక్కుతుంటే.. మొద్దు నిద్రలో రేవంత్‌రెడ్డి సర్కారు ఉందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. మహబూబాబాద్ జిల్లా గూడూరులో యూరియా కోసం రైతులు పడుతున్న అవస్థ ఇదంటూ.. శనివారం ఎక్స్‌లో పోస్టు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కొరతతో అన్నదాత కలవరపడుతున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. యూరియా కూడా సరఫరా చేయలేని దిక్కుమాలిన ప్రజాపాలనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అభయహస్తం కాదు.. రైతన్నల పాలిట భస్మాసుర హస్తమైందని హరీశ్‌రావు దుయ్యబట్టారు.

### రేవంత్ పాలనతో నిర్మాణరంగం కుదేలు

**బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్**



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డికి విషయం తక్కువ.. విషం ఎక్కువని క్రెడాయ్, స్వాతంత్య్ర దినోత్సవ ప్రసంగంతో తెలిసిపోయిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్ అనేది రెవెన్యూ ఇంజిన్.. నిర్మాణ రంగం బాగుంటేనే అన్నీ బాగుంటాయని చెప్పారు. అలాంటిది భూముల ధరలు పెంచాలని రేవంత్‌రెడ్డి చూస్తున్నారని, దీంతో నిర్మాణ రంగం కుదేలవుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. రేవంత్ పాలనతో హైదరాబాద్ డ్యామేజీ అయిందని, జీహెచ్ఎంసీలో భవన నిర్మాణ అనుమతులు తగ్గిపోయాయని, హెచ్ఎండీఏ కార్యకలాపాలు పడక వేశాయని, రెరాను అడ్డం పెట్టుకుని బిల్డర్లను బెదిరిస్తున్నారని శ్రవణ్ ఆరోపించారు. వ్యక్తులకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పోరాటం చేయడంలేదని ఇటీవల ఎమ్మెల్సీలపై సుప్రీం ఇచ్చిన తీర్పుపై స్పందించారు. రాజ్యాంగం గెలవాలనేదే తమ తాపత్రయం అని, రేవంత్‌రెడ్డి, బీజేపీ, తమిళిసై ఆటలో తాను, సత్యనారాయణతో పాటు కోదండరాం కూడా బలిపశువు అయ్యారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సెప్టెంబర్ 17న సుప్రీం తీర్పు చరిత్రాత్మకంగా ఉంటుందని ఆశిస్తున్నామని శ్రవణ్ అన్నారు.

మరిన్ని రాష్ట్ర వార్తలు
సాక్షి ప్లస్
ఈ-పేపర్‌లో..



# గేమ్ చేంజర్ జీఎస్‌టీ సంస్కరణలు!!

న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ)ల్లో ప్రతిపాదిత మార్పులను 'కొత్త తరం'గేమ్ చేంజర్ సంస్కరణలుగా సీనియర్ ప్రభుత్వాధికారులు అభివర్ణించారు. ఇవి అంతిమంగా 2047 నాటికి ఒకే శ్లాబ్ దిశగా బాటలు వేయగలవని ఆశాభావం వ్యక్తం చేశారు. 'సాధారణంగా ఆదాయ, వ్యయాల సామర్థ్యాలు దాదాపు ఒకే స్థాయిలో ఉండే సంపన్న దేశాలకు సింగిల్ రేటు విధానం అనువుగా ఉంటుంది. అలా మన దగ్గర కూడా ఒకే శ్లాబ్ విధానాన్ని తేవడమే అంతిమ లక్ష్యం. అయితే, ప్రస్తుతం అందుకు సమయం అనువుగా లేదు. భారత్ కూడా అభివృద్ధి చెందిన దేశంగా మారిన తర్వాత దానిపై దృష్టి పెట్టొచ్చు'అని అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం 5 శాతం, 12 శాతం, 18 శాతం, 28 శాతంగా ఉన్న నాలుగు శ్లాబులను 5 శాతం, 18 శాతం కింద రెండు శ్లాబులుగా, డీమెరిట్ గూడ్స్‌పై 40 శాతంగా సవరించాలని కేంద్రం ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. రెండు శ్లాబుల విధానాన్ని జీఎస్‌టీ కౌన్సిల్ ఆమోదిస్తే దేశ ఆర్థిక వ్యవస్థకు మరింత దన్ను లభిస్తుందని, అమెరికా టారిఫ్ ముప్పులను కూడా కొంత వరకు అధిగమించవచ్చని అధికారులు తెలిపారు. కేంద్ర ఆర్థిక శాఖ ప్రతిపాదనలు తొలుత రాష్ట్రాల ఆర్థిక మంత్రుల ప్యానెల్‌కి, ఆ తర్వాత జీఎస్‌టీ కౌన్సిల్ ముందుకు వెళ్తాయి. పన్ను సంస్కరణలపై జీఎస్‌టీ కౌన్సిల్ సెప్టెంబర్‌లో సమావేశం అయ్యే అవకాశం ఉంది.

**ఆర్థిక వ్యవస్థకు మరింత దన్ను**

- 2047 నాటికి ఒకే శ్లాబ్ దిశగా అడుగులు
- రెండు శ్లాబులతో తగ్గనున్న పలు ఉత్పత్తుల ధరలు
- చౌక కానున్న టీవీలు, ఏసీలు, వాషింగ్ మెషీన్లు
- దిగి రానున్న ఆహార ఉత్పత్తుల ధరలు
- ప్రభుత్వాధికారుల వెల్లడి

కొత్త విధానంతో చాలా నిత్యావసర వస్తువులు తక్కువ శ్లాబులోకి మారడం వల్ల వాటి ధరలు తగ్గుతాయని, వినియోగం పెరుగుతుందని ఒక అధికారి వివరించారు. 'సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలను (ఎంఎస్ఎంఈ), మధ్య తరగతి, పేదలు, రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నెక్స్ట్‌జెన్ జీఎస్‌టీని సిఫారసు చేశాం. అలాగే రోజువారీ వినియోగించే ఉత్పత్తుల ధరలు కూడా తగ్గేలా ప్రతిపాదనలు చేశాం' అని తెలిపారు. పన్నులు తగ్గడం వల్ల ప్రజల చేతిలో మరింత డబ్బు మిగులుతుందని, ఇది అంతిమంగా వినియోగం మరింత పెరగడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. పన్ను రేట్ల క్రమబద్ధీకరణకు సంబంధించి కేంద్రం స్వల్పకాలికం కన్నా దీర్ఘకాలిక పరిష్కార మార్గం వైపే మొగ్గు చూపిందని చెప్పారు. 'మేం ఒక్కొక్క ఉత్పత్తిని నిశితంగా పరిశీలించాం. రైతులు ఉపయోగించే పురుగు మందులు కావచ్చు, విద్యార్థుల పెన్సిళ్లు లేదా ఎంఎస్ఎంఈలకు అవసరమయ్యే ముడి వస్తువులు కావచ్చు.. ప్రతిదానిపై కూలంకషంగా చర్చించాం. మెరిట్, స్టాండర్డ్ శ్లాబుల కింద వర్గీకరించాం' అని ఆ అధికారి చెప్పారు. తాజా ప్రతిపాదనల ప్రకారం 12% కేటగిరీలో ఉన్న వెన్న, పండ్ల రసాలు, డ్రై ఫ్రూట్స్ మొదలైన 99% ఉత్పత్తులు 5% శ్లాబ్‌లోకి మారనున్నాయి. 28% శ్లాబ్‌లోని ఏసీలు, టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు లాంటి ఎలక్ట్రానిక్స్ వస్తువులు, అలాగే సిమెంట్ లాంటి ఉత్పత్తులు 18% శ్లాబ్‌లోకి వస్తాయి. ప్రస్తుతం 12% శ్లాబ్ పరిధిలో ఉన్న ప్యాకేజ్డ్ ఫుడ్, దుస్తులు మొదలైన 20% ఉత్పత్తులను 5% శ్లాబ్‌లోకి మార్చడం వల్ల ఆదాయం తగ్గినా, వినియోగం పెరగడం వల్ల ఆ లోటును భర్తీ చేసుకోవచ్చని కేంద్రం భావిస్తోంది.

**ధరలు తగ్గుతాయి.. వినియోగం పెరుగుతుంది..**




# ధర్మవరంలో 'ఉగ్ర' కలకలం

**ఉగ్రవాద సంస్థలతో సంబంధం ఉన్న నూర్ మహమ్మద్ అరెస్ట్**

- ఐదురోజుల క్రితమే ఎన్ఐఏ, ఐబీ బృందాల అదుపులోకి...
- తాజాగా ధర్మవరంలోని ఇంట్లో సోదాలు
- పాక్‌కు ఫోన్ కాల్స్, వాట్సాప్ చాటింగ్ చేసినట్లు గుర్తింపు



కదిరి కోర్టు ఆవరణలో జీపులో ఉన్న ఉగ్రవాది. (ఇన్‌సెట్‌)లో నూర్ మహమ్మద్

**అతనికి దూరంగా ఉంటున్నా**

వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో గత మూడు నెలల నుంచి నేను నా భర్తకు దూరంగా ఉంటున్నాను. ఓ స్కూల్‌లో పనిచేస్తూ నలుగురు కుమారులను పోషిస్తున్నాను. నా భర్తకు ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్నట్లు నాకు తెలీదు. ఇప్పుడు అతనికి, నాకు ఎలాంటి సంబంధాలూ లేవు.

\- సుమ్మియా, నూర్ మహమ్మద్ భార్య

ధర్మవరం/కదిరి టౌన్: ఉగ్రవాద కదలికల వార్తలు శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణ ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేశాయి. తాజాగా శనివారం తెలిసిన వివరాల ప్రకారం పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థలతో ఫోన్‌కాల్స్, వాట్సాప్ చాటింగ్ చేస్తూ.. యువతను ఉగ్రవాదులుగా మార్చేందుకు ప్రయత్నిస్తూ.. దేశద్రోహానికి పాల్పడిన ధర్మవరం పట్టణానికి చెందిన కొత్వాల్ నూర్ మహమ్మద్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ), ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) అధికారులు అరెస్టు చేశారు. ధర్మవరం పట్టణంలోని లోనికోటలో నివాసముండే కొత్వాల్ నూర్ మహమ్మద్ స్థానిక మార్కెట్‌వీధిలోని సల్మాన్ బిరియాని సెంటర్-టీ స్టాల్‌లో వంట చేసేవాడు. ఈ నెల 12న హోటల్ వద్ద అతన్ని ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. శనివారం తెల్లవారుజామున అతన్ని తీసుకుని వచ్చి ఇంట్లో సోదాలు చేశారు. మొబైల్‌ఫోను, 16 సిమ్‌కార్డులు, ఉగ్రవాద ప్రేరేపిత పుస్తకాలు స్వాధీనం చేసుకున్నారు. ధర్మవరం డీఎస్పీ కార్యాలయానికి తరలించి విచారణ చేపట్టారు. నూర్ మహమ్మద్ ఉగ్ర లింకులపై అన్ని కోణాల్లో విచారణ చేసిన తర్వాత పూర్తి వివరాలు తెలియజేస్తామని ధర్మవరం ఇన్‌చార్జ్ డీఎస్పీ నరసింగప్ప తెలిపారు. కాగా, నూర్ మహమ్మద్‌కు భార్య సుమ్మియా, నలుగురు కుమారులు, ఒక అక్క, ముగ్గురు చెల్లెళ్లు ఉన్నారు. ప్రస్తుతం నూర్ తల్లి హాజరబీ దగ్గర ఉంటున్నాడు. కాగా, ధర్మవరంలో ఎన్ఐఏ, ఐబీ అధికారులు అరెస్టు చేసిన ఉగ్రవాది నూర్ మహమ్మద్‌ను శనివారం రాత్రి కదిరి కోర్టులో హాజరుపరిచారు. అతనికి 14 రోజుల రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం అతన్ని కడప సెంట్రల్ జైలుకు తరలించారు.

**29 ఉగ్రవాద సంస్థల వాట్సాప్, ఫేస్‌బుక్ గ్రూపుల్లో సభ్యత్వం**

దాదాపు 29 ఉగ్రవాద సంస్థలకు చెందిన వాట్సాప్, ఫేస్‌బుక్ గ్రూపుల్లో నూర్ మహమ్మద్ కీలక సభ్యుడిగా ఉన్నట్లు గుర్తించినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. స్థానికంగా ఉన్న యువతలో ఎంతమందిని ఉగ్రవాద ఉచ్చులోకి దింపారన్న సమాచారాన్ని ఎన్ఐఏ, ఐబీ అధికారులు సేకరించినట్లు తెలుస్తోంది. అతనిపై దేశద్రోహం కేసుతో పాటు యూఏపీఏ (చట్ట విరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం) కింద కేసులు నమోదు చేసినట్లు సమాచారం.

# నక్సల్స్‌తో చర్చలు జరిపి మీరేం సాధించారు?

**'నక్సల్స్ నరమేధం-మేధోమథనం' చర్చలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్**

కరీంనగర్ టౌన్: పేదరికం ఉన్నంత కాలం నక్సలిజం ఉంటుందని, ఆపరేషన్ కగార్‌ను ఆపి నక్సలైట్లతో చర్చలు జరపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ చెప్పడం హాస్యాస్పదమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. నక్సలైట్లతో గతంలో చర్చలు జరిపిన కాంగ్రెస్ ఏం సాధించిందని ప్రశ్నించారు. కరీంనగర్‌లో శనివారం సాయంత్రం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'నక్సల్స్ నరమేధం-మేధోమథనం' చర్చలో కేంద్ర మంత్రి బండి సంజయ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నక్సల్స్ చేతిలో బలైన ఏబీవీపీ విద్యార్థులకు నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ, అధికారంలో ఉన్నంతకాలం నక్సలైట్లపై నిషేధం విధించిన కేసీఆర్, అధికారం పోగానే చర్చలంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నాడని మండిపడ్డారు. నక్సలైట్ల చేతిలో వేలాది మంది అమాయక ప్రజలు చనిపోయినప్పుడు సామాజిక కోణం గుర్తుకురాలేదా? అని ప్రశ్నించారు. ఆపరేషన్ కగార్‌ను ఆపే ప్రసక్తే లేదని, నక్సలైట్లను ఏరిపారేసే కార్యక్రమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. 2026 మార్చి నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించి 'నక్సల్ ముక్త్ భారత్'గా మార్చి తీరుతామని ఉద్ఘాటించారు. ప్రజాస్వామ్యంలో తుపాకీ ఒక్కరే పట్టాలి. అది పోలీసే కావాలని బండి స్పష్టం చేశారు.




మాట్లాడుతున్న కేంద్రమంత్రి బండి సంజయ్

# సీఎం ప్రసంగం మభ్యపెట్టే విధంగా ఉంది

**వాజ్‌పేయి వర్ధంతి కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు**



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి స్వాతంత్య్ర దినోత్సవ ప్రసంగం అబద్ధపు వాగ్దానాలతో ప్రజలను మభ్య పెట్టే విధంగా సాగిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.22,500 కోట్లతో పేదలకు ఇళ్లు నిర్మిస్తామని ప్రకటించిందే తప్ప ఇప్పటిదాకా ఇళ్లు ఇచ్చిన దాఖలాల్లేవన్నారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్లు కడతామని హామీఇచ్చి 19 నెలలు గడిచినా ఇప్పటి వరకు అడుగు ముందుకు పడలేదని విమర్శించారు. శనివారం పార్టీ కార్యాలయంలో దివంగత మాజీ ప్రధాని వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి రాంచందర్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ ప్రచారకుడిగా వాజ్‌పేయి తన జీవితం ప్రారంభించాక బీజేపీలో చేరి దేశ ప్రధానిగా కావడం ఆయన అసామాన్య వ్యక్తిత్వానికి నిదర్శనమని కొనియాడారు. వాజ్‌పేయితో పాటు మోదీ వంటి నాయకులను తీర్చిదిద్దిన ఆర్ఎస్ఎస్ గురించి కొందరు నేతలు తప్పుగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కాసం వెంకటేశ్వర్లు, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఒక్కటి దాటినా కోతే!

▶ మొదటి పేజీ తరువాయి

దరఖాస్తు చేసుకున్న వారిలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఈ పథకం అమలవుతోంది. మొదట్లో 39 లక్షల మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఆ తరువాత కూడా దరఖాస్తులు రావడంతో ఈ లబ్ధిదారుల సంఖ్య పెరిగింది. దీంతో ప్రభుత్వంలో ఆందోళన వ్యక్తమైనట్టు తెలిసింది. పథకం ప్రారంభమైన 16 నెలల్లో కొత్తగా 12 లక్షల మంది చేరారు. అంటే జూలైలో ఈ పథకం కింద లబ్ధిదారులు 51.26 లక్షల మంది ఉన్నారు. ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం సబ్సిడీ కింద ప్రతి నెలా రూ.185 నుంచి 200 కోట్ల వరకు రాష్ట్రంలోని రెండు విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కం)కు చెల్లిస్తోంది.

**ఒక్క యూనిట్ ఎక్కువైనా..**

విద్యుత్ వినియోగం ఆధారంగా 0–50 యూనిట్ల వరకు యూనిట్‌కు రూ.1.95 పైసలు, 51–100 యూనిట్ల వినియోగానికి యూనిట్‌కు రూ.3.10 చొప్పున బిల్లు వసూలు చేస్తారు. వినియోగం 100 యూనిట్లకు పెరిగితే 0–200 యూనిట్ల మధ్య వినియోగానికి ప్రతీ యూనిట్‌కు రూ.3.40 చొప్పున చెల్లించాలి. ప్రస్తుతం గృహజ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్ పొందుతున్న వారిలో 0–50, 50–100 యూనిట్లను వినియోగించే పేదలే ఎక్కువ. వీరితోపాటు 100–200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించుకున్న లబ్ధిదారులందరికీ జీరో బిల్ వస్తోంది. అంటే 200 యూనిట్లలోపు కరెంటు వాడిన వారు బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదు. అయితే, 200 యూనిట్లు దాటి ఒక్క యూనిట్ ఎక్కువైనా వారు పూర్తి బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. ఒక నెలలో 201 యూనిట్లు విద్యుత్ వినియోగించి.. ఆ తరువాత నెలలో 200 యూనిట్లలోపు విద్యుత్ వాడినా వారికి ఈ పథకం వర్తిస్తోంది. ఇకపై ఏదైనా నెలలో 200 యూనిట్లకు మించి విద్యుత్ వినియోగిస్తే వారిని శాశ్వతంగా ఈ పథకం కింద అనర్హులుగా పరిగణించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనిపై ఇప్పటికే ప్రభుత్వంలో ఉన్నత స్థాయిలో చర్చలు జరిగినట్టు తెలిసింది.

# పోలవరం కొట్టుకుపోయినా ఎన్డీఎస్ఏకు కనిపించదా?

▶ మొదటి పేజీ తరువాయి

ఒక ప్రకటనలో ప్రశ్నించారు. 'తెలంగాణకు వరప్రదాయిని అయిన కాళేశ్వరం ప్రాజెక్టుకు ఒక నీతి, పోలవరం ప్రాజెక్టుకు మరో నీతా? అసెంబ్లీ ఎన్నికల వేళ అత్యంత అనుమానాస్పదంగా కుంగిన మేడిగడ్డ పిల్లర్లపై కేవలం 24 గంటల్లోపే ఎన్డీఎస్ఏను దించి బీఆర్ఎస్‌పై బీజేపీ నేతలు బురదజల్లారు. కళ్లముందు రెండోసారి కొట్టుకుపోయినా పోలవరం కాఫర్ డ్యామ్‌పై బీజేపీ నేతలు ఎందుకు మౌనంగా ఉన్నారు?'అని నిలదీశారు. 'ఏపీలో ఏకంగా పది అడుగుల వెడల్పు, ఎనిమిది అడుగుల లోతుకు కుంగిన పోలవరం కాఫర్ డ్యామ్‌కు గుట్టుచప్పుడు కాకుండా యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేస్తున్నారు. తెలంగాణలో మాత్రం 20 నెలలు కావస్తున్నా మేడిగడ్డ బరాజ్ వద్ద మరమ్మతులు లేకపోవడానికి ప్రధాన కారణం ముఖ్యమంత్రి మూర్ఖత్వమే. 2020లో పోలవరం డయాఫ్రం వాల్ రెండేండ్లకే కొట్టుకుపోయినా ఇప్పటికీ ఉలుకూ, పలుకూ లేదు. తెలంగాణలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కుప్పకూలి 8 మంది మరణించినా ఇప్పటికీ ఎన్డీఎస్ఏ అడ్రస్ లేదు. పంజాబ్‌నే తలదన్నే స్థాయిలో తెలంగాణలో వ్యవసాయ విప్లవాన్ని సృష్టించి, దేశానికే అన్నం పెట్టే స్థాయికి రాష్ట్ర రైతును తీర్చిదిద్దిన కేసీఆర్‌పై కక్షతో కాళేశ్వరం ప్రాజెక్టుమీద కాంగ్రెస్, బీజేపీలు సాగిస్తున్న మూకుమ్మడి కుట్రలను కాలరాస్తాం. తెలంగాణకు జీవనాడి అయిన కాళేశ్వరం ప్రాజెక్టును కంటికి రెప్పలా కాపాడుకుంటాం'అని పేర్కొన్నారు.

# చంద్రబాబు స్క్రిప్ట్‌నే రేవంత్ వినిపించారు

**కాళేశ్వరం లేదని చెప్పడం అంటే.. బనకచర్లకు మద్దతివ్వడమే: మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి**



సూర్యాపేట టౌన్: సీఎం రేవంత్‌రెడ్డి తీరు చంద్రబాబు ప్రసంగానికి కొనసాగింపేనని, గోదావరిలో నీళ్లు లేవని చెప్పకుండా కాళేశ్వరం లేదని చెప్పడం అంటే బనకచర్లకు మద్దతు ప్రకటించడమేనని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేటలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం నుంచి 240 టీఎంసీలకు పైగా నీళ్లను వాడుతున్నామని చెప్పాల్సిందని, ఇది చెప్పలేదు అంటే బనకచర్లకు అనుమతిస్తున్నట్లే అని స్పష్టమవుతుందన్నారు. బనకచర్ల కట్టి తీరుతామన్న చంద్రబాబుకు అనుకూలంగానే.. కాళేశ్వరంలో మాకు నీళ్లు అవసరం లేదు అన్నట్లు ఉందని ఆరోపించారు. ఇది ముమ్మాటికీ తెలంగాణ ప్రజలను మోసం చేయడానికేనని అన్నారు. రేవంత్ చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్ట్‌ని ఇక్కడ వినిపించారని విమర్శించారు. బనకచర్లకు అనుమతులు రావాలంటే కాళేశ్వరంను రికార్డ్‌లో నుంచి మాయం చేయాలనే కుట్ర జరుగుతుందన్నారు. చంద్రబాబు కుట్రలో భాగంగానే ఇక్కడ రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని ఆరోపించారు. కాళేశ్వరంపై ఉన్న నందిమేడారం, కన్నెపల్లి గాయత్రి పంప్ హౌస్‌లను ప్రారంభించారంటే.. కాళేశ్వరం ప్రాజెక్టు అంతా బాగున్నట్లే కదా అని అన్నారు. కాళేశ్వరం ద్వారా గత ఎనిమిది పంటలకు నీళ్లు ఇచ్చినట్లుగానే ఈ ప్రభుత్వం ఆయకట్టు ప్రాంతాలకు నీటిని విడుదల చేయాలని జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇక్కడి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దేవాదుల నుంచి నీళ్లు ఇస్తామంటూ కొత్త పాట అందుకున్నారని, దేవాదుల నీళ్లు ఇస్తామన్న ప్రాంతానికే ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. కాళేశ్వరంపై కాంగ్రెస్ చెప్పిందంతా అబద్ధం అని రుజువైందని చెప్పారు.

# శిబూ సోరెన్ ఆలోచనలు స్ఫూర్తిదాయకం

**జార్ఖండ్‌లో శిబూ సోరెన్‌కు సీఎం రేవంత్ నివాళులు**



శిబూ సోరెన్ చిత్రపటం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి నివాళి. చిత్రంలో జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్, ఎంపీలు అనిల్‌కుమార్, జయవీర్

సాక్షి, హైదరాబాద్: జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత శిబూ సోరెన్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం జార్ఖండ్ వెళ్లి నివాళులర్పించారు. శిబూ సోరెన్ కుటుంబ సభ్యులు, ప్రస్తుత జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్, వారి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. శిబూ సోరెన్ ఆలోచనలు, విలువలు, ఎప్పటికీ స్ఫూర్తిదాయకం అని రేవంత్‌రెడ్డి కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ తరఫున నివాళులర్పించినట్లు ముఖ్యమంత్రి 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డితోపాటు ఎంపీలు జయవీర్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్ కూడా ఉన్నారు.

# కాంగ్రెస్ పాలన రైతులకు శాపం

**మాజీ మంత్రి ఎస్.నిరంజన్‌రెడ్డి మండిపాటు**



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతుల పాలిట కాంగ్రెస్ పాలన శాపంగా మారిందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. ఒక్క యూరియా బస్తా కోసం చెప్పులు లైన్లో పెట్టి రైతులు రోజుల తరబడి వేచి చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. యూరియా కూడా సరఫరా చేయలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలతో కలిసి శనివారం తెలంగాణ భవన్‌లో నిరంజన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేటాయించిన కోటా మేరకు యూరియా పంపామని కేంద్రం, యూరియా కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం లేఖలతో కాలం వెళ్లదీస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగస్టు వరకు రాష్ట్రానికి 8.30 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 5.25 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చిందని చెప్పారు. మరణించిన రైతుల కుటుంబాలకు రూ.5 లక్షల బీమా అందించే రైతు బీమా ప్రీమియం చెల్లించకపోవడంతో 5 వేల మంది రైతుల కుటుంబాలు పథకానికి అర్హత కోల్పోయాయని తెలిపారు. మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, పుట్ట మధు, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్ తనోబా పాల్గొన్నారు.

# 'కాళేశ్వరం' పేల్చివేత కుట్ర వెనుక కాంగ్రెస్, బీజేపీ

**బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్**

- మేడిగడ్డలో ఒక్క పిల్లర్ మాత్రమే ఎందుకు కుంగిపోయింది?
- దీనిపై 'సిట్'తో విచారణ జరపాలి
- రేవంత్, బండి సంజయ్, కిషన్‌రెడ్డి పాత్రను తేల్చాలి



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టును పేల్చివేసేందుకు జరిగిన కుట్ర వెనుక కాంగ్రెస్, బీజేపీ హస్తం ఉందని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. కేసీఆర్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి దించేందుకు కాంగ్రెస్, బీజేపీ కుట్ర పన్నాయన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, 2022లో రికార్డు స్థాయిలో గోదావరికి వరద వచ్చినా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు తట్టుకున్నాయన్నారు. కానీ ఎవరో స్క్రిప్టు రాసినట్లుగా మేడిగడ్డలో ఒక్క పిల్లర్ మాత్రమే ఎందుకు కుంగిపోయిందని ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు.

**సిట్ ఏర్పాటు చేసి విచారణ జరపాలి**

'మేడిగడ్డ కుంగితే పిల్లర్లకు ఎక్కడా పగుళ్లు రావని ఇంజనీరింగ్ నిపుణులు చెపుతున్నారు. మేడిగడ్డలో 20వ నంబర్ పిల్లర్‌ను ఎవరో పేల్చే కుట్రచేశారు. కుట్ర వెనుక ఉన్న అసాంఘిక శక్తులు రేవంత్ రెడ్డి, బండి సంజయ్, కిషన్ రెడ్డి.. ఇంకా ఎవరైనా ఉన్నారా అనేది తేల్చాలి. ఘటన జరిగిన వెంటనే రేవంత్ రెడ్డి, బండి సంజయ్, కిషన్ రెడ్డి మొబైల్ ఫోన్ డేటా చెక్ చేస్తే వెంటనే దొరికేవాళ్లు. దీని వెనుక రేవంత్ రెడ్డి, బండి సంజయ్, కిషన్‌రెడ్డి ఉన్నారా? లేదా? అనేది సిట్ ఏర్పాటు చేసి తేల్చాలి. లేదా అక్కడ తక్కువ స్థాయిలో ఏమైనా భూకంపాలు వచ్చాయా లేదా అనేది తేల్చాలి' అని ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. కాగా, 2023 అక్టోబర్ 21న రాత్రి మేడిగడ్డ బరాజ్ వద్ద పెద్ద ఎత్తున శబ్దాలు వచ్చినట్లు మరుసటి రోజు మహదేవ్‌పూర్ పోలీసు స్టేషన్‌లో ఇరిగేషన్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ఫిర్యాదు చేశారని ప్రవీణ్‌కుమార్ గుర్తు చేశారు. అయితే పేలుళ్ల కోణంలో పోలీసులు విచారణ జరపకపోగా, ఇప్పటి వరకు ఎవరి వద్దా స్టేట్‌మెంట్లు రికార్డు చేయలేదన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖ రాసిన వెంటనే వచ్చిన ఎన్డీఎస్ఏ మేడిగడ్డ పేలుళ్లపై ఎందుకు మాట్లాడలేదని ఆయన ప్రశ్నించారు.

# నాసిరకంగా కట్టింది కాక.. ఇప్పుడు ఇలాంటి ప్రకటనలా?

- 'కాళేశ్వరం'పిల్లర్లు కూలినప్పుడు మీరే అధికారంలో ఉన్నారు
- అప్పుడు బీఆర్ఎస్ ముఖ్య నేతలు ఏం చేశారు
- ప్రవీణ్‌కుమార్‌కు అద్దంకి దయాకర్ కౌంటర్



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టును పేల్చేసేందుకు ఎవరో ప్రయత్నాలు చేశారని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇప్పుడు మాట్లాడటం దొంగలు పడ్డ రెండేళ్లకు కుక్కలు మొరిగినట్టుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ వ్యాఖ్యానించారు. నాసిరకం పనులు చేసి, కుంగిపోయేట్టు ప్రాజెక్టులు నిర్మించి, అనువుగాని చోట కట్టి అభాసుపాలయింది కాక, ఇప్పుడు ఇలాంటి ప్రకటనలు చేయడం ద్వారా ఆ పార్టీ మరింత దిగజారుతోందని ఎద్దేవా చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు పిల్లర్లు కుంగిపోయిన తర్వాత రెండున్నర నెలలు బీఆర్ఎస్ పార్టీనే అధికారంలో ఉందని, అప్పుడు ఆ పార్టీ ముఖ్య నేతలు ఏం చేశారని ప్రశ్నించారు. ఘటన జరిగినప్పుడు కాంగ్రెస్, బీజేపీ, జేఏసీ నేతలతో సహా ఎవరినీ అక్కడకు వెళ్లనీయలేదని అన్నారు. బీఆర్ఎస్ పార్టీలో లుకలుకలతో అధికారం పోవాలని అసలు ఆ ప్రాజెక్టును కూల్చింది కేసీఆరో, కేటీఆరో, కవితనో, హరీశ్‌రావో మీరే తేల్చుకోవాలని వ్యాఖ్యానించారు. తమ విలాసవంతమైన జీవితం ఎక్కడ బయటపడుతోందోనని అధికారం పోయిన తర్వాత ప్రగతిభవన్ నుంచి విలువైన వస్తువులన్నింటినీ కేసీఆర్ కుటుంబం తీసుకెళ్లిపోయిందని ఆరోపించారు. బంగారం, వెండి, విలువైన ఫర్నిచర్‌ను రెండు లారీల్లో సర్దుకువెళ్లారని, కేవలం ఖాళీ కుర్చీలు, గోడలు మాత్రమే మిగిల్చి వెళ్లారని అద్దంకి దయాకర్ ధ్వజమెత్తారు.

# 'రంగు' భళా.. ఆరోగ్యం డీలా!

స్వీట్ షాపునకు వెళ్తే ప్రకృతిలోని అన్ని రంగులూ అక్కడే ఉన్నాయా అన్నట్టు ఉంటుందా దృశ్యం. రెస్టారెంట్ల విందు భోజనమూ ఇందుకు ఏమీ తీసిపోదు. పుత్తడిని తలదన్నేలా మెరిసే జిలేబీలు మొదలు.. కుంకుమ పువ్వు దట్టించినట్టు కనిపించే బిర్యానీల వరకు.. భోజన ప్రియుల జిహ్వకు నువ్వా నేనా అంటూ పోటీపడుతూ నోరూరించే రంగు రంగుల ఆహార పదార్థాల వెనుక ఉన్న రసాయనాలు ఇప్పుడు ప్రజల ఆరోగ్యానికి సవాల్ విసురుతున్నాయి.

- సాక్షి, స్పెషల్ డెస్క్



ఇంటి వంటకాలైతే రోజులో కొన్ని రకాలే చేయగలం. అదే బయటి ఫుడ్ అయితే మనకు నచ్చినన్ని కొనుక్కోవచ్చు. ఇంటి పట్టున ఉండే ఆర్డర్ చేస్తే నిమిషాల్లోనే ఫుడ్ చేతికందుతోంది. జనంలో ఆహారపుటలవాట్లు మారడం, ఆదాయాలు పెరగడం బయటి ఫుడ్ వినియోగానికి ఆజ్యం పోస్తున్నాయి. రెస్టారెంట్, వీధి బండ్లపై విక్రయించే ఫుడ్‌కు జనం అలవాటు పడుతున్నారు కూడా. ఈ నేపథ్యంలో కస్టమర్లను ఆకట్టుకునేలా సింథటిక్ ఫుడ్ కలరెంట్స్ (ఎస్ఎఫ్‌సీ) వినియోగం అంతకంతకూ పెరుగుతోంది.

### పరిమితి మించితే ముప్పే

సింథటిక్ ఫుడ్ కలరెంట్స్ వాడకం పరిమితికి మించితే ఆరోగ్య సమస్యలు తప్పవని నిపుణులు చెబుతున్నారు. ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఎనిమిది సింథటిక్ ఆహార రంగులను అనుమతిస్తోంది. ఆహార ఉత్పత్తిని బట్టి వీటి వినియోగ పరిమితులు ఉంటాయి. ఇవి నిర్దేశించిన పరిమితుల్లో ఉపయోగిస్తే ఎటువంటి సమస్యా లేదు. పరిమితికి మించి లేదా దీర్ఘకాలిక వినియోగమే ముప్పుగా పరిణమిస్తోంది. ముఖ్యంగా నియంత్రణ లేని అనధికారిక ఆహార విక్రేతల నుంచి కొనుగోలు చేసిన ఆహారమే ప్రమాదాలకు కారణం అవుతోందని పోషకాహార నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పిల్లలు, సున్నితత్వం ఉన్న వ్యక్తులు వీటికి దూరంగా ఉండడమే మేలని వారు సూచిస్తున్నారు.

### అవయవాలపైనా ప్రభావం

ఈ సింథటిక్ రంగులు వాడితే ఆహార పదార్థాలు ఆకట్టుకునేలా ఉంటాయి. వేడి, వెలుతురులోనూ రంగు స్థిరంగా ఉంటుంది. ధర కూడా తక్కువ. అందుకే ఆహార పదార్థాల విక్రేతలు వీటిని విరివిగా, పరిమితికి మించి ఈ రసాయన రంగులను వాడుతున్నారు. ఎంత పరిమాణంలో రంగులు వాడారన్న విషయమూ వినియోగదార్లకు తెలియదు. కొన్ని సింథటిక్ ఫుడ్ కలరెంట్స్‌ను దీర్ఘకాలం, అధికంగా తీసుకోవడం వల్ల పిల్లల్లో అధిక చురుకు వంటి ప్రవర్తనా సమస్యలు, అలర్జీ, లేదా అవయవాలు చెడిపోయే ప్రమాదమూ ఉందని అధ్యయనాలు చెబుతున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మెరుగైన పర్యవేక్షణకుతోడు ఈ రంగుల పట్ల ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరమూ ఉందని సూచిస్తున్నారు.

### అస్పష్టమైన సమాచారం

ప్యాక్ చేసిన ఆహార పదార్థాలలో వినియోగించిన సింథటిక్ రంగుల వివరాలను కంపెనీలు వెల్లడించిన తీరే ఆశ్చర్యం కలిగిస్తుంది. ఐఎన్ఎస్ 110, ఈ 129, అనుమతి పొందిన రంగు.. ఇలాంటి పేర్లతో కంపెనీలు రంగుల వివరాలను ప్యాక్‌లపై ముద్రిస్తాయి. సగటు భారతీయ వినియోగదారునికి ఇటువంటి సమాచారం అర్థం చేసుకోవడం కష్టం. వీధుల్లో, రోడ్లపై విక్రయించే స్నాక్స్, మిఠాయిలు, లేదా రెస్టారెంట్లలో విక్రయించే ఆహార పదార్థాల్లో వినియోగించే కృత్రిమ రంగుల వివరాలను తెలిపే విధానమే లేదు. దుకాణాల్లో అమ్మే వస్తువులన్నీ సురక్షితమన్న భావన చాలా మంది వినియోగదారుల్లో ఉంది. అయితే కొన్ని బ్రాండ్లు, రెస్టారెంట్లు శుభ్రమైన, మొక్కల ఆధారిత రంగులతో ఆహార పదార్థాలు రూపొందించడం శుభపరిణామం.

### రంగుల మాయ
కృత్రిమ రంగులు, వినియోగించే వస్తువులు, అధిక వాడకం వల్ల వచ్చే సమస్యలు

**1 టార్‌ట్రాజిన్ (ఈ 102/ఐఎన్ఎస్ 102)**
వినియోగం: పసుపు వర్ణంలో ఉండే స్వీట్స్, చిప్స్, శీతల పానీయాలు
సమస్యలు: పిల్లల్లో అధిక చురుకు, ఆస్తమా, చర్మ సమస్యలు

**2 సన్‌సెట్ యెల్లో ఎఫ్‌సీఎఫ్ (ఈ 110/ఐఎన్ఎస్ 110)**
వినియోగం: పచ్చళ్లు, పళ్లరసాలు, సాసెస్, బేకరీ ఉత్పత్తులు
సమస్యలు: అలర్జీ, అధిక చురుకు, జీర్ణ సమస్యలు

**3 కార్మోయిసిన్ (ఈ 122/ఐఎన్ఎస్ 122)**
వినియోగం: జెల్లీస్, జామ్స్, సిరప్స్, స్వీట్స్
సమస్యలు: చర్మ సమస్యలు, అధిక చురుకు

**4 ఇండిగో కార్మిన్ (ఈ 132/ఐఎన్ఎస్ 132)**
వినియోగం: ఐస్‌క్రీమ్స్, క్యాండీస్
సమస్యలు: అలర్జీ, వికారం, అధిక రక్తపోటు

**5 పాన్సో 4ఆర్ (ఈ 124/ఐఎన్ఎస్ 124)**
వినియోగం: కేక్స్, బిస్కట్స్‌లో కోటింగ్, డిజర్ట్స్, సాసులు
సమస్యలు: ఆస్తమా, దద్దుర్లు

**6 బ్రిలియంట్ బ్లూ (ఈ 133/ఐఎన్ఎస్ 133)**
వినియోగం: శీతల పానీయాలు, పాల పదార్థాలు, స్వీట్స్
సమస్యలు: దద్దుర్లు, అలర్జీ, శ్వాస సమస్యలు

**7 ఎరిథ్రోసిన్ (ఈ 127/ఐఎన్ఎస్ 127)**
వినియోగం: కాండీడ్ ఫ్రూట్స్, కేక్ టాపింగ్స్, చెర్రీస్
సమస్యలు: థైరాయిడ్ సమస్యలు, డీఎన్ఏకు నష్టం, అలర్జీ

**స్వీట్స్, ఆహార పదార్థాల్లో కృత్రిమ రంగులు**
- ఆకట్టుకునే రంగుల వెనుక రసాయనాలు
- ప్యాక్‌లపై అస్పష్టంగా కలరెంట్స్ సమాచారం
- అధికంగా వాడితే ముప్పు తప్పదంటున్న వైద్యులు



| ఎఫ్ఎస్ఎస్ఏఐ తనిఖీలు | సంవత్సరం | పరిశీలించిన శాంపిళ్లు | నాణ్యతా ప్రమాణాలు లేనివి | పెట్టిన కేసులు |
|---|---|---|---|---|
| | 2024-25 | 1,94,116 | 34,388 | 31,407 |

## ధ్యానంతో మానసిక ప్రశాంతత
### ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్



నందిగామ: ధ్యానంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. కన్హా శాంతివనంలో శనివారం హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, శ్రీ రామచంద్ర మిషన్ గురూజీ కమ్లేష్ పటేల్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గురూజీతో కలిసి ధ్యానం చేశారు. అనంతరం మోహన్ భగవత్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ నిత్యం కొంత సమయాన్ని ధ్యానం కోసం కేటాయించాలని సూచించారు.



## టీబీ ముక్త్ భారత్ అందరి బాధ్యత
### టీబీ అండ్ చెస్ట్ డిసీజెస్ కాన్ఫరెన్స్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



టీబీ నివారణ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గవర్నర్, స్పీకర్ ఎంపీ, కలెక్టర్

వికారాబాద్: టీబీ ముక్త్ భారత్ కోసం ప్రతీ పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచించారు. వికారాబాద్ సమీపంలోని అనంతగిరి గుట్టపై శనివారం నిర్వహించిన ట్యుబర్ కులోసిస్ అండ్ చెస్ట్ డిసీజెస్ కాన్ఫరెన్స్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హరిత రిసార్ట్ వద్ద స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి గవర్నర్‌కు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో టీబీకి మందులు ఉండేవి కావని, దీంతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఇలాంటి విప త్కర స్థితిలో టీబీ నివారణకు అనంతగిరి టీబీ శానిటోరియం కీలక భూమిక పోషించిందన్నారు. టీబీ నివారణలో అవగాహనే ముఖ్యమని గవర్నర్ స్పష్టంచేశారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కవులు, రచయితలు, మేధావులు, వైద్యులు ఇలా అన్నివర్గాల వారు టీబీ ముక్త్ భారత్‌లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతగిరి గుట్టపై ఉన్న టీబీ శానిటోరియం ఎన్నో ఏళ్లుగా అమూల్యమైన సేవలందిస్తోందని స్పీకర్ గడ్డం ప్రసాద్ ప్రశంసించారు. విద్య, వైద్యం కోసం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సెక్రటరీ దాన కిశోర్, డీఎం అండ్ హెచ్ఓ లలితాదేవి, టీబీ అసోసియేషన్ చైర్మన్ సుధీర్ ప్రసాద్, వైద్యులు దీన్‌దయాళ్‌భాగ్, సురేందర్, బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ పునర్జన్మ!

▶ మొదటి పేజీ తరువాయి

ఆ అనుభూతిని కలిగిస్తారు.

- ప్రధానంగా సంబంధిత వ్యక్తుల నుంచి సేకరించిన ఏఐ నమూనాలతో ఇది సాధ్యమవుతుంది.
- చనిపోయిన వారి టెక్స్ట్ మెసేజ్‌లు, ఈ-మెయిల్‌లు, సోషల్ మీడియా పోస్టులు, వాయిస్ నోట్‌లు, వీడియో రికార్డింగ్‌లు వంటివి ఉపకరిస్తున్నాయి. ఆ వ్యక్తికి సంబంధించిన వ్యక్తిత్వ లక్షణాలు, నిర్ణయం తీసుకునే విధానాలు సహాయపడుతున్నాయి.
- వారి బయోమెట్రిక్ డేటా (ముఖ కవళికలు, స్వరం) వంటివి దోహదపడుతున్నాయి.
- వీటి ఆధారంగా నాడీ నెట్‌వర్క్‌లకు శిక్షణ ఇవ్వడం ద్వారా ఏఐ ఆయా వ్యక్తులను అనుకరించగలదు.
- ఫలానా వ్యక్తి ఇంకా సజీవంగా ఉన్నట్టుగా సంభాషించగలదు.
- రెప్లికా, ప్రాజెక్ట్ డిసెంబర్, హియర్ ఆఫ్టర్ ఏఐ వంటి సాధనాలు ఇప్పటికే ఇలాంటి వాటిని అందిస్తున్నాయి.
- మరణించిన వారి స్వరం మాదిరిగానే సంబంధీకులతో సంభాషించేలా చేయొచ్చు. చనిపోయిన తాత లేదా బామ్మ స్వరాలను ఉపయోగించి మనవళ్లు, మనవరాళ్లకు నిద్రవేళ కథలను చెప్పే సౌలభ్యం కూడా కలుగుతుందని అంటున్నారు.

### సమాధానం లేని ప్రశ్నలెన్నో...

ఒక వ్యక్తి భౌతికంగా మరణించాక కూడా బతికి ఉన్నట్టుగా భ్రమలో మునగడం డిజిటల్ మరణానంతర జీవితం అనే జవాబులేని ప్రశ్నలను ముందుకు తెస్తోంది.

- ఇది మరణించిన వారి గురించి పడే బాధను తగ్గిస్తుందా? లేదా వారి జ్ఞాపకాలు వెంటాడేలా చేస్తుందా? ఈ డిజిటల్ సాంకేతిక భ్రాంతి/ అయోమయాల మధ్య చనిపోయిన వారు ఎంతకాలం 'జీవించగలరు'? ఈ ఏఐ అమరత్వాన్ని ఎవరు నియంత్రిస్తారు? సంబంధిత వ్యక్తి కుటుంబమా, టెక్ కంపెనీలా లేక ఆయా దేశాలు/ రాష్ట్రాల ప్రభుత్వాలా?
- డిజిటల్ క్లోన్ ఓ వ్యక్తిగా ఉండటం విరమించి పూర్తిగా వేరే వ్యక్తిగా వ్యవహరిస్తే లేదా హ్యాకింగ్‌కు గురైతే ఏమి జరుగుతుంది?
- ఆయా మాధ్యమాల ద్వారా మనం జ్ఞాపకశక్తిని కాపాడుకుంటున్నామా? లేదా భ్రమల్లో విహరించేలా తయారవుతున్నామా? ఇది వరంగా పరిణమిస్తుందా లేక శాపంగా మారుతుందా?
- ఈ ప్రశ్నలకు జవాబులు డిజిటల్ సాంకేతికతను ఏ రూపంలో, ఏ అవసరానికి ఉపయోగిస్తారనే దానిపై ఆధారపడి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

## మీ సమస్యలపై సీఎంతో మాట్లాడతా
### అసంఘటిత రంగ కార్మికుల సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ హామీ ఇచ్చారు. ఈ రంగంలో పనిచేస్తున్న కార్మికుల గురించి సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడతానని, త్వరలోనే సీఎంతో సమావేశం ఏర్పాటు చేయిస్తానని భరోసా ఇచ్చారు. శనివారం గాంధీభవన్‌లోని ప్రకాశ్‌హాల్‌లో టీపీసీసీ అనుబంధ కామ్‌గారీ కర్మచారీ కాంగ్రెస్ (కేకేసీ) రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. సంఘం చైర్మన్ కౌశల్ సమీర్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులు ఎక్కువ శ్రమపడినా తగిన గుర్తింపు, ఆదాయం ఉండదని ఆవేదన వ్యక్తంచేశారు. అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్న చిత్తశుద్ధితో సీఎం ఉన్నారన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ఈ కార్మికులను ఆదుకోవాలనే బలమైన ఆలోచనతో రాహుల్‌గాంధీ వారి పక్షాన నిలబడుతున్నారని తెలిపారు. సమావేశంలో కేకేసీ జాతీయ చైర్మన్ ఉదిత్ దిత్‌రాజు, వైస్‌చైర్మన్ షేక్ ఇబ్రహీం, రాష్ట్ర ఇన్‌చార్జి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీశ్వర్‌రావు, టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు జెట్టి కుసుమకుమార్, మానకొండూరు ఎమ్మెల్యే సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్‌లతో పాటు పెద్ద సంఖ్యలో అసంఘటిత రంగ కార్మికులు పాల్గొన్నారు.

## కమిటీల పేరిట కాలయాపన తగదు
### తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కమిటీల పేరిట కాలయాపన చేస్తోందని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రులు డి.శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయడంతో పాటు మరో వైపు సీనియర్ ఐఏఎస్ అధికారులు నవీన్ మిత్తల్, లోకేశ్ కుమార్, కృష్ణ ఆదిత్యలతో మరో కమిటీ ఏర్పాటు చేశారని, వీటి ఏర్పాటు జరిగి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు ముందుకు పడలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరి కమిటీలు వేసి చేతులు దులుపుకున్నట్లు ఉందని, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలనే చిత్త శుద్ధి కనిపించడం లేదన్నారు. పెండింగ్ సమస్యలను ఆగస్టు 15లోగా పరిష్కరించాలని టీఈజేఏసీ గడువు విధించినప్పటికీ 63 డిమాండ్లలో ఆర్థిక భారం లేని సమస్యలను కూడా పరిష్కరించక పోవడం ఉద్యోగులపట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదాసీన వైఖరిని తెలియజేస్తోందన్నారు. డిమాండ్ల పరి ష్కారం కోసం భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని, ఈ అంశంపై ఈనెల 19న నిర్ణయం తీసుకోనున్నట్లు వారు వెల్లడించారు.

# పార్లమెంటు తరహాలో అసెంబ్లీ ప్రాంగణం

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం భావిస్తోంది. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని రోడ్లు, భవనాల శాఖ ఓ బృహత్తర ప్రణాళికను సిద్ధం చేస్తోంది.

**ఉద్యానవన శాఖ స్థలాన్ని సేకరించి..**

శాసన మండలి కూడా శాసనసభ ఉన్న ప్రధాన భవనంలోకే మారనుంది. ఇప్పటికే పాత అసెంబ్లీ హాల్‌కు పూర్తి స్థాయిలో మరమ్మతు చేసి పునరుద్ధరించారు. ప్రస్తుతం జూబ్లీహాలు వెనకవైపు కొనసాగుతున్న మండలి ప్రాంగణాన్ని ఖాళీ చేయనున్నారు. దీంతో ఆ ప్రాంగణం మొత్తాన్ని రీమోడలింగ్ చేయబోతున్నారు. ఇందుకోసం ఉద్యానవన విభాగం అధీనంలోని స్థలాలను సేకరించి దానికి మరోచోట ప్రత్యామ్నాయ స్థలాన్ని ఇచ్చి ఇక్కడ నుంచి తరలించాలని నిర్ణయించారు. అలా సేకరించిన నర్సరీ, ఉద్యానవన స్థలాలను కొత్త నిర్మాణాలకు వాడబోతున్నారు. జూబ్లీహాలు భవనానికి కూడా వారసత్వ హోదా ఉండటంతో దానిని తొలగించే వీలులేదు. దీంతో ఆ భవనాన్ని రీమోడలింగ్ చేయబోతున్నారు. దాని చుట్టుపక్కల ఉన్న ఖాళీ స్థలాలను కూడా వినియోగించుకోనున్నారు. ఆ ప్రాంతంలో ప్రత్యేకంగా భారీ పార్కింగ్ యార్డును రూపొందించేందుకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. సాధారణ పార్కింగ్ స్థలం వాహనాలకు సరిపోని పక్షంలో ప్రత్యేకంగా పార్కింగ్ టవర్‌ను నిర్మించే యోచనలో ఉన్నారు. మొత్తం మీద వాహనాలను ప్రధాన భవనం ఛాయల్లో పార్క్ చేయకుండా చేస్తారు. ఇక పార్టీల శాసనసభా పక్ష కార్యాలయాలు, ప్రింటింగ్ ప్రెస్ ఉన్న భవనాలు తొలగించి ఆ ప్రాంతాన్ని లాన్‌గా మార్చబోతున్నారు. ముందు వైపు, ఆ చుట్టుపక్కల ఎలాంటి ఇతర నిర్మాణాలు లేకుండా క్రమబద్ధం చేస్తారు.

**వాటికీ రీమోడలింగ్..**

ఇక పబ్లిక్ గార్డెన్‌లో ఉన్న ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియం, జవహర్ బాలభవన్, హెల్త్ మ్యూజియంలు వినియోగంలో లేవు. వాటిని కూడా రీమోడలింగ్ చేయటం ద్వారా ఎలాంటి అవసరాలకు వినియోగించవచ్చనే విషయంలో ప్లాన్ చేస్తున్నారు. వీఐపీలకు, సందర్శకులకు వేర్వేరు ప్రధాన ద్వారాలు ఏర్పాటు చేయబోతున్నారు. పార్లమెంట్‌లో ఉన్న సెంట్రల్ హాల్ మాదిరిగా ఇక్కడ కూడా అలాంటి హాల్ నిర్మాణం, అక్కడ శాసన సభ్యులు కలసి కూర్చుని మాట్లాడుకోవడానికి వీలుగా ఏర్పాట్లు, సమావేశాల నిర్వహణకు వినియోగించుకునేలా నిర్మాణం చేయనున్నారు. దీనికి సంబంధించి అధికారులు మూడు రకాల ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. వీటిల్లో ముఖ్యమంత్రి ఆమోదించే ప్రణాళిక ప్రకారం త్వరలో నిర్మాణాలు ప్రారంభించనున్నారు.

## ఓసీ లేకుండా విద్యుత్ కనెక్షన్ కుదరదు

- బహుళ అంతస్తుల భవన నిర్మాణదారులకు హైకోర్టు స్పష్టీకరణ
- ఇష్టారాజ్యంగా బిల్డర్ల నిర్మాణాలు
- ఇలాంటి వాటిని ప్రోత్సహించలేం



సాక్షి, హైదరాబాద్: మున్సిపల్ అధికారులిచ్చే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) సమర్పించకుండా బహుళ అంతస్తుల భవనాలకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం కుదరదని హైకోర్టు తేల్చిచెప్పింది. బిల్డర్లు తరచూ.. ఆమోదించిన ప్లాన్ మార్చి నిర్మాణం చేస్తున్నారని, చట్టవిరుద్ధంగా అదనపు అంతస్తులు కడుతున్నారని, ఆ తర్వాత క్రమబద్ధీకరణకు కోరుతున్నారని.. ఇవన్నీ ఉల్లంఘనలేనని వ్యాఖ్యానించింది. గతంలో తాము ఇచ్చిన సడలింపులను దుర్వినియోగపరిస్తే మౌనంగా ఉండలేమని తేల్చిచెప్పింది. ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడితే సమర్థించలేమని హైకోర్టు పేర్కొంది. సమాజ ప్రయోజనాల దృష్ట్యా ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించలేమని స్పష్టం చేసింది. ముందుగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) నుంచి ఓసీ పొందాలని ఓ కేసులో పిటిషనర్‌ను ఆదేశించింది. అది సమర్పించిన తర్వాతే టీజీఎస్‌పీడీసీఎల్ విద్యుత్ కనెక్షన్ ఇస్తుందని చెప్పింది. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని తన భవనానికి విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు ఓసీ కోసం పట్టుబట్టకుండా టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ మహమ్మద్ ఆరిఫ్ రిజ్వాన్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. స్టిల్ట్‌తో పాటు ఐదు అంతస్తుల నిర్మాణం జీహెచ్ఎంసీ మంజూరు చేసిన ప్రణాళిక ప్రకారమే జరిగిందన్నారు. అన్ని చార్జీలు చెల్లించిన తర్వాతే విద్యుత్ కనెక్షన్‌కు అనుమతి కోరామని చెప్పారు. టీజీఎస్‌పీడీసీఎల్ తరఫు న్యాయవాది శ్రీధర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. గతంలో ఓసీ సడలింపులకు అధికారులు అనుమతి ఇవ్వడంతో చాలా మంది లబ్ధిదారులు ఆ తర్వాత కూడా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ సమర్పించలేదన్నారు. విద్యుత్ కనెక్షన్ పొంది సరఫరాను అనుభవిస్తున్నారని.. దీంతో ఈ ఏడాది జనవరిలో టీజీఎస్‌పీడీసీఎల్ ఓ సర్క్యులర్ జారీ చేసిందన్నారు. దీని ప్రకారం 10 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న భవనాలకు విద్యుత్ సేవలకు ఓసీ తప్పనిసరి చేసిందన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఉల్లంఘనలను ప్రోత్సహించేలా ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని స్పష్టం చేశారు.



ఎగువ కాఫర్ డ్యామ్

# కుంగిపోయింది

**10 మీటర్ల వెడల్పు, 8 మీటర్ల లోతున భారీ గొయ్యి**

**భారీ వాహనాల రాకపోకల వల్లే కుంగిందంటున్న నిపుణులు**

- గుట్టుచప్పుడు కాకుండా మట్టి, రాళ్లతో గోతిని పూడ్చివేసిన అధికారులు
- తిరిగి రాకపోకలకు అనుమతించిన వైనం
- బాబు సర్కార్ పాపం.. పోలవరానికి శాపం
- ప్రధాన డ్యామ్ నిర్మాణానికి వీలుగా వరద ప్రవాహం మళ్లింపునకు నిర్మించిందే ఎగువ కాఫర్ డ్యామ్
- డ్యామ్ నిర్మాణ సామగ్రి సరఫరాకు మరో దారిని నిర్మించుకోని కాంట్రాక్టర్
- కమీషన్ల కోసం కాఫర్ డ్యామ్ మీదుగా రాకపోకలకు అనుమతి ఇచ్చిన సర్కారు
- గతంలోనూ కమీషన్ల కక్కుర్తితో ఎగువ కాఫర్ డ్యామ్ పునాది జెట్ గ్రౌటింగ్ వాల్ పనుల్లో అక్రమాలు
- 40 మీటర్లకు బదులు 20 మీటర్ల లోతుతోనే నిర్మాణం

సాక్షి, అమరావతి/పోలవరం రూరల్ :పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో చంద్రబాబు సర్కార్ తప్పిదాలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రధాన (ఎర్త్ కమ్ రాక్ ఫిల్) డ్యామ్ నిర్మాణానికి వీలుగా గోదావరి వరద ప్రవాహాన్ని స్పిల్ వే మీదుగా మళ్లించడానికి నిర్మించిన ఎగువ కాఫర్ డ్యామ్ తాజాగా కుంగిపోయింది. వాస్తవానికి దీనిపై భారీ వాహనాల రాకపోకలకు అనుమతించకూడదు. కానీ.. బట్రెస్ డ్యామ్, డయాఫ్రం వాల్ పనులకు అవసరమైన మట్టి, రాళ్లు, కంకర, సిమెంటును భారీ వాహనాల్లో ఎగువ కాఫర్ డ్యామ్ మీదుగానే సరఫరా చేస్తున్నారు. ఇందుకోసం కాఫర్ డ్యామ్‌ల మధ్య ప్రత్యేకంగా దారిని ఏర్పాటు చేసుకోవాల్సిన బాధ్యత కాంట్రాక్టర్‌దే. కానీ.. కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూర్చి, కమీషన్లు వసూలు చేసుకోవడానికి ఎగువ కాఫర్ డ్యామ్ మీదుగానే భారీ వాహనాల్లో వాటిని సరఫరా చేయడానికి సర్కార్ అనుమతించింది. ఆ భారీ వాహనాల రాకపోకల వల్ల ప్రకంపనలు, ఒత్తిడి వల్ల ఎగువ కాఫర్ డ్యామ్ 10 మీటర్ల వెడల్పు, 8 మీటర్ల లోతున దిగువకు కుంగి పోయింది. శుక్రవారం ఉదయం దీన్ని గమనించిన అధికారులు గుట్టుచప్పుడు కాకుండా రాళ్లు, మట్టి వేసి పూడ్చివేశారు. మళ్లీ వాహనాల రాకపోకలకు అనుమతి ఇచ్చేశారు.

**కమీషన్ల కక్కుర్తి వల్లే సీపేజీ**

- గోదావరికి 2017లో వరద ప్రవాహం ముగిశాక ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల పునాది జెట్ గ్రౌటింగ్ వాల్‌లను 2018 జూన్ నాటికి అప్పటి చంద్రబాబు సర్కార్ పూర్తి చేసింది. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్ నిర్మించే ప్రదేశంలో కమీషన్ల కక్కుర్తితో ఇసుక సాంద్రతను తప్పుగా లెక్కించి.. 40 మీటర్ల లోతుతో నిర్మించాల్సిన జెట్ గ్రౌటింగ్ వాల్‌ను 20 మీటర్ల లోతుతో నిర్మించింది.
- గోదావరి ప్రవాహం ప్రభావం జెట్ గ్రౌటింగ్ వాల్‌పై పడకుండా రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో 2018లో గోదావరి వరదలకు ఎగువ కాఫర్ డ్యామ్ జెట్ గ్రౌటింగ్ వాల్ 200 నుంచి 260 మీటర్ల మధ్య కోతకు గురై దెబ్బతింది. 20 మీటర్ల లోతుతో నిర్మించిన జెట్ గ్రౌటింగ్ వాల్ పటిష్టంగా ఉందో లేదో తెలుసుకోకుండానే ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల పనులను 2018 డిసెంబర్‌లో ప్రారంభించి.. 2019 మార్చి నాటికి పూర్తి చేయలేక ఇరు వైపులా ఖాళీ ప్రదేశాలను వదిలేసిందని అంతర్జాతీయ నిపుణుల కమిటీ ఎత్తిచూపింది.
- దీనివల్లే ఎగువ కాఫర్ డ్యామ్‌లో భారీ ఎత్తున సీపేజీ (లీకేజీ) సమస్య ఉత్పన్నమైందని, ఇది ఎగువ కాఫర్ డ్యామ్ భద్రతను ప్రశ్నార్థకం చేసిందని స్పష్టం చేసింది. ఎగువ కాఫర్ డ్యామ్ భద్రతకు బట్రెస్ డ్యామ్‌ను నిర్మించాలని సూచించింది. దాంతో రూ.వందల కోట్లు వెచ్చించి బట్రెస్ డ్యామ్‌ను నిర్మించాల్సి వచ్చిందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

**వెంటాడుతున్న పాపాలు**

- రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు పాపాలు వెంటాడుతూనే ఉన్నాయి. విభజన చట్టం ప్రకారం పోలవరం ప్రాజెక్టును వంద శాతం ఖర్చుతో కేంద్రమే పూర్తి చేసి రాష్ట్రానికి అప్పగించాలి. కానీ.. కమీషన్ల కక్కుర్తితో రాష్ట్ర సమగ్రాభివృద్ధికి దిక్సూచిగా నిలిచే ప్రత్యేక హోదాను కేంద్రానికి తాకట్టు పెట్టి.. 2016 సెప్టెంబర్ 7న పోలవరం నిర్మాణ బాధ్యతలను అప్పటి చంద్రబాబు సర్కార్ దక్కించుకుంది.
- పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సీడబ్ల్యూసీ (కేంద్ర జల సంఘం) సూచించిన విధానాన్ని తుంగలో తొక్కి.. కమీషన్లు వచ్చే పనులనే చేపట్టింది. గోదావరి వరద ప్రవాహాన్ని మళ్లించేలా స్పిల్ వే, స్పిల్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేయకుండానే ప్రధాన డ్యామ్ గ్యాప్-2 పునాది డయా ఫ్రం వాల్‌ను నిర్మించింది.
- దీంతో 2017, 2018 గోదావరి వరదల ఉధృతికి డయా ఫ్రం వాల్ దెబ్బతింది. ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతం కోతకు గురైంది. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేయలేక.. ఇరు వైపులా ఖాళీ ప్రదేశాలను వదిలేసి, 2019 ఫిబ్రవరి నాటికి చేతులెత్తేసింది. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లలో వదిలేసిన ఖాళీలు అంటే 2,400 మీటర్ల వెడల్పుతో ప్రవహించాల్సిన గోదావరి వరద 800 మీటర్లకు కుదించుకుపోయి ప్రవహించడం వల్ల వరద ఉధృతి మరింత పెరిగి ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతం కోతకు గురైంది.
- 2019 మే 30న అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం.. చంద్రబాబు సర్కార్ తప్పిదాలను సరిదిద్ది.. స్పిల్ వే, స్పిల్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేసి గోదావరి ప్రవాహాన్ని స్పిల్ వే మీదుగా మళ్లించింది. కుడి, ఎడమ కాలువలను జలాశయంతో అనుసంధానం చేసే కనెక్టివిటీలను పూర్తి చేసి.. ఎడమ కాలువలో కీలకమైన నిర్మాణాలను పూర్తి చేసి.. కేంద్రంతో చర్చించి నిధుల సమస్యను పరిష్కరించింది. నిర్వాసితులకు పునరావాసం కల్పించి పోలవరం ప్రాజెక్టుకు జీవంపోసింది.



> దుష్టుల ఆలోచన చొప్పున నడువక, పాపుల మార్గమున నిలువక యెహోవా ధర్మశాస్త్రమునందు ఆనందించుచు, దివారాత్రము దానిని ధ్యానించువాడు ధన్యుడు.
>
> – క్రైస్తవ ధర్మం



## గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, **తిథి:** బ.నవమి రా.8.32 వరకు తదుపరి దశమి, **నక్షత్రం:** కృత్తిక ఉ.6.45 వరకు తదుపరి రోహిణి, **వర్జ్యం:** రా.9.46 నుండి 11.14 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.40 నుండి 5.32 వరకు, **అమృత ఘడియలు:** రా.2.14 నుండి 3.44 వరకు.

సూర్యోదయం : 5.46
సూర్యాస్తమయం : 6.22
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

# అధర్మం నాలుగు పాదాలపై...

## జనతంత్రం



వర్ధెల్లి మురళి



శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి. 'పరిత్రాణాయ సాధూనామ్, వినాశాయ చ దుష్కృతామ్, ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే' అనే సందేశాన్ని మన జనజీవన స్రవంతితో సమ్మేళన పరిచిన భగవానుడాయన. సన్మార్గులను రక్షించడానికీ, దుర్మార్గులను శిక్షించడానికీ ప్రతి యుగంలోనూ నేను అవతరిస్తూనే ఉంటానని ఆయన చేసిన గీతోపదేశాన్ని భారతీయ సమాజం ఇప్పటికీ స్మరించుకుంటూనే ఉన్నది. ఇక జన్మాష్టమి సందర్భమైతే సరేసరి. పామరుల నుంచి పండితుల వరకు, సామాన్యుల నుంచి సర్కార్ పెద్దల వరకూ ఆ మహామహోపాధ్యాయుని సంస్మరణ అవిస్మరణీయమైన ఆచారంగా మిగిలిపోయింది.

ఈ కృష్ణాష్టమి సందర్భంగా రాజకీయ నాయకులు ఇచ్చిన సందేశాల్లో ఏపీ ప్రతిపక్ష నేత వై.ఎస్. జగన్ చేసిన ట్వీట్ అందరి దృష్టినీ ఎక్కువగా ఆకర్షించింది. 'అధర్మం ఎంత బలంగా ఉన్నా – అది తాత్కాలికం. ధర్మం ఎంత నెమ్మదిగా ముందుకెళ్ళినా – అది శాశ్వతం. శ్రీకృష్ణుని జీవితం దీనికి నిదర్శనం' అని ఆ సందేశంలో పేర్కొన్నారు. నిన్నమొన్నటి రాజకీయ పరిణామాలు ఈ ట్వీట్‌కు ప్రేరణ కావచ్చు. ఎన్నికలౌక తతంగంగా – ప్రజాస్వామ్యం ఒక ప్రహసనంగా మారిన తీరు ప్రభావితం చేసి ఉండవచ్చు. కిందటేడాది జరిగిన సాధారణ ఎన్నికలపై పుంఖానుపుంఖాలుగా ఆరోపణలు వస్తున్న విషయం విదితమే. ఆ ఆరోపణలకు తగిన ఆధారాలు సమకూరుతున్న తీరు కూడా తెలిసిన సంగతే.

రెండు రోజుల కిందటే జరిగిన రెండు జడ్పీటీసీ ఉప ఎన్నికల తతంగం మరో రకమైన వంచన. నడిబజార్లలో ప్రజాస్వామ్యం బట్టలూడదీసి వివస్త్రగా నిలబెట్టిన దుశ్శాసన క్రీడగా దాన్ని వర్ణించవచ్చు. ఈ వికృత కేళికి బాధ్యులెవరంటే ఏమని చెబుతాం? కర్ణుడి చావుకు కారణాలేమిటో అర్జునుడికి కృష్ణపరమాత్మ తెలియజెప్పుతాడు. 'నీ చేతను, నా చేతను వరమడిగిన కుంతి చేత వాసవు చేతన్ ధర చేత భార్గవు చేత నరయంగ కర్ణుడీల్గె నార్వురి చేతన్' అని వివరిస్తాడు. 'కర్ణుడు నీవల్లా నావల్ల మాత్రమే చనిపోలేదు. ఆయన చావుకు కుంతీదేవి, ఇంద్రుడు, భూదేవి, పరశురాముడు కూడా కారకులే'నని చెబుతాడు.

అదేవిధంగా పులివెందుల, ఒంటిమిట్టల్లో కూడా రక్షకులుగా ఉండవలసినవారే ప్రజాస్వామ్య హత్యాకాండకు ఒడిగట్టారు. 'సత్యం వద' (సత్యాన్ని మాట్లాడు), 'ధర్మం చర' (ధర్మాన్ని అనుసరించు) అని ఉపనిషత్తులు చేస్తున్న బోధనను మన సనాతన ధర్మ ప్రభుత్వం 'సత్యం వధ' (సత్యాన్ని చంపు), 'ధర్మం చెర' (ధర్మాన్ని నిర్బంధించు)గా అర్థం చేసుకున్నట్టుంది. ఆ రాష్ట్ర ప్రభుత్వంలో ఉన్న రాజకీయ వ్యవస్థ సత్యాన్ని వధించైనా ఓ గెలుపును కైవసం చేసుకోవాలని సంకల్పించింది. రాజ్యాంగ ధర్మాన్ని నిర్వర్తించవలసిన ఎన్నికల వ్యవస్థ ఈ సంకల్పానికి సహకరించింది. నిష్పక్షపాతంగా వ్యవహరించవలసిన అధికార యంత్రాంగం, ముఖ్యంగా పోలీస్ యంత్రాంగం ఈ సంకల్పానికి సాగిలబడింది. సత్యాన్ని మాట్లాడవలసిన నాలుగో స్తంభం (మీడియా) దాన్ని చంపేయడానికి తోడ్పాటునిచ్చింది.

రాజ్యాంగ ధర్మాన్ని నిలబెట్టవలసిన ప్రభుత్వం, ఎన్నికల సంఘం, అధికార యంత్రాంగం, మీడియా సమష్టిగా అధర్మ పతాకాన్ని ఎగరవేశాయి. అధర్మాన్ని నాలుగు పాదాల మీద నడిపించాయి. ఆ నడక తీరు ఎలా సాగిందో ఒకసారి చూద్దాం. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు ఇరవై జడ్పీటీసీ స్థానాలు ప్రాతినిధ్యం లేకుండా ఖాళీగా ఉన్నాయి. ఇందులో చాలా స్థానాలు పులివెందుల, ఒంటిమిట్ట స్థానాలు ఖాళీ అవకముందు నుంచే అలా ఉన్నాయి. అధికారం బాగా తలకెక్కిన వారికి చిత్రాతిచిత్రమైన కోర్కెలు కలుగుతుంటాయని చాలా కథల్లో చదువుకున్నాము. అటువంటి ఒక కోరిక ముఖ్యమంత్రికో, ఆయన కుమారునికో కలిగిందని సమాచారం. జగన్‌మోహన్‌రెడ్డికి బలమైన కోటవంటి పులివెందులలో ఆయన్నొకసారి ఓడించాలనేది ఆశ. ఆ కోర్కె తీరేలోగా పులివెందుల నియోజకవర్గం నుంచి ఓ తోకనో, ఒక ఈకనో గెలుచుకొచ్చి అదేం దుర్భేద్యమైన దుర్గం కాదని చాటేందుకు ఉబలాటపడ్డారు. అలా చేస్తే వైసీపీ నైతిక ధృతి దెబ్బతిని స్థానిక ఎన్నికల్లో తమకు 'జీవన్‌టోన్'లా ఉపయోగపడుతుందని ఆశించారు.

పులివెందుల జడ్పీటీసీతోపాటు పక్కనే ఉన్న రాజంపేట నియోజకవర్గంలోని ఒంటిమిట్ట స్థానానికి కూడా ఉపఎన్నికలు జరిపి ఏదోవిధంగా రెండూ గెలవాలని ఆలోచన చేశారు. అలా జరిగితే కడప జిల్లాలో జగన్ బలం కోల్పోయాడని ప్రచారం చేసుకోవాలనేది లక్ష్యం. ఈ లక్ష్యసాధన కోసం కలిసివచ్చే కరివేపాకుల్ని ఇంతకుముందే సేకరించి పెట్టుకున్నారు. ఈ రెండింటికి మాత్రమే ఎన్నికలు జరిపితే మిగిలిన 18 జడ్పీటీసీల సంగతి? ఇన్నిచోట్ల ఒకేసారి దుశ్శాసన ప్రయోగం మంచిది కాదు. వికటించినా వికటించవచ్చు – అని ఈ రెంటికి మాత్రమే ఎన్నిక జరిగే విధంగా జయరామిరెడ్డి అనే దేశం కార్యకర్తను కోర్టు మెట్లు ఎక్కించారు. కడప జడ్పీ ఛైర్మన్ ఎమ్మెల్యేగా గెలిచినందువల్ల అప్పటికే ఆ పదవి ఖాళీగా ఉన్నది. రెండు జడ్పీటీసీలు ఖాళీగా ఉండగా కొత్త ఛైర్మన్ ఎన్నిక కుదరదని, కనుక ఈ రెండు స్థానాలకు ముందుగా ఎన్నికలు నిర్వహించేవిధంగా ఆదేశించాలని జయరామిరెడ్డి న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. న్యాయస్థానం ఓకే చేసింది.

రాజ్యాంగంలోని 243వ అధికరణాన్ని అనుసరించి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సంపూర్ణమైన అధికారం రాష్ట్ర ఎన్నికల సంఘానిదే! రెండు జడ్పీటీసీల ఎన్నికలకు కోర్టు ఆదేశించినప్పుడు ఖాళీగా ఉన్న మిగిలిన స్థానాలకు కూడా ఎన్నికల నిర్వహణకు ఈసీ ఉపక్రమించి ఉండవచ్చు. అది దాని ధర్మం కూడా! కానీ రాష్ట్ర ప్రభుత్వానికి సమ్మతం కాని పనిని చేయడానికి ఈసీ సాహసించలేదు. ఆరు మాసాలకు మించి ఖాళీగా ఉండకూడదన్న స్ఫూర్తిని కూడా విస్మరించింది. ఇక ఎన్నికలు జరిగిన రెండు స్థానాలపై చాలాకాలం ముందునుంచే టీడీపీ సర్కార్ వ్యూహాత్మకంగా వ్యవహరించడం మొదలుపెట్టింది. వైసీపీ కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నాలు మొదలుపెట్టింది.

ఎన్నికలు సరిగ్గా వారం రోజుల ముందటే పులివెందుల నియోజకవర్గానికే చెందిన వైసీపీ కార్యకర్త సైదాపురం సురేష్ రెడ్డిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. ఆ మరుసటిరోజే శాసనమండలి సభ్యుడైన రమేష్ యాదవ్‌పైనా, వైసీపీ నాయకుడు వేల్పుల రాముపైన దాడి జరిగింది. రామును హత్య చేయడానికే చూశారని సమాచారం. వైసీపీ కార్యకర్తలూ, నేతలూ ఎన్నికలయ్యేంతవరకు ఇళ్ళను వదిలి వెళ్లకపోతే ఇటువంటి ఘటనలే జరుగుతాయని హెచ్చరికలు జారీ చేశారు. పాలక కూటమి దాడుల పట్ల పోలీసుల స్పందన మరీ అన్యాయం. ఒక జడ్పీటీసీ ఎన్నిక కోసం వందలాదిమంది పోలీసులతో ఒక డీఐజీ స్థాయి అధికారే మోహరించారు. దాడులపై ఫిర్యాదులు చేసిన వారితో ఆయన వెటకారంగా వ్యవహరించారనే వార్తలు వచ్చాయి. 'పక్క ఊరికి వెళ్లి పత్తాపారం చేస్తే ఇలానే ఉంటుంద'ని ఆయన వ్యాఖ్యానించారు. తామే లేకపోతే అక్కడ తలలు తెగిపడేవనే మాటలు కూడా వైరల్ అయ్యాయి.

ఈ తరహా కామెంట్ల వల్ల తమకు పోలీసు రక్షణ లభించదనే అభిప్రాయం సహజంగానే వైసీపీ కార్యకర్తలకు ఏర్పడుతుంది. ఏడాది మాత్రమే గడువున్న ఒక చిన్న ఎన్నిక కోసం గ్రామాల ప్రశాంతత ఎందుకు భగ్నం కావాలన్న ఆలోచన కూడా ఉండవచ్చు. వైసీపీ ముఖ్య కార్యకర్తలంతా మండలం నుంచి బయటికి వెళ్లారు. యెల్లో మీడియా మాత్రం వైసీపీ వాళ్లు ఓటుకు ఐదు వేలు, పదివేలిచ్చి ఓటర్లను ప్రలోభపెడుతున్నారని, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారనీ యథావిధిగా వెకిలి రాతలే రాసింది. తలలు తెగిపడే పరిస్థితులు ఉన్నాయని డీఐజీ స్థాయి అధికారి చెప్పినప్పుడు ఎన్నికల సంఘం స్పందించి ఉండాల్సింది. పరిస్థితులు చక్కదిద్దడానికి ప్రయత్నాలు చేసి ఉండవలసింది. కానీ అటువంటివేమీ జరగలేదు.

నిబంధనల ప్రకారం పోలింగ్‌కు 48 గంటల ముందు బయటి ప్రాంతాల వాళ్లంతా అక్కడి నుంచి వెళ్లిపోవాలి. మంత్రి సవిత నాయకత్వంలో ఒకటి, జమ్మలమడుగు ఎమ్మెల్యే దండనాయకునిగా మరొకటి, కమలాపురం ఎమ్మెల్యే నేతృత్వంలో ఇంకోటి, బీటెక్ రవి అధీనంలో ఒకటి చొప్పున అక్కడే తిష్ఠవేసి ఉన్న నాలుగు బెటాలియన్లు మాత్రం ఈ నిబంధన పాటించలేదు. పోలింగ్ రోజున ఉదయం నాలుగు గంటలకే ఈ బెటాలియన్లు మొత్తం 15 పోలింగ్ బూతుల్ని చుట్టుముట్టాయి. పోలింగ్ బూత్‌లకు ఈ బెటాలియన్లు ఔటర్ రింగ్ రోడ్డు మాదిరిగా నిలబడితే పోలీసులు ఇన్నర్ రింగ్‌రోడ్డు మాదిరిగా పోలింగ్ బూత్ ప్రాంగణాల్లో ఉండిపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేయాలని వచ్చిన వారికి తొలుత కూటమి బెటాలియన్లే ఎదురుపడ్డాయి.

ఓటేసేందుకు వచ్చిన ఓటర్ల దగ్గర స్లిప్పులు లాక్కుని కూటమి సైన్యం వారిని వెనక్కి పంపించింది. ఒక్క వైసీపీ ఏజెంట్‌ను కూడా బూతుల్లోకి ఈ కిరాయి సైన్యం అనుమతించలేదు. ఫిర్యాదు చేయడానికి ఏ ఒక్క పోలీసూ కనబడలేదు. అంతకు ముందే నాలుగు గ్రామాల పోలింగ్ బూత్‌లను ఎత్తివేసి పక్క గ్రామాలలో ఏర్పాటు చేశారు. ఆ గ్రామాల మధ్య మాత్రం పోలీసు చెక్‌పోస్టులు ఏర్పాటయ్యాయి. కాళ్లు పట్టుకున్నా పోలీసులు కనికరించలేదు. ఓట్లు వేసేందుకు వెళ్లనీయలేదు. ఈ

> పులివెందుల జడ్పీటీసీతోపాటు పక్కనే ఉన్న రాజంపేట నియోజకవర్గంలోని ఒంటిమిట్ట స్థానానికి కూడా ఉపఎన్నికలు జరిపి ఏదోవిధంగా రెండూ గెలవాలని ఆలోచన చేశారు. అలా జరిగితే కడప జిల్లాలో జగన్ బలం కోల్పోయాడని ప్రచారం చేసుకోవాలనేది లక్ష్యం. ఈ లక్ష్యసాధన కోసం కలిసివచ్చే కరివేపాకుల్ని ఇంతకుముందే సేకరించి పెట్టుకున్నారు. ఈ రెండింటికి మాత్రమే ఎన్నికలు జరిపితే మిగిలిన 18 జడ్పీటీసీల సంగతి? ఇన్నిచోట్ల ఒకేసారి దుశ్శాసన ప్రయోగం మంచిది కాదు. వికటించినా వికటించవచ్చు – అని ఈ రెంటికి మాత్రమే ఎన్నిక జరిగే విధంగా జయరామిరెడ్డి అనే దేశం కార్యకర్తను కోర్టు మెట్లు ఎక్కించారు. కడప జడ్పీ ఛైర్మన్ ఎమ్మెల్యేగా గెలిచినందువల్ల అప్పటికే ఆ పదవి ఖాళీగా ఉన్నది. రెండు జడ్పీటీసీలు ఖాళీగా ఉండగా కొత్త ఛైర్మన్ ఎన్నిక కుదరదని, కనుక ఈ రెండు స్థానాలకు ముందుగా ఎన్నికలు నిర్వహించే విధంగా ఆదేశించాలని జయరామిరెడ్డి న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. న్యాయస్థానం ఓకే చేసింది.
>
> రెండు జడ్పీటీసీల ఎన్నికలకు కోర్టు ఆదేశించినప్పుడు ఖాళీగా ఉన్న మిగిలిన స్థానాలకు కూడా ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం (ఈసీ) ఉపక్రమించి ఉండవచ్చు. అది దాని ధర్మం! కానీ ప్రభుత్వానికి సమ్మతం కాని పనిని చేయడానికి ఈసీ సాహసించలేదు.

వార్తలు, ఫోటోలు ఒక సెక్షన్ మీడియాలో, సోషల్ మీడియాలో పెద్ద ఎత్తునే కనిపించాయి. కానీ ఎన్నికల సంఘం స్పందించ లేదు. పోలింగ్ బూత్‌లను మార్చడమనే నిర్ణయాన్ని కూడా పాలక కూటమి సూచన మేరకే ఈసీ తీసుకున్నదనే విషయం బహిరంగ రహస్యం.

ఒంటిమిట్ట మండలంలోనూ ఇదే ఫార్ములాను అమలు చేశారు. కాకపోతే తొలుత పోలింగ్ బూతుల్లోకి వైసీపీ ఏజెంట్లు ప్రవేశించగలిగారు. ఓ గంటన్నర తర్వాత రాష్ట్ర మంత్రి నాయకత్వంలో ఓ పటాలం బయల్దేరి బూతుల్లో ఉన్న ఏజెంట్లను బయటకు తరిమేశారు. సాక్షాత్తూ ఒక రాష్ట్ర మంత్రి అక్రమంగా బూత్‌లో చొరబడ్డా, ఏజెంట్లపై దౌర్జన్యం చేసినా ఎన్నికల సంఘం కిమ్మనలేదు. కొన్ని బూతుల్లో కాసేపు ఏజెంట్లు కూర్చున్న ఫలితం ఓట్ల సంఖ్యలో కనిపించింది. అక్కడ వైసీపీకి 6 వేలకు పైగా ఓట్లు పడ్డాయి. నిజమైన ఓటర్లను అనుమతించని పులివెందులలో వైసీపీకి 683 ఓట్లు వచ్చాయి. అవి కూడా కూటమి సైన్యమే వేసి ఉంటుంది కనుక అందుకు వారికి ఓ వైసీపీ నాయకుడు వెటకారంగా ధన్యవాదాలు తెలియజేశారు.

బూటకపు ఎన్నికల కౌంటింగ్ ముగిసిన తర్వాత కూటమికి వంత పాడుతున్న మీడియాలోని ఓ ప్రధాన సెక్షన్ స్పందన జుగుప్సాకరంగా ఉన్నది. స్వేచ్ఛగా ఎన్నికలు జరిగినందువల్ల టీడీపీ గెలిచిందట. ముప్పయ్యేళ్ల తర్వాత పులివెందుల ప్రజలకు నిజమైన స్వాతంత్ర్యం లభించిందట! అందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతూ బ్యాలెట్ బాక్సుల్లో స్లిప్పులు వేశారట! స్లిప్పుల బండారాన్ని సోషల్ మీడియాలో ఓ యువకుడు ఎండగట్టిన తీరు నవ్వు తెప్పిస్తున్నది. కామెంట్లు రాసిన కాగితాలను బ్యాలెట్ బాక్సుల్లో వేయాలంటే ఆ కాగితాన్ని మతడపెట్టి వేయాలి. కానీ ఆ కాగితాలపై మడతలు లేకపోగా ఇస్త్రీ చేసినట్టుగా ఉన్నాయంటూ వాటి ఫోటోలను జతజేశాడు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఓటేయడానికి క్యూలైన్లలో నిలబడిన కూటమి కార్యకర్తలను గుర్తించి, ఆ ఫోటోలను ఒక సెక్షన్ మీడియా ప్రచురించింది. అయినా ఈసీలో స్పందన లేదు. ఈరకంగా వ్యవస్థలన్నీ ప్రలోభాలకు లోనై ఏలినవారి ఎదుట సాగిలపడుతున్న తీరును చూస్తుంటే మన ప్రజాస్వామిక వ్యవస్థ పెనుప్రమాదాన్ని ఎదుర్కోబోతున్నట్టు హెచ్చరికలు కనిపిస్తున్నాయి. పౌరులారా బహుపరాక్!

vardhelli1959@gmail.com

## రాయని డైరీ

జెలెన్‌స్కీ, (ఉక్రెయిన్ అధ్యక్షుడు)

మాధవ్ శింగరాజు

శుక్రవారం అలాస్కాలో ట్రంప్, పుతిన్ కలిసినప్పుడు చరిత్రలో నేను చదువుకున్న 'యాల్టా' సమావేశమే నాకు గుర్తుకొచ్చింది!

నేను పుట్టటానికి 33 ఏళ్ల ముందు జరిగిన సమావేశం అది. అప్పటికి పుతిన్ పుట్టలేదు. ట్రంప్ కూడా పుట్టలేదు. యాల్టా సమావేశం జరిగిన ఏడాదికి ట్రంప్, ఏడేళ్లకు పుతిన్ పుట్టారు.

'యాల్టా' ఇప్పుడు ఉక్రెయిన్‌లో ఉంది. అప్పట్లో సోవియెట్ యూనియన్‌లో ఉంది. యాల్టాకు పోలికగా ఇప్పుడు అలాస్కా నాకు గుర్తుకు రావటానికి తగినన్ని కారణాలే ఉన్నాయి.

రెండో ప్రపంచ యుద్ధం మధ్యలో యాల్టా సమావేశం జరిగింది. ఇప్పుడు రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మధ్యలో అలాస్కా సమావేశం జరిగింది.

యాల్టా సమావేశం రూజ్‌వెల్ట్, స్టాలిన్, చర్చిల్‌ల మధ్య జరిగింది. అలాస్కా సమావేశం ట్రంప్, పుతిన్‌ల మధ్య జరిగింది.



యాల్టాలో రూజ్‌వెల్ట్, చర్చిల్ కలిసి స్టాలిన్‌కు కొన్ని దేశాల భూభాగాలను పంచి పెట్టారు! ఇప్పుడు ట్రంప్ కూడా ఉక్రెయిన్‌లో కొన్ని ప్రాంతాలను నా చేత ఇప్పించేందుకు ట్రంప్‌కు మాట ఇచ్చి ఉంటారా?!

అలాస్కాకు, యాల్టాకు అన్నిటికన్నా ముఖ్యమైన పోలిక... యాల్టా సమావేశం ఫిబ్రవరిలో జరగటం! ఆ తర్వాత 77 ఏళ్లకు ఉక్రెయిన్ మీదకు రష్యా దురాక్రమణ కూడా ఫిబ్రవరిలోనే ప్రారంభం అవటం!

శనివారం ఉదయం ట్రంప్ పర్సనల్ సెక్రెటరీ నటాలీ ఫోన్ చేసి, "ప్రెసిడెంట్ ట్రంప్ హ్యాపీగా లేరు..." అన్నారు!

సోమవారం వాషింగ్టన్‌లో ట్రంప్‌కూ, నాకూ మధ్య జరగబోయే సమావేశంలో ట్రంప్ తనేమి చెప్పబోతారో, దాన్నే ముందుగా నటాలీ చేత నాకు చెప్పించటానికి ట్రంప్ ఫోన్ చేయించి ఉంటారని నాకు అర్థమైంది.

"ట్రంప్ ఒక్కరేనా, ప్రెసిడెంట్ పుతిన్ కూడా హ్యాపీగా లేరా?" అన్నాను.

నా వ్యంగ్యాన్ని ఆమె సరిగానే అర్థం చేసుకున్నప్పటికీ, అదేమీ పట్టనట్లు "మీరూ, పుతిన్ ఓపెన్ డోర్స్ మీటింగ్‌లో కూర్చుంటే బాగుంటుందని ప్రెసిడెంట్ ట్రంప్ భావిస్తున్నారు..." అన్నారు.

"ఓపెన్ ఆన్సర్లు లేకుండా, ఓపెన్ డోర్ మీటింగులతో ఏమౌతుంది చెప్పండి మిసెస్ నటాలీ?" అన్నాను.

నటాలీ కొద్ది క్షణాలు మౌనంగా ఉన్నారు. ఆ తర్వాత, "మూడో ప్రపంచ యుద్ధం కనుక మొదలైతే ఇక అదే చివరిది అవుతుందని ట్రంప్ ఆందోళన చెందుతున్నారు" అన్నారు!!

మూడో ప్రపంచ యుద్ధం వస్తే అదే ఆఖరి యుద్ధం అవుతుందని జోస్యంలా చెప్పటం కాకుండా, మూడో ప్రపంచ యుద్ధం వస్తే ఈ భూగోళానికే పెద్ద విపత్తు అని ఒక జాగ్రత్తలా ఎవరూ ఎందుకు మాట్లాడరు!

"మిసెస్ నటాలీ! రోజంతా మీరు ప్రెసిడెంట్ పక్కనే ఉంటారని, ఇంటర్నెట్‌లో ప్రెసిడెంట్ ట్రంప్‌పై వచ్చే ప్రశంసాపూర్వకమైన కథనాలను ఆయనకు అందిస్తుంటారని విన్నాను. ట్రంప్ కనుక పుతిన్‌తో, 'మీరే ముందు యుద్ధం ఆపేయండి' అని ఒక్క మాట అనగలిగినా మా వైపు నుండి కూడా ఒక ప్రశంసాపూర్వకమైన కథనం మీకు లభ్యమౌతుంది..." అన్నాను, నవ్వుతూ.

ఆ మాటకు తనూ నవ్వారు.


ఇద్దరం ఒకప్పుడు ఎంటర్‌టైన్‌మెంట్ కెరీర్‌లో ఉన్నవాళ్లం. ఆ మ్యాజిక్ ఏదో మా మాటల్లో పనిచేసినట్లుంది. ప్రెసిడెంట్‌కు సెక్రెటరీగా కాకుండా, ఒక కో–ఆర్టిస్ట్‌గా నాతో సైన్ ఆఫ్ అయ్యారు నటాలీ.

అలాస్కా సమావేశం జరిగినప్పటికీ కీవ్‌ను ఆక్రమించేందుకు రష్యా ఇంకా ఇంకా దగ్గరికి వస్తూనే ఉంది!

రేపు ట్రంప్‌తో నా మీటింగ్ తర్వాత కూడా రష్యాకు నేను ఒకటే చెబుతాను. "మీరు మాపై దాడికి వచ్చినప్పుడు మీరు మా ముఖాలను చూస్తారు. మా వీపులను కాదు, మా ముఖాలను!" అని చెప్పిందే చెబుతాను.

# అద్భుతాలకు నిలయాలు

సైన్స్ టుడే



డా॥ సి.వి. సర్వేశ్వర శర్మ

భూమి మీద తయారైన కార్బన్ డై ఆక్సైడ్‌లో సగభాగాన్ని సాగరాలు పీల్చేసుకుంటాయి. పరిశుభ్రమైన నీటి కన్నా సాగర జలాలు ఎనిమిది రెట్లు ఎక్కువ కార్బన్ డై ఆక్సైడ్‌ను పీల్చుకుంటాయి. సముద్రపు పై పొరలు పీల్చుకున్న కార్బన్ డై ఆక్సైడ్‌ను దిగువ పొరలు క్రమంగా కిందికి లాగి పీల్చుకుంటాయి. సముద్రం అడుగున ఉన్న వృక్ష జాతులు ఈ కార్బన్ డై ఆక్సైడ్‌ను వాడుకుంటాయి. సాగర్ జలాల్లో ఎన్ని రకాల మొక్కలు ఉన్నాయో, వాటి సంఖ్య ఎంతో తెలుసుకునే ప్రయత్నంలో పడ్డారు పరిశోధకులు. ఈ కార్యక్రమం పేరు 'ఓల్వో ఓషన్ రేసు'. ఇందులో ఎనిమిది 'యాచ్'లను ఉపయోగిస్తారు. పందాల్లో ఉపయోగించే ప్రత్యేకమైన నౌకలను 'యాచ్'లు అంటారు. వీటిలో నీటి రంగును గుర్తించి నమోదు చేసే రేడియోమీటర్ పరికరాలు ఉంచారు. సముద్రం అడుగున పెరిగే వృక్ష జాతిని అనుసరించి నీటి ఉపరితలం రంగు మారుతుంది. ఈ రంగుల ఆధారంగా మొక్కల జనాభాను లెక్కిస్తారు.

సముద్ర అగాధంలో ఉండే పర్వత శ్రేణులు సముద్రాలలోని నీటిపై ప్రభావం చూపుతాయి. సముద్ర ప్రవాహాలు ప్రపంచ వాతావరణంపై తమ ప్రభావాన్ని చూపుతాయి. సముద్ర కెరటాల ధ్వని ప్రళయఘోషను గుర్తుకు తెస్తుంది. సముద్ర గర్భంలో అంతా నిశ్శబ్దంగా ఉంటుందని అనుకునేవారు. కానీ సముద్ర ఉపరితలంతో పోలిస్తే అంతర్భాగాలలో శబ్దాల తీవ్రత అధికంగా ఉండి గోలగోలగా ఉంటుందని తెలుసుకున్నారు.

సముద్రాల లోపల పీడనం, ఉష్ణోగ్రతలు వివిధ పొరల్లో వివిధ రకాలుగా ఉంటాయి. ఈ పొరల గుండా ధ్వని ప్రసరించినపుడు ప్రతిధ్వనులు ఏర్పడతాయి. సముద్ర ఉపరితలంపై ధ్వనులు వేగంగా ప్రయాణిస్తాయి. అదే విధంగా చల్లని నీటితో పోలిస్తే వేడినీటిలో శబ్దాలు వేగంగా వెళతాయి. ఇదంతా శబ్దాల తీవ్రతకు కారణం అవుతాయి. మానవాళికి ఆహారం నుండి దివ్య ఔషధాల వరకు ఎన్నింటినో సాగరాలు సమకూరుస్తున్నాయి. వ్యాధికారక సూక్ష్మజీవులకు విరుగుడు కూడా ప్రకృతిలో ఉంటుందని పరిశోధకుల భావన. సముద్ర అగాధాలలో ఉన్న సూక్ష్మజీవులు 'ఆటోపిక్ డెర్మటైటిస్' అనే చర్మవ్యాధిని నివారించడంలో శక్తిమంతంగా పనిచేస్తాయని గుర్తించారు.

జపాన్ సముద్రంలో 6,300 అడుగుల లోతున ఒక తెగ సూక్ష్మజీవులను గుర్తించారు. ఇవి మనుషుల మధుమేహాన్నీ, స్థూలకాయాన్నీ అరికడతాయని పరీక్షల్లో రుజువయ్యింది. ఔషధ తయారీ కంపెనీలు ఈ సూక్ష్మజీవుల నుండి ప్రయోజనకరమైన ఔషధాలను తయారు చేసే ప్రయత్నంలో ఉన్నాయి. సముద్రాల అడుగుభాగం పరిశీలిస్తే అక్కడ అనేక వృక్ష, జంతుజాతులు ఉన్నాయి. ఇవి ఎటువంటి సూర్యరశ్మి, సేంద్రియ పదార్థాలపైనా ఆధారపడకుండా జీవించడం ఒక



◆ సముద్ర గర్భంలో అంతా నిశ్శబ్దంగా ఉంటుందని అనుకునేవారు. కానీ సముద్ర ఉపరితలంతో పోలిస్తే అంతర్భాగాలలో శబ్దాల తీవ్రత అధికంగా ఉండి గోలగోలగా ఉంటుందని తెలుసుకున్నారు.

అద్భుతం. సముద్రం అట్టడుగు మట్టిలో, ఆహారాన్ని విషం చేసే ఒక రకమైన 'క్లోస్ట్రిడియమ్ పెర్‌ఫ్రింజెర్స్' అనే సూక్ష్మజీవులను కనుగొన్నారు. ఇవన్నీ విషంతో బ్రతకడం ఒక ఆశ్చర్యకరమైన విషయం.

ప్రపంచ వ్యాప్తంగా అత్యంత ఆవశ్యకమైన పెట్రోలియం, మ్యాంగనీసు, సహజవాయువులు, ఫాస్ఫేట్, సల్ఫర్, టైటానియం, జిర్కాన్, బంగారం, ప్లాటినం, వజ్రాలు, తగరం, ఇనుములకు సముద్రాలు నెలవులు. సముద్రాల అడుగున అగ్నిపర్వతాలు ఉన్నాయి. ఇవి విజృంభించినపుడు కొంత ఎత్తుకు ఎదిగిన తరువాత చల్లబడిపోతాయి. కొన్నింటికి విజృంభణ ఎక్కువగా ఉండి సముద్ర ఉపరి తలం పైకి వచ్చి చల్లారి ఒక దీవిగా ఏర్పడతాయి. ఈ విధంగానే హవాయి దీవులు ఏర్పడ్డాయి. ఇలా సముద్రంలో ఎన్నో అద్భుతాలు దర్శనమిస్తాయి.

వ్యాసకర్త పాపులర్ సైన్స్ రచయిత

## ఇన్ బాక్స్

# జవాబుదారీతనం ఏదీ?

బిహార్‌లో ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా సవరణలు 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (సర్)లో 'ఓటు చోరీ' జరుగుతోందనీ, దాన్ని సరిదిద్దాలనీ కోరుతూ మూడు వందల మంది ప్రతిపక్ష ఎంపీలు ఢిల్లీలో నిరసన ర్యాలీ చెయ్యడం ప్రాముఖ్యం కలిగిన వార్త. వారిని ఎన్నికల కమిషన్ తమను కలిసేందుకు అనుమతినిస్తే సరిపోయేది. సబబుగా ఉండేది. ప్రతిపక్షాలు గత కొంత కాలంగా బిహార్ అంశమే కాకుండా, గత సార్వత్రిక ఎన్నికల్లో అక్రమాలు జరిగినట్లు కొన్ని ఆధారాలతో బలంగా చెబుతున్నాయి. కర్ణాటకలో ఒక పార్లమెంటు నియోజక వర్గంలో లక్ష ఓట్లకు పైగా మతలబు జరిగినట్లూ, అలాంటి ఉదంతాలు దేశ వ్యాప్తంగా ఉన్నట్లూ, తద్వారా అధికార పక్షానికి మేలు జరిగినట్లూ తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆరోపణల తీవ్రత దృష్ట్యా ఎన్నికల కమిషన్ సందేహ నివృత్తి చేయాల్సింది. అది దేశ ప్రజలకు మంచి సందేశం ఇచ్చినట్లు ఉండేది. అలా చెయ్యడం దాని బాధ్యత కూడా!

దురదృష్ట వశాత్తూ ఎన్నికల సంఘం ఆ దిశగా ఆలోచిస్తున్నట్లు కనబడడం లేదు. ఒక రాజ్యాంగ సంస్థ తన బాధ్యత పట్ల ఏ రూపంలో విమర్శ ఎదురైనా, దాన్ని ఒక అవకాశంగా తీసుకుని ప్రజల దృష్టిలో తన నిబద్ధతను చాటిచెప్పేలా ప్రవర్తించాలి. కానీ జరుగుతున్నది అలా లేదు. గత ఎన్నికల్లోని సందేహాస్పద ఓటర్ల జాబితాను డిజిటల్ రూపంలో అడుగుతున్నారు. దాన్ని ఇవ్వడం లేదు. దొంగ ఓట్లు, ఒకే చిరునామాతో ఉన్న డజన్ల ఓట్లు, డూప్లికేట్‌వీ... ఇలాంటి అవకతవకలు లక్షల్లో నమోదైనట్లు ప్రతిపక్షాలు చూపిస్తున్నాయి. వాటికి జవాబు లేదు.

ఒక్క ఓటుతో ఫలితాలు తారుమారయ్యే ప్రజాస్వామ్యంలో ఒక అసెంబ్లీ నియోజకవర్గంలోనే వేలాది ఓట్లు తొలగించడం తీవ్ర ప్రభావాన్ని కలిగించే అంశం. బిహార్ రాష్ట్రం మొత్తంలో 65 లక్షల ఓట్లు తొలగించారు. దొంగవైతే తప్పేం లేదు. కానీ అవి దొంగవా, లేదా అర్హులవా అన్నది స్పష్టంగా రుజువులతో చెప్పడం లేదు. పైగా ఇది ఎన్నికలకు ముందు రెండు నెలల్లో తేల్చేస్తున్న హడావిడి రివ్యూ కావడం ఆందోళన కలిగిస్తోంది.

ప్రతిపక్షాల ఆరోపణల వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉండొచ్చు. అది అప్రస్తుతం. తన బాధ్యత పట్ల ఒక అనుమానం కలిగే అంశంపై ఎన్నికల కమిషన్ సరిగ్గా స్పందించాలి. ప్రతీ పౌరుడికీ తన ఓటు హక్కును స్వేచ్ఛగా వాడుకొనే పరిస్థితి కల్పించాలి. అక్రమాలతో ప్రజాతీర్పు తారుమారు కాకుండా చూసే బాధ్యత కూడా దానిదే. అలా చూడడమే కాకుండా ఆ నమ్మకాన్ని పౌరునిలో కలిగించాలి. అది ప్రజల పట్ల, దేశం పట్ల రాజ్యాంగ బద్ధమైన బాధ్యత.

– డా॥ డి.వి.జి. శంకరరావు । మాజీ ఎంపీ

# స్వయం సంస్కరణ





ఉపాధ్యాయులు, ప్రవచనకారులు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వవలసింది ఆచరణకే! ఫ్రెంచి తత్త్వవేత్త అగస్ట్ కాంప్ట్ బాల్యంలో జరిగిన ఒక సంఘటన ఈ సందర్భంగా గుర్తుచేసుకోవలసి ఉంది. ఓ ఉపాధ్యాయుడు కుర్చీలో కూర్చొని, బల్ల మీద కాళ్ళుపెట్టి పాఠాలను చెప్పాడు. ఆ తర్వాత పాఠం అప్పజెప్పమని ఉపాధ్యాయుడు కాంప్ట్ అడిగాడు. వెంటనే కాంప్ట్ కూడా ఆ ఉపాధ్యాయునిలాగే కుర్చీలో కూర్చొని బల్లమీద కాళ్ళు పెట్టి పాఠాన్ని అప్పజెప్పాడు. ఉపాధ్యాయునికి కోపం వచ్చింది. కాంప్ట్‌ను తిట్టాడు. దీంతో కాంప్ట్ నెమ్మదిగా, 'అయ్యా! మీరు పెద్దవారు. మిమ్మల్ని అనుసరించటం నాకు ధర్మం అనుకొని అలా చేశాను' అన్నాడు. తోటి విద్యార్థులతో కలిసి ఆ ఉపాధ్యాయుడిని తీసేయవలసిందిగా వినతిపత్రం సమర్పించాడు. అధికారులు కాంప్ట్‌ను బడి నుంచి పంపివేశారు (పుట 317– 318 – తత్త్వవేత్తలు – త్రిపురనేని గోపీచంద్). అలా గెంటి వేయబడిన కాంప్ట్ సుప్రసిద్ధ సంఘ సంస్కర్త, తత్త్వవేత్త అయ్యారు.

భగవద్గీతలో **'యద్యదాచరతి శ్రేష్ఠః'** అను శ్లోకం (3 వ అధ్యాయం– 21వ శ్లోకం) శ్రేష్ఠులు ఏ కార్యాలను చేస్తారో వాటినే సామాన్య జనులు అనుసరిస్తారు అని తెలుపుతుంది. కాబట్టి ఉపాధ్యాయులు, బోధకులు క్రమశిక్షణాయుతమైన, పవిత్రమైన, జీవితాన్ని ఆదర్శంగా ప్రజలముందు నిలపాలి. **'యద్యదాచరతి తద్బోధయా'**– దేన్ని ఆచరిస్తావో దాన్ని బోధించు' అని పెద్దలు చెబుతారు. అలా జరిగినపుడే శ్రేయస్సు కలిగేది. స్వయం సంస్కరణ, సంఘ సంస్కరణ – రెండూ సాధ్యమవుతాయి.

– రాచమడుగు శ్రీనివాసులు

# గూగుల్‌ని అడిగేస్తూ.. చెప్పింది చేసేస్తూ..




ఒకప్పుడు.. తేలికపాటి అనారోగ్య సమస్య వచ్చినా వైద్యుడి దగ్గరికో దగ్గరిలోని మెడికల్ షాపుకో వెళ్లేవాళ్లం. డాక్టర్ రాసినవో, మెడికల్ షాపువాళ్లు ఇచ్చినవో మందులు తెచ్చుకునేవాళ్లం. దగ్గరివాళ్లు ఇచ్చే ఆరోగ్య సలహా పాటించేవాళ్లం. ఇప్పుడు ఇంటర్నెట్ కాలం నడుస్తోంది. ఆరోగ్యం, శరీర సంరక్షణకు సంబంధించి ప్రజల ప్రవర్తన, ప్రాధాన్యతలు ఎంతలా మారాయంటే సమస్య వచ్చినప్పుడే కాదు ఆరోగ్యంగా ఉండేందుకూ ఏం చేయాలో సింపుల్‌గా గూగుల్‌ను అడిగేస్తున్నారు!

- సాక్షి, స్పెషల్ డెస్క్

ఆరోగ్యానికి సంబంధించి కొన్ని సమస్యలు, అనుమానాలను.. ఇతరులతో చర్చించడానికి చాలామంది ఇష్టపడరు. అంతేకాదు, హాస్పిటల్‌కు వెళితే ఖర్చు అని వెనకడుగు వేసేవారూ ఉన్నారు. ఇంటర్నెట్ రాక, గూగుల్ సెర్చ్ ఇంజిన్ దైనందిన జీవితంలో భాగమయ్యాక ఇలాంటి వాళ్లందరికీ పెద్ద ఉపశమనం లభించినట్టు అయింది. చిన్న సమస్య తలెత్తినా, అనుమానం ఉన్నా, వేరొకరికి చెప్పలేనిదైనా.. ఒకరిపై ఆధారపడకుండా సింపుల్‌గా గూగుల్‌ని అడిగేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెటింగ్ డేటా, అనలిటిక్స్ కంపెనీ 'కాంటార్' రూపొందించిన 'హెల్త్ అండ్ వెల్‌నెస్ ఇన్ ఇండియా' నివేదికే ఇందుకు నిదర్శనం. హెల్త్, వెల్‌నెస్‌కు సంబంధించి 2024లో నెటిజన్లు గూగుల్‌లో వెతికిన 110 రకాలకుపైగా అంశాలను విశ్లేషించి ఈ నివేదిక రూపొందించారు.

'ఫలానా ఉత్పత్తి వాడాను, చాలా బాగా పని చేసింది'. 'ఫలానా పద్ధతి పాటించడం వల్ల పరిష్కారం దొరికింది' అంటూ మన అనుకున్నవారిచ్చే సలహా పాటిస్తాం. మరి మన అని అనుకున్నవారు లేకపోతే? గూగుల్‌ను ఆశ్రయిస్తున్నారు! ప్రపంచవ్యాప్తంగా రోజుకు 850 కోట్ల వరకు గూగుల్ సెర్చెస్ నమోదవుతున్నాయంటే ఏ స్థాయిలో ఈ సెర్చ్ ఇంజిన్ 'మన' అయిందో అర్థం చేసుకోవచ్చు. భారత్ నుంచి గూగుల్‌లో నెలకు 1,200 కోట్ల విజిట్స్ నమోదవుతున్నట్టు సమాచారం. ఈ విషయంలో యూఎస్ తర్వాత రెండో స్థానం మనదే. అయితే సెర్చ్ ఇంజిన్ చూపించే ఉత్పాదనను ఎంత మంది కొన్నారు, రేటింగ్స్ ఏంటి, రివ్యూలు ఏం చెబుతున్నాయో తెలుసుకున్నాకనే యూజర్లు అడుగు ముందుకేస్తున్నారు.

### 'మన' గూగుల్

### జాగ్రత్త అవసరం

గూగుల్ లాంటి సెర్చ్ ఇంజిన్లను నమ్మి ఔషధాలు కొని, వాడేయటం ఆరోగ్యానికి మంచిది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వైద్యుడు.. పేషెంట్ శరీర తత్వాన్ని పూర్తిగా తెలుసుకుని మందులు సిఫార్సు చేస్తాడు. కానీ గూగుల్ అలాకాదు.. సాధారణీకరించి మందులు చెప్పేస్తుంది. అందువల్ల గూగుల్ సలహాల విషయంలో అప్రమత్తంగా ఉండాలంటున్నారు.

### ఎక్కువగా సెర్చ్ చేసిన అంశాలు

పోషకాలు–సప్లిమెంట్లు, ప్రత్యామ్నాయ వైద్యం, చర్మ సంరక్షణ, శారీరక దృఢత్వం, శరీర బరువు నిర్వహణ, మానసిక ఆరోగ్యం, మహిళల ఆరోగ్యం, నిద్ర, రోగనిరోధక శక్తి, అధునాతన వైద్యం, డీటాక్సిఫికేషన్, దీర్ఘాయువు, బీ12 అధికంగా ఉండే ఆహారం, నడకకు ఉత్తమమైన షూ, సున్నిత చర్మానికి సౌందర్య సాధనాలు, చక్కెర లేని ఆహార పదార్థాలు.. వగైరా.

| నమ్మకమైన సలహాదారుగా ఈ సెర్చ్ ఇంజిన్ | సప్లిమెంట్లు, విటమిన్ల నుంచి షూ వరకు | ఆరోగ్య సంబంధ సందేహాల నివృత్తికీ అదే | భారీగా పెరిగిన శోధనలే ఇందుకు నిదర్శనం |
|---|---|---|---|

## టాప్-5 పోకడలు

**నమ్మదగిన ఆరోగ్య పరిష్కారాలు**

ప్రత్యక్షంగా కనిపించే, నమ్మకమైన ఫలితాలను వినియోగదారులు కోరుకుంటున్నారు. చర్మ సంరక్షణ, శరీర బరువు నిర్వహణ, వ్యాయామంపై 2.66 కోట్ల సెర్చ్‌లు నమోదయ్యాయి. 2023తో పోలిస్తే ఇవి 39% పెరిగాయి. చర్మ ఆరోగ్యానికి కొల్లాజెన్, మెరుగైన నిద్ర కోసం మెలటోనిన్, శక్తి కోసం ప్రీ-వర్కౌట్ సప్లిమెంట్స్ కోసం జనంలో ఆసక్తి పెరిగింది.

**క్లినికల్, స్వీయ-సంరక్షణ**

సైన్స్ ఆధారిత వెల్‌నెస్ ఎక్కువగా కోరుకుంటున్నారు. బరువు తగ్గించే జీఎల్‌పీ-1 మందులు, జ్ఞాపకశక్తి పెంచే సప్లిమెంట్లు, హార్మోన్ల ట్రాకింగ్ కోసం 1.46 కోట్ల శోధనలు జరిగాయి. 2023తో పోలిస్తే ఇవి 13 శాతం ఎక్కువ.

**అంతర్గత ఆరోగ్యం-బాహ్య శక్తి**

అందం, మానసిక స్థితి, శరీర బరువు నిర్వహణ, వృద్ధాప్యం వంటి సమస్యలు.. పోషకాహారం, పేగు (గట్) ఆరోగ్యం, రోగనిరోధక శక్తితో ముడిపడి ఉన్నాయని చాలామంది భావిస్తున్నారు. ఈ తరహా సెర్చ్‌లు 1.45 కోట్ల వరకు జరిగాయి. చర్మం, జుట్టు ఆరోగ్యానికి సహకరించే ఔషధాలు, మల్టీవిటమిన్‌లపై జనంలో ఆసక్తి పెరిగింది.

**ఆరోగ్యకర దినచర్యలు**

రోజువారీ దినచర్యలు, ఆరోగ్య నిర్వహణలపై ప్రజల శ్రద్ధ పెరిగింది. 9% పెరుగుదలతో ఈ విభాగంలో 99 లక్షల శోధనలు నమోదయ్యాయి. హైడ్రేషన్, ఋతు చక్రం, ధ్యానం, యోగా వంటివి ట్రాక్ చేయడానికి సాంకేతికతను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. మహిళలు నెలసరి సమస్యలపై ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు.

**ప్రత్యామ్నాయ వైద్యం**

ఆయుర్వేదం, హోమియోపతి, ఆక్యుపంక్చర్, డిటాక్స్ టీ, బయో హ్యాకింగ్ వంటి వాటి గురించి 17% వృద్ధితో 87 లక్షల సెర్చ్‌లు జరిగాయి. (శాస్త్ర, సాంకేతికతల సాయంతో మన శరీరాన్ని, మనసును ఆరోగ్యంగా ఉంచుకోవడం లేదా ఆరోగ్యాన్ని మరింత మెరుగుపర్చుకోవడాన్ని బయో హ్యాకింగ్ అంటారు.)

**పోషకాలు-సప్లిమెంట్లు**

విటమిన్ బీ12 కోసం 27 లక్షల శోధనలు నమోదయ్యాయి. 2023తో పోలిస్తే ఇవి **54** శాతం ఎక్కువ కావడం గమనార్హం.

**చర్మ ఆరోగ్యం**

సున్నితమైన చర్మం కోసం సెర్చ్‌లు **30%** పెరిగాయి.

**బరువు నిర్వహణ**

జీఎల్‌పీ1 ఔషధాలైన ఓజెంపిక్ కోసం **216%**, జెప్‌బౌండ్‌కు **943%** అధికంగా సెర్చ్‌లు నమోదయ్యాయి.

**ఒత్తిడి తగ్గేందుకు**

కార్టిసాల్ కోసం శోధనలు **59%** పెరిగాయి.

**మహిళల ఆరోగ్యం**

గతంతో పోలిస్తే.. రుతుచక్రంలోని దశల గురించి వెతకడం **100** శాతానికిపైగా పెరిగింది.

**నిద్ర**

మెలటోనిన్ సంబంధిత స్ప్రే, గమ్మీలు, ట్యాబ్లెట్ల కోసం సెర్చ్‌లు **27%** పెరిగి 45 లక్షలకు చేరుకున్నాయి.

**చక్కెర**

చక్కెర రహిత, చక్కెరకు ప్రత్యామ్నాయాల కోసం.. గతంలో కంటే **14** శాతం ఎక్కువగా 74 లక్షల శోధనలు జరిగాయి.

---

## ఫొటోగ్రఫీ పోటీల్లో సాక్షి ఫొటో జర్నలిస్టులకు అవార్డులు



సాక్షి, హైదరాబాద్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం-2025 సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సమాచార శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో సాక్షి ఫొటో జర్నలిస్టులు సత్తాచాటారు. హైదరాబాద్‌కు చెందిన నోముల రాజేశ్‌రెడ్డి, గడిగే బాలస్వామి, సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్ కె.సతీశ్ ఉత్తమ అవార్డులు సాధించారు. మంగళవారం 19వ తేదీన హైదరాబాద్ గ్రీన్‌పార్క్ హోటల్‌లో వారు అవార్డులు అందుకోనున్నారు.

## 'ప్రభుత్వ పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్స్‌గా మార్చాలి'



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్ పద్ధతిలోకి మార్చాలని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సోమయ్య, టి.లింగారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం నాంపల్లిలోని టీఎన్జీవో భవన్‌లో డెమో క్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) 15వ వార్షిక కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎం.సోమయ్య, టి.లింగారెడ్డి మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చి, విద్యార్థులందరికీ ఉదయం అల్పాహారం, పుష్టికరమైన మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ అందించాలన్నారు. పాఠశాలలోనే హోంవర్క్ చేయించిన తర్వాత విద్యార్థులను ఇంటికి పంపించే విధానం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలని కోరారు. ఈ విధానంతోనే ప్రభుత్వ పాఠశాలలు మనుగడ సాగించే అవకాశం ఉంటుందన్నారు. కొత్తగా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకంటే సెమీ రెసిడెన్షియల్ విధానంతోనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు రావాల్సిన ఐదు డీఏలు వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీ అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బిల్లులు, పెన్షనరీ బెనిఫిట్స్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## నేటి నుంచి రిలయన్స్ డిజిటల్ ఇండియా సేల్

సాక్షి, హైదరాబాద్: దేశంలోని అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ రిటైలర్ అయిన రిలయన్స్ డిజిటల్ ఆదివారం నుంచి 'డిజిటల్ ఇండియా సేల్'ను ప్రారంభించనున్నట్లు తెలిపింది. ఈ సేల్‌లో భాగంగా వినియోగదారులు 25 శాతం వరకు సేవింగ్స్ (ఎస్‌బీఐ బ్యాంకు కార్డులపై 10 శాతం తక్షణ డిస్కౌంట్, ఇది రూ.15 వేల వరకు ఉండొచ్చు. గిఫ్ట్ వోచర్‌లపై 15 శాతం డిస్కౌంట్ ఉంటుంది) పొందుతారని వెల్లడించింది. అదనంగా వినియోగదారులు 1 ఉచిత ఈఎంఐతో సహా ఆకర్షణీయమైన పేపర్ ఫైనాన్స్ ఆప్షన్లు కూడా పొందవచ్చని పేర్కొంది. అలాగే ఎంపికచేసిన యాక్సెసరీలపై యూపీఐ చెల్లింపులు చేసిన మీదట 5 శాతం అదనపు డిస్కౌంట్ పొందవచ్చని తెలిపింది. డిజిటల్ ఇండియా సేల్ www. reliance digital. in వెబ్‌సైట్‌తో పాటు అన్ని రిలయన్స్ డిజిటల్, మై జియో, జియో మార్ట్ డిజిటల్ స్టోర్స్‌లో అందుబాటులో ఉన్నట్లు వెల్లడించింది.

---

## మేమెక్కడికి పోవాలె.. ఈ పల్లె.. మా గడ్డ!

- నారాయణపేట జిల్లా పల్లెగడ్డను ఖాళీ చేయాలని దేవాదాయ శాఖ ఆదేశం
- చిన్నరాజమూరు ఆంజనేయస్వామి ఆలయ మాన్యం భూమిలో ఊరు
- 7 ఏళ్లుగా గ్రామస్తుల న్యాయపోరాటం.. పట్టించుకోని ప్రజా ప్రతినిధులు
- 250 కుటుంబాల్లో ఆందోళన



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఆ పల్లెలో మూడు తరాల ప్రజలు ఉన్నంతలో సుఖంగా జీవించారు. ప్రస్తుతం నాలుగో తరం జీవనం సాగిస్తోంది. 200 ఏళ్లకు పైగా అక్కడే స్థిర నివాసం ఏర్పరచుకున్న ఆ పల్లె వాసులకు దేవాదాయ శాఖ రూపంలో ఆపద ముంచుకొచ్చింది. ఆలయ మాన్యం భూమిలో ఊరు ఉందంటూ.. గ్రామాన్ని ఖాళీ చేయాలని అధికారులు హుకుం జారీచేశారు. దీంతో గ్రామస్తులకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. నారాయణపేట జిల్లాలోని పల్లెగడ్డ వాసుల దీనగాథపై 'సాక్షి'గ్రౌండ్ రిపోర్ట్..

### 250కి పైగా కుటుంబాలు.. 16,124 జనాభా

పర్వత ప్రాంతమైన పల్లెగడ్డ మొదట నారాయణపేట జిల్లా మరికల్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉండేది. 2018లో ఇది నూతన జీపీగా ఆవిర్భవించింది. ప్రస్తుతం ఈ పల్లెలో 250 కుటుంబాలకు పైగా నివాసం ఉంటున్నాయి. మొత్తం 16,124 మంది జనాభా.. 745 మంది ఓటర్లు ఉన్నారు. 20 ఎకరాలు గ్రామకంఠం భూమిగా రికార్డులో నమోదై ఉంది. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలోని చిన్న రాజమూరు ఆంజనేయ స్వామి ఆలయం పేరిట సర్వే నంబర్ 269, 270, 271లో 69 ఎకరాల మాన్యం భూమి ఉంది. దీనికి పైభాగాన మరికల్‌లో నివసిస్తున్న కాట్లకొండ వంశీయుల భూములు ఉన్నాయి. సుమారు 200 ఏళ్ల క్రితం ఆ వంశస్తులైన హన్మన్న, ముసిలన్న, చిన్న రాజన్న, తిమ్మన్న సదరు ఆలయ భూమిలో గుడిసెలు వేసుకుని కుటుంబాలతో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. కాలక్రమంలో వారి వారసులు సైతం అక్కడే వ్యవసాయం చేసుకుంటూ స్థిరపడ్డారు. క్రమక్రమంగా జనాభా పెరుగుతూ వచ్చింది. పక్కా ఇళ్ల నిర్మాణాలు కూడా జరిగాయి. దీంతో అప్పటి పెద్దలు గ్రామానికి పల్లెగడ్డగా నామకరణం చేశారు.

### 2018లో 11 మందికి... ఇటీవల 25 మందికి..

ఆలయ మాన్యం భూమిలో నిర్మించుకున్న ఇళ్లు తొలగించాలని 2018లో దేవాదాయ శాఖ అధికారులు పల్లెగడ్డ వాసులు 11 మందికి నోటీసులు జారీ చేశారు. దీంతో వారు నారాయణపేట జిల్లా కోర్టును ఆశ్రయించారు. ఈ ఏడాది జూన్, జూలైలో మరో 25 మందికి నోటీసులు జారీ అయ్యాయి. ఈ నెల 18న దేవాదాయ శాఖ ట్రిబ్యునల్ కోర్టుకు హాజరుకావాలని అందులో పేర్కొనడంతో గ్రామస్తుల్లో ఆందోళన నెలకొంది

### ఏడేళ్లుగా కోర్టు చుట్టూ తిరుగుతున్నా..



అధికారులు గ్రామాన్ని ఖాళీ చేయాలంటున్నారనే విషయాన్ని ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. ఏడేళ్లుగా నారాయణపేట కోర్టు చుట్టూ తిరుగుతున్నా. గ్రామం ఖాళీ చేసి పోతే మా బతుకులేం కావాలి? మాకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. – హన్మంతు, పల్లెగడ్డ

### ముత్తాతల కాలం నుంచి ఇక్కడే ఉన్నాం..



నేనొక్కడినే కాదు.. చాలా మంది అప్పులు చేసి ఇళ్లు కట్టుకున్నారు. మా ముత్తాతల కాలం నుంచి ఇక్కడే ఉన్నాం. ఇప్పుడు ఖాళీ చేయాలంటూ నాతో పాటు 25 మందికి నోటీసులిచ్చారు. మాకు ప్రభుత్వం ఎక్కడైనా ఇళ్లు నిర్మించి ఇస్తే.. ఊరు ఖాళీ చేయడానికి అభ్యంతరం లేదు. – గోవింద్, పల్లెగడ్డ

### ఆధారాలుంటే కోర్టుకు సమర్పించాలి..

చిన్నరాజమూరు ఆంజనేయ స్వామి ఆలయ భూమిలో ఇళ్లు నిర్మించడం వల్లే పల్లెగడ్డ గ్రామస్తులకు దశలవారీగా నోటీసులిస్తున్నాం. వారి వద్ద ఏమైనా ఆధారాలుంటే కోర్టులో సమర్పించాలి. లేకుంటే కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం. – కవిత, దేవాదాయ శాఖ ఈఓ, మహబూబ్‌నగర్

---

## న్యూజిలాండ్‌లో భారత స్వాతంత్ర్య వేడుకలు

- వేడుకల్లో పాల్గొన్న ఆ దేశ ప్రధాని లుక్సన్
- ఆకట్టుకున్న సూర్యాపేట కళాకారుడి ప్రదర్శన




తెలంగాణ కళాకారులను ప్రశంసిస్తున్న న్యూజిలాండ్ దేశ ప్రధాని క్రిస్టఫర్ లుక్సన్

సూర్యాపేట/మిరుదొడ్డి (దుబ్బాక): భారతదేశ 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను న్యూజిలాండ్ ప్రభుత్వం–ఇండియా ఎంబసీ– తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా శనివారం న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్‌లో ఘనంగా నిర్వహించాయి. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేసేందుకు వేడుకల్లో రాష్ట్రంనుంచి ఆరుగురు ప్రముఖ కళాకారులు పాల్గొన్నారు. పేరిణి నృత్య ప్రదర్శనలో భాగంగా సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన పేరిణి రాజ్‌కుమార్‌కు, జనగామ జిల్లాకు చెందిన పెరుమాళ్ల సంతోష్ కుమార్‌కు ఆరుగురిలో అవకాశం దక్కింది. ఈ వేడుకల్లో అక్కడి ప్రధాని క్రిస్టఫర్ లుక్సన్ పాల్గొన్నారని ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ అవార్డు గ్రహీత అందె భాస్కర్ తెలిపారు. శనివారం ఆయన న్యూజిలాండ్ నుంచి 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడారు. డ్యూ డ్రాప్ ఈవెంట్ స్టేడియంలో జరిగిన తెలంగాణ డప్పుల కళాప్రదర్శనతో పాటు, ఒగ్గు కళాకారుల పేరిణి నృత్యాలను ఆ దేశ ప్రధాని తిలకించి ప్రశంసించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో న్యూజిలాండ్ ఇండియా కాన్సులేట్ జనరల్ మదన్‌మోహన్ షెట్టి, సీడీఎస్ ఫౌండేషన్ చారుదాసు, న్యూజిలాండ్ సెంట్రల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కల్యాణ్‌రావు తదితరులు పాల్గొన్నట్లు చెప్పారు.

---

## అబార్షన్.. ఒకటే ఆప్షన్!

- ఐదేళ్లలో రాష్ట్రంలో 917 శాతం పెరిగిన అబార్షన్లు
- 2020–21లో 1,578 అబార్షన్లు జరగ్గా.. 2024–25 నాటికి 16,059
- రాష్ట్రంలో పెరుగుతున్న అబార్షన్ల తీరుపై ఆందోళన
- గర్భస్రావాలకు భిన్న కారణాలు




**హైదరాబాద్‌లో ఉంటున్న హరీశ్, సుష్మ దంపతులిద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. పెళ్లయిన ఐదేళ్లకు సుష్మ గర్భం దాల్చింది. డాక్టర్ సిఫారసు మేరకు ఐదు నెలల తరువాత స్కానింగ్ సెంటర్‌లో పరీక్షలు చేయించుకోగా, గర్భంలోని శిశువు కుడికాలులో చిన్న దోషం ఉన్నట్లు ఆధునాతన స్కానర్ ద్వారా తెలిసింది. దీంతో లోపం ఉన్న శిశువు వద్దంటూ దంపతులు అబార్షన్‌కు మొగ్గుచూపారు.**

సాక్షి, హైదరాబాద్: ఇటీవలి కాలంలో పెరుగుతున్న గర్భస్రావాలు ఆందోళన కలిగిస్తున్నాయి. రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా గణనీయంగా అబార్షన్లు పెరిగినట్లు కేంద్ర ప్రభుత్వం గణాంకాలతో వెల్లడించింది. రాష్ట్రంలో 2020–21లో అధికారికంగా 1,578 అబార్షన్లు జరగగా, 2024–25 నాటికి 16,059కి పెరిగాయి. అంటే ఐదేళ్లలో ఏకంగా 917 శాతం గర్భస్రావాలు పెరిగినట్లు ఇటీవల రాజ్యసభలో కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్ వెల్లడించారు. దేశంలో 2024- 25లో 8,93,372 అబార్షన్లు జరగడం నిజంగా ఆందోళన కలిగించే విషయం. అధికారికంగానే ఒక ఏడాదిలో దేశవ్యాప్తంగా దాదాపు 9 లక్షల అబార్షన్లు జరిగాయంటే, అనధికారికంగా గ్రామాల్లో ఆర్‌ఎంపీలు, ఇతర గుర్తింపు లేని డాక్టర్ల ద్వారా జరుగుతున్న అబార్షన్ల సంఖ్య ఎంత ఉంటుందో అంచనాకు అందని పరిస్థితి.

### ఏ చిన్న వైకల్యాన్నైనా గుర్తించేలా...

గర్భస్థ శిశువు ఆరోగ్యం గురించి తెలుసుకునేందుకు టిఫ్ఫా (టార్గెట్ ఇమేజింగ్ ఫర్ ఫ్యూటల్ అనొమాలిస్) స్కాన్ అనే సరికొత్త సాంకేతిక పరికరం ప్రస్తుతం అందుబాటులోకి వచ్చింది. ఈ యంత్రం ద్వారా శిశువు కడుపులో పడిన నాలుగు నెలల నుంచి ఆరు నెలల్లోపు శిశువుకు సంబంధించిన పూర్తి ఆరోగ్య స్థితిని తెలుసుకోవచ్చు. శిశువు మెదడు, గుండె, వెన్నుముక, పక్కటెముకలు, అంతర్గత అవయవాల గురించి ఈ యంత్రం సమగ్ర వివరాలిస్తుంది. దీంతో గర్భస్థ శిశువు ఏమాత్రం అనారోగ్యంగా ఉన్నా దంపతులు అబార్షన్ వైపు మొగ్గ చూపుతున్నట్లు ఓ ప్రముఖగైనకాలజిస్టు 'సాక్షి'కి తెలిపారు.

### 2017 నుంచి రికార్డులు తప్పనిసరి

గతంలో అబార్షన్ కేసులు రికార్డుల్లో ఉండేవి కావు. ఇప్పుడు హెచ్‌ఎంఐఎస్ (హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్) ద్వారా గర్భస్రావాల సమాచారం సక్రమంగా నమోదవుతోంది. 2017లో అమల్లోకి వచ్చిన కొత్త గర్భస్రావ చట్టం కారణంగా మరింత స్పష్టమైన గణాంకాలు వెల్లడవుతున్నాయి. దీంతో కరీంనగర్, ఖమ్మం వంటి అధిక గర్భస్రావాలు జరిగే జిల్లా కేంద్రాల్లో ఇప్పుడు లెక్కలు బహిర్గతమవుతున్నాయని ఓ అధికారి తెలిపారు.

### తెలంగాణలో 608 హెల్త్‌కేర్ సెంటర్లు

దేశంలో గర్భస్రావ సేవల కోసం ప్రత్యేకంగా 12,434 ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో రాష్ట్రంలో 608 కేంద్రాల్లో గర్భస్రావ సేవలున్నాయి. ప్రతి సెంటర్‌కు సగటున 26 కేసులు వస్తున్నట్లు అధికారులు చెపుతున్నారు. అత్యధికంగా తమిళనాడులో 2,623 ఉండగా, ఏపీలో 833 ఉన్నాయి.

### ప్రధాన కారణాలివీ..

- ఆరోగ్య సమస్యలు, జన్యుపరమైన లోపాలతోపాటు పెరుగుతున్న జీవన వ్యయాలు కూడా ప్రైవేటు ఉద్యోగులు, రైతులను గర్భవిచ్ఛిత్తి వైపు ఉసిగొల్పుతున్నట్లు ఓ నివేదిక చెబుతోంది.
- గర్భవిచ్ఛిత్తికి సమయాన్ని గర్భధారణ తరువాత 20 వారాల నుంచి 24 వారాల వరకు పొడిగిస్తూ 2021లో మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంటీపీ) చట్టాన్ని సవరించడం.
- అవాంఛిత గర్భధారణలు కూడా అబార్షన్‌కు ఓ కారణమని వైద్య నిపుణులు చెబుతున్నారు.
- గర్భస్థ శిశువు ఆడపిల్ల అయితే అబార్షన్ చేయించుకునే పరిస్థితి ఇప్పటికీ ఉండటం.
- ప్రస్తుత పరిస్థితుల్లో 30 ఏళ్ల వరకు యువతీ యువకులకు పెళ్లిళ్లు కావడం లేదు. గర్భం దాల్చే యువతుల వయస్సు 30 దాటినప్పుడు ఎవరి ప్రమేయం లేకుండా గర్భవిచ్ఛిత్తి జరిగే అవకాశాలు కూడా అధికంగా ఉంటున్నాయి. అదీగాక గర్భస్థ శిశువు ఏమాత్రం అనారోగ్యంతో ఉన్నా అబార్షన్ల వైపు మొగ్గ చూపుతున్నారు.
- కోవిడ్ అనంతరం ఉద్యోగ భద్రత, జీవన విధానం మార్పులతో దంపతులు ఒకరు లేదా ఇద్దరు పిల్లలను మాత్రమే కోరుకుంటుడటం కూడా అబార్షన్లు పెరగడానికి కారణమని అంటున్నారు.
- కుటుంబ ప్రణాళిక, మహిళల ఆరోగ్య రక్షణ, సామాజిక అవగాహన వంటి అంశాలపై మరింత దృష్టి పెట్టకపోతే భవిష్యత్తులో ఈ సమస్య మరింత తీవ్రతరమవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

---

## ఎడారి దేశంలో బిక్కుబిక్కుమంటూ..

- బతుకుదెరువుకోసం దుబాయ్‌కి వెళ్లి మోసపోయిన తెలుగువారు
- కాపాడాలంటూ వేడుకుంటున్న కుటుంబ సభ్యులు



సెల్ఫీ వీడియోలో మాట్లాడుతున్న కిరణ్

వెల్గటూర్: బతుకుదెరువు కోసం ఎడారి దేశం వెళ్లిన తొమ్మిది మంది తెలుగువారు అక్కడ ఓ ముఠా చేతిలో మోసపోయి బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. వీరిలో ఆరుగురు తెలంగాణవారు కాగా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ముగ్గురు ఉన్నారు. తమను కాపాడి ఇండియాకు తీసుకురావాలని వేడుకుంటూ సెల్ఫీ వీడియో తీసి పంపించాడు జగిత్యాల జిల్లా ఎండపల్లికి చెందిన మంతెన కిరణ్. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎండపల్లికి చెందిన మంతెన కిరణ్ ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. అక్కడ గ్రీన్ స్కెచ్ ఎల్ఎల్‌సీ కంపెనీలో ఈ ఏడాది ఏప్రిల్‌లో ఉద్యోగంలో చేరాడు. అతడితోపాటు తెలంగాణకు చెందిన మరో ఐదుగురు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు పనికి కుదిరారు. అక్కడ వీరికి ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. అతను వేరే కంపెనీలో ఎక్కువ జీతం వస్తుందని చెప్పగా.. అతడి మాటలు నమ్మిన ఈ తొమ్మిది మంది అతడితో ఓ ప్రదేశానికి వెళ్లారు. అక్కడ ఆ ముఠా సభ్యులు వీరి నుంచి ఐడీ కార్డులు, సిమ్‌కార్డులు, బ్యాంక్ అకౌంట్ వివరాలు, సంతకాలు, ఫొటోలు తీసుకుని ఈనెల 5న విడిచిపెట్టారు. అనుమానాస్పదంగా ఉన్న వీరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. కిరణ్‌తోపాటు ఏపీకి చెందిన ఓ వ్యక్తిని విడిచి పెట్టారు. మిగిలిన ఏడుగురిని పోలీసుల అదుపులోనే ఉంచుకున్నారంటూ కిరణ్ సెల్ఫీ వీడియో తీసి అతని స్నేహితులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డికి పంపించారు. ప్రస్తుతం ఈ ఇద్దరు జెబలాలి ప్రాంతంలో సిమెంట్ పైపుల్లో తలదాచుకున్నట్లు కిరణ్ తెలిపాడు. పోలీసుల అదుపులో ఉన్నవారిలో వెల్గటూర్ మండలం జగదేవుపేటకు చెందిన మధు, నిజామాబాద్ జిల్లాకు చెందిన వినయ్, రాజు, శ్రీకాంత్ నిర్మల్ జిల్లాకు చెందిన అశోక్, ఏపీకి చెందిన మరో ఇద్దరు ఉన్నారు. పొట్ట కూటికి ఆశపడి పొరుగు దేశం వెళ్లి మోసపోయిన తమవారిని ప్రభుత్వం ఆదుకొని ఇండియాకు తీసుకురావాలని కిరణ్ కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

## ఉత్కంఠతో మొదలై ఉసూరుమనిపించి..

### నిష్ఫలంగా ముగిసిన ట్రంప్, పుతిన్ చర్చలు

**జాయింట్ బేస్ ఎల్మెండార్ఫ్–రిచర్డ్సన్(అలాస్కా):** ఎడాపెడా టారిఫ్‌ల పిడిగుద్దులు కురిపించి ప్రపంచదేశాలకు సుంకాల ముచ్చెమటలు పట్టించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శక్తిసామర్థ్యాలు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఎదుట నిర్వీర్యమయ్యాయి. అలాస్కాలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా, ప్రపంచ దేశాలు అత్యంత ఉత్కంఠతతో ఎదురుచూసిన ట్రంప్, పుతిన్ శిఖరాగ్ర చర్చలు దాదాపు మూడు గంటలపాటు జరిగినా చివరకు ఎలాంటి సత్ఫలితాలనివ్వకుండానే ముగిశాయి. దీంతో దురాక్రమణ జెండా ఎగరేసి ఉక్రెయిన్‌పై బాంబుల మోత మోగిస్తున్న రష్యాను నిలువరించి ఉక్రెయిన్‌లో శాంతికపోతాలు ఎగిరేలా చేస్తానన్న ట్రంప్ భీష్మ ప్రతిజ్ఞ నెరవేరలేదు. అలాస్కాకు చేరుకున్నది మొదలు చర్చలు, సంయుక్త ప్రకటనదాకా ఆద్యంతం పుతిన్‌దే పైచేయి కనిపించింది. అయితే శాంతి ఒప్పందం దిశగా అడుగులు వేశామని ట్రంప్ ప్రకటించగా ఒప్పందం కంటే 'పరస్పర అవగాహన' దిశగా సఖ్యత కుదిరిందని పుతిన్ చెప్పుకొచ్చారు. ఉక్రెయిన్‌లో శాంతిస్థాపనకు ఇరునేతలు ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారనే నిర్దిష్ట ప్రణాళికలను ఇరువురూ బయటపెట్టలేదు. కానీ ఈ చర్చలకు కొనసాగింపుగా రష్యా రాజధాని మాస్కోలో మరోదఫా చర్చలు జరిగే అవకాశముంది.

**పుతిన్‌పై ప్రశ్నల శరాలు**

తన ఏలుబడిలో రష్యా మీడియా పుతిన్‌ను ముక్కుసూటి ప్రశ్నలడిగే దుస్సాహసం చేయదు. కానీ అమెరికాలో అడుగుపెట్టిన పుతిన్‌కు అమెరికా అంతర్జాతీయ మీడియా ప్రశ్నలతో మూకుమ్మడి దాడి చేసింది. పుతిన్ దాదాపు ఏ ప్రశ్నకూ సమాధానం ఇవ్వనప్పటికీ ప్రశ్నల బాణాలు సంధిస్తూ మీడియా పుతిన్‌కు నోటమాట రానివ్వకుండా చేసింది. ''ఉక్రెయిన్‌లో అమాయక పౌరుల ప్రాణాలను తీయడం ఎప్పుడు ఆపేస్తారు? శాంతిస్థాపనకు కంకణం కట్టుకున్నానని మీరు చెప్పే మాటలను ట్రంప్ ఎందుకు నమ్మాలి? ఇలా పలు ప్రశ్నలను మీడియా గట్టిగా అడిగినా పుతిన్ మౌనంగా ఉండిపోయారు. తాను ఆ ప్రశ్నలను వినదల్చుకోలేదు అన్నట్లు చెవులు మూసుకున్నారు.

**సాదర స్వాగతం పలికిన ట్రంప్**

పుతిన్ కంటే ముందే యాంకరేజ్ సిటీలోని ఎయిర్‌పోర్ట్‌కు ట్రంప్ చేరుకున్నారు. తర్వాత ఎయిర్‌పోర్ట్‌లో దిగిన పుతిన్‌కు ట్రంప్ ఎర్ర తివాచీ పరచి మరీ సాదర స్వాగతం పలికారు. ఇద్దరూ కలిసి ఫొటోలకు పోజిచ్చారు. రెడ్‌కార్పెట్‌పై నడిచి వెళ్లేటప్పుడు అమెరికా అత్యంత భారీ బాంబులను జారవిడిచే బీ–2 బాంబర్ యుద్ధవిమానాలతోపాటు ఎఫ్–22 ఫైటర్‌జెట్‌లు గగనతలంలో దూసుకుపోయాయి. ట్రంప్ తన బీస్ట్ కారులో పుతిన్‌ను ఎక్కించుకున్నారు. మార్గమధ్యంలో ఇద్దరూ వెనకసీట్లో కూర్చుని నవ్వుతూ మాట్లాడుకున్నారు. తర్వాత జాయింట్ ఎల్మెండార్ఫ్–రిచర్డ్సన్ వైమానిక స్థావరంలో ఏర్పాటుచేసిన సమావేశమందిరానికి చేరుకున్నారు. అమెరికా విదేశాంగ మంత్రి, జాతీయ భద్రతా సలహాదారు మార్కో రూబియో, ట్రంప్ ప్రత్యేక దూత స్టీవ్ విట్కాఫ్, రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్, జాతీయ భద్రతా సలహాదారు యూరీ ఉషకోవ్‌ల సమక్షంలో ట్రంప్, పుతిన్‌లు సుదీర్ఘంగా చర్చించారు. ఉక్రెయిన్‌పై దాడులు మొదలెట్టాక పుతిన్ అమెరికా గడ్డపై కాలుమోపడం ఇదే తొలిసారి.



జాయింట్ బేస్ స్థావరంలో సమావేశమైన పుతిన్, ట్రంప్

### అమెరికా మా పొరుగు దేశం

భేటీ తర్వాత సంయుక్త సమావేశంలో పుతిన్ తొలుత మాట్లాడారు. ''అమెరికా, రష్యాలు పొరుగుదేశాలే. మమ్మల్ని కేవలం మహాసముద్రాలే వేరుచేస్తున్నాయి. అది కూడా కేవలం నాలుగు కిలోమీటర్లే. మిగతా అంశాల్లో మేం మిత్రదేశాలమే. అందుకే రెడ్‌కార్పెట్‌పై నాకు స్వాగతం పలకేటప్పుడు ట్రంప్ నన్ను హలో పొరుగుమిత్రుడా(నెయిబర్) అని సంబోధించారు. అమెరికాలో ఇప్పటికీ ఆర్థోడాక్స్ చర్చిలు ఉన్నాయి. మా మధ్య సాంస్కృతిక బంధం బలోపేతానికి కృషి చేస్తాం. పరస్పర ప్రయోజనకర, సమస్థాయి ఒప్పందాలకు ఈ సాంస్కృతికబంధాలు వారధిగా నిలుస్తాయి. ప్రచ్ఛన్నయుద్ధంకాలంనుంచి ఇరు దేశాల సంబంధాలు అత్యంత దారుణంగా దెబ్బతిన్నాయి. ఇకమీదట విభేదాలు విడనాడి చర్చల మార్గంలో పయనిద్దాం. వాస్తవానికి ఇలాంటి భేటీ ఎప్పుడో జరగాల్సింది''అని పుతిన్ అన్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధం అంశాన్ని పుతిన్ పరోక్షంగా ప్రస్తావిస్తూ.. ''సంక్షోభమే ఈ సమావేశాలకు ప్రధాన పునాది. ఉక్రెయిన్‌ను చుట్టుముట్టిన సమస్యలకు పరిష్కారం వెతకాల్సి ఉంది. ఉక్రేనియన్ల ఆందోళనను అప్పుడూ పట్టించుకున్నా. ఇప్పుడూ పట్టించుకుంటున్నా. మా మూలాలు ఒక్కటే. పరస్పర సంఘర్షణ కారణంగా ఇరువైపులా శాంతి ప్రక్రియలో ఉక్రేనియన్లు, యురోపియన్లు అవరోధాలు కల్పించొద్దు. అంతా శుభమే జరగాలని కోరుకుంటున్న ట్రంప్‌కు నా ధన్యవాదాలు. మా ఇరు పక్షాలు చక్కటి ఫలితాల కోసమే పాటుపడుతున్నాయి. అమెరికా శ్రేయస్సు కోసం ట్రంప్ పరితపిస్తున్నారు. అలాగే రష్యా స్వప్రయోజనాలు మాకు ముఖ్యం. ట్రంప్‌తో ఎలాంటి ఒప్పందం కుదరలేదు. కానీ ఉక్రెయిన్ అంశంలో అమెరికాతో ఒక అవగాహనకు వచ్చాం''అని పుతిన్ స్పష్టంచేశారు.

### నేరుగా శాంతి ఒప్పందమే అత్యుత్తమం

తర్వాత ట్రంప్ మాట్లాడారు. ''అధ్యక్షుడు వ్లాదిమిర్‌తో సమావేశం అత్యంత సత్ఫలితాలనిచ్చింది. అయితే తదుపరి దశ(శాంతిచర్చల)కు చేరే క్రమంలో ఎంతో పురోగతి సాధించాం. ఈ చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు మాకు సువర్ణావకాశం దక్కింది. కానీ ఇంకా కొన్ని అవరోధాలను అధిగమించాల్సి ఉంది. (శాంతి)ఒప్పందం కుదరాలంటే అంతకుముందు మరో ఒప్పందం కుదరాలి. సంక్షోభం సమసిపోవాలంటే నాటో కూటమి దేశాలు, ఉక్రెయిన్ వల్లే సాధ్యం. ఒప్పందం పూర్తిగా వాళ్ల చేతుల్లోనే ఉంది. వారానికి వేల మంది చనిపోకుండా నిలువరించాల్సి ఉంది. చర్చల కొనసాగింపుగా మరోదఫా వ్లాదిమిర్‌తో భేటీ కావాల్సి ఉంది''అని ట్రంప్ అన్నారు. దీంతో వెంటనే పుతిన్ కల్పించుకుని ''ఈసారి మాస్కోలో కలుద్దాం''అని అన్నారు. తర్వాత ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో పలు పోస్ట్‌లు పెట్టారు. ''ఉక్రెయిన్, రష్యాలు నేరుగా శాంతి ఒప్పందాన్ని కుదుర్చుకోవడమే ఈ యుద్ధాన్ని ముగించేందుకు అత్యుత్తమ మార్గం. కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకున్నా అది సమగ్ర స్థాయిలో అమలుకావడం కష్టమే. కాల్పుల విరమణ తరచూ ఉల్లంఘనలకు గురయ్యే అవకాశం ఉంది. అందుకే ఉక్రెయిన్, రష్యా నేరుగా శాంతి ఒప్పందం చేసుకోవాలి. సోమవారం వైట్‌హౌస్‌లో జెలెన్‌స్కీతో సమావేశమవుతా. మా చర్చలు ఫలవంతమయ్యాక పుతిన్‌తో మాట్లాడతా. ఆ తర్వాత పుతిన్, జెలెన్‌స్కీలు ఒక్కచోటకు చేర్చి యుద్ధవిరమణకు కృషి చేస్తా''అని ట్రంప్ అన్నారు.

ఉక్రెయిన్‌పై దురాక్రమణ దండయాత్ర మొదలెట్టాక రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు అంతర్జాతీయంగా ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. అమెరికాసహా పలు దేశాల నుంచి అంతర్జాతీయ ఆంక్షలు, యుద్ధ నేరాలకు పాల్పడ్డారంటూ అరెస్ట్ వారెంట్‌లు, సైబర్ దాడులతో శత్రుదేశాలు చుట్టుముట్టినా ఏమాత్రం బెదరక పుతిన్ తన తిరుగులేని ఆధిపత్యాన్ని ట్రంప్ సమక్షంలోనే ప్రదర్శించి రష్యాకు ఎదురులేదని నిరూపించారు. సంయుక్త ప్రకటన సమయంలోనూ ట్రంప్ కంటే ముందే మాట్లాడి తన వాదనను మొదటే గట్టిగా వినిపించారు. దాదాపు 13 నిమిషాలపాటు సంయుక్త ప్రకటన చేస్తే అందులో అగ్రభాగం 8 నిమిషాలు పుతినే మాట్లాడాడు. దాంతో ట్రంప్ చివర్లో మమ అనిపించి ప్రసంగాన్ని ముగించారు. ట్రంప్‌తో భేటీ పర్వంలో అడుగడుగునా పుతిన్ తన పైచేయిని ప్రదర్శించడం విశేషం.

## పుతిన్ పైచేయి!



- అలాస్కాలో అడుగుపెట్టింది మొదలు వెళ్లేదాకా తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించిన పుతిన్
- యుద్ధం, శాంతి, కాల్పుల విరమణ పదాలను మాటవరసకైనా ప్రస్తావించని ట్రంప్

**ఎర్రతివాచీ స్వాగతంలో తొలి గెలుపు**

ఉక్రెయిన్‌తో శాంతి ఒప్పందం కుదుర్చుకోకుంటే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరికలను స్వీకరించిన ట్రంప్ నుంచే స్వయంగా రెడ్‌కార్పెట్ సాదర స్వాగతాన్ని పొంది పుతిన్ తన రష్యాకు అంతర్జాతీయంగా ప్రభ ఏమాత్రం తగ్గలేదని నిరూపించారు. ఉక్రెయిన్ యుద్ధంలో లక్షలాది మంది అమాయక ఉక్రెయిన్ పౌరుల ప్రాణాలను బలితీసుకున్నారన్న అపవాదు ఉన్న దేశాధ్యక్షునికి అలస్కా ఎయిర్‌పోర్ట్‌లో సాధారణ స్వాగతంతో ట్రంప్ ముగిస్తే సరిపోయేది. కానీ అత్యంత ఆప్తుడైన మిత్రుడు తరలివస్తే ఎంతగా ప్రేమతో ఆహ్వానం పలుకుతామో అదేతరహాలో పుతిన్‌కు ట్రంప్ ఎర్రతివాచీ పరిచి మరీ సాదరంగా ఆహ్వానించారు. ప్రధాని మోదీ అమెరికాలో పర్యటించినప్పుడు కూడా సమహోదా ఉన్న ట్రంప్ స్వయంగా వెళ్లి ఎయిర్‌పోర్ట్‌లో స్వాగతం పలకలేదు. కానీ యుద్ధనేరారోపణలు ఎదుర్కొంటున్నాసరే స్వయంగా ట్రంప్ వెళ్లి పుతిన్‌కు స్వాగతం పలకడం ద్వారా అగ్రరాజ్యాధినేతకు తాను ఏమాత్రం తీసిపోనని పుతిన్ బహిరంగంగా నిరూపించారు. ఉక్రెయిన్ మొదలయ్యాక దౌత్యపరంగా, ఆర్థికంగా, ఆంక్షల పరంగా రష్యా ఏకాకిగా తయారైందని పశ్చిమదేశాల మీడియా చెబుతున్నదంతా ఒట్టి మాటలేనని, అమెరికా దృష్టిలో పుతిన్ ఇప్పటికీ అత్యంత ప్రభావవంతమైన, శక్తివంతమైన ప్రపంచనేత అని రుజువైంది. ట్రంప్‌తో సోదరభావంతో మెలగడం, కరచాలనం, ఒకే కారులో ప్రయాణించడం ద్వారా తానూ ట్రంప్ ఒకే స్థాయి అని పుతిన్ అందరికీ స్పష్టంగా అర్థమయ్యేలా చేశారు.

**కాల్పుల విరమణ.. గప్‌చుప్**

ఉక్రెయిన్‌తో దాడులు ఆపి కాల్పుల విరమణను అమల్లోకి తేవడమే ఈ భేటీ ప్రధాన లక్ష్యం. అలాంటి కీలక 'కాల్పుల విరమణ'పదాన్ని మాటవరసకైనా ట్రంప్ ప్రస్తావించకుండా పుతిన్ విజయవంతంగా కట్టడిచేశారు. మేమే 'ఆ మార్గం'లో ఇంకా పయనించలేదు. అక్కడి దాకా వెళ్లేందుకు ఇంకొన్ని అవరోధాలను అధిగమించాల్సి ఉంది అని మాత్రమే ట్రంప్ వ్యాఖ్యానించారుగానీ 'కాల్పుల విరమణ'అనే పదం పలకడానికి కూడా ఆయన సాహసించలేదు. తద్వారా పుతిన్ తన కనుసన్నల్లో, తాను అనుకున్నదే భేటీలో జరిగేలా తన ఆధిపత్యాన్ని ప్రదర్శించారు.

**పాక్షిక విజయం కూడా సాధించని ట్రంప్**

ఈ భేటీలో మా ప్రతిపాదనలకు పుతిన్ ఒప్పుకోకపోతే రష్యాపై మరోదఫా ఆంక్షలు విధిస్తానని రెండ్రోజుల ముందు ట్రంప్ చేసిన భీష్మప్రతిజ్ఞ ఉత్తిదేనని తేలిపోయింది. ఎలాంటి తుది నిర్ణయాలు తీసుకోకుండానే భేటీ ముగిసినా సరే ట్రంప్‌లో ఎలాంటి నిరసన, ఆందోళన కనిపించలేదు. పైగా పుతిన్ చేసిన మాస్కో పర్యటన ప్రతిపాదనకు ట్రంప్ సంతోషం వ్యక్తంచేయడం విచిత్రం. పైగా తాము అనుకున్న ఫలితాలు రాకపోయినా ట్రంప్.. పుతిన్‌తో చర్చలు సానుకూలంగా సాగాయని విరుద్ధమైన ప్రకటన చేయడం గమనార్హం. దీంతో భేటీపై ట్రంప్‌కు ఎలాంటి పట్టు సాధించలేకపోయారని అర్థమవుతోంది. భేటీ జరుగుతున్నాసరే రష్యా దాడులుచేసేలా పుతిన్ ఆదేశాలిచ్చి తన మొండి వైఖరిని మరోసారి చూపించారు.

**శాంతి చర్చలను వాణిజ్య చర్చలుగా మార్చిన పుతిన్**

యుద్ధం ఆపాలన్న డిమాండ్‌తో ముందుకొచ్చిన అమెరికాను వాణిజ్యచర్చలకు బలవంతంగా పుతిన్ కూర్చోబెట్టినట్లు ఈ భేటీ తర్వాత ప్రసంగాన్ని చూస్తే అర్థమవుతోంది. ''వాణిజ్యం, డిజిటల్, హై–టెక్, స్పేస్ వంటి రంగాల్లో అమెరికా–రష్యా పెట్టుబడులు, వాణిజ్య సహకారం మరింతగా బలపడనుంది. ఆర్కిటిక్‌లోనూ సహకారం బాగుంది''అని సంబంధంలేని విషయాలనూ పుతిన్ చెప్పుకొస్తున్నా ఆయనను అడ్డుకోవాల్సింది పోయి ట్రంప్ ఆయనకు వంతపాడటం విచిత్రం. పుతిన్‌తోపాటు ట్రంప్ ఆ తర్వాత గొంతు కలుపుతూ.. ''రష్యా వ్యాపార భాగస్వాములు మాతో వాణిజ్యానికి ఉవ్విళ్లూరుతున్నారు''అని ట్రంప్ వ్యాఖ్యానించారు. తద్వారా శాంతి చర్చలను పుతిన్ విజయవంతంగా వాణిజ్యచర్చలుగా మార్చేశారు.

**పదికి పది.. కానీ సున్నా**

సమావేశం ముగిశాక ఈ భేటీలో పూర్తి సత్ఫలితాలను సాధించామని, 10/10 మార్కులు కొట్టేశానని ట్రంప్ చేసిన వ్యాఖ్యానాల్లో పిసరంతైనా నిజం లేదని తేలిపోయింది. వాస్తవానికి ఆ పది మార్కులు పుతిన్ దోచేశారు. శాంతి ఒప్పందం దిశగా కనీసం ఒక్క షరతు విషయంలో పుతిన్‌ను ట్రంప్ ఒప్పించలేకపోయారు. ఎయిర్‌పోర్ట్‌లో ట్రంప్‌తో కరచాలనం, రెడ్‌కార్పెట్ స్వాగతం, ట్రంప్ కలిసి మీడియాకు ఫొటోలకు పోజులు, కలిసి కారులో ప్రయాణం, దారి పొడవునా కారులో నవ్వులు, భేటీ సందర్భంగా తమ వాదనను గట్టిగా వినిపించడం, సంయుక్త ప్రకటన వేళ తొలుత మాట్లాడం సహా ప్రతి సందర్భంలోనూ పుతిన్ పైచేయి సాధించారు. సాధారణంగా ఇతర దేశాల నేతలు మాట్లాడేటప్పుడు హఠాత్తుగా కల్పజేసుకుని, వెటకారంగా మాట్లాడి వారిని అవమానించే ట్రంప్.. ఈసారి మాత్రం పుతిన్ మాట్లాడేటప్పుడు మౌనంగా ఉండటం గమనార్హం. యుద్ధం, శాంతి, ఉక్రెయిన్ ప్రాంతాల దురాక్రమణ, కాల్పుల విరమణ వంటి కీలక పదాలను కనీసం ట్రంప్ ప్రస్తావించేందుకు సైతం సాహసించకపోవడం పుతిన్ దౌత్యవిజయంగా చెప్పొచ్చు. సొంత గడ్డపై జరిగిన భేటీలోనే నోరుమెదపని ట్రంప్ ఇక రష్యాలో జరగబోయే రెండో రౌండ్ భేటీలో ఏపాటి మాట్లాడతారనే అనుమానాలు బలపడుతున్నాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

## భారత్‌పై మళ్లీ టారిఫ్ లేనట్లే!!

**అదనపు టారిఫ్‌లపై పునరాలోచన చేస్తానన్న ట్రంప్**

**న్యూయార్క్:** రష్యా చమురును కొనుగోలు చేస్తోందన్న కారణంతో భారత్‌పై ఏకంగా 50 శాతం టారిఫ్ విధించిన ట్రంప్ మరోదఫా సుంకాత మోతపై వెనక్కి తగ్గినట్లు కన్పిస్తోంది. ఈ అదనపు టారిఫ్‌ల అంశంపై పునరాలోచన చేస్తానని ఆయన వ్యాఖ్యానించారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సమావేశం అనంతరం భారత్‌పై సుంకాల అంశంపై ట్రంప్ మాట్లాడారు. ''పుతిన్‌తో సుదీర్ఘ సమావేశం తర్వాత రష్యా నుంచి ముడిచమురును కొనుగోలు చేస్తున్న దేశాలపై మరోదఫా టారిఫ్ విధింపుపై ఇప్పుడు నిర్ణయం తీసుకోదల్చుకోలేదు. ఇప్పటికైనాసరే భారం మోపాలనుకుంటే మోపుతా. ఒకవేళ నేను ఆ పని చేయకపోవచ్చు కూడా''అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

## రేపే ట్రంప్, జెలెన్‌స్కీ భేటీ

**కీవ్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సోమవారం వాషింగ్టన్‌లో భేటీ కాబోతున్నానని ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీ వెల్లడించారు. శనివారం ఉదయమే ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడానని తెలిపారు. చాలాసేపు సంభాషణ జరిగిందని పేర్కొన్నారు. వ్యక్తిగత భేటీ కోసం సోమవారం వాషింగ్టన్‌కు రావాలంటూ ఆహ్వానించినందుకు ట్రంప్‌కు జెలెన్‌స్కీ కృతజ్ఞతలు తెలిపారు. ఉక్రెయిన్–రష్యా యుద్ధాన్ని, సాధారణ ప్రజల మరణాలకు ముగింపు పలికే దిశగా ట్రంప్‌తో సమగ్రంగా చర్చించబోతున్నానని జెలెన్‌స్కీ సోషల్ మీడియాలో పోస్టుచేశారు. ఉక్రెయిన్–రష్యా సంఘర్షణకు తెరతించడానికి యూరప్ దేశాలు చురుకైన పాత్ర పోషించాలని మరోసారి విజ్ఞప్తి చేశారు. అమెరికాతోపాటు యూరప్ దేశాల అధినేతల నుంచి ఉక్రెయిన్ భద్రతకు హామీ కోరుతున్నామని ఉద్ఘాటించారు. తమకు విశ్వసనీయమైన సెక్యూరిటీ గ్యారంటీ కావాలన్నారు.

## రూ. 30,000 కోట్లతో బ్రిజ్ క్షేత్ర అభివృద్ధి

**ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రకటన**

**మథుర:** ఉత్తరప్రదేశ్‌లో భారీ ఆధ్యాత్మిక ప్రాజెక్టుకు యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతోంది. యూపీలోని బ్రిజ్ ప్రాంతంలో ద్వాపర యుగంతో సంబంధం ఉన్న మథుర, బృందావన్, బర్సానా, గోకుల్(బ్రిజ్ క్షేత్ర)ను రూ.30,000 కోట్లతో అభివృద్ధి చేయబోతున్నట్లు సీఎం యోగి ఆదిత్యనాథ్ శనివారం ప్రకటించారు. ఈ నాలుగు దివ్య క్షేత్రాలను అనుసంధానించబోతున్నట్లు తెలిపారు. పురాణాల ప్రకారం శనివారం శ్రీకృష్ణుడి 5,252వ జన్మదినం. ఈ సందర్భంగా యోగి ఆదిత్యనాథ్ మథుర పట్టణంలో పలువురు యోగులు, గురువులను సన్మానించారు. మథుర–బృందావన్‌లో రూ.646 కోట్ల విలువైన 118 అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. అయోధ్యలో భవ్య రామమందిర నిర్మాణం అసాధ్యమని పదేళ్ల క్రితం అన్నారని, ఇప్పుడు అది కార్యరూపం దాల్చిందని చెప్పారు.

## ఓట్ చోరీ ఆరోపణలపై నేడు మీడియా ముందుకు ఈసీ

**న్యూఢిల్లీ:** బిహార్‌లో చేపట్టిన ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)తో ఓట్ల చోరీ జరిగిందంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేస్తున్న తీవ్ర ఆరోపణలు, ప్రతిపక్షాల ఆందోళనల నడుమ ఆదివారం ఎన్నికల కమిషన్(ఈసీ)మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటన మినహా ఇతర అంశాలపై ఈసీ అధికారికంగా మీడియా సమావేశాలను ఏర్పాటు చేయడం అరుదైన విషయం. నేటి మీడియా కాన్ఫరెన్స్ ఏ విషయంపైన అనేది అధికారికంగా వెల్లడి కానప్పటికీ, తీవ్ర ఆరోపణల నేపథ్యంలోనే దీనిని చేపట్టామని అధికారులు అంటున్నారు. మహారాష్ట్ర, కర్నాటక, హరియాణాల్లో జరిగిన గత ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందంటూ రాహుల్ గాంధీ ఇటీవలి కాలంలో పదేపదే ఈసీని ఉద్దేశించిన ఆరోపణలు ఎక్కుపెడుతుండటం తెల్సిందే.

## పాక్ ఆకస్మిక వరదల్లో మృతులు 327

**పెషావర్:** పాకిస్తాన్‌లోని ఖైబర్ ఫక్తున్వాలో సంభవించిన ఆకస్మిక వరదల్లో మరణించిన వారి సంఖ్య 327కు చేరుకుంది. క్లౌడ్ బరస్ట్, ఆకస్మిక వరదల్లో గత 48 గంటల వ్యవధిలో 327 మంది చనిపోయారని విపత్తు విభాగం ప్రతినిధి ఒకరు వివరించారు. మృతుల్లో 13 మంది చిన్నారులు, 15 మంది మహిళలు ఉన్నారని ప్రావిన్స్ అధికారులు శనివారం వెల్లడించారు. వర్షాలు, వరదలకు సంబంధించిన ఘటనల్లో పలువురు మహిళలు, చిన్నారులు సహా మరో 120 మంది గాయాలపాలయ్యారని చెప్పారు. ఖైబర్ ప్రావిన్స్‌లో మరో 50 మంది వరకు జాడ తెలియాల్సి ఉందన్నారు. అత్యధికంగా ప్రభావితమైన బునెర్ జిల్లాలో 204 మంది చనిపోయారు. వరదల తాకిడితో 74 నివాసాలు దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. ఖైబర్ ప్రావిన్స్‌లో భారీ వర్షాలు, వరదలు ఈ నెల 21వ తేదీ వరకు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.

## అలాగైతే గందరగోళమే

**రాష్ట్రపతి, గవర్నర్లకు కోర్టులు నిర్దిష్ట గడువు నిర్దేశించలేవు**

- లోటుపాట్లు ఉంటే రాజ్యాంగ ప్రక్రియ ద్వారా సరిదిద్దాలి
- ఒక వ్యవస్థ అధికారాల్లో మరో వ్యవస్థ జోక్యం తగదు
- సుప్రీంకోర్టుకు లిఖితపూర్వక వివరణ ఇచ్చిన కేంద్రం

**న్యూఢిల్లీ:** రాష్ట్రాల శాసనసభల్లో ఆమోదించి, పంపించిన బిల్లులపై నిర్ణయం తీసుకోవడానికి రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయస్థానాలు నిర్దిష్ట గడువు(టైమ్‌లైన్) విధించడం వల్ల రాజ్యాంగపరమైన గందరగోళం తలెత్తుతుందని కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. బిల్లులకు సమ్మతి తెలియజేసే లేదా తిప్పి పంపించే విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించే అధికారం కోర్టులకు ఉండదని స్పష్టంచేసింది. ఒకవేళ గడువు విధిస్తే రాష్ట్రపతి, గవర్నర్ల అత్యున్నత స్థానాన్ని, గౌరవాన్ని తగ్గించినట్లు అవుతుందని అభిప్రాయపడింది. రాష్ట్రపతి, గవర్నర్ల విధుల్లో లోటుపాట్లు ఉంటే, వారు సక్రమంగా స్పందించకపోతే న్యాయస్థానాలు జోక్యం చేసుకోవడం సరైంది కాదని వెల్లడించింది. రాజ్యాంగపరమైన ప్రక్రియ ద్వారా ఆ లోటుపాట్లు సరిదిద్దాలని తెలియజేసింది. సమ్మతి కోసం రాష్ట్రాల అసెంబ్లీల నుంచి వచ్చిన బిల్లుల విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు కోర్టులు గడువు నిర్దేశించవచ్చా? అనే దానిపై అభిప్రాయాలు తెలియజేయాలంటూ సుప్రీంకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచిస్తూ నోటీసులు జారీ సంగతి తెలిసిందే. దీనిపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఇటీవల లిఖితపూర్వక వివరణను సుప్రీంకోర్టుకు సమర్పించారు. ఈ వివరణలో కేంద్రం ఏం చెప్పిందంటే...

**రాజ్యాంగ రూపకర్తలు అవి ఆశించలేదు**

''ప్రభుత్వంలో భాగమైన ఒక వ్యవస్థ రాజ్యాంగం తనకు అప్పగించని విధులు నిర్వర్తించాలని చూస్తే అది చివరకు రాజ్యాంగపరమైన గందరగోళానికే దారితీస్తుంది. ఒక వ్యవస్థ విఫలమైతే లేదా నిష్క్రియాత్మకంగా వ్యవహరిస్తే లేదా పొరపాట్లు చేస్తే... మరో వ్యవస్థ అందులో కలుగజేసుకోవడం తగదు. ఒక వ్యవస్థకు రాజ్యాంగం ఇచ్చిన అధికారాలను మరో వ్యవస్థ చెలాయించడం చెల్లదు. రాజ్యాంగం ప్రకారం వ్యవస్థలకు వాటికంటూ ప్రత్యేక అధికారాలు ఉంటాయి. ఎవరైనా ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసినప్పుడు లేదా సంస్థల పనితీరుపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమైన సందర్భాల్లో కూడా ఒక వ్యవస్థకు లేని అధికారాలు చెలాయించడానికి అనుమతి ఇస్తే రాజ్యాంగపరమైన విపరిణామాలే సంభవిస్తాయి.

**లేని అధికారాలను కల్పించడం లేదు**

రాజ్యాంగం మన దేశంలో చట్టబద్ధమైన పాలనను స్థిరపర్చింది. వ్యవస్థల మధ్య సున్నితమైన సమతౌల్యాన్ని నిర్దేశించింది. రాష్ట్రపతి, గవర్నర్లకు సుప్రీంకోర్టు గడువులు విధిస్తే గనుక ఆ సమతౌల్యాన్ని నీరుగార్చినట్లే అవుతుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 అనేది కోర్టులకు లేని అధికారాలను కల్పించడం లేదు. రాజ్యాంగ, శాసన విభాగాల బాధ్యతలు, అధికారాల్లో కోర్టులు జోక్యం చేసుకోలేవు. రాష్ట్రపతి, గవర్నర్లది రాజకీయంగా అత్యున్నత స్థాయి.

**చెక్స్ అండ్ బ్యాలెన్సెస్ ఉన్నప్పటికీ..**

ఆర్టికల్ 200, 201లు రాష్ట్రపతి, గవర్నర్లకు ఎలాంటి టైమ్‌లైన్ విధించడం లేదు. బిల్లుల విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు ప్రత్యామ్నాయాల గురించి మాత్రమే అవి చెబుతున్నాయి. రాజ్యాంగానికి లోబడి ఒక వ్యవస్థను మరో వ్యవస్థ అదుపు చేసే విధానం(చెక్స్ అండ్ బ్యాలెన్సెస్) ఉన్నప్పటికీ అదే రాజ్యాంగం ప్రకారం సమాజంలో మూడు మూల స్తంభాలైన శాసన, కార్యనిర్వహక, న్యాయ విభాగాలకు వాటికే సంబంధించిన ప్రత్యేక అధికారాలు (జోన్లు) ఉంటాయి. మరో విభాగం అందులో వేలుపెట్టలేదు. రాష్ట్రపతి, గవర్నర్లకు సైతం వారికే ప్రత్యేకమైన అధికారాలు, అత్యున్నత హోదాలు ఉంటాయని గుర్తుంచుకోవాలి''.

## నేడు స్వదేశానికి శుభాంశు

**ప్రధాని మోదీని కలువనున్న వ్యోమగామి**



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లో గడిపి చరిత్ర సృష్టించిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా ఆదివారం అమెరికా నుంచి స్వదేశానికి రానున్నారు. యాగ్జియం–4 మిషన్ కోసం అమెరికాలో గత ఏడాదిగా శిక్షణ పొందిన శుక్లా ముందుగా ఢిల్లీలో ప్రధాని మోదీని కలుసుకుంటారు. అనంతరం, యూపీలోని సొంతూరు లక్నోకు బయలుదేరి వెళతారు. ఆ తర్వాత అక్టోబర్‌లో మొదలయ్యే గగన్‌యాన్ మిషన్ శిక్షణలో పాల్గొంటారు. అమెరికాలోని ఫ్లోరిడా నుంచి జూన్ 25న నింగిలోకి దూసుకెళ్లిన యాగ్జియం–4 మిషన్‌లోని నలుగురు వ్యోమగాముల్లో శుభాంశు శుక్లా ఒకరు. జూన్ 26వ తేదీ నుంచి ఐఎస్ఎస్‌లో పలు ప్రయోగాలను విజయవంతంగా పూర్తి చేసుకుని, తిరిగి జూలై 15న భూమిపైకి చేరుకున్నారు. శనివారం శుభాంశు విమానంలో కూర్చుని చిరునవ్వులు చిందిస్తున్న ఫొటోను ఇన్‌స్టాలో షేర్ చేశారు. 'నేను స్వదేశానికి చేరుకునేందుకు విమానంలో కూర్చున్నప్పుడు, మిశ్రమ భావోద్వేగాలు కలిగాయి. గత ఏడాదికాలంలో నా స్నేహితులు, కుటుంబ సభ్యులుగా ఉన్న అద్భుతమైన వ్యక్తులను విడిచిపెట్టాల్సి వస్తున్నందుకు ఓ వైపు బాధ, మిషన్ తర్వాత మొదటిసారిగా నా స్నేహితులు, కుటుంబ సభ్యులు, దేశంలోని ప్రతి ఒక్కరినీ కలవబోతున్నందుకు మరో వైపు ఉత్సాహం ఉన్నాయి. జీవితం అంటే ఇదేనేమో అని అనుకుంటున్నాను'అని శుక్లా పేర్కొన్నారు. శుక్రవారం హ్యూస్టన్‌లోని భారత కాన్సులేట్‌లో జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో శుక్లాతోపాటు వ్యోమగామిగా ఎంపికైన ప్రశాంత్ నాయర్ కూడా పాల్గొన్నారు.

## రక్తపోటును పెంచేస్తున్న సూరీడు!

**వాషింగ్టన్:** ఎండ తగిలితే ఒళ్లు వేడెక్కుతుంది. రాత్రిళ్లు ఒళ్లు చల్లబడుతుంది. కానీ రాత్రి పగలు అని తేడా లేకుండా ఎప్పుడైనా సరే మన రక్తపోటును సూరీడు ప్రభావితం చేస్తాడనే కొత్త విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఆరు సంవత్సరాలపాటు చైనాలోని క్వింగ్‌డావో, వేహాయ్ నగరాల్లోని 5,00,000 మంది ప్రజల రక్తపోటు స్థాయిలను పర్యవేక్షించి శాస్త్రవేత్తలు ఈ కొత్త విషయాన్ని కనుగొన్నారు. సౌర తుపాన్ల కారణంగా భూమి మీదకు దూసుకొచ్చే ఉష్ణగాలులు మన భూ అయస్కాంతావరణాన్ని ప్రభావితంచేసి చివరకు మన బీపీని పెంచేస్తాయని స్పష్టమైంది. సౌరతుపాన్ల కారణంగా భూ అయస్కాంతావరణంలో సంభవించే మార్పులు మానవ ఆరోగ్యంపై ఎలాంటి ప్రతికూల ప్రభావాలు చూపతాయనే దానిపై అధ్యయనం సాగింది. ముఖ్యంగా మహిళల బీపీని సౌరతుపాను ప్రభావితం చేస్తుందని అధ్యయనంలో వెల్లడైంది. అయితే ఈ సౌరతుపాను దృగ్విషయం మన బీపీని ప్రమాదకరస్థాయిలో పెంచేస్తుందా? దీని ఇతర దుష్ప్రభావాలు ఏంటనే వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. సౌరగాలులకు మానవ ఆరోగ్యానికి మధ్య సంబంధం ఉందని తెల్పే ఈ పరిశోధనా తాలూకు వివరాలు తాజాగా కమ్యూనికేషన్స్ మెడిసిన్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. పరిశోధనలో భాగంగా మధ్యస్థాయి అయస్కాంతావరణం ఉండే చైనాలోని రెండు నగరాలను ఎంచుకున్నారు. అక్కడి 5లక్షలకుపైగా ప్రజల రక్తపోటు స్థాయిల రికార్డ్‌లను సౌరతుపాన్ల కాలంతో పోల్చిచూశారు. భూ అయస్కాంతావరణం(జీఎంఏ)లో మార్పులకు తగ్గట్లు అక్కడి ప్రజల బీపీలో హెచ్చుతగ్గులు ఉన్నట్లు కనుగొన్నారు. ముఖ్యంగా మహిళల బీపీ అనేది జీఎంఏకు అనుగుణంగా స్పందిస్తున్నట్లు స్పష్టమైంది. ఇప్పటికే రక్తపోటుతో బాధపడుతున్న వారికి సౌరశక్తి అనేది ప్రతికూలకంగా మారుతుందని శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాలు విధాన నిర్ణయాలు మరింత సమర్థవంతంగా తీసుకునేందుకు ఇలాంటి పరిశోధనలు దోహదపడతాయిన వారు చెప్పారు. సౌరతుపాన్లు ఇప్పటికే ఉపగ్రహాలు, కమ్యూనికేషన వ్యవస్థలు, విద్యుత్ గ్రిడ్‌లపై పెను ప్రభావం చూపుతున్న విషయం తెల్సిందే. ఇప్పుడీ జాబితాలోకి మానవ ఆరోగ్యం వచ్చిచేరింది. భూగోళం మీది వాతావరణంతోపాటు అంతరిక్ష అంశాలు సైతం మనిషిపై ప్రభావం చూపుస్తాయని తాజా అధ్యయనం చాటుతోంది.

## ట్రంప్–పుతిన్ చర్చలను స్వాగతించిన భారత్

**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధినేత పుతిన్ మధ్య అలస్కాలో జరిగిన చర్చలను భారత ప్రభుత్వం స్వాగతించింది. ఉక్రెయిన్‌లో సంఘర్షణ సాధ్యమైనంత త్వరగా ముగిసిపోవాలని ప్రపంచమంతా కోరుకుంటున్నట్లు తెలియజేసింది. ఉక్రెయిన్‌లో శాంతి సాధనకు ట్రంప్, పుతిన్ ఎంతగానో కృషి చేస్తున్నారని భారత విదేశాంగ శాఖ శనివారం ఒక ప్రకటనలో ప్రశంసించింది. వారిద్దరి భేటీలో సాధించిన ప్రగతి పట్ల హర్షం వ్యక్తంచేసింది. ఉక్రెయిన్–రష్యా యుద్ధాన్ని ముగించడానికి చర్చలు, దౌత్య మార్గాలే శరణ్యమని పునరుద్ఘాటించింది. బలప్రయోగంతో ఏదీ సాధించలేమని పేర్కొంది. భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ బ్రిటిష్ విదేశాంగ మంత్రి డేవిడ్ లామీతో మాట్లాడారు. ఉక్రెయిన్ సంఘర్షణపై వారు చర్చించారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ వచ్చే నెలలో ఉక్రెయిన్‌లో పర్యటించబోతున్నట్లు తెలిసింది.



**నేరుగా.. వేగంగా..**

హైదరాబాద్ విమానాశ్రయం నుంచి ఆస్ట్రేలియాకు నేరుగా విమాన సర్వీసులు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు పలు అంతర్జాతీయ విమాన యాన సంస్థలు సన్నద్ధమవుతున్నాయి. -10లో



**ఆటవిడుపునకు ఆలవాలం.. గాలం..**

ఇటీవల కురుస్తున్న వర్షాలకు నగరంలోని జలాశయాలు నిండు కుండలను తలపిస్తున్నాయి. దీంతో ఔత్సాహిక హాబీ ఫిషర్స్‌తో పలు ప్రాంతాలు జోష్ నింపుకొన్నాయి. - సిటీప్లస్‌లో




**వాతావరణం**

నగరంలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 29, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

## కృష్ణా..ముకుందా..మురారీ

గోల్డెన్ టెంపుల్‌లో పల్లకీ సేవ



అబిడ్స్ ఇస్కాన్ టెంపుల్ వద్ద భక్తజన సందోహం



బృందావన మాలికి అశేష జనావళి భక్తితో పూజలు చేసి పులకరించింది. మువ్వ గోపాలుడిని కొలిచి ముక్తి ప్రసాదించమని వేడుకుంది. శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా శనివారం నగరంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. ఇంటింటా చిన్ని కృష్ణుల వేష ధారణలో చిన్నారులు అలరించారు. అబిడ్స్, సికింద్రాబాద్‌లలోని ఇస్కాన్ ఆలయాలతో పాటు బంజారాహిల్స్‌లోని హరే కృష్ణ గోల్డెన్ టెంపుల్‌కు భక్తజనులు భారీ సంఖ్యలో వచ్చారు. అబిడ్స్‌లోని ఇస్కాన్ టెంపుల్‌కు జనం లక్షలాదిగా తరలి రావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు ఇసుక వేస్తే రాలనంతగా కిక్కిరిసిపోయాయి.



అబిడ్స్ ఇస్కాన్ టెంపుల్‌లో పూజలు



సికింద్రాబాద్ ఇస్కాన్ టెంపుల్‌లో..

# కురిసేది ఎంతో.. ఇంకేది కొంతే!

మహా నగరంలో ప్రతియేటా 89 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదవుతున్నా.. కేవలం 0.95 శాతం వర్షపు నీరు మాత్రమే భూమిలో ఇంకుతోంది. మిగతాదంతా వృథాగా పోతోంది. అందుకే రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. సర్వీస్ రోడ్లపై మోకాలు లోతు వరద వచ్చి చేరుతోంది. లోతట్టు ప్రాంతాలన్నీ నీట మునుగుతున్నాయి. కానీ.. అదే వర్షపు నీరు నేలలో ఇంకేదెంత? ప్రతి వర్షాకాలం సాధారణ వర్షపాతం కంటే అత్యధికంగా నమోదవుతున్నా.. భూమిలో ఇంకే వర్షపు నీరు ఒక్క శాతం మించని పరిస్థితి లేకుండాపోయింది. దక్కన్ పీఠభూమి రాతి నేల కావడంతో వర్షపు నీరు ఇంకే పరిమాణంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వరుణుడు కరుణించినా.. వాన చుక్క భూమిలోకి ఇంకే పరిస్థితులు లేకుండా పోతున్నాయి. కుండపోత వర్షం కురుస్తున్నా వరద నీరు నాలాలు, మురుగు కాల్వల ద్వారా మూసీలో కలుస్తోంది. - సాక్షి, సిటీబ్యూరో



బిగ్ స్టోరీ

ఏడాదిలో ఎంత వర్షం కురిస్తే ... రూఫ్‌టాప్‌పై ఎంత నీరు పడుతుందంటే..

| వర్షపాతం (సెం.మీ) | వాననీరు (లీటర్లు) |
|---|---|
| 50 | 4,645 |
| 60 | 5,574 |
| 70 | 6,503 |
| 75 | 6,968 |
| 80 | 7,432 |

మహా నగరంలో ప్రస్తుత వర్షాకాలంలో ఇప్పటి వరకు వర్షపాతం నమోదు ఇలా.. (మిల్లీ మీటర్లలో) (జూన్ 1 నుంచి ఆగస్టు 16 వరకు )

| మండలం | సాధారణం | కురిసింది | అధిక శాతం |
|---|---|---|---|
| అమీర్‌పేట | 386.7 | 635.3 | 64 |
| ఖైరతాబాద్ | 382.5 | 609.5 | 59 |
| బండ్లగూడ | 357.9 | 559.6 | 56 |
| శేరిలింగంపల్లి | 385.1 | 584.6 | 52 |
| రాజేంద్రనగర్ | 365.3 | 549.5 | 50 |
| సరూర్‌నగర్ | 341.9 | 509.8 | 49 |
| ముషీరాబాద్ | 374.3 | 556.6 | 49 |
| మల్కాజిగిరి | 336.4 | 483.2 | 44 |
| మారేడుపల్లి | 378.1 | 537.9 | 42 |
| అంబర్‌పేట | 363.4 | 507.3 | 40 |
| షేక్‌పేట | 375.8 | 527.6 | 40 |

## గ్రేటర్‌లో ప్రతి యేటా అత్యధిక వర్షపాతమే

- నాలా, మురుగు కాల్వల్లో కలుస్తున్న వరద నీరు
- వాన నీటిని ఒడిసిపట్టకుంటే.. ఉపద్రవమే
- సంరక్షణ తప్పనిసరి అంటున్న నిపుణులు

గ్రేటర్ పరిధిలో నేల కనిపించనంతంగా నిర్మాణాలు విస్తరిస్తున్నాయి. ప్రధానంగా నగరంతో పాటు శివారులోని గేటెడ్ కమ్యూనిటీలు, ఇండిపెండెంట్ ఇళ్లు, బహుళ అంతస్తుల భవంతులు, ఆకాశహర్మ్యాల నిర్మాణాలు జోరందుకోవడంతో భూగర్భజలాల వినియోగం బాగా పెరుగుతోంది. ఏటా కురుస్తున్న వర్షపు నీటిని నేల గర్భంలోకి ఇంకించేందుకు అవసరమైన రీచార్జింగ్ పిట్స్ లేకపోవడంతో సుమారు 65 నుంచి 70 శాతం మేర వృథాగా పోతున్నట్లు భూగర్భజల నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వర్షపు నీరు వరద రూపంలో 40 నుంచి 50 శాతం మేర వృథాగా పోవడం సర్వసాధారణమే. కానీ నగరంలో దీనికి అదనంగా మరో 20 నుంచి 45 శాతం నీరు వృథాగా రహదారులపై ప్రవహించి చివరకు మూసీలో కలుస్తోంది.

### సాధారణ వర్షం కురిస్తేనే..

సాధారణ వర్షపాతం (20 మిల్లీ మీటర్లు) నమోదైతేనే కనీసం 1,600 లీటర్ల నీటిని ఇంకుడు గుంతల ద్వారా భూగర్భంలోకి ఇంకించవచ్చు. ఈ నీరు నలుగురు సభ్యులున్న కుటుంబానికి మూడురోజుల అవసరాలకు సరిపోతుంది. ఇంకుడు గుంతలు తవ్వడం ద్వారా బోరు బావి ఎప్పటికీ వట్టిపోదు. భావితరాలకు జల బ్యాంక్ ఏర్పాటు చేసి అందించవచ్చు. నిత్యావసరాల కోసమే కాదు... ఇంట్లో పెంచుకునే మొక్కలకు సైతం జలం.. జీవం అందించవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. నివాస సముదాయాల్లో నీరు తోడటం తప్ప నింపే పరిస్థితి లేదు. వాన నీటిలో కొంతైనా భూమిలోకి ఇంకించినా.. ఫిల్టర్ చేసి వాడుకున్నా.. నీటి కష్టాలే ఉండవని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నగరంలో సరాసరి వర్షపాతం 890 మిల్లీమీటర్లు. జలమండలి పరిధిలో 1450 చదరపు కిలోమీటర్ల మేరకు ఏటా కురుస్తున్న వాన నీళ్లు 15 నుంచి 20 టీఎంసీలకు సమానమని నిపుణులు చెబుతున్నారు. ఇందులో 5 శాతం కూడా భూమిలోకి ఇంకించే పరిస్థితి లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

### ఈ సీజన్‌లో 50 సెం.మీ

నగరంలో వర్షాకాల సీజన్‌లో ఇప్పటికే సాధారణ వర్షపాతం కంటే 34 శాతం అత్యధికంగా నమోదైనట్లు వాతావరణ శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మొత్తం 29 అర్బన్ మండలాల్లో కలిపి సాధారణ వర్షపాతం 37 సెంటీమీటర్లు నమోదు కావాల్సి ఉండగా.. 50 సెం.మీ మేర కురిసింది. పటాన్‌చెరు, తిరుమలగిరిల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా.. 27 ప్రాంతాల్లో కనీసం 15 నుంచి 64 శాతం వరకు సాధారణం కంటే అత్యధిక వర్షపాతం నమోదైంది.

### తోడేస్తున్నారు..

పెరుగుతున్న జనాభాతో నీటి వినియోగం మరింత పెరుగుతోంది. భూగర్భ జలం తరుగుతోంది. రోజువారీగా బోరు బావుల నుంచి సుమారు 650 కోట్ల లీటర్ల మేర జలాలు తోడుతున్నట్లు అంచనా. రాష్ట్రంలోనే అత్యధికంగా భూగర్భజలాలను తోడుతున్నది హైదరాబాద్ వాసులేనని భూగర్భ జలవనరుల శాఖ నివేదిక స్పష్టం చేస్తోంది. గతేడాది తక్కువ నీరు ఇంకి ఎక్కువ నీరు తోడిన రెవెన్యూ జిల్లాల్లో హైదరాబాద్, మేడ్చల్ తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. బోరుబావులు 120 అడుగులకు మించి తవ్వొద్దని వాల్టా చట్టం నిబంధన ఉన్నా దీనిని బేఖాతరు చేస్తూ విచ్చలవిడిగా 400 నుంచి 2 వేల అడుగుల లోతున బోర్లు వేస్తున్నారు. ఫలితంగా నీటి మట్టాలు గరిష్ట స్థాయిలో పడిపోతున్నాయి.

### భూగర్భ పొరల్లోకి.. ఇంకేందుకు

వర్షం కురిసిన తర్వాత నీరు భూగర్భ పొరల్లోకి ఇంకేందుకు కొన్నిరోజులు పడుతుంది. వాతావరణ, రుతుపవనాల గమనంలో వచ్చిన మార్పులు ఉపరితల, భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వర్షం కురిసిన తర్వాత నీరు భూగర్భ పొరల్లోకి ఇంకడానికి వారం నుంచి రెండు వారాలు సమయం పడుతుంది. గ్రావిటీ రికవరీ అండ్ క్లైమెట్ ఎక్స్‌పెరిమెంట్ (గ్రేస్) పరిశోధన ఆధారంగా విశ్లేషించగా.. భూగర్భ జలం, ఉపరితల నీటితో సహా భూమిపై నీటి కదలికలు, నిల్వల్లో మార్పులను గ్రేస్ విధానంలో అంచనా వేస్తున్నారు. ఒక క్యూబిక్ మీటర్ అంటే 5 వేల లీటర్లలో 15 శాతం మాత్రమే భూమిలోకి ఇంకుతోందని అధ్యయనం తెలిపింది. లోటు వర్షపాతం ఉంటే ఆ ప్రభావం భూగర్భ జలాలపై అధికంగా ఉంటుంది. భూమిలోకి ఇంకే నీరు 25నుంచి 50 శాతం తగ్గుతోందని పరిశోధకులు పేర్కొంటున్నారు. నగరంలో సగటు భూగర్భ నీటి మట్టం 11.94 మీటర్లు కాగా.. ప్రస్తుతం 15 నుంచి 20 మీటర్లకు పడిపోవడం గమనార్హం.

### వర్షపు నీరు భూమిపై పడిన తర్వాత ఇలా..

- వాతావరణంలోకి దాదాపు 30 శాతం వర్షపు నీరు తిరిగి ఆవిరైపోతుందని అంచనా. ఈ ప్రక్రియ ఉష్ణోగ్రత, తేమ, గాలి పరిస్థితులను బట్టి మారవచ్చు. మొక్కలు వర్షపు నీటిలో కొంత భాగాన్ని గ్రహిస్తాయి ట్రాన్స్‌పిరేషన్ అనే ప్రక్రియ ద్వారా వాతావరణంలోకి తిరిగి విడుదల చేస్తాయి.
- వర్షపు నీటిలో కొంత భాగం భూమిలోకి ఇంకుతోంది. భూగర్భ జలాలను పెంచుతోంది. నేల కూర్పు, సంతృప్తి స్థాయిలను బట్టి వర్షపాతంలో దాదాపు 10 నుంచి 20 శాతం వరకు ఇంకే అవకాశం ఉంటుంది.

వర్షపు నీరు సగం వరకు ఉపరితలంపైకి ప్రవహించి నాలాల నుంచి వాగుల్లో కలుస్తోంది. ఈ ప్రవాహం విస్తృతంగా మారవచ్చు కానీ సాధారణంగా మొత్తం వర్షపాతంలో 40 నుంచి 50 శాతం ప్రవహిస్తుంది.

### వర్షపు నీటి సంరక్షణ సామాజిక బాధ్యత



వర్షపు నీటి సంరక్షణ సామాజిక బాధ్యత. ప్రతి వర్షపు బొట్టును ఒడిసిపట్టి భూమిలోకి ఇంకేలా చూడటం అందరి కర్తవ్యం. నివాస సముదాయాలలో ఇంకుడు గుంతలు తప్పనిసరి. భూగర్భ జలాల పెంపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

– అశోక్ రెడ్డి, జలమండలి ఎండీ

### ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపడితేనే భవిష్యత్తు



జలం.. జీవనాధారం. లిక్విడ్ గోల్డ్. నీటి సంరక్షణపై అవగాహన అవసరం. వర్షం వచ్చినప్పుడు ప్రతి బొట్టునూ ఒడిసిపడితేనే భవిష్యత్తు. కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న మాహానగరంలో ప్రతి వర్షపు చుక్క నేలలో ఇంకిస్తే భూగర్భజలాలు పెంపు సాధ్యం. ఎండిపోయిన బోర్లకు జీవనం వస్తోంది. నిత్యావసర నీటి కోసం ట్యాంకర్లపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. వరద ముప్పు తప్పుతుంది.

– కరుణాకర్ రెడ్డి, ఫౌండర్, వాక్‌వాటర్ ఫౌండేషన్

# వరద ముంపు.. రోగాల ముప్పే

## భారీ వర్షాలతో పొంగిన మురుగు నీరు

- తాగునీరు కలుషితమయ్యే అవకాశం
- డయేరియా, డెంగీ, విషజ్వరాలు పెరిగే ప్రమాదం
- ఫీవర్ సర్వే ప్రారంభించిన వైద్యారోగ్య శాఖ





సాక్షి, సిటీబ్యూరో: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మహా నగరంలో మురుగు కాల్వలు పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాలు మునిగిపోయాయి. ఎక్కడ చూసినా బురద, నీరు నిలిచిపోవడం, పరిసర ప్రాంతాల్లో చిత్తడి వాతావరణం కనిపిస్తోంది. ఈ సమయంలో డయేరియా, డెంగీ, విష జ్వరాలు పెరిగే ప్రమాదం పొంచి ఉందని వైద్యారోగ్య అంచనా వేస్తోంది. దీనికి అనుగుణంగానే ముందస్తు ప్రణాళికలతో సిద్ధమవుతోంది. ఫీవర్ సర్వే చేపడుతోంది. గ్రేటర్ పరిధిలోని గర్భిణులు, పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి అవసరమైన మందులు సిద్ధం చేస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పాములు వచ్చే అవకాశం ఉన్నందున.. పాము కాటు, కుక్కకాటు మందులు అందుబాటులో ఉంచినట్లు వైద్యారోగ్యశాఖ సిబ్బంది చెబుతున్నారు.

### వారం రోజులు కఠిన పరీక్షే..

రాబోయే వారం రోజులు నగర ప్రజలకు కఠిన పరీక్ష తప్పేలా లేదు. విషజ్వరాలు, డెంగీ, డయేరియా కేసులు పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. కొన్ని రోజులుగా విస్తారంగా వర్షాలు కురిశాయి. వాతావరణంలో మార్పులు, తాగునీటి కలుషితం కావడం, దోమల బెడద పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే ఇంటింటి జలుబు, జ్వరం వంటి లక్షణాలతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వైద్యారోగ్య శాఖ సిబ్బంది ఇంటింటి ఫీవర్ సర్వే ప్రారంభించారు. ఎప్పటికప్పుడు వివరాలు సేకరిస్తున్నారు. అవసరమైన వారికి మందులు, ప్రాథమిక చికిత్సలు అందిస్తున్నారు. మరో వైపు జీహెచ్ఎంసీ, మలేరియా బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నాయి.

### అప్రమత్తంగా ఉన్నాం..



జిల్లా వ్యాప్తంగా ఫీవర్ సర్వే చేస్తున్నాం. జీహెచ్ఎంసీతో కలసి దోమల నివారణ, యాంటీ లార్వా ఆపరేషన్ చేపడుతున్నాం. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి యంత్రాంగం సిద్ధంగా ఉంది. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగడం మంచిది. – డి.వెంకటి, హైదరాబాద్ డీఎంహెచ్ఓ

# భవన విజయం!

## దేశంలో ఎన్సీఆర్ తర్వాత మనదే ఖరీదైన నగరం

- విలాసవంతమైన ఇళ్ల కొనుగోళ్లకు పెరిగిన ఆసక్తి
- రూ.3 కోట్ల కంటే ఎక్కువ ధర గృహాల కొనుగోలు
- జనవరి–జూన్ మధ్య 30,553 యూనిట్ల అమ్మకం
- ఇందులో 35 శాతం వాటా లగ్జరీ గృహాలదే
- క్రెడాయ్– సీఆర్ఈ మ్యాట్రిక్స్ నివేదికలో వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ స్థిరాస్తి రంగం ఖరీదైపోయింది. ఒకప్పుడు దేశంలోనే అందుబాటు ఇళ్ల ధరల మార్కెట్‌లో హైదరాబాద్ ముందు వరసలో నిలవగా.. ప్రస్తుతం నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్సీఆర్) తర్వాత దేశంలోనే అత్యంత ఖరీదైన రెండో నగరంగా అభివృద్ధి చెందింది. ఆధునిక వసతులు, విలాసవంతమైన జీవన శైలి, కొనుగోలుదారుల అభిరుచుల్లో మార్పులు, నిర్మాణ వ్యయాలు, భూములు, నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదల వంటివి నగరంలో ఇళ్ల ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.

**లగ్జరీదే మూడో వంతు వాటా..**

నగరంలో ఇళ్ల అమ్మకాల్లో విలాసవంతమైన గృహాలే ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ఈ ఏడాది తొలి అర్ధభాగంలో మొత్తం విక్రయాలలో రూ.3 కోట్ల కంటే ఎక్కువ ధర ఉన్న ఆస్తుల వాటా మూడో వంతు కంటే ఎక్కువగా ఉండటమే ఇందుకు ఉదాహరణ. క్రెడాయ్, సీఆర్ఈ మ్యాట్రిక్స్ తాజా గణాంకాల ప్రకారం.. జనవరి–జూన్ మధ్య కాలంలో నగరంలో రూ.56,345 కోట్ల విలువైన 30,553 ఇళ్ల విక్రయాలు జరిగాయి. ఇందులో రూ.3 కోట్ల కంటే ఎక్కువ ధర ఉన్న గృహాల విలువలో 35 శాతం వాటాను కలిగి ఉన్నాయి. రూ.1.5 కోట్ల నుంచి రూ.3 కోట్ల మధ్య ధర ఉన్న ప్రీమియం ఫ్లాట్ల వాటా మరో 34 శాతంగా ఉంది.

**ధర ఏడాదిలో రూ.20 లక్షల పెరుగుదల..**

కరోనా మహమ్మారి తర్వాత నగరంలో లగ్జరీ గృహాల మార్కెట్ పూర్తిగా మారిపోయింది. ఒక రకంగా చెప్పాలంటే కోవిడ్ లగ్జరీ ప్రాపర్టీ విభాగానికి బూస్ట్ లాగా మారింది. దీంతో నగరంలో ఏటా గృహాల ధరలు శరవేగంగా పెరుగుతున్నాయి. సగటు టికెట్ పరిమాణం పరిశీలిస్తే.. 2024 ప్రారంభంలో రూ.1.62 కోట్లుగా ఉండగా.. ఇప్పుడది ఏకంగా రూ.1.84 కోట్లకు చేరుకుంది. ఏడాదిలో రూ.20 లక్షల వరకూ ధరలు పెరిగాయి. ఎన్సీఆర్ తర్వాత దేశంలో రెండో అత్యంత ఖరీదైన మార్కెట్‌గా హైదరాబాద్ అవతరించింది.

**అందుబాటు ఇళ్ల కొరత..**

నగరంలో సగటు కొనుగోలుదారుకు ఇంటి యాజమాన్యం అందుబాటులో ఉండటం లేదు. సరసమైన గృహాలు దాదాపు కనుమరుగయ్యాయి. రూ.70 లక్షల కంటే తక్కువ ధర ఉన్న ఫ్లాట్ల అమ్మకాల విలువలో కేవలం 3 శాతమే ఉండటమే ఉదాహరణ. ఇవి కూడా ఎక్కువగా ఇస్నాపూర్, ఆదిభట్ల, కిస్మత్‌పూర్, ఘట్‌కేసర్ వంటి శివారు ప్రాంతాల్లోనే కేంద్రీకృతమై ఉన్నాయి. నగరంలో అందుబాటు గృహాల కొరత తీవ్రంగా ఉంది. చాలా మంది కొనుగోలుదారులు కార్యాలయాలు, పాఠశాలలు, ఆసుపత్రులు వంటి సౌకర్యాలకు సమీపంలో ఉన్న లగ్జరీ గృహాల వైపు మొగ్గు చూపిస్తున్నారు. మాదాపూర్, హైటెక్ సిటీ వంటి పశ్చిమ హైదరాబాద్‌లో అపార్ట్‌మెంట్ కొనాలంటే చదరపు అడుగు ధర కనిష్టంగా రూ.10వేలుగా ఉండగా.. ఇతర ప్రాంతాలలో రూ.8 వేలుగా ఉంది.

టాప్-5 నగరాల్లో ఇళ్ల ధరలు (రూ.కోట్లలో)

| నగరం | విక్రయమైన ఇళ్ల సంఖ్య | సగటు ధర |
|---|---|---|
| ఎన్సీఆర్ | 25,059 | 3.66 |
| హైదరాబాద్ | 30,553 | 1.84 |
| బెంగళూరు | 30,842 | 1.61 |
| ముంబై | 75,300 | 1.12 |
| చెన్నై | 11,395 | 1.10 |

## ఆర్టీసీ టీఏవైఎల్ టికెట్ ధరల తగ్గింపు

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీసీ ట్రావెల్ యాజ్ యూ లైక్ టికెట్ ధరలను తగ్గించింది. ఈ నెల 31వ తేదీ వరకు ఈ తగ్గింపు కొనసాగనుంది. ప్రస్తుతం రూ.150 ఉన్న టీఏవైఎల్ రూ.130కే లభించనుంది. సీనియర్ సిటిజన్లకు రూ.120కి లభించే టికెట్‌లపై రూ.10 తగ్గింపును ప్రకటించారు. అలాగే.. పిల్లల టీఏవైఎల్ టికెట్ ధరలను కూడా రూ.100 నుంచి రూ.90కి తగ్గించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

## 'మహా గణపతి'కి భారీ బందోబస్తు



ఖైరతాబాద్: వినాయక చవితి సందర్భంగా ఖైరతాబాద్ మహాగణపతిని ప్రతిష్ఠించే పరిసర ప్రాంతాల్లో చేపట్టాల్సిన బందోబస్తు ఏర్పాట్లను శనివారం సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి, ఏసీపీ సంజయ్‌కుమార్, ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ వెంకట్ రెడ్డిలు సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఖైరతాబాద్ రైల్వేగేట్, మింట్ కాంపౌండ్, సెన్సేషన్ థియేటర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి వినాయక చవితి సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై సూచనలు చేశారు. ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకునేందుకు భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేయనున్నారు.



## గణపతులు రెడీ

వినాయక చవితి సమీపిస్తున్న తరుణంలో గణపతి ప్రతిమలు తుది మెరుగులు దిద్దుకుని పూజలకు సిద్ధమవుతున్నాయి. ధూల్‌పేట, హిమాయత్ నగర్ తదితర ప్రాంతాల్లో వినాయక విగ్రహాలను కళాకారులు తయారు చేశారు. నగరంలోని పలుచోట్ల విగ్రహాల విక్రయాలు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి.






## చిన్ని కృష్ణుల సందడి

శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా శనివారం చిన్నారులు నగరంలో సందడి చేశారు. పలు ప్రాంతాల్లో కృష్ణుడి వేషధారణలో అలరించారు. పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ఆలయాల్లో పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.





## ఈసీ కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రాజేంద్రనగర్: హిమాయత్‌సాగర్ ఈసీ కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో హిమాయత్‌సాగర్ గేట్లను ఎత్తి వరదనీటిని వదులుతున్నారు. వరద నీరంతా హిమాయత్‌సాగర్, కిస్మత్‌పూర్ గుండా ప్రవహిస్తుంది. ఈ ప్రాంతంలోని కిస్మత్‌పూర్, బాబమ్మ కాలనీ, ఈసీ వాగులో రాత్రి ఒక మృతదేహం కనిపించడంతో స్థానికులు రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుని వయస్సు 35 సంవత్సరాలు ఉంటందని... ఎలాంటి ఆనవాళ్లు లభించలేదన్నారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.



# కలివిడిగా ఉంటూ..అందరినీ ఆకట్టుకుంటూ..

**తల్లి, కుమారుడు అరెస్టుపై కాలనీలో చర్చ..**



కుత్బుల్లాపూర్: సరోగసి పేరిట అమాయకులకు ఎరవేసి అందిన కాడికి దండుకుంటున్న ముఠాపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే ప్రధాన నిందితులు లక్ష్మీరెడ్డి, ఆమె కుమారుడు నరేందర్ రెడ్డిలతో కలిసి ఈ దందా కొనసాగిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. వీరిని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి ఆధ్వర్యంలో పేట్‌బషీరాబాద్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో సోమవారం కోర్టులో వీరి కస్టడీ పిటిషన్ వేసి మరింత సమాచారం రాబట్టేందుకు సిద్ధమయ్యారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని పద్మానగర్ రింగ్ రోడ్డు సమీపంలో వీరు చేస్తున్న దందాకు చెక్ పెట్టారు.

**అందరితో కలివిడిగా ఉంటూ... అమాయకులకు ఎర...**

సరోగసి కేసులో అరెస్ట్ అయిన లక్ష్మీరెడ్డి, ఆమె కుమారుడు నరేందర్ రెడ్డిలు పథకం ప్రకారం అమాయకులతో మాటలు కలిపి వారి ఆర్థిక పరిస్థితిని కనుగొని సరోగసికి అంగీకారం అయ్యేలా ప్లాన్ రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా ఎంతో మంది అమాయకులు మోసపోయారు. కొంత మందికి అనుకున్న రీతిలో డబ్బులు చెల్లించకుండా వారిని బెదిరించి పంపినట్లు పోలీసుల విచారణలో తెలిసినట్లు సమాచారం. అంతేకాకుండా భర్తతో విడిపోయిన లక్ష్మీరెడ్డి మహారాష్ట్రకు వెళ్లి అక్కడ ఫెర్టిలిటీ కేంద్రాలకు అండం విక్రయించి డబ్బు సంపాదించేది. ఈ క్రమంలో ముంబై పోలీసులు సైతం ఈమెను అరెస్టు చేసి జైలుకు పంపినా బుద్ధి మారకుండా జైలు నుండి బయటకు వచ్చి మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ కు మకాం మార్చింది. ఇక్కడ సొంత ఇల్లు తీసుకుని ఎవరికీ అనుమానం రాకుండా మూడంతస్తుల నిర్మాణం చేపట్టి కొంతమందిని నమ్మించి సరోగసికి ఒప్పించి తన ఇంట్లోనే ఉంచుకుంటూ వస్తుంది. ఎవరైనా ఆరా తీస్తే.. వారు మా బంధువులే అన్నట్లు నమ్మిస్తూ వచ్చింది. ఇళ్ల మధ్యనే ఎవరికీ అనుమానం రాకుండా ఇలా సరోగసి కేంద్రాన్ని నిర్వహించడంపై స్థానికులు ఆశ్చర్యపోయారు. లక్ష్మీరెడ్డి కొంతమంది ఏజెంట్లను నియమించుకొని డబ్బు ఎరగా చూపి ఎంతో మంది అమాయకులను ఇదే విధంగా మోసం చేసినట్లు తెలిసింది. లక్షల్లో ఫీజులు వసూలు చేసి... అందులో 25 శాతం మాత్రమే సరోగసి మహిళలకు ఇచ్చేదని ప్రధాన ఆరోపణ. తల్లి కుమారుడుని కస్టడీ తీసుకొని విచారిస్తే మరిన్ని విషయాలు వెలుగులో కి వస్తాయని పలువురు ఆరోపిస్తున్నారు.

**ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలకు నోటీసులు..**

పేట్ బషీరాబాద్ సరోగసి కేసులో కొన్ని హాస్పిటల్స్‌కు నోటీసులు ఇచ్చినట్లు ఇన్‌స్పెక్టర్ విజయవర్ధన్ తెలిపారు. నిందితురాలు లక్ష్మి, ఆమె కుమారుడు నరేందర్ రెడ్డి పలు ప్రైవేట్ ఆస్పత్రులకు ఏజెంట్లుగా ఉన్నట్టు గుర్తించామన్నారు.హెగ్డే హాస్పిటల్, లక్స్ హాస్పిటల్, అను టెస్ట్ ట్యూబ్ సెంటర్, ఈవీఎఫ్ ఐవీఎఫ్ సెంటర్, ఫర్టి కేర్, శ్రీ ఫెర్టిలిటీ, అమూల్య ఫెర్టిలిటీ సెంటర్లకు నోటీసులు జారీ చేసినట్లు విజయవర్ధన్ పేర్కొన్నారు.

## బాలుడిపై హత్యాచారం కేసులో నిందితుడి రిమాండ్

ఉప్పల్: ఐదేళ్ల బాలునిపై లైంగింక వాంఛ తీర్చుకోవడమే కాక దారుణంగా హతమార్చిన నిందితుడు బీహార్ రాష్ట్రానికి చెందిన షంస్ కమర్‌ను ఉప్పల్ పోలీసులు అదుపులోకి తీసుకుని శనివారం రిమాండ్‌కు తరలించారు. నిందితడు కమర్ వెంట వెళుతుండగా బాలుడు నవ్వుకుంటూనే వెళ్లాడు. హత్యాచారం అనంతరం ఇంట్లో చెబుతాడన్న భయంతో మెడకు తాడు చుట్టి గట్టిగా లాగి హత్య చేసినట్లు పోసుమార్టం ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు.

## కవి తంగిరాల చక్రవర్తికి నివాళి



సాక్షి, సిటీబ్యూరో: ప్రగతిశీల, కమ్యూనిస్టు సాహిత్యాన్ని పుస్తక రూపంలో తేవడానికి శక్తి వంచన లేకుండా కృషి చేసిన ప్రముఖ కవి, రచయిత తంగిరాల చక్రవర్తి మరణం పట్ల తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్, తెలంగాణ పబ్లికేషన్స్ నిర్వాహకులు కోయ చంద్ర మోహన్ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. బాలాపూర్‌లోని చక్రవర్తి స్వగృహానికి వెళ్లి నివాళులు అర్పించి, వారి కుటుంబాన్ని పరామర్శించారు. చక్రవర్తి శనివారం ఉదయం గుండెపోటుతో అకస్మాత్తుగా మరణించారు. ఆయన కేవలం జర్నలిస్టుగానే కాకుండా వందలాది పుస్తకాలను తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించారు. తంగిరాల క్రిష్ణప్రసాద్ పేరు మీద సంస్థను స్థాపించి, నాటక రంగంలో నిష్ణాతులను గుర్తించి అవార్డులను బహూకరిస్తూ వచ్చారు. తెలుగు సాహిత్యరంగంలో ప్రముఖ కవులు, రచయితల పుస్తకాలను సమీక్షించారు. తంగిరాలకు నివాళులర్పించిన వారిలో రచయితలు కూర చిదంబరం, మోహనకృష్ణ, ముజాహిద్, నరేష్, సుధాకర్, వాగ్దేవి తదితరులు ఉన్నారు.

## విద్యుదాఘాతంతో వాచ్‌మన్ మృతి


దుర్గా ప్రసాద్ (ఫైల్)

నిజాంపేట్: బాచుపల్లి పరిధి ప్రగతినగర్ పీకాక్ సర్కిల్ వద్ద నీలిమ రెసిడెన్సి అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన దుర్గా ప్రసాద్ (35) నీలిమ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తూ, తన భార్య మౌనిక (29), ఇద్దరు పిల్లలతో కలిసి వాచ్‌మెన్ గదిలో నివాసం ఉంటున్నారు. శనివారం ఉదయం అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో నీరు నిలిచిపోవడంతో దుర్గాప్రసాద్ మోటార్ ఆన్ చేసి నీరు బయటకు పంపే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో అకస్మాత్తుగా విద్యుత్ షాక్‌కు గురై కుప్పకూలాడు. భార్య మౌనిక, ప్లిలలు బయటకు వచ్చే సరికి అపస్మారక స్థితిలో పడ్డారు. వెంటనే పీపుల్స్ హాస్పిటల్‌కు తరలించగా, అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య మౌనిక స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది.

**ఫ్లవర్ డెకరేషన్ చేస్తూ..**

జీడిమెట్ల: హోటల్‌లో ఫ్లవర్ డెకరేషన్ చేస్తుండగా ఓ ఎలక్ట్రీషియన్ కరెంట్ షాక్ తగిలి మృతి చెందిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రేమ్‌సాగర్ తెలిపిన మేరకు.. చింతల్ లెమన్ రిడ్జ్ హోటల్‌లో ప్రకాష్ అనే వ్యక్తి ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం హోటల్ యాజమాన్యం హోటల్‌లో ఫ్లవర్ డెకరేషన్ చేయాల్సిందిగా ప్రకాష్‌ను ఆదేశించారు. అప్పటికే అక్కడ విద్యుత్ షాక్ తగిలే ప్రమాదం ఉందని ప్రకాష్ యాజమాన్యానికి తెలిపాడు. అయినప్పటికీ యాజమాన్యం డెకరేషన్ చేయాలని చెప్పారు. పనులు చేస్తుండగానే 11కేవీ వైర్లు తగిలి కిందపడిపోయాడు. వెంటనే యాజమాన్యం మల్లారెడ్డి అస్పత్రికి తరలించగా అప్పటికే ప్రకాష్ మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. ప్రకాష్ సోదరుడు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అధిక వడ్డీ ఆశచూపి రూ.21 కోట్లు వసూలు చేశారు

**లబోదిబోఅంటున్న బాధితులు**


వివరాలు వెల్లడిస్తున్న బాధితులు

మల్కాజిగిరి: విశ్రాంత ఉద్యోగులు, చిరు వ్యాపారులు, వృద్ధులను లక్ష్యంగా చేసుకున్నాడో మోసగాడు. బ్యాంక్ వడ్డీకన్న ఎక్కువ ఇస్తానని చెప్పడంతో నమ్మి మోసపోయామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.మల్కాజిగిరిలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సైనిక్‌పురిలో దినేష్ అనే వ్యక్తి స్పెల్ బౌండ్ కోవర్కింగ్ పేరిట కార్యాలయం ఏర్పాటు చేశాడు. బ్యాంక్ వడ్డీకన్న ఎక్కువ ఇస్తానని నమ్మించి డబ్బులు వసూలు చేశాడు. నమ్మకం కలగడానికి కార్యాలయం చూపించి తీసుకున్న డబ్బుకు చెక్కులు ఇచ్చాడు. కొన్ని నెలలుగా వడ్డీ ఇవ్వడం లేదు. ఈ ఏడాది మే నెలలో మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లాలో ఐపీ పిటిషన్ వేసి భాదితులకు వాట్సప్ ద్వారా నోటీసులు పంపించడంతో బాధితులు ఖంగుతిన్నారు. అతని ఇంటి వద్దకు వెళ్లి భాదితుడు దినేష్ భార్య కవితను అడిగితే తనకు ఆయనకు మనస్పర్థలు రావడంతో విడాకులు తీసుకున్నామని తను ఎక్కడున్నాడో తెలియదని చెప్పింది. కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు ఇవ్వడానికి వెళ్తితే సివిల్ మ్యాటర్ అని ఫిర్యాదు తీసుకోలేదన్నారు. తాము వృద్ధులు , విశ్రాంత ఉద్యోగులమని మోసపోయామని ఆ కోణంలో ఫిర్యాదు కూడా నమోదు చేయలేదన్నారు. 159 మందికి పైగా భాదితులు ఉన్నారని సుమారు 21 కోట్ల డబ్బులు వసూలు చేశారన్నారు. ఇప్పటికైనా రాచకొండ కమిషనర్ చొరవ చూపి తమకు న్యాయం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో జగన్నాథరావు, రవి, శ్రీధర్,సతీష్, సుధాకర్,ఫణి,సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఉమెన్స్ హాస్టల్ నిర్వాహకుడిపై మహిళల దాడి

- అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఫిర్యాదు
- పూలకుండీలు, ఫర్నిచర్ ధ్వంసం చేసి నిర్వాహకుడు సత్యప్రకాశ్ పై దాడి

మాదాపూర్ : మాదాపూర్‌లో ఉమెన్స్ హాస్టల్ నిర్వాహకుడిపై మహిళలు దాడి చేసిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. మాదాపూర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన మేరకు.. షేక్‌పేటలో ఉంటున్న తల్లిదండ్రులు తన కూతురిని నీట్ ఎగ్జామ్ కొచింగ్ కోసం జులై 13 నుంచి హాస్టల్‌లో ఉంచారు. 10 రోజుల క్రితం నిర్వాహకుడు అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని తెలపడంతో బంధువులు, తల్లిదండ్రులు వచ్చి నిర్వాహకుడిపై దాడి చేశారు. మాదాపూర్ ఇమేజ్‌గార్డెన్ రోడ్డులో ఉన్న అర్ణవ్ ప్లాజాలో ఎస్‌పీపీ ఎగ్జిక్యూటివ్ ఉమెన్స్ హాస్టల్‌లో 16 సంవత్సరాల బాలిక ఉంటుంది. బాలికపై హాస్టల్ నిర్వాహకుడు సత్యప్రకాశ్ లైంగిక దాడికి పాల్పడ్డాడని ఆరోపిస్తూ కొందరు మహిళలు ఆందోళనకు దిగారు. పూలకుండీలను ధ్వంసం చేసి దాడికి దిగారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపుచేశారు.అనంతరం సత్యప్రకాశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసి నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఇంట్లో అగ్నిప్రమాదం

**కాలి బుడిదైన సామగ్రి**



కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ సాయికృష్ణనగర్ కాలనీలోని ఓ ఇంట్లో శనివారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. కాలనీకి చెందిన శంకర్ కుటుంబ సభ్యులు తిరుపతి వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. శంకర్ కుటుంబ సభ్యులు తిరుపతికి వెళ్లే సమయంలో వారి బంధువుల పిల్లలకు ఇంటి తాళం ఇచ్చి వెళ్లారు. ఇంట్లో వారిద్దరు నిద్రిస్తున్న సమయంలోనే ప్రమాదం జరిగింది. ఇల్లంతా దట్టమైన పొగలు వ్యాపించడంతో అప్రమత్తమైన వారు బయటకు వచ్చి స్థానికులకు చెప్పారు. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇంట్లోని సామగ్రి, ఫర్నిచర్, విలువైన వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. బాధితులు ఆదివారం సాయంత్రం వరకు తిరిగి వచ్చే అవకాశం ఉందని స్థానికులు తెలిపారు.

**ఘటన స్థలాన్ని సందర్శించిన ఎమ్మెల్యే..**


అగ్నిప్రమాద విషయం తెలిసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శనివారం ఘటన స్థలాన్ని సందర్శించారు. అధికారులతో మాట్లాడి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు.

# గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

పంజగుట్ట: బంజారాలకు సంబంధించినే అనేక రాష్ట్రాల్లోని ఆస్తులు భూములు బంజారాల అభివృద్ధికే ఉపయోగించాలని మాజీ మంత్రిరవీంద్ర నాయక్ డిమాండ్ చేశారు.రాష్ట్ర గవర్నర్ ద్వారా భారత ప్రధానమంత్రికి, రాష్ట్రపతికి పంపనున్న బహిరంగ లేఖను ఆయన శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అఖిల భారత బంజారా మహా సేవా సంఘ్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ జగన్ నాయక్ విశ్లావత్‌తో కలిసి ఆవిష్కరించారు. బంజారాల చరిత్రను, వారు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకువెళ్లేందుకు ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గిరిజన నిరుద్యోగులకు వారికి రిజర్వ్‌డ్ చెయ్యబడ్డ వేలాది ఖాళీ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. యావత్ భారతదేశం మొత్తం ఒకే భాష మాట్లాడే గిరిజనుల భాష గోర్‌గోల్ భాషను అధికారిక భాషగా గుర్తించి రాజ్యాంగంలోని ఆర్టికల్ 8లో చేర్చాలని కోరారు. సమావేశంలో ఆర్.బోనా నాయక్, జి.రవి తదితరులు పాల్గొన్నారు.

## వర్షానికి కూలిన రెస్టారెంట్ గోడ..

సుభాష్‌నగర్: శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. అంగడిపేట లోని 44వ జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న అలనాటి రెస్టారెంట్ హోటల్ వద్ద వర్షానికి గోడతోపాటు విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్‌లు కూలిపోయాయి. దీంతో స్థానికంగా రాత్రిలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. శనివారం మరమ్మతులు చేపట్టారు. పైప్‌లైన్ రోడ్ లోనీ దుర్గా విహార్ వద్ద శనివారం ఉదయం వరకు ప్రధాన రోడ్డు నదిని తలపించింది.



## రోడ్లపై బైక్ విన్యాసాలు.. నలుగురి అరెస్ట్



శంషాబాద్ రూరల్: రహదారిలో వంతెనపై బైక్‌లతో స్టంట్ చేసిన నలుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు.. నగరంలోని బోరబండ ప్రాంతానికి నలుగురు యువకులు ఈ నెల 15న సాయంత్రం బెంగళూరు జాతీయ రహదారిపై సాతంరాయి శివారులో వంతెనపై బైక్‌లతో విన్యాసాలు చేస్తూ శంషాబాద్ వైపు వచ్చారు. ఈ సమయంలో రహదారిలో వాహనదారులకు ఆటంకం కల్గించడంతో పాటు ప్రమాదకరంగా బైక్‌లపై విన్యాసాలు చేయడంతో వాహనదారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. శనివారం వివరాలను కనుగొన్న ఆర్జీఐఏ ట్రాఫిక్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. నలుగురుని లాఅండ్ ఆర్డర్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అలరించిన 'కర్ణాటక కచేరీ'



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–8లోని సప్తపర్ణి వేదికగా ప్రిన్స్ రామ వర్మ జన్మాష్టమి పర్వదినం సందర్భంగా కర్ణాటక కచేరీని నిర్వహించారు. ఆయనకు వయోలిన్‌లో ఎస్ఆర్ విను, మృదంగంలో బి.హరికుమార్ సమకూర్చగా, వారి నాజూకైన వాద్యను ప్రవేశాలు కచేరి ఆకర్షణను మరింత పెంచాయి. కచేరిలో 12వ శతాబ్దపు అష్టపది నుంచి 20వ శతాబ్దం వత్సాలా రంగస్వామి రచించిన పున్నమి నట్టి వరకు అనేక శతాబ్దాలను, రాగాలను ఆవహించే కృతులు వినిపించబడ్డాయి. రామవర్మ స్వచ్ఛమైన గాత్ర నైపుణ్యం, భావవ్యక్తీకరణ, అందరికీ చేరువయ్యే శైలి వల్ల ఆ అనుభవం ఒక విశిష్టమైన సంగీత యాత్రగా మారింది.

## 300 మంది పోలీసులతో బందోబస్తు



బందోబస్తును పర్యవేక్షించిన ఏసీపీ ప్రవీణ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ ఇమాన్యుయేల్

అబిడ్స్: అబిడ్స్ పరిసర ప్రాంతాలు జనసంద్రంగా మారాయి. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలతో అబిడ్స్ ఇస్కాన్ ఆలయానికి శనివారం లక్షలాది మంది భక్తు లు తరలివచ్చారు. ముందు జాగ్రత్తగా అబిడ్స్ ఏసీపీ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ ఇమాన్యుయేల్, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ నర్సింలు దాదాపు 300 మంది అదనపు పోలీసులతో బందోబస్తు చేపట్టారు. అబిడ్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో అదనపు ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. శనివారం రాత్రి వరకు అబిడ్స్ పరిసర ప్రాంతాల రోడ్లపై వాహనాల రాకపోకలు నిలిపివేయడంతో ఇస్కాన్ ఆలయానికి వచ్చే భక్తులు కాలినడకన ఆలయానికి వచ్చారు. సీసీ కెమెరాల ద్వారా పోలీసు సిబ్బంది బందోబస్తు పర్యవేక్షించారు.

## చాకలి ఐలమ్మ విగ్రహం ధ్వంసం దారుణం

ఉస్మానియా యూనివర్సిటీ: వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేయడం దారుణమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మండి పడ్డారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని భోసి గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వీరనారి చాకలి ఐలమ్మ కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, ధ్వంసం చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. విగ్రహాలు ధ్వంసం చేసే వారికి పైన హత్యయత్నం కేసులు నమోదు చేయాలన్నారు.

## ఓయూ దూరవిద్యలో ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూరవిద్య కేంద్రంలో ఈ విద్యా సంవత్సరానికి ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించు ఎంట్రన్స్ పరీక్షలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. వచ్చే నెల 7న జరిగే ప్రవేశ పరీక్షలకు 2వ తేదీ వరకు, రూ.500 అపరాధ రుసుముతో 5 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.పాండురంగా రెడ్డి తెలిపారు. టీజీ ఐసెట్–2025లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో నేరుగా ప్రవేశం కల్పించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలను ఉస్మానియా వెబ్‌సైట్లో చూడవచ్చు.

## ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై యువకుల వీరంగం..

**ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద బస్సు ఆపినందుకు దాడి**

సనత్‌నగర్: ఆర్టీసీ డ్రైవర్‌పై ఇద్దరు యువకులు వీరంగం చేశారు. ట్రాఫిక్ రెడ్ సిగ్నల్ పడడంతో బస్సు ఆపినందుకు ఎందుకు ఆపావంటూ దాడి చేసిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఆలేరుకు చెందిన ఎంఎంరెడ్డి (35) ఆర్టీసీ డ్రైవర్. ఈ నెల 15న తెల్లవారుజామున 3–4 గంటల మధ్య కంటోన్మెంట్ జేబీఎస్ ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద రెడ్ సిగ్నల్ పడగా బస్సును ఆపాడు. అదే సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు స్కూటీపై వచ్చి ప్యాసెంజర్ డోర్‌ను కొట్టగా డ్రైవర్ ఎంఎంరెడ్డి ఓపెన్ చేశాడు. బస్సును ఎందుకు ఆపావంటూ దూషించడమే కాకుండా దాడికి దిగారు. రెడ్ సిగ్నల్ పడిందని, అందుకే బస్సును ఆపానంటూ ఎంతచెప్పినా ఇద్దరూ వినిపించుకోలేదు. అతన్ని కొట్టడమే కాకుండా బస్సు అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో బాధితుడు డయల్ 100కు ఫోన్ చేయగా వెంటనే పోలీసులు అక్కడికి చేరుకునే లోపే పరారయ్యారు. తనపై దాడి చేసిన యువకులపై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో బేగంపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఉదయ్‌నగర్‌లో దెబ్బతిన్న రోడ్డు



ఫిలింనగర్‌లోని కొత్త చెరువు పక్కన దెబ్బతిన్న రోడ్డు

# ఏ రోడ్డు చూసినా గుంతలే!

**ఎడతెరపి లేని వర్షాలకు దెబ్బతింటున్న రోడ్లు**

- గుంతలు పూడ్చడంలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు
- గుంతల వల్ల రోడ్లపై నెమ్మదిస్తున్న ట్రాఫిక్



బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ముందు..

బంజారాహిల్స్: వరుసగా కురుస్తున వర్షాలకు ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రహదారులు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయి. స్పందించాల్సిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో వాహనదారులతో పాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో జీహెచ్ఎంసీలో డివిజన్ల వారీగా ఉండే మాన్‌సూన్ టీమ్‌ల ద్వారా అధికారులు ఆయా డివిజన్ల పరిధిలో దెబ్బతిన్న రోడ్లకు కనీసం తాత్కాలిక మరమ్మతులు అయినా చేసేవారు కానీ ఇప్పుడు మాన్‌సూన టీమ్‌లన్నింటిని హైడ్రాలో కలిపేయడంతో ఎవరు గుంతలు పూడుస్తారో, రోడ్లు దెబ్బతింటే ఎవరికి చెప్పాలో కూడా స్థానిక బస్తీలు, కాలనీవాసులకు తోచడం లేదు.

- ఖైరతాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, ఫిలింనగర్, ఎన్బీటీనగర్, శ్రీనగర్ కాలనీ, ఖైరతాబాద్, సోమాజిగూడ ప్రాంతాల్లో రోడ్లు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న రోడ్లను ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో ఆ రోడ్లపై వాహనాల నెమ్మదిగా సాగుతున్నాయి. దీంతో ట్రాఫిక్ పోలీసులే కొన్ని చోట్ల పలుగు పార పట్టుకొని శ్రమదానం చేస్తూ గుంతలను పూడుస్తున్నారు.
- సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి గుంతలు తేలిన రోడ్లకు కనీసం తాత్కాలిక మరమ్మతులు అయినా చేయాల్సిన అవసరం ఉంది.



బంజారాహిల్స్ రోడ్ నెం 7/9 మెరీడియన్ స్కూల్ జంక్షన్‌లో దెబ్బతిన్న రోడ్డు



శ్రీనగర్ కాలనీ ఎస్‌బీఐ బ్యాంకు వద్ద...



జూబ్లీహిల్స్ రోడ్ నెం 92లోని తాజ్‌మహల్ హోటల్ వద్ద...

## వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి



జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని స్వయంభూ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ వర్గాలు ఆయనకు శాలువా కప్పి కృష్ణ పరమాత్మ ఫొటో జ్ఞాపికను బహూకరించారు. స్వామి వారి ఊంజల్ సేవలో కూడా ఎమ్మెల్యే పాల్గొన్నారు.

**ఇందిరానగర్ ఫేజ్–2 బస్తీలో...**

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్ ఇందిరానగర్ ఫేజ్–2 బస్తీలో పునఃనిర్మాణం జరుగుతున్న శ్రీకృష్ణ మందిరంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. యాదవ సంఘం నాయకుడు మల్లేశ్ యాదవ్ నేతృత్వంలో స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు లాంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బస్తీ కమిటీ ప్రతినిధులు కృష్ణాచారి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరానగర్‌లో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



రాధాకృష్ణుడి వేషధారణలో చినారులు

**జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో...**

శ్రీనగర్‌కాలనీ: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణల్లో ఆకట్టుకున్నారు. పలు సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలతో అలరించారు.





శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు

## గణేష్ ఉత్సవ నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలి

బంజారాహిల్స్: రానున్న గణేష్ నవరాత్రి మహోత్సవాల సందర్భంగా మండప నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు బంజారాహిల్స్ పోలీసులు సమావేశం నిర్వహించారు. బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ కె.ఎం.రాఘవేంద్ర, ఎస్ఐలు సంధ్య, కూన రమేష్, విజయ్, రవీందర్, కె.సురేందర్ తదితరులు పాల్గొని మాట్లాడుతూ... మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్‌స్టేషన్‌ల ఇంటిమేషన్ ఇవ్వాలని సూచించారు. ప్రతి మండపానికి సీసీ కెమెరా ఏర్పాటు చేసుకోవాలని, అనుమానితుల కదలికలపై దృష్టిపెట్టాలని, డీజేలకు ఎట్టి పరిస్థితులోనూ అనుమతి లేదన్నారు. నిమజ్జన తేదీలతో పాటు రూట్ మ్యాప్ కూడా పోలీసులకు అందించాలని కోరారు.



మాట్లాడుతూ బంజారాహిల్స్ పోలీసులు

## మహిళా వెయిటింగ్ హాల్ ప్రారంభం



మహిళా వెయిటింగ్ హాల్‌ను ప్రారంభిస్తున్న ఘంటా చక్రపాణి

బంజారాహిల్స్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో మహిళా వెయిటింగ్ హాల్‌ను వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సుదూర ప్రాంతాల నుంచి వచ్చే మహిళా విద్యార్థులకు, వారి పిల్లల సంరక్షణ కోసం విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో ప్రత్యేకంగా మహిళా వెయిటింగ్ హాల్‌ను రూపొందించామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్వీకే రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ పుష్పా చక్రపాణి, ఉమెన్స్ సెల్ ఇన్‌ఛార్జి రాణిరజిత మాధురి, ప్రొఫెసర్ పల్లవీ కాబ్డే, ప్రమీలా కేతావత్, చంద్రకళ, మేరీ సునంద, బోధన, బోధనేతర సిబ్బంది, ఉద్యోగ సంఘాల నాయకులు కాంతం ప్రేమకుమార్, నారాయణరావు, యాకేష్‌దైదా, మియాజాని, విశ్వనాథ తదితరులు పాల్గొన్నారు.



స్కాలర్‌షిప్స్ పొందిన చిన్నారులతో కాలనీ నేతలు

## పేద విద్యార్థులకు చేయూత

వెంగళరావునగర్: ఆర్థికంగా సహకరించక విద్యకు దూరం అవుతున్న పేద విద్యార్థులకు చేయూతనివ్వాలని మధురానగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు పిలుపునిచ్చారు. మధురానగర్‌కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు, ప్రొఫెసర్ జయశంకర్‌ల పేరుతో అక్షరజ్యోతి స్కాలర్‌షిప్స్‌ను నిరుపేద చిన్నారులకు పంపిణీ చేశారు. ఈ ఏడాది 159 మంది విద్యార్థినీ విద్యార్థులకు రూ. 8.81 లక్షల వరకు స్కాలర్‌షిప్స్‌ను అందించామన్నారు. కాలనీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రతాప్‌రెడ్డి, కోడె సాంబశివరావు, ఉపాధ్యక్షులు ఎస్.వి.మనోహర్ రావు, జాయింట్ సెక్రటరీ హనుమంతరావు, కోశాధికారి సుగుణ తదితర అసోసియేషన్ నేతలు, సభ్యులు, ఈసీ మెంబర్లు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## మాంసం వ్యర్థాలను స్వచ్ఛ ఆటోలకు అందించాలి



మాట్లాడుతున్న బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి

బంజారాహిల్స్: గణేష్ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బీఫ్, మటన్, చికెన్ దుకాణాల వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి నిర్వాహకులతో మాట్లాడుతూ... నవరాత్రుల్లో భాగంగా మాంసం వ్యర్థాలను ఇష్టానుసారంగా బయటపడేయవద్దని, వాటిని బ్లాక్ కవర్లలో భద్రపరిచి తప్పనిసరిగా స్వచ్ఛ ఆటోలకు అందించాలన్నారు.

మాంసం వ్యర్థాలను బయటపడేస్తే కుక్కలు తీసుకువెళ్లి మండపాల వద్ద వేసే ప్రమాదం ఉందని, దీని వల్ల సమస్యలు తలెత్తుతాయన్నారు. నిర్వాహకులు ఈ సూచనలను పక్కాగా పాటించాలన్నారు. రోజూ వ్యర్థాలను భద్రపరుస్తూ ఆటోలకు అందజేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మట్టి విగ్రహాలను పూజిస్తే సన్మానం

పంజగుట్ట: ప్రతి ఒక్కరూ మట్టి వినాయకక విగ్రహాలనే పూజించి పర్యావరణాన్ని కాపాడాలని ఎమ్మెల్సీ, జై గణేశ భక్తి సమితి గౌరవాధ్యక్షుడు బొగ్గరపు దయానంద్ గుప్తా తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మట్టి గణపతిని పూజించాలి అనే ప్రచార కరపత్రాన్ని ఆయన జై గణేశ భక్తి సమితి చైర్మన్ కె.ఎస్.ఆనంద్ రావు, వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు ఎ.జైస్ కుమార్‌లతో కలిసి ఆవిష్కరించారు. తెలంగాణలోని 33 జిల్లాల్లో ఎవరైనా వినాయక మంటపాల్లో మట్టి వినాయకున్ని పెట్టి పూజలు నిర్వహిస్తే ఆ ఫొటోలు తమకు పంపితే వారికి రవీంద్రభారతిలో సన్మానం, జ్ఞాపిక, సర్టిఫికెట్‌ను ప్రముఖుల చేతులమీదుగా అందిస్తామన్నారు. జై గణేష్ భక్తి సమితి ఉపాధ్యక్షులు కె.మహేష్, విజయ రంగారావు, భువనేశ్వరి, మహిళా అధ్యక్షురాలు శ్రీదేవి, రాష్ట్ర సెక్రటరీ సునిత, అడ్వైజర్ శ్రీకాంత్, జాయింట్ సెక్రటరీ రవికాంత్, జంగయ్య, కోటి రెడ్డి, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ శ్రీనగర్‌కాలనీ నూతన కార్యవర్గం



శ్రీనగర్‌కాలనీ: భారతీయ జనతాపార్టీ శ్రీనగర్‌కాలనీ డివిజన్ నూతన కమిటీని డివిజన్ అధ్యక్షురాలు జి.అనంతలక్ష్మి నియమించారు. శనివారం జరిగిన కమిటీ సమావేశంలో నూతన కమిటీ పేర్లను ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా పూజారి శ్రీనివాస్, రాజ్‌వినయ్, పంకజ్‌నాథ్, కడియాల సుధారాణి, ప్రధాన కార్యదర్శులుగా నరేంద్ర యాదవ్, హరీష్‌కుమార్, కార్యదర్శులుగా కృష్ణగౌడ్, అజయ్, ప్రేమలత, శ్రీలక్ష్మి, యువమోర్చా అధ్యక్షులుగా సాయికిరణ్ యాదవ్, మహిళామోర్చా అధ్యక్షురాలిగా శ్రీదేవి, ఓబీసీ మోర్చా ఉమేష్, ఎస్‌సి మోర్చ వినోద్‌కుమార్, మైనార్టీ మోర్చ విల్సన్‌లతో పాటుగా మరో 40 మంది ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లుగా నియమించారు.

## అంతర్జాతీయ చెఫ్ పోటీల్లో సత్తా చాటడమే లక్ష్యం

పంజగుట్ట: కలినరీ ఒలంపిక్స్‌గా భావించే అంతర్జాతీయ చెఫ్ పోటీల్లో భారత దేశం సత్తా చాటడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు సౌత్ ఇండియన్ చెఫ్స్ అసోసియేషన్ (సికా) ఉపాధ్యక్షులు సుధాకర్ అన్నారు. సెప్టెంబర్ 19 నుంచి 21 వరకు చెన్నై ట్రేడ్ సెంటర్‌లో నిర్వహించనున్న సికా కలినరీ ఒలంపియాడ్ 7వ ఎడిషన్ పోటీల్లో పాల్గొనే చెఫ్‌లకు శనివారం పార్క్ హోటల్‌లో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అంతర్జాతీయ కలినరీ పోటీల్లో విజయం సాధించిన ముగ్గురు శ్రీలంకకు చెందిన చెఫ్‌లు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొని 200 మంది విద్యార్థులకు, 70 మంది వివిధ హోటల్స్‌లో పనిచేసే చెఫ్స్‌కు కుక్కింగ్‌లో కొత్త టెక్నాలజీ, ఎలాంటి క్వాలిటీ మేయింటెన్ చెయ్యాలి, వివిధ డిజైన్‌లు, ప్లేట్ ప్రజెంటేషన్ మెళుకువలు నేర్పించారు. అనంతరం కలినరీ ఒలంపియాడ్ పోస్టర్‌ను సికా కార్యదర్శి సీతారాం ప్రసాద్, బోర్డు సభ్యులు విక్రమ్ సింహా, ప్రముఖ చెఫ్ సంజయ్, కర్నాటక చాప్టర్ ప్రతినిధి కాశీవిశ్వనాథ్, యాదగిరి ఆవిష్కరించారు.

## 18న మెగా 'సర్జికల్ కరెక్షన్, హెల్త్ క్యాంప్'

బంజారాహిల్స్: ఈ నెల 18వ తేదీన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ బ్రాంచ్ ఆధ్వర్యంలో వికలాంగుల కోసం ఉచిత శస్త్ర చికిత్సలు, క్యాలిపర్స్, వీల్ చైర్స్, ఎలక్ట్రిక్ మోటార్ సైకిళ్ల పంపిణీ నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ భీమ్‌రెడ్డి తెలిపారు. శనివారం సోమాజిగూడలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... డిసేబుల్ ట్రస్ట్, అగర్వాల్ సేవాదళ్, పిట్టి ట్రస్ట్, డాక్టర్ నారి చారిటబుల్ ట్రస్ట్, రవి హీలియోస్ హాస్పిటల్, వికలాంగుల నెట్‌వర్క్, వికలాంగుల హక్కుల సాధన సమితి, ఎఫ్ఈడీ, జనజాగృతి ట్రస్ట్‌లు సంయుక్తంగా వికలాంగుల కోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయని తెలిపారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరవుతారన్నారు. జిల్లా కలెక్టర్ హరిచందన తదితరులు హాజరవుతారని తెలిపారు. వికలాంగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు





## సినిమా ఫైటర్స్ ఎంపికలు




ఎంపికల్లో పాల్గొన్న ఫైటర్స్

బంజారాహిల్స్: సినిమాల్లో ఫైటర్స్ విభాగంలో ఆసక్తి గల యువకులకు తెలంగాణ సినిమా అండ్ మీడియా స్టంట్ డైరెక్టర్స్, స్టంట్ ఆర్టిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఎంపికలు నిర్వహించారు. బంజారాహిల్స్ రోడ్‌నెం. 2లోని యూనియన్ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ ఎంపికలకు రాష్ట్ర వ్యాప్తంగా కరీంనగర్, హైదరాబాద్, నిజామాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాల నుంచి 200 మంది వరకు యువకులు హాజరైనట్లు అసోసియేషన్ ప్రెసిడెంట్ పెరుమాల రాము తెలిపారు. వీరికి సినిమాల్లో ఫైటర్స్‌గా నిలదొక్కుకునేందుకు కార్డులు ఇవ్వడంతో పాటు ఫెడరేషన్ కార్యాలయానికి కూడా విన్నవిస్తామని తెలిపారు. ఎంపికకు హాజరైన యువకులకు కరాటే, జిమ్నాస్టిక్స్, బైక్ వీలింగ్, ఫిట్‌నెస్, ఎత్తు, బరువు వంటి అంశాలను పరీక్షించి ఎంపికచేస్తామని తెలిపారు. యూనియన్ జనరల్ సెక్రటరి జల్లెల సతీష్ కుమార్, ఉపాధ్యక్షుడు విక్కి, ఫైట్ మాస్టర్లు సి. శ్రీనివాసరావు, బి.నరేష్, బద్రి, మాస్టర్ అల్తాఫ్, బి. పవన్, అక్బర్, యు.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



## మైమరిపించిన నృత్యం..

కాచిగూడ ఉత్తరాది మఠం ఆధ్వర్యంలో సత్యాత్మ తీర్థుల వారి 30 చాతుర్మాస దీక్ష సందర్భంగా దాక్షాయణి నృత్యప్రదర్శన ఆహూతులను అలరించింది. సంగీతానికి అనుగుణంగా దాక్షాయణి హావభావాలు మైమరిపించాయి. సాక్షి, సిటీబ్యూరో



## మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 3లోని జంక్షన్‌లో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబూ జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్‌ల ఆశయ స్ఫూర్తిని అందరూ కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఉపాధ్యక్షుడు జిల్లా శంకర్, తెలంగాణ మాలల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్, టీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బరిగెల వెంకటస్వామి, ఆల్ ఇండియా పాన్ అసోసియేషన్ అధ్యక్షుడు సలావుద్దీన్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య, బీఎస్పీ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బడుగుల లింగం తదితరులు పాల్గొన్నారు.



మహనీయుల విగ్రహాలకు నివాళులు అర్పిస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

## నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో ఫెస్టివ్ ఎడిషన్ పేరిట సూత్ర ది ఇండియా ఫ్యాషన్ ఎగ్జిబిషన్ ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్ ప్లాజాలో చేనేత ఎగ్జిబిషన్ ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ది గోలిమార్ ఎడిషన్ పేరిట హై లైఫ్ ఎగ్జిబిషన్ ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది
- సిరి ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ల్యాండ్ స్కేప్స్ పెయింటింగ్ ఎగ్జిబిషన్ మాసాబ్ ట్యాంక్‌లోని జేఎన్ఏఎఫ్ఏయూ కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో గణేష్ చతుర్థి స్పెషల్ పేరిట ఏర్పాటు చేసిన ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు నేషనల్ సిల్క్ ఎక్స్‌పో అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

# నేరుగా.. వేగంగా..!



**త్వరలో హైదరాబాద్ టు ఆస్ట్రేలియా విమాన సర్వీసులు**

- 11 గంటలకు తగ్గనున్న ప్రయాణ సమయం
- గణనీయంగా పెరిగిన ప్రయాణికులు
- ఏటా లక్షన్నర మందికిపైగా రాకపోకలు

సాక్షి, సిటీబ్యూరో: ప్రయాణికుల సంఖ్య పెరిగింది.. విమాన సర్వీసులకు డిమాండ్ కూడా పెరిగింది.. ఈ నేపథ్యంలో హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఆస్ట్రేలియాకు నేరుగా విమాన సర్వీసులు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు పలు అంతర్జాతీయ విమానయాన సంస్థలు సన్నద్ధమవుతున్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి ఆస్ట్రేలియాలోని పలు నగరాలకు కొంతకాలంగా ప్రయాణికుల రాకపోకలు గణనీయంగా పెరిగాయి. అమెరికా, కెనడా వంటి దేశాలతో పాటు ఆస్ట్రేలియాకు సైతం విద్యార్థులు పెద్దసంఖ్యలో తరలి వెళ్తున్నారు. ఉన్నత చదువులు పూర్తి చేసుకొని అక్కడే ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. మరోవైపు వివిధ సంస్థల మధ్య వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు సైతం గణనీయంగా పెరిగాయి. దీంతో విద్యార్థులు, ఉద్యోగ, వ్యాపార వర్గాల రాకపోకలు, పర్యాటకుల రద్దీ అధికమైంది. అయితే హైదరాబాద్ నుంచి ఆస్ట్రేలియాకు నేరుగా విమాన సర్వీసులు అందుబాటులో లేకపోవడంతో కనెక్టింగ్ ఫ్లైట్లలోనే గంటల తరబడి ప్రయాణం కొనసాగించాల్సి వస్తోంది. మరోవైపు ట్రాన్సిట్ ఎయిర్‌పోర్టులలో కనెక్టింగ్ ఫ్లైట్ కోసం గంటల తరబడి పడిగాపులు కాయాల్సి స్తోంది.

### నాలుగేళ్లుగా పెరుగుతున్న రద్దీ...

'నాలుగేళ్ల క్రితం నాలుగైదు వేలమంది మాత్రమే హైదరాబాద్ నుంచి ఆస్ట్రేలియాకు రాకపోకలు సాగించారు. కానీ, ఇప్పుడు కనీసం లక్షన్నర మంది ప్రయాణిస్తున్నారు. ఈ నాలుగేళ్లలోనే ప్రయాణికుల రద్దీ, డిమాండ్ బాగా పెరిగాయి'అని సికింద్రాబాద్‌కు చెందిన కన్సల్టెన్సీ సంస్థ ప్రతినిధి ఒకరు తెలిపారు. హైదరాబాద్ నుంచి అత్యధిక మంది మెల్‌బోర్న్, సిడ్నీతోపాటు పెర్త్, అడిలాయిడ్ నగరాలకు కూడా రాకపోకలు సాగిస్తున్నారు. ఆస్ట్రేలియాలోని పలు నగరాల్లో రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు కూడా హైదరాబాద్ నగరానికి చెందిన వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు. ఎయిర్‌పోర్ట్ వర్గాల అంచనా మేరకు 2022లో హైదరాబాద్ నుంచి పెర్త్ నగరానికి 4,900 మంది ప్రయాణం చేస్తే, ఇప్పుడు ఆ సంఖ్య సుమారు 10 వేలకు చేరుకుంది. మెల్‌బోర్న్‌కు సుమారు 65 వేల మందికిపైగా, సిడ్నీ నగరానికి మరో 60 వేల మందికిపైగా ప్రయాణించారు. 2024లో సుమారు 1.5 లక్షల మంది ప్రయాణించినట్లు అంచనా. నేరుగా విమానాలు అందుబాటులోకి వస్తే ప్రయాణికుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ''హైదరాబాద్-ఆస్ట్రేలియాల మధ్య నేరుగా విమానాలను నడిపేందుకు కొన్ని సంస్థలు సిద్ధంగా ఉన్నాయి. వాటితో చర్చలు కొనసాగుతున్నాయి. త్వరలోనే అవి అందుబాటులోకి రావచ్చు''హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ అధికారి ఒకరు తెలిపారు.

### కనెక్టివిటీ తిప్పలు...

- ప్రస్తుతం హైదరాబాద్ నుంచి ఆస్ట్రేలియాకు నేరుగా విమాన సర్వీసులు లేకపోవడం వల్ల ఢిల్లీ, బెంగళూర్ నగరాల నుంచి బయలుదేరవలసి వస్తుంది.
- ఇప్పుడు హైదరాబాద్ నుంచి డైరెక్ట్ ఫ్లైట్స్ లేవు. ఢిల్లీ, బెంగళూర్ నగరాల నుంచి కనెక్టింగ్ ఫ్లైట్స్‌లో ప్రయాణించాల్సి వస్తోంది.
- ప్రస్తుతం మలేసియా, సింగపూర్, థాయ్‌లాండ్ తదితర దేశాల నుంచి బయలుదేరాల్సి వస్తోంది. దీంతో ప్రయాణ సమయం 16 గంటల నుంచి 17 గంటలకు పైగా ఉంది.
- కనెక్టింగ్ ఫ్లైట్ కోసం 2 నుంచి 4 గంటలు ఎదురుచూడాల్సి వస్తోంది.
- హైదరాబాద్ నుంచి నేరుగా విమానాలు అందుబాటులోకి వస్తే కేవలం 11 గంటల్లోనే చేరుకోవచ్చు. 5 నుంచి 6 గంటల ప్రయాణ సమయం తగ్గుతుంది.
- ప్రస్తుతం సింగపూర్ ఎయిర్‌లైన్స్, థాయ్ ఎయిర్‌వేస్, ఎయిర్ ఏసియా విమానాలు ఆస్ట్రేలియాకు సర్వీసులను నడుపుతున్నాయి.

# అందరివాడు వాజ్‌పేయి

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

కాచిగూడ: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి అజాత శత్రువుగా పేరు పొందారని, ఆయన అందరివాడని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి కొనియాడారు. వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా శనివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో వాజ్ పేయి చిత్రపటానికి కేంద్రమంత్రి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాజ్‌పేయి భారతదేశం గర్వించదగ్గ గొప్ప నేత అని, ఆయన దేశానికి ఎనలేని సేవలందించారని కొనియాడారు. అటల్ జీ బాటలోనే నరేంద్రమోదీ ప్రభుత్వం నడుస్తోందన్నారు. అటల్‌జీ వ్యక్తిత్వం దూరదృష్టి ప్రతి బీజేపీ కార్యకర్తకూ మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు డాక్టర్ ఎస్.గౌతంరావు, లంకల దీపక్ రెడ్డి, కన్నె ఉమా రమేష్ యాదవ్, వై.అమృత, ఎ.అజయ్‌కుమార్, కేశబోయిన శ్రీధర్, సి.నందకిషోర్ యాదవ్, ఎ.సూర్యప్రకాష్ సింగ్, చిట్టి శ్రీధర్, వనం రమేష్, సి.వినోద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ కార్యాలయంలో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

# సీఎం చెప్పినా అధికారులు వినట్లే..

**ఆర్.కృష్ణయ్య**



సమావేశంలో అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, వేముల రామకృష్ణ, నీల వెంకటేశ్

హిమాయత్‌నగర్: పెండింగ్‌లో ఉన్న రూ.8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించినప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. బకాయిల విడుదల కోసం ఈ నెల 20న కళాశాలలను బహిష్కరించి, విద్యార్థులతో కలిసి కలెక్టరేట్, ఆర్డీవో, ఎమ్మార్వో కార్యాలయాల వద్ద నిరసన తెలిపి వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల ఉద్యమాలను తక్కువ అంచనా వేయొద్దన్నారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో శనివారం తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బడ్జెట్‌లో విద్యకు కేటాయించిన సొమ్మును మంత్రులు మింగుతున్నారని ఆరోపించారు. కాంట్రాక్టర్లకు రూ.వేల కోట్లు బిల్లులు విడుదల చేస్తూ, 15 లక్షల విద్యార్థుల బకాయిల విషయంలో మాత్రం తీవ్ర జాప్యం చేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని విద్యార్థులకు, కాలేజీ యాజమాన్యాలకు న్యాయం చేయాలని కోరారు. అవినీతి ఐఏఎస్ అధికారులపై త్వరలో ప్రధాని మోదీకి ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ఫీజుల స్కీములు ఎత్తివేయడానికి 'ట్రస్ట్ బ్యాంకు'ఏర్పాటు చేసి దాని ద్వారా ఫీజులు చెల్లిస్తామని ప్రభుత్వం కొత్త నాటకానికి తెర లేపిందని ఆరోపించారు. ఈ ప్రతిపాదన ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమన్నారు. సమావేశంలో నాయకులు నీల వెంకటేష్, రామకృష్ణ, నంద గోపాల్, మోడీ రాందేవ్, కార్తీక్ పటేల్, కృష్ణ, గౌడ్, భరత్ గౌడ్, అభిరాం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలందరూ కాంగ్రెస్ వైపే..

- జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో మంత్రులు పొన్నం, తుమ్మల

వెంగళరావునగర్: రానున్న జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల కోసం ప్రత్యేకంగా నియమించిన చైర్మన్లు, బూత్ ఇన్‌చార్జీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజలంతా కాంగ్రెస్ వైపు ఉన్నారని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ మధురానగర్ బూత్ కమిటీ సమావేశం శనివారం వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని వెస్ట్ శ్రీనివాస్‌నగర్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో జరిగింది. మంత్రులు మాట్లాడుతూ ఈ ఎన్నికలు అధికార కాంగ్రెస్ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుందని, ఖచ్చితంగా జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయం సాధించి తీరాలని అన్నారు. ఇక్కడ కాంగ్రెస్ పార్టీకి ఎంతో ఆదరణ ఉందని పేర్కొన్నారు. బూత్ కమిటీ ఇన్‌చార్జీలు, చైర్మన్లు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోతోందని, ప్రజాపాలనను ప్రజలంతా మెచ్చుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు అజహరుద్దీన్, రహమత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎస్.రెడ్డి, అనిల్‌కుమార్, ఆర్.నాగేశ్వరరావు, రాఘవరెడ్డి, మనోజ్ యాదవ్, దేవిరెడ్డి నాగార్జునరెడ్డి, చిలకల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం. చిత్రంలో తుమ్మల, అజహరుద్దీన్ తదితరులు

## ఉత్సాహంగా వాలీబాల్ లీగ్ క్వాలిఫయర్ పోటీలు

హైదరాబాద్: ప్రైమ్ హైదరాబాద్ బ్లాక్ హాక్స్ వర్సిటీ వాలీబాల్ లీగ్ క్వాలిఫయర్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. శనివారం యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన క్వాలిఫయర్స్‌లో 32 బాలుర, 24 బాలికల జట్లు పాల్గొన్నాయి. ఇందులో గెలిచిన 12 బాలుర, 8 బాలికల జట్లు ప్రధాన పోటీలకు అర్హత సాధించాయి. ఈ నెల 22 నుంచి వచ్చే నెల 24వ తేదీ వరకు ఈ స్కూల్ లీగ్ జరగనుంది. క్వాలిఫయర్స్ ముగింపు వేడుకల్లో ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లోని హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టు యజమాని కంకణాల అభిషేక్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే ప్రతిభావంతులను గుర్తించి, వారిని తీర్చిదిద్ది ప్రైమ్ వాలీబాల్ లీగ్‌తోపాటు జాతీయ స్థాయిలో సత్తా చాటేలా చేయడమే లక్ష్యంగా ఈ స్కూల్ లీగ్‌ను ప్రారంభించామని అభిషేక్ చెప్పారు. కాగా, గాడియం, శ్రీనిధి, డీపీఎస్ నాచారం, నాదర్‌గుల్, పల్లవి, ఆగాఖాన్, చిరెక్, ఫ్యూచర్ కిడ్స్, సిల్వర్ ఓక్స్, ఇండస్ పాఠశాల జట్లుసహా 20 టీమ్‌లు ప్రధాన పోటీలకు అర్హత సాధించాయి.

## టెన్నిస్‌లో విజేతగా అహీల్



లక్డీకాపూల్: టెన్నిస్ నేషనల్ సిరీస్ అండర్-12 టోర్నమెంట్‌లో నగరానికి చెందిన అహీల్ విజేతగా నిలిచాడు. శనివారం శామీర్‌పేటలోని ఆష్ టెన్నిస్ అకాడమీలో ఈ పోటీలు జరిగాయి. ఇందులో అహీల్ గుజరాత్‌కు చెందిన రియాన్ నందన్కర్‌ను 6-1, 7-5 తేడాతో ఓడించాడు. కాగా, ఇటీవల ఒడిశాలోని కళింగ స్టేడియంలో టాబ్ ఏఐటీఏ-ఓటీఏ చాంపియన్‌షిప్ సిరీస్(సీఎస్7) పోటీల్లో ఎస్ 7 యు 14 విభాగంలో అహీల్ బెంగుళూర్‌కు చెందిన నమన్ సరూప్‌ను 7.5, 6.4 తేడాతో ఓడించాడు.

## ఉప్పల్‌లో ఫ్లెక్సీ కలకలం





పిల్లర్‌కు కట్టిన ఫ్లెక్సీ

ఉప్పల్: ఉప్పల్‌లో వరంగల్ జాతీయ రహదారి ఎలివేటెడ్ కారిడార్ పిల్లర్‌కు గుర్తు తెలియని వ్యక్తి కట్టిన ఫ్లెక్సీ శనివారం ఉప్పల్‌లో తీవ్ర కలకలం సృష్టించింది. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఫొటోలకు దండం పెడుతూ 'దయచేసి ఈ ఉప్పల్ రోడ్డు వేయగలరు'అని ఉన్న ఫ్లెక్సీని పిల్లర్‌కు కట్టి ఉంది. స్థానికంగా ఈ ఫ్లెక్సీ చర్చనీయాంశంగా మారింది. రోడ్డుపై అటుగా వచ్చే వారంతా ఫ్లెక్సీ చూస్తూ, ఫొటోలు తీసుకుంటూ వెళ్లున్నారు.

# ఘనంగా 'వైద్యగర్జన' ఆత్మీయ సమ్మేళనం

సుల్తాన్‌బజార్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉస్మానియా మెడికల్ కాలేజ్-2005 బ్యాచ్‌కు చెందిన వైద్య విద్యార్థులు 2010లో వైద్యగర్జన ద్వారా తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోశారని తెలంగాణ మెడికల్ జేఏసీ చైర్మన్ డాక్టర్ బొంగు రమేశ్ అన్నారు. వైద్యగర్జన జ్ఞాపకాలను స్మరించుకుంటూ శనివారం ఉస్మానియా వైద్య కళాశాల ఆడిటోరియంలో వైద్యగర్జన ఆత్మీయ సమ్మేళన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెడికల్ జేఏసీ చైర్మన్ డాక్టర్ బొంగు రమేశ్, ప్రత్యేక అతిథిగా టీపీహెచ్‌బీఏ రాష్ట్ర అధ్యక్షుడు కత్తి జనార్దన్ హాజరై తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అతిథులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉద్యమంలో మరుపురాని సన్నివేశాలను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ విధులకు ఆటంకం కలిగించకుండానే రాష్ట్ర సాధన పోరాటాల్లో వైద్యులు పాల్గొన్నారని అన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణంలోనూ అదే స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉస్మానియా వైద్య కళాశాల విద్యార్థులు, ఉద్యమ నాయకులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



తెలంగాణ ఉద్యమకారులను సన్మానిస్తున్న డాక్టర్ కిరణ్ తదితరులు

# మావోయిస్టు పార్టీపై నిషేధం ఎత్తేయాలి

**సీపీఐ (ఎంఎల్, చంద్ర పుల్లారెడ్డి) కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్**



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: మావోయిస్టు పార్టీపై నిషేధం ఎత్తేసి, వారితో శాంతి చర్చలు జరపాలని సీపీఐ (ఎంఎల్, చంద్ర పుల్లారెడ్డి) కేంద్ర కమిటీ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో శనివారం ఏర్పాటు చేసిన ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక రాష్ట్ర కన్వీనర్ చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీలను నక్సల్స్ పేరిట బూటకపు ఎన్‌కౌంటర్లలో చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు విధించిన నిషేధాన్ని ఎత్తివేసి వారితో శాంతిచర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ నెల 24న వరంగల్‌లో జరగనున్న పార్టీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం సభా పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో నాయకులు సుధాకర్, షేక్ షావలి, సంపంగి పద్మక్క, సునీత, సంతోష్ నాయక్, సత్యవర్ధన్, సైదులు, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా యూసీఎంఏఎస్ పోటీలు

- దేశం నలుమూలల నుంచి వచ్చిన చిన్నారులు, తల్లిదండ్రులు
- కిటకిటలాడిన జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియం

రాయదుర్గం: దేశంలో అతిపెద్ద మెంటల్ అర్థమెటిక్స్ ప్రదర్శనల్లో ఒకటైన 24వ యూసీఎంఏఎస్ నేషనల్ కాంపిటీషన్-2025 శనివారం ఘనంగా ప్రారంభమైంది. వేలాది మంది చిన్నారులు తరలివచ్చారు. చిన్నారులు, వారి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులతో గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగిస్టేడియం సందడిగా మారింది. దేశవ్యాప్తంగా 6 నుంచి 13 ఏళ్లలోపు 6 వేల మంది విద్యార్థులు పోటీలో పాల్గొనగా, దక్షిణ భారత దేశం నుంచి 2,500 మందికిపైగా తరలి రావడం గమనార్హం. ఈ పోటీలు ఆదివారం కూడా కొనసాగనున్నాయి. ప్రథమ రౌండ్ నుంచే విద్యార్థులు క్షణాల్లో క్లిష్ట గణనలను అద్భుత వేగం, ఖచ్చితత్వంతో పరిష్కరించగా, తల్లిదండ్రులు అభినందనలు తెలుపుతూ ప్రోత్సహించారు. చిన్నారుల అసాధారణ ప్రతిభను సందర్శకులు ఆశ్చర్యంతో వీక్షించారు. ఈ పోటీలో ప్రధాన ఆకర్షణగా అబాకస్(మెంటల్ అర్థమెటిక్స్) నిలిచింది. ఇది కేవలం గణితపరంగా కాకుండా ఏకాగ్రతను పెంపొందించడం, జ్ఞాపకశక్తికి పదును పెట్టడం, వినికిడి నైపుణ్యాలను బలోపేతం చేయడం.. మొత్తంగా మెదడు సామర్థ్యాన్ని పెంపొందించడం ద్వారా పిల్లలకు జీవితాంతం సహకరించే నైపుణ్యాలను అందిస్తుంది.



యూసీఎంఏఎస్ జాతీయ స్థాయి పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

### ఇది మేధస్సు పండుగ..

- యూసీఎంఏఎస్ ఇండియా సీఈఓ, అధ్యక్షుడు డాక్టర్ స్నేహల్ కారియా యూసీఎంఏఎస్ పోటీలు మాత్రమే కాదని, ఇది మేధస్సు పండుగ అని యూసీఎంఏఎస్ ఇండియా సీఈఓ, అధ్యక్షుడు డాక్టర్ స్నేహల్ కారియా అన్నారు. యూసీఎంఏఎస్ జాతీయ స్థాయి పోటీలు-2025ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో యూసీఎంఏఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ క్రిస్‌చ్యూ, అధికారులు, ప్రతినిధులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

# అశ్రునయనాల మధ్య డీజీపీ మాతృమూర్తికి అంత్యక్రియలు

రాయదుర్గం: రాష్ట్ర డీజీపీ జితేందర్ మాతృమూర్తి కృష్ణగోయల్ భౌతికకాయానికి అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య శనివారం రాయదుర్గంలోని వైకుంఠ మహాప్రస్థానంలో అంత్యక్రియలను నిర్వహించారు. ఆమె నగరంలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. ఆమె మృతి పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, పోలీసు అధికారులు సంతాపం ప్రకటించారు. అంత్యక్రియల్లో సీనియర్ పోలీసు అధికారులు బి.శివధర్‌రెడ్డి, మహేష్ భగవత్, కమలాసన్‌రెడ్డి ఏకే మహంతి, రవిగుప్తా, సందీప్ శాండిల్య, నాగిరెడ్డి, విజయకుమార్, తరుణ్‌జోషి, ఏఆర్ శ్రీనివాస్, సత్యనారాయణ, విశ్రాంత పోలీసు సీనియర్ అధికారి మహేందర్‌రెడ్డి, సైబరాబాద్ పోలీసు అధికారులు, బంధువులు, స్నేహితులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# పోటెత్తి.. పోటీ పడి..

**వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు**

బంజారాహిల్స్: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్‌కు భక్తులు పోటెత్తారు. నగర నలుమూలల నుంచి భారీగా తరలివచ్చారు. స్వామివారు భక్తులకు రాధాగోవింద, శ్రీ గోదా గోవింద, శ్రీ లడ్డూ గోపాల్‌గా దర్శనమిచ్చారు. స్వామివారి ఝూలన్ సేవలో పాల్గొనేందుకు భక్తులు పెద్ద ఎత్తున పోటీ పడ్డారు. స్వామివారికి ఉదయం నుంచి రాత్రి వరకు విశేష అర్చనలు జరిగాయి. శ్రీ రాధాగోవిందులకు రోజు పొడవునా నాలుగు విస్తృత అభిషేకాలను హరేకృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ అధ్యక్షుడు సత్యగౌర చంద్రదాస ప్రభూజీ నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో బంజారాహిల్స్ దారులన్నీ వాహనాలతో కిక్కిరిసిపోయాయి.



గోల్డెన్ టెంపుల్‌లో కృష్ణాష్టమి సందర్భంగా అభిషేకం చేస్తున్న దృశ్యం, తరలివచ్చిన భక్తులు

# నిర్మాత తుమ్మలపల్లికి ఘన సత్కారం

బంజారాహిల్స్: శతాధిక చిత్రాల నిర్మాత తుమ్మలపల్లి సత్యనారాయణ అరుదైన ఘనతను సాధించారు. ఒకే రోజు 15 చిత్రాలకు, 15 దర్శకులతో క్లాప్ కొట్టించి నిర్మాణం ప్రారంభించి, తొమ్మిది ప్రపంచ రికార్డుల గుర్తింపు పొందిన ఆయనను పలు అంతర్జాతీయ సంస్థలు అభినందించాయి. సమీకృత అంతర్జాతీయ తెలుగు సాంస్కృతిక సంఘం, వంశీ ఇంటర్నేషనల్, ఫాస్ ఫిలిం సొసైటీ, ఇట్మా, హర్ ఆర్ట్ గ్యాలరీ సంస్థలు సన్మానించాయి. సంస్థల అధినేతలు సంస్కృతిరత్న డాక్టర్ కె.ధర్మారావు, శిరోమణి డాక్టర్ వంశీ రామరాజు, హీరో సుమన్ తోపాటు వేలాది సినీ అభిమానుల సమక్షంలో ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, నిర్మాత, దర్శకుడు అంబికా కృష్ణ చేతుల మీదుగా తుమ్మలపల్లి సత్యనారాయణకు 'మూవీ మహరాజ్' బిరుదుతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.



నిర్మాత తుమ్మలపల్లి సత్యనారాయణను సత్కరిస్తున్న సాంస్కృతిక సంస్థల అధినేతలు

# దిగుమతులు తగ్గి.. ధరలు పెరిగి..

- వర్షాలకు దెబ్బతిన్న కూరగాయల పంటలు
- నగర మార్కెట్లలో చుక్కలనంటుతున్న ధరలు



సాక్షి, సిటీబ్యూరో: వరుస వర్షాలకు నగర మార్కెట్లు కుదేలవుతున్నాయి. కూరగాయల దిగుమతులు భారీగా తగ్గాయి. కూరగాయల ధరలు అమాంతం పెరిగాయి. రెండు, మూడు రోజులుగా హైదరాబాద్ శివారు జిల్లాలతోపాటు ఇతర జిల్లాల్లో కురుస్తున్న వర్షాలకు భారీగా పంట నష్టం ఏర్పడింది. వరదనీట పంటలు మునిగిపోయాయి. దీంతో నగరానికి కూరగాయల దిగుమతులు భారీగా తగ్గాయని మార్కెట్ అధికారుల చెప్తున్నారు. గ్రేటర్ శివారు జిల్లాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా నగర మార్కెట్లకు కూరగాయల దిగుమతులు డిమాండ్‌కు తగ్గట్టుగా కావడం లేదని మార్కెట్ అధికారులు అంటున్నారు. కొద్ది మొత్తంలో ఉన్న కూరగాయలకు డిమాండ్ పెరగడంతో వ్యాపారులు ధరలు పెంచేశారు. టమాటా కిలో రూ. 50-60, బీన్నీస్ రూ. 120, మిగతా కూరగాయల ధరలు రూ. 60-80 వరకు పలుకుతున్నాయి.

**డిమాండ్ ఎక్కువ.. దిగుమతులు తక్కువ**

మార్కెట్‌కు కావాల్సిన కూరగాయల దిగుమతులు లేవు. రోజూ వంద శాతం వివిధ రకాల కూరగాయలు దిగుమతి అయితే నాలుగైదు రోజుల నుంచి 50-60 శాతం మాత్రమే నగర హోల్‌సెల్ మార్కెట్‌లకు వచ్చినట్లు మార్కెటింగ్ శాఖ రికార్డులు చెబుతున్నాయి. వానతో బోయిన్‌పల్లి మార్కెట్‌కు శనివారం కేవలం 12 వేల క్వింటాళ్లు, గుడిమల్కాపూర్‌కు 5 వేల క్వింటాళ్ల కూరగాయలు దిగుమతి అయ్యాయి. సాధారణరోజుల్లో బోయిన్‌పల్లిలో మార్కెట్‌కు 32 వేల క్వింటాళ్లు, గుడిమల్కాపూర్‌కు 16 వేల క్వింటాళ్లు దిగుమతి అవుతాయి.


# సాధనతోనే అనుకున్న లక్ష్యాలు సాధ్యం

బ్యాడ్మింటన్ చాంపియన్ పీవీ సింధు




సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ వేదికలపై దేశ యువత ఎక్కువ పతకాలు సాధించాలని ప్రముఖ బ్యాడ్మింటన్ చాంపియన్ పీవీ సింధు అన్నారు. జూబ్లీహిల్స్‌లోని జీవీకే హెల్త్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల పట్ల ఆసక్తి ఉన్న వారు ప్రారంభం నుంచే ఒక క్రమపద్ధతిలో సాధన చేస్తే, అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని అన్నారు. మానసికంగా, శారీరకంగా ఫిట్నెస్ అనేది ప్రతి ఒక్కరికీ అవసరమన్నారు. యువతలో ఎక్కువ మందికి క్రికెట్‌పై క్రేజ్ ఉందని, తరువాతి స్థానంలో బ్యాడ్మింటన్ నిలుస్తోందన్నారు. దేశంలో యువ జనాభా సంఖ్య, ఒలింపిక్స్‌లో మెడల్స్ రేషియో చూస్తే మనం వెనుకబడి ఉన్నామనే విషయాన్ని స్పష్టం చేస్తుందన్నారు. క్షేత్ర స్థాయిలో క్రీడల పట్ల స్పష్టమైన పాలసీ అవసరమని, సరైన శిక్షణతోనే దీన్ని అధిగమించవచ్చని తెలిపారు. 'త్వరగా గుర్తించండి, ఆరోగ్యంగా ఉండండి' అనే నినాదంతో ఫ్రీడం ఆఫ్ గుడ్ హెల్త్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. జీవీకే డైరెక్టర్ కేశవ్, వీణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.







ఇటీవల కురుస్తున్న వర్షాలకు నగరంలోని జలాశయాలు నిండుకుండలను తలపిస్తున్నాయి. దీంతో ఔత్సాహిక హాబీ ఫిషర్స్‌తో పలు ప్రాంతాలు జోష్ నింపుకున్నాయి. నగరంలోనూ పలు దుకాణాల్లో ఫిషింగ్ సరంజామా కోసం వారాంతాల్లో సందడి నెలకొంది. దీంతో చెరువులు, సరస్సుల బాట పట్టిన నగర వాసుల కోసం పలు చోట్ల అధికారులు ఏర్పాట్లు చేశారు. ఫిష్ గేమ్ సీజన్ కోసం సిద్ధమైన పలువురు ఔత్సాహికులు ఏకాగ్రత, ఓర్పు, సహనం పెంపొందించుకునేందుకు ఈ హాబీ ఎంతగానో దోహదపడుతుందని చెబుతున్నారు.

- సాక్షి, సిటీబ్యూరో

# ఆటవిడుపునకు ఆలవాలం.. గాలం..

## నగరంలోని జలాశయాల్లో ఫిషింగ్ జోష్..

| | | | |
|---|---|---|---|
| వర్షాల జోరుతో మరింత ఉత్సాహంగా | ఫిషింగ్ సరంజామాతో వారాంతాల్లో సందడి | ఔత్సాహికుల కోసం పలు చోట్ల ప్రత్యేక ఏర్పాట్లు | చెరువులు, సరస్సుల బాట పట్టిన నగరవాసులు |

ఏకాగ్రత, ఓర్పు, సహనం పెంపొందించే హాబీ


నగర పురాతన కళాభిరుచిలో చేపలు పట్టడం ఒకటి. వారాంతాల్లో లేదా సెలవు దినాల్లో నీటి వనరులు పుష్కలంగా ఉన్న ప్రదేశాలు చేపల వేట కోసం తరలివచ్చే సమూహాలతో నిండి ఉంటాయి. వ్యాపారులు, సంపన్నుల నుంచి ఉద్యోగులు, విద్యార్థుల వరకూ ఈ అభిరుచిని ఓ హాబీగా భావిస్తారు.

### వేట...బాట...

చేపల వేట కోసం హుస్సేన్ సాగర్, హిమాయత్ సాగర్ బ్యాక్ వాటర్స్ వంటి ప్రదేశాలను ఎంచుకుంటున్నారు పలువురు ఔత్సాహికులు. పొడవాటి కర్ర, నైలాన్ లైన్, పదునైన హుక్, ఎర కోసం వానపాములే ఆయుధాలుగా వేట సాగుతుంటుంది. చేపల్ని పట్టడంలో నైపుణ్యం పెరిగేకొద్దీ, వారికి అవసరమైన పరికరాలు కూడా పెరుగుతాయి. 'హుస్సేన్ సాగర్‌లో చిన్నప్పుడు వేట ప్రారంభించాను.. అప్పటి నుంచి హైదరాబాద్ చుట్టూ ఉన్న దాదాపు ప్రతి సరస్సులోనూ చేపలు పట్టాను. నా జీవితంలో నేను పట్టిన అతి పెద్ద చేప మంజీరలో ఏడు కిలోల ముర్రెల్ అలాగే ఇటీవల కొడైకెనాల్‌లో ట్రౌట్'. అంటూ నాలుగు దశాబ్దాలకు పైగా హాబీగా చేపలుపడుతున్న నగరవాసి జాన్ విక్టర్ పాల్ గుర్తుచేసుకున్నారు. విక్టర్ తరచూ తోటి ఔత్సాహికులైన జాఫ్రీ ఖాన్, భరత్ రెడ్డి, జునైద్ ఫరూకీ మార్క్ క్యాంపస్‌లతో కలిసి వెళతాడు. 'మా సామానులో ఎక్కువ భాగం షిమనో అబు గార్సియా రీల్స్. ఒకప్పుడు అమెరికాలో మాత్రమే అందుబాటులో ఉండేవి. కానీ ఇప్పుడు నగరంలోని అంతర్జాతీయ స్పోర్ట్స్ స్టోర్‌లలో కూడా అందుబాటులో ఉన్నాయి' అని ఆయన చెప్పారు.

### అవకాశాలు తగ్గుతున్నా.. అభిరుచి ఆగేనా?

ఒకప్పుడు తెలంగాణ 7,000కి పైగా సరస్సులను కలిగి ఉండేది. ఇప్పుడు ఆ సంఖ్య దారుణంగా పడిపోయింది. అందువల్ల హాబీ ఫిషర్స్‌కు అవకాశాలు తగ్గిపోయాయి. హుస్సేన్ సాగర్‌తో పాటు హిమాయత్‌సాగర్, ఉస్మాన్ సాగర్, ఫాక్స్‌సాగర్, ఎదులాబాద్, పీర్జాదిగూడ, రాంపల్లి, షామీర్‌పేట, దేవరాయంజల్, తూముకుంట నార్సింగి సరస్సుల్లో ఈ తరహా వేట బాగా సాగేదని వీరు గుర్తుచేసుకుంటారు. కొన్ని సరస్సులను ఫిషింగ్ సహకార సంస్థలకు లీజుకు ఇవ్వడం వల్ల అక్కడ వేటను అధికారికంగా నిషేధించారు. హాబీ జాలర్ల ఉత్సాహాన్ని గుర్తించి, మత్స్య శాఖ షామీర్‌పేట సరస్సులో పైలట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. 'ఏళ్లు గడిచేకొద్దీ చేపలు పట్టడం అనే హాబీ కొంత సన్నగిల్లినా.. ప్రస్తుతం మళ్లీ ఊపందుకుంటోంది. దీనికి ప్రోత్సాహాన్ని అందించేందుకు కుటుంబ సమేతంగా ఈ అభిరుచిని ఆస్వాదించడానికి వీలుగా షామీర్‌పేట చెరువును అభివృద్ధి చేయనున్నాం. దీని కోసం సుమారు రూ.2 కోట్లు ఖర్చు చేస్తున్నాం' అని మత్స్య శాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్ తెలిపారు.



### ధ్యానం లాంటిదే...

'కొత్త తరం ఫిషింగ్ హాబీ అలవర్చుకోవాలి. చాలామంది కాలేజీ విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు నన్ను సంప్రదించి నాతో పాటు ఫిషింగ్‌కు వస్తున్నారు. నేను వారికి ఫిషింగ్ రీల్ వాడటం, వేర్వేరు రకాల నీళ్లలో ఎలా చేపలు పడతారు వంటి పద్ధతులు నేర్పిస్తున్నా. ఇది మనసుకు చక్కని విశ్రాంతినిచ్చే హాబీ. ధ్యానం లాగే ఫిషింగ్ మనకు ఏకాగ్రత, సహనం నేర్పుతుంది.

- జాన్ విక్టర్ పాల్

'నలభై సంవత్సరాల తర్వాత కూడా వారాంతాల్లో ఇప్పటికీ ఇదే నా మొదటి ఎంపిక. ప్రతి జాతి, సీజన్ స్థానాన్ని బట్టి విధానాలు మారుతూ ఉంటాయి. అది ఈ అనుభవం తాలూకా ఆనందాన్ని మరింత పెంచుతుంది.' అని సికింద్రాబాద్‌కు చెందిన లిన్ డిసిల్వా అంటున్నారు. నగరంలో అనేక సరస్సులు మాయమైనా, ఇప్పుడు విశాలమైన కొత్త రోడ్లు హాబీ హంటర్స్‌కు కొత్త మార్గాలను దగ్గర చేస్తున్నాయి. ఒక గంట డ్రైవ్‌లో ప్రధాన నదులు, జలాశయాలకు చేరుకోగలుగుతున్నారు. కొందరు శ్రీశైలం, నాగార్జునసాగర్ మధ్య పడవలను అద్దెకు తీసుకుంటారు. లేదా సరైన ప్రదేశం కోసం చిన్న పడవలతో కూడా తెడ్డు వేస్తారు. చేపలు పట్టడానికి ఎన్నారైలు సైతం ఉత్సాహం చూపిస్తున్నారు.'ఏకాగ్రత, ఓర్పు ప్రకృతిలో స్వచ్ఛమైన ఆనందాన్ని అనుభవించాడ్ని నేర్పిస్తుంది ఫిషింగ్. నగరం మారవచ్చు, కానీ నీళ్లు, చేపలు ఉన్నంత వరకూ ఈ అభిరుచికి అంతం ఉండదు అంటున్నారు హాబీ జాలర్లు.

### ఇప్పటికీ ఇదే మొదటి ఎంపిక..

### వంశ పారంపర్యంగా..

'చిన్నప్పుడు మా నాన్నతో కలిసి కావేరి నదిలో చేపలు పట్టేవాడిని. ఆ తర్వాత కొంతమంది స్నేహితులను కలుపుకొని నగర చెరువుల్లో చేపలు పట్టడం ప్రారంభించా. నా పిల్లలు చిన్నప్పటి నుంచి నాతో కలిసి ఫిషింగ్‌కు వచ్చేవారు.

- అనంత కుమార్ మోహెల్



### ఫిషింగ్ హాబీకి ప్రోత్సాహం..



నగరవాసుల్లో ఫిషింగ్ హాబీ వయసుకు అతీతంగా పెరిగింది. శామీర్‌పేట్, బీబీ నగర్, గండిపేటతో పాటు జనగాం వంటి ప్రాంతాలకూ నగరం నుంచి ఫిషింగ్ కోసం వెళ్తున్నారు. మా వంతు ప్రయత్నంగా ఈ హాబీని ప్రోత్సహిస్తున్నాం. శామీర్‌పేట్, బీబీ నగర్ చెరువులను మరింతగా అభివృద్ధి చేస్తున్నాం.

- మెట్టు సాయి కుమార్, మత్స్య శాఖ చైర్మన్



# చేనేత సిరి.. శారీ

## నేత ఉత్పత్తులకు మద్దతుగా నేడు 'శారీ వాక్'

సాక్షి, సిటీబ్యూరో : భారతీయ చేనేత సొగసును, సంస్కృతి విలువను చాటే ప్రత్యేకమైన 'శారీ వాక్' ఆగస్టు 17న ఉదయం 6 గంటలకు జరగనుంది. కూకట్‌పల్లి జేఎన్టీయూ క్యాంపస్ నుంచి ప్రారంభమై ఫోరమ్ మాల్ వరకూ మహిళామూర్తులు చేనేత చీరలతో పాదయాత్ర చేస్తారు. 'చేనేత వస్త్రాన్ని ధరించడం కేవలం సంప్రదాయమే కాదు, కార్మికుల చెమట చుక్కలకు, వారిలోని కళాత్మక దృష్టికి ఇచ్చే గౌరవం అని తెలిపారు. ఈ శారీ వాక్‌లో ప్రతి ఒక్కరూ పాలు పంచుకుంటే, చేనేత పరిశ్రమకు బలమైన మద్దతు లభిస్తుందని ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్ ప్రజలకు పిలుపునిచ్చారు. మన సంస్కృతి నిలవాలంటే చేనేత నిలవాలని కొనియాడారు.



# హస్తకళా సూత్రం..

- సందర్శకులను ఆకట్టుకుంటున్న ఉత్పత్తులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో సూత్ర ది ఇండియా ఫ్యాషన్ ఎగ్జిబిషన్ శనివారం ప్రారంభమైంది. ఫెస్టివ్ ఎడిషన్‌లో ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్ మూడు రోజుల పాటు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. దేశ వ్యాప్తంగా 100 మందికి పైగా డిజైనర్లు, హస్త కళాకారులు, వారు రూపొందించిన ఉత్పత్తులు, డిజైనరీ ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శిస్తారని తెలిపారు. ముఖ్యంగా కంచి చీరలు, భారతీయ సిల్‌హౌట్స్, ఎథ్నిక్ ఎలిగెన్స్, యాంటిక్ జర్మన్ సిల్వర్, డిజైనరీ కలెక్షన్స్ ప్రత్యేకతను చాటుకుంటున్నాయని తెలిపారు



# సిక్కిం షోయగం..

బేగంపేట కంట్రీక్లబ్‌లో అలరించిన సంప్రదాయ ఫ్యాషన్ షో

సనత్‌నగర్ : బేగంపేటలోని కంట్రీక్లబ్‌లో సిక్కిం సంప్రదాయ, సాంస్కృతిక వారసత్వం నుంచి స్ఫూర్తి పొందిన వస్త్రధారణతో నిర్వహించిన ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. సిక్కిం వేషధారణలో మోడల్స్ ర్యాంప్‌పై తళుక్కుమన్నారు. సంగీతం, నృత్యాలు వారి సంస్కృతిని ప్రతిబింబించాయి. కంట్రీక్లబ్ హాస్పిటాలిటీ అండ్ హాలిడేస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్‌రెడ్డి 'వీఐపీ గోల్డ్ మెంబర్‌షిప్ కార్డు'ను బేగంపేటలోని కంట్రీక్లబ్‌లో శనివారం ఆవిష్కరించారు. తమ కార్యకలాపాలను తొలిసారి సిక్కింలోని గ్యాంగ్‌టక్ నగరానికి విస్తరించినట్లు ప్రకటించారు. ప్రీమియం హాలిడే అనుభవాలను పర్యాటక ప్రియులకు అందించేందుకు, దేశవ్యాప్తంగా విస్తృత సేవలను అందిస్తున్నట్లు, స్థానిక సాంస్కృతిక విలువలను గౌరవిస్తూ సమకాలీన వినోదానికి నూతన రూపు ఇస్తోందని తెలిపారు. రూ.5 లక్షలకుపైగా సభ్యులతో, సీసీహెచ్‌హెచ్ఎల్ 2029 నాటికి ఒక మిలియన్‌కు చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ద్వారా గుర్తింపు పొందిన తమ క్లబ్స్‌లో క్లబ్బింగ్, ఫిట్‌నెస్, ఎంటర్‌టైన్‌మెంట్ వంటి అంశాల్లో అత్యుత్తమ సేవలను అందిస్తుందన్నారు. కర్ణాటకలోని బందీపూర్‌లో వైల్డ్ లైఫ్ రిసార్ట్, కేరళలోని కోవలం బీచ్ రిసార్ట్, హైదరాబాద్‌లోని హోటల్ అమృత కాజిల్ సహా అంతర్జాతీయ పర్యాటక వృద్ధికి దోహదపడే అంశాలను వివరించారు. దేశవ్యాప్తంగా తమ క్లబ్స్‌లో పికిల్‌బాల్ కోర్టులను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ క్రీడ అన్ని క్లబ్‌లో అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు వివరించారు.








# మిల్లెట్ సమ్మిట్

## నగర వేదికగా మూడు రోజుల పాటు నిర్వహణ

- 18 రాష్ట్రాల నుంచి ఔత్సాహికులు హాజరు
- మిల్లెట్ ఆధారిత ఉత్పత్తుల తయారీపై అవగాహన

సాక్షి, సిటీబ్యూరో: నగర వేదికగా మూడు రోజుల పాటు జరగనున్న నేషనల్ మిల్లెట్ స్టార్టప్ సమ్మిట్ –2025 శనివారం ఘనంగా ప్రారంభమైంది. మాదాపూర్‌లోని మినర్వా హాల్స్‌లో ప్రారంభమైన ఈ సమ్మిట్‌లో 18 రాష్ట్రాల నుంచి 120 మంది ఔత్సాహికులు మిల్లెట్ ఆధారిత ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్ వంటి అంశాలపై జరిగిన చర్చలో పాల్గొన్నారు. ఆధునిక కాలంలో ఆరోగ్యానికి పెరుగుతున్న ప్రాధాన్యత, ప్రస్తుత జీవన శైలిలో మిల్లెట్ల పాత్రపై మిల్లెట్స్ నేషనల్ మీడియా పోర్టల్ చైర్మన్ ప్రసన్న శ్రీనివాస్ అవగాహన కల్పించారు. మిల్లె ఆధారిత ఉత్పత్తుల వ్యాపారం, వృద్ధి తదితర అంశాలపై అవగాహన కల్పించడమే ఈ వేదిక లక్ష్యమని తెలిపారు.

### 50కి పైగా ఉత్పత్తులు..

మిల్లెట్స్‌తో మొత్తం 50 కంటే ఎక్కువ ఉత్పత్తుల తయారీ విధానాలపై ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. ఇందులో ఇన్‌స్టాంట్ బ్రేక్‌ఫాస్ట్, పొడులు, లడ్డూ, నూడుల్స్, దోశ మిశ్రమాలు, మిల్లెట్ మాల్ట్, పొంగల్ మిక్స్ వంటి ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ సమ్మిట్‌లో హెచ్ఎన్ఏ కౌన్సిల్‌కు చెందిన 100 మంది వైద్యులు మిల్లెట్ ఆధారిత పోషకాహారంపై సలహాలు అందిస్తారు. ప్రముఖ సాంకేతిక నిపుణులు జగన్నాథ్ చినారి మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు విధానంపై శిక్షణ ఇవ్వనున్నారు. వ్యాపార రిజిస్ట్రేషన్, చట్టపరమైన సలహాలను ఐబీఎల్‌సీఎస్ నిపుణులు అందివ్వనున్నారు.




### అర్బన్ డైనింగ్‌లో..

లైఫ్‌స్టైల్ కోణంలో చూస్తే, మిల్లెట్ వంటకాలు కేవలం గ్రామీణ ఆహారమే కాకుండా, అర్బన్ డైనింగ్‌లోనూ ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. హైదరాబాదులో ప్రారంభమవుతున్న 40 ప్రీమియం మిల్లెట్ స్టోర్లు, గ్రామీణ స్థాయిలో ఏర్పాటైన 100 మైక్రో స్టోర్లు ఈ ఆరోగ్యకర ఆహారాన్ని అందరికీ చేరువ చేస్తున్నాయి. మిల్లెట్ టీ, మిల్లెట్ వైన్ వంటి కొత్త ఉత్పత్తులు త్వరలో మార్కెట్‌లోకి రానున్నాయి.

# పోటెత్తిన గోదావరి


వరద జలాలతో జలకళ సంతరించుకున్న ఎస్సారెస్పీ


కడెం ప్రాజెక్టు గేట్ల నుంచి దిగువకు పరవళ్లు తొక్కుతున్న వరద

- భారీ వర్షాలతో ఎగువ ప్రాంతంలోనూ భారీ వరద
- ఇప్పటికే పోటెత్తుతున్న దిగువ గోదావరి ప్రాంతం
- రెండురోజుల్లో పూర్తిగా నిండనున్న జైక్వాడ్ రిజర్వాయర్
- సింగూరు ప్రాజెక్టుకు 31,412 క్యూసెక్కుల వరద
- నిజాంసాగర్‌కు 31,500 క్యూసెక్కుల ప్రవాహం
- శ్రీరాంసాగర్‌కు 1.04 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- కడెంకు 1.33 లక్షలు, ఎల్లంపల్లికి 2.15 లక్షల క్యూసెక్కుల వరద
- నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా కొనసాగుతున్న పంపింగ్
- త్వరలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌కు నీటి పంపింగ్

సాక్షి, హైదరాబాద్/బాల్కొండ/నిర్మల్/రామగుండం: నైరుతి రుతుపవనాలు దేశంలోకి ప్రవేశించిన రెండున్నర నెలల తర్వాత ఎట్టకేలకు ఎగువ గోదావరి నది పోటెత్తింది. పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో సింగూరు ప్రాజెక్టు నుంచి శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు వరకు గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువన మహారాష్ట్రలో ఉన్న జైక్వాడ్ ప్రాజెక్టు గరిష్ట నిల్వ సామర్థ్యం 102.73 టీఎంసీలు కాగా, శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి 6,738 క్యూసెక్కుల వరద వస్తుండడంతో 97.29 టీఎంసీలకు చేరింది. రెండు మూడు రోజుల్లో జైక్వాడ్ నిండితే గోదావరి ప్రధాన పాయ ద్వారా తెలంగాణలోకి వచ్చే వరద ప్రవాహం మరింత పెరగనుంది.

### రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్లకు వరద

రాష్ట్రంలో మంజీర నదిపై నిర్మించిన సింగూరు ప్రాజెక్టుకు 31,412 క్యూసెక్కుల వరద వస్తుండగా, 21.34 టీఎంసీల నిల్వను కొనసాగిస్తూ 43,634 క్యూసెక్కులను కిందికి విడుదల చేస్తున్నారు. సింగూరు ప్రాజెక్టు గరిష్ట నిల్వ సామర్థ్యం 29.91 టీఎంసీలు అయినప్పటికీ డ్యామ్ భద్రతపై డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్ (డీఎస్‌ఆర్‌పీ) హెచ్చరికల నేపథ్యంలో నిల్వను 21 టీఎంసీలకు మించకుండా చర్యలు తీసుకుంటున్నారు. దిగువన ఉన్న నిజాంసాగర్ గరిష్ట నిల్వ సామర్థ్యం 17.8 టీఎంసీలు కాగా, 31,500 క్యూసెక్కుల వరద వస్తుండడంతో నిల్వలు 9.22 టీఎంసీలకు చేరాయి. గోదావరి ప్రధాన పాయపై ఉన్న శ్రీరాంసాగర్ గరిష్ట నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా, ప్రాజెక్టుకు 1.04 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండడంతో నిల్వలు 54.63 టీఎంసీలకు పెరిగాయి. కడెం నదిపై నిర్మించిన కడెం ప్రాజెక్టు సామర్థ్యం 4.7 టీఎంసీలు కాగా, 1.33 లక్షల క్యూసెక్కుల వరద పోటెత్తడంతో 3.06 టీఎంసీల నిల్వలను కొనసాగిస్తూ, 2.04 లక్షల క్యూసెక్కులను కిందికి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు మొత్తం 18 గేట్లను ఎత్తివేశారు. ప్రాజెక్టు దిగువన చేపల వేటకు వెళ్లిన కన్నాపూర్ గ్రామానికి చెందిన గంగాధర్ (41) నీటి ప్రవాహంలో గల్లంతయ్యాడు. సారంగాపూర్ మండలంలోని స్వర్ణ ప్రాజెక్టుకు 15వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో ఐదు గేట్లు ఎత్తి 25,400 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. భైంసా పట్టణంలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి 10,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, ఐదు గేట్లు ఎత్తి 20 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీరాంసాగర్, కడెం నుంచి వస్తున్న వరద తోడుకావడంతో దిగువన గోదావరి ప్రధాన పాయపై ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 2.15 లక్షల క్యూసెక్కుల వరద పోటెత్తింది. జలాశయం నిల్వ సామర్థ్యం 20.18 టీఎంసీలు కాగా, 18.23 టీఎంసీల నిల్వలను కొనసాగిస్తూ 20 గేట్లను ఎత్తి 53,800 క్యూసెక్కులను కిందికి విడుదల చేస్తున్నారు. నంది పంప్‌హౌస్ ద్వారా మరో 12,600 క్యూసెక్కులను మేడారం రిజర్వాయర్‌కు తరలించి అక్కడి నుంచి గాయత్రి పంప్‌హౌస్ ద్వారా 11,000 క్యూసెక్కులను మిడ్‌మానేరు రిజర్వాయర్‌లోకి తరలిస్తున్నారు. అక్కడి నుంచి త్వరలో రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌లోకి నీటి పంపింగ్ ప్రారంభించే అవకాశం ఉంది. దీంతో సాగు, తాగునీటికి ఇబ్బందులు తొలగిపోనున్నాయి.

## దిగువ గోదావరిలో కొనసాగుతున్న ఉధృతి

ఎల్లంపల్లి నుంచి విడుదల చేసిన వరద ఇంకా చేరకపోవడంతో దిగువన ఉన్న సుందిళ్ల బరాజ్‌కి 6,142, అన్నారం బరాజ్‌కి 7,825 క్యూసెక్కుల వరద మాత్రమే వస్తోంది. అయితే, వచ్చిన వరదను వచ్చినట్టు కిందికి విడుదల చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో నీళ్లు నింపరాదని ఎన్డీఎస్‌ఏ సూచించిన విషయం తెలిసిందే. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లోని దిగువ పరీవాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో ఉపనదులైన ప్రాణహిత, ఇంద్రావతి, శబరి, వాగులు, వంకల్లో వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో దిగువ గోదావరి ఉగ్రరూపం దాలుస్తోంది. గోదావరిలో ప్రాణహిత కలిసే కాళేశ్వరం వద్ద నిర్మించిన మేడిగడ్డ బరాజ్ నుంచి ధవళేశ్వరం బరాజ్‌కు దిగువన సముద్రంలో కలిసే వరకూ గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రాణహిత నది వచ్చి కలవడంతో మేడిగడ్డ బరాజ్‌కి 3.73 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా, దాన్ని మొత్తం కిందికి విడుదల చేస్తున్నారు. దానికి ఛత్తీస్‌గఢ్ నుంచి వస్తున్న ఇంద్రావతి వరద తోడవుతుండటంతో తుపాకులగూడెం (సమ్మక్క సాగర్) బరాజ్‌లోకి 4.60 లక్షల క్యూసెక్కుల వరద చేరుతుండగా అంతే స్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు. సీతమ్మసాగర్ (దుమ్ముగూడెం బరాజ్)లోకి చేరుతున్న 3.56 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తుండడంతో ఏపీలోని పోలవరం ప్రాజెక్టు గుండా ప్రవహించి ధవళేశ్వరం బరాజ్ మీదుగా సముద్రంలోకి వరద చేరుతోంది.


కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ మండలం వంతెన పైనుంచి ఉప్పొంగి ప్రవహిస్తున్న తుంపెల్లి వాగు


ఆదిలాబాద్ తరుణం వాగులో తాడు సాయంతో లారీ డ్రైవర్‌ను రక్షిస్తున్న పోలీసులు

# వాగులు వంకలు ఏకం

## రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు • పలు జిల్లాల్లో పొంగుతున్న వాగులు

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలో వర్షాలు దంచి కొడుతున్నాయి. పలు జిల్లాల్లో భారీ వర్షాలకు వరద పోటెత్తడంతో లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. కొన్నిచోట్ల రోడ్లు, వంతెనలు దెబ్బతినటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాగులు, వంకలు పొంగుతున్నాయి. జలాశయాలు నిండు కుండలను తలపిస్తున్నాయి. మరో రెండు మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించటంతో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. దెబ్బతిన్న రోడ్లను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్, పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక విభాగాలు సిద్ధమయ్యాయి.

**ఉమ్మడి వరంగల్ జిల్లా:** ఉమ్మడి జిల్లా పరిధిలోని మహబూబాబాద్, ములుగు, వరంగల్, భూపాలపల్లి జిల్లాల్లో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని పాకాల వాగు బ్రిడ్జి పైనుంచి వరద పొంగిపొర్లుతోంది. దీంతో ఏటి అవతలి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొత్తగూడ మండలంలోని గుంజేడువాగు, గాదెవాగు, రాళ్లతెట్టెవాగు, ముస్మివాగు, మొండ్రాయిగూడెం వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బయ్యారం మండలం ఇల్లెందు– మహబూబాబాద్ రహదారి పైనుంచి జిన్నెల వర్రె వాగు పొంగి ప్రవహిస్తోంది. ములుగు జిల్లా మేడారంలోని జంపన్నవాగులో మేడారం బ్రిడ్జిని ఆనుకుని వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్టు నగర్– వెంగ్లాపూర్ మధ్య ఉన్న యాసంగి తోగు వరద రోడ్డును కమ్మేయడంతో పస్రా నుంచి మేడారానికి శనివారం ఉదయం నుంచి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మేడారం, రెడ్డిగూడెం, కన్నెపల్లి, ఊరట్టం, ఎల్బాక, పడిగాపూర్, నార్లాపూర్ గ్రామాల్లోని వరి పొలాలు నీట మునిగాయి. ఎల్బాక, పడిగాపూర్ గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. గోవిందరావుపేట మండలంలోని లక్నవరం సరస్సు సామర్థ్యం 33 ఫీట్లు 6 ఇంచులు కాగా, శనివారం సాయంత్రం వరకు చెరువు పూర్తిగా నిండి అలుగు పోస్తోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపసముద్రం, భీంఘనపురం రిజర్వాయర్లలోకి 18 అడుగుల మేర నీరు చేరింది. మోరంచ వాగు ఉప్పొంగి ప్రవహించింది. చిట్యాల, మొగుళ్లపల్లి, టేకుమట్ల చలివాగుకు వరద పెరిగింది.


పాలేరు రిజర్వాయర్ పరిస్థితిని సమీక్షిస్తున్న పోలీసు అధికారులు

**ఉమ్మడి ఖమ్మం జిల్లా:** ఖమ్మం, పాలేరు, వైరా, పినపాక, ఇల్లెందు నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. వైరా, కారేపల్లి మండలాల్లో పలుచోట్ల లోతట్టు ప్రాంతాల కాలనీలను వరద ముంచెత్తగా ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని మున్నేటికి వరద నెమ్మదిగా పెరుగుతుండడంతో నీటిమట్టం శనివారం రాత్రి 15 అడుగులకు చేరింది. దీంతో మున్నేటికి ఇరువైపులా పరిస్థితులను ఖమ్మం కలెక్టర్ అనుదీప్, మున్సిపల్ కమిషనర్లు పరిశీలించి స్థానికులను అప్రమత్తం చేశారు. భారీ వర్షాలకు పలు ప్రాంతాల్లో పత్తి, పెసర పంటలు దెబ్బతిన్నాయి.

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా:** జిల్లాలో శనివారం కుండపోతగా వర్షం కురిసింది. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలో అత్యధికంగా 98.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, లక్సెట్టిపేట, చెన్నూరు, కాగజ్‌నగర్ పట్టణాల్లో లోతట్టు కాలనీల్లోకి వరద నీరు చేరింది. ఆదిలాబాద్ తరుణం వాగులో రెండు లారీలు వరదలో చిక్కుకుపోగా, డ్రైవర్లను పోలీసులు రక్షించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సుభాష్‌నగర్, భాగ్యనగర్, కృష్ణానగర్ కాలనీల్లోకి నీరు చేరడంతో స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బజార్‌హత్నూర్, కన్నెపల్లి, భీమిని, వేమనపల్లి తదితర మండలాల్లో పత్తి, సోయా, వరి పంటలు దెబ్బ తిన్నాయి. ఇంద్రవెల్లి మండలం ముత్నూరు వద్ద ఆదిలాబాద్–మంచిర్యాల రహదారి తెగిపోయింది. సిరికొండలోని చిక్మాన్ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. సాత్నాల ప్రాజెక్టుల గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు.


ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ సమీపంలో కోతకు గురైన ప్రధాన రహదారి

**నిజామాబాద్:** నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. పంట పొలాలు నీట మునిగాయి. బోధన్ డివిజన్ పరిధిలో అత్యధికంగా వర్షపాతం నమోదైంది. జలాల్‌పూర్–బడా పహాడ్ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. ఇందల్వాయి మండలం సిర్నాపల్లి వాగు ఉధృతంగా ప్రవహించడంతో గ్రామానికి రాకపోకలు నిలిచాయి.

**కామారెడ్డి జిల్లా:** కామారెడ్డి జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి భారీ వర్షం కురిసింది. అత్యధికంగా రామారెడ్డి మండలంలో 12.3 సెం.మీ. వర్షపాతం నమోదైంది. పోచారం ప్రాజెక్టు నిండి అలుగులు పోస్తూ మంజీరలోకి ప్రవహిస్తోంది. ఎగువన సింగూరు, గణపురం ఆనకట్టల ద్వారా కూడా దిగువకు నీటిని వదులుతుండడంతో మంజీర ద్వారా నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 31 వేల క్యూసెక్కుల నీరు వస్తోంది. భారీ వర్షాలతో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఒక ఇల్లు పూర్తిగా, 11 ఇళ్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయి.


ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో చెరువులను తలపిస్తున్న వరి పొలాలు


కొణిజర్ల మండలం తీగలబంజర వద్ద పగిడేరు వాగు ఉధృతి

# అప్రమత్తంగా ఉండండి

## భారీ వర్షాల నేపథ్యంలో అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

- క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని స్పష్టీకరణ
- వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో సీఎం శనివారం ఉదయం పలు ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో మాట్లాడారు. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో ఎస్డీఆర్‌ఎఫ్, ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలను ముందుగానే మోహరించామని, వారు కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపడతారని సీఎం తెలిపారు. వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉన్నందున జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. వాతావరణ శాఖ సమాచారం ప్రకారం జగిత్యాల మినహా 15 జిల్లాల్లో అధిక వర్షపాతం, మిగతా జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైందని తెలిపారు. నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటిమట్టాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నీటి విడుదలపై ముందుగానే కలెక్టర్లు, క్షేత్రస్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో, లోలెవల్ బ్రిడ్జీలు, కాజ్‌వేలపై నుంచి రాకపోకలు పూర్తిగా నిషేధించాలని, పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటి సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలన్నారు.

### వ్యాధులు ప్రబలకుండా చర్యలు

నిరంతరాయంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వర్షపు నీరు నిల్వ ఉండి దోమలు, ఇతర క్రిమికీటకాలు విజృంభించి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున నగర, పురపాలక, గ్రామ పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఆస్పత్రుల్లో తగినన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలని, అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టం, పశు నష్టం చోటుచేసుకోకుండా జాగ్రత్తలు వహించాలని తెలిపారు. రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, వైద్య ఆరోగ్య, పురపాలక, పోలీస్, అగ్నిమాపక శాఖలు, ఎస్డీఆర్‌ఎఫ్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సీఎం సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రజల నుంచి వచ్చే వినతులకు జీహెచ్‌ఎంసీ, హైడ్రా, ఎస్డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక శాఖల సిబ్బంది తక్షణమే స్పందించాలని ఆదేశించారు.

# కృష్ణమ్మ ఉగ్రరూపం

## శ్రీశైలం, సాగర్‌లకు భారీగా వరద

- శ్రీశైలం 5 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల
- నాగార్జునసాగర్ 20 క్రస్ట్‌గేట్లు ఎత్తివేత
- రెండు జలాశయాల వద్ద భారీగా విద్యుదుత్పత్తి


శ్రీశైలం డ్యాం 5 గేట్ల ద్వారా నీటి విడుదల

దోమలపెంట/నాగార్జునసాగర్: శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల నుంచి కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. శ్రీశైలం ఆనకట్ట వద్ద శనివారం ఐదు గేట్లను ఎత్తి నాగార్జునసాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. జూరాలలో ఆనకట్ట స్పిల్ వే ద్వారా 41,112 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి ద్వారా 38,879 క్యూసెక్కులు, సుంకేశుల నుంచి 30,653 క్యూసెక్కులు కలిపి మొత్తం 1,10,644 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయంలోకి వస్తోంది. దీంతో 5 గేట్లు ఒక్కొక్కటి పది అడుగుల మేరకు ఎత్తి 1,33,720 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. మరోవైపు ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 30,509 క్యూసెక్కులు కలిపి 65,824 క్యూసెక్కుల నీళ్లు అదనంగా సాగర్‌కు విడుదలవుతున్నాయి. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 882.1 అడుగుల నీటిమట్టం వద్ద 199.7354 టీఎంసీల నీటి నిల్వ ఉంది. గడిచిన 24 గంటల్లో పోతిరెడ్డిపాడు ద్వారా 25,333, హెచ్ఎన్ఎస్ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2,426 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమగట్టు కేంద్రంలో 16.956 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు. కుడిగట్టు కేంద్రంలో 15.357 మి.యూనిట్లు ఉత్పత్తి చేశారు. పై నుంచి భారీగా వరద వస్తుండటంతో నాగార్జునసాగర్ 20 గేట్లు ఎత్తి 1,56,540 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి ద్వారా 29,516 క్యూసెక్కులు నదిలోకి వదులుతున్నారు. నాగార్జునసాగర్ జలాశయం గరిష్ట నీటిమట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు). ప్రస్తుత నీటిమట్టం 587.40 అడుగులు(305.7464 టీఎంసీలు) ఉంది.

# వర్షాలతో 84.97 కి.మీ. గ్రామీణ రోడ్లకు నష్టం

- వాటి మరమ్మతులకు రూ.147.70 కోట్లు అవసరం
- ప్రాథమికంగా అంచనా వేసిన పంచాయతీరాజ్ అధికారులు
- వెంటనే పనులు చేపట్టాలని మంత్రి సీతక్క ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో 84.97 కి.మీ. మేర రోడ్లు దెబ్బతిన్నట్టు పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. 124 ప్రాంతాల్లో రహదారులు (ఉపరితల రోడ్లు, కల్వర్టులు, లోకాజ్ వేలు, గండ్లు) దెబ్బతినగా.. వాటి మరమ్మతుల కోసం రూ.147.70 కోట్ల మేర ఖర్చు చేయాల్సి ఉంటుందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు తాత్కాలిక అంచనాలతో నివేదిక సమర్పించారు. వీటి తాత్కాలిక పునరుద్ధరణ వ్యయం రూ.6.02 కోట్లు, శాశ్వత పునరుద్ధరణ వ్యయం రూ.141.68 కోట్లుగా అంచనావేశారు. అధిక వర్షం కురుస్తున్న ప్రాంతాల్లో పరిస్థితులపై శనివారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ జి.సృజన, ఈఎన్సీలు కృపాకర్ రెడ్డి, ఎన్ అశోక్, ఇతర అధికారులతో మంత్రి సమీక్షించారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో త్వరితగతిన రోడ్ల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. నిధుల కొరత లేదని, తాత్కాలిక మరమ్మతుల కోసం అవసరమైన నిధులు జిల్లా కలెక్టర్ల వద్ద ఉన్నాయని.. వాటిని వినియోగించుకోవాలని మంత్రి సీతక్క ఆదేశించారు. రోడ్ల మరమ్మతుల పనుల్లో వేగం పెంచాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు నిత్యం అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

### రోడ్ల నష్టం ప్రాథమిక అంచనా వివరాలు..

- ఉపరితల రోడ్లు (సర్ఫేజ్ డామేజెస్): 48 ప్రాంతాల్లో రహదారులు దెబ్బతినగా.. తాత్కాలిక పునరుద్ధరణకు రూ.3.32 కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు రూ.42.63 కోట్లు ఖర్చవుతుంది.
- సీడీ పనులు (కల్వర్టులు, లోకాజ్ వే): 77 ప్రాంతాల్లో కల్వర్టులు, లోకాజ్ వే, క్రాస్ డ్రైయిన్ నిర్మాణాలు దెబ్బతిన్నాయి. వీటి తాత్కాలిక పునరుద్ధరణ వ్యయం రూ.1.55 కోట్లు, శాశ్వత పునరుద్ధరణ వ్యయం రూ.57.60 కోట్లు.
- గండ్లు (బ్రీచెస్): 30 ప్రాంతాల్లో రహదారులకు గండ్లు పడ్డాయి. తాత్కాలిక పునరుద్ధరణకు రూ.1.06 కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు రూ.5.45 కోట్లు ఖర్చవుతుందని అంచనా.

## వరద నియంత్రణకు ప్రత్యేక కంట్రోల్‌రూమ్‌లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భారీవర్షాల నేపథ్యంలో వరద నియంత్రణ చర్యల్లో భాగంగా పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసింది. రాష్ట్ర స్థాయిలో హైదరాబాద్ ఈఎన్సీ (ఇంజనీరింగ్ ఇన్ చీఫ్) కార్యాలయంలో ప్రత్యేకంగా ఫ్లడ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాల్లో ఎలాంటి రహదారి సమస్యలు, ఇంజనీరింగ్ సమస్యలు తలెత్తినా ప్రజలు ఫిర్యాదులు చేసేందుకు వీలుగా టోల్ ఫ్రీ నంబర్ 040-3517 4352ను అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో పాటు ప్రతి సర్కిల్ స్థాయిలో సూపరింటెండెంట్, ఇంజనీర్లు (ఎస్ఈలు), ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల (ఈఈలు) కార్యాలయాల్లో కూడా కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. ఫీల్డ్ స్థాయిలో ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా స్థానిక అధికారులు స్పందించేలా, వెంటనే అవసరమైన సాయాన్ని అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ కంట్రోల్ రూముల ద్వారా సమాచార సేకరణ, స్పందన, పునరుద్ధరణ చర్యలపై సమన్వయం జరుగుతోంది. ప్రజలు ఎక్కడైనా రహదారులు దెబ్బతిన్నా, కల్వర్టులు కూలినా, గండ్లు పడ్డా వెంటనే సంబంధిత నంబర్లకు సమాచారం ఇవ్వొచ్చని సూచించారు. వర్షాకాలంలో గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు వీటిని ఏర్పాటు చేసినట్టు పీఆర్ శాఖ అధికారులు వెల్లడించారు.

● యాత్ర




## హెచ్‌పీవీ-ఫ్రీ ఇండియా

సర్వైకల్ క్యాన్సర్ బారిన పడకుండా, భవిష్యత్ సురక్షితంగా ఉండేలా అట్టడుగు వర్గాల బాలికలకు ఉచిత హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందించే లక్ష్యంగా సుదీర్ఘ కారు యాత్ర ప్రారంభించారు ప్రియా రాజ్‌గోపాల్, మీనాక్షి సాయి. 'హెచ్‌పీవీ-ఫ్రీ ఇండియా' నినాదంతో ముంబైలో మొదలైన ఈ కారు యాత్ర 40 రోజుల్లో 15 రాష్ట్రాలను చేరుతుంది. తాము వెళ్లిన ప్రాంతాలలో గర్భాశయ క్యాన్సర్, నివారణ గురించి పేదింటి మహిళలకు అవగాహన కలిగిస్తున్నారు ప్రియా, మీనాక్షి. ప్రస్తుతం వారి యాత్ర తమిళనాడుకు చేరింది. అక్కడ వారికి ఘనస్వాగతం లభించింది. చెన్నైలోని అడయార్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో డా.జయశ్రీ ఆధ్వర్యంలో 50 మంది నిరుపేద బాలికలు ఉచిత హెచ్‌పీవి టీకా తీసుకున్నారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ సర్వైకల్ క్యాన్సర్‌కు మాత్రమే కాకుండా వెజైనల్ క్యాన్సర్, వల్వార్ క్యాన్సర్‌లను కూడా నివారిస్తుంది. లక్షమంది నిరుపేద బాలికలకు హెచ్‌పీవీ టీకా వేయించాలనేది ప్రియా రాజ్‌గోపాల్, మీనాక్షి సాయిల లక్ష్యం. మనోబలం మూర్తీభవించిన ఈ మహిళలకు అదేమీ పెద్ద కష్టం కాబోదు.

● సోషల్ మీడియా

## డాగ్ టాకింగ్



కుక్కలు వీధుల్లో కనిపించకుండా చూడాలని, వాటిని పునరావాస కేంద్రాలకు తరలించాలనే సుప్రీం కోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేసిన వారితో పాటు తీవ్రంగా అభ్యంతరం చెప్పినవారు ఎంతోమంది ఉన్నారు. ఈ నేపథ్యంలో మూగజీవులైన వీధి కుక్కలు మాట్లాడుతున్నట్లు క్రియేట్ చేసిన వీడియోలు నెట్‌లోకంలో హల్‌చల్ చేస్తున్నాయి. కంటెంట్ క్రియేటర్ షిరిన్ సెవనీ శునకవేషధారణతో, శునకంలా మాట్లాడిన వీడియోకు మంచి స్పందన వచ్చింది. ఆమె వీధికుక్కల తరఫున వకాల్తా పుచ్చుకుంది. 'వీధికుక్కలు కనిపించకుండా పోతే ఏం జరుగుతుంది?' కాప్షన్‌తో సుమిత్ మిత్రా అనే కంటెంట్ క్రియేటర్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఎమోషనల్ వీడియోను పోస్ట్ చేశాడు. కొందరు క్రియేటర్‌లు ఏఐ-జనరేటెడ్ వీడియోలతో వీధి శునకాలతో మాట్లాడించారు. అలాంటి ఒక వీడియోలో ఒక శునకం గట్టిగా ఇలా నినాదం ఇస్తుంది.... 'వీధుల్లో ఉండడం అనేది వీధి కుక్కలుగా మా ప్రాథమిక హక్కు' ఢిల్లీలోని ఇండియా గేట్ దగ్గర ఒక కోతి గన్‌మైక్‌తో శునకాన్ని ఇంటర్వ్యూ చేస్తున్న వీడియో, బాలుడికి, శునకానికి మధ్య జరిగిన సంభాషణ... ఇలాంటి వీడియోలు ఎన్నో బాగా పాపులర్ అయ్యాయి.

● మానవత్వం

## కుటుంబం దూరమై... శునకాలే కుటుంబమై!

వీధికుక్కల పట్ల అమానవీయంగా ఉండే వారి కంటే మానవత్వంతో వ్యవహరించే వారు అరుదుగా ఉంటారు. అలాంటి అరుదైన వ్యక్తులలో ఢిల్లీకి చెందిన దేవీజీ ఒకరు. డెబ్బై నుంచి ఎనభై వరకు వీధికుక్కల ఆలనాపాలనా చూసుకుంటుంది దేవీజీ. భర్త చనిపోయిన, పిల్లలు దూరమైన దేవికి శునకాలే పిల్లలు. స్ఫూర్తిదాయకమైన దేవీజీ గురించి కంటెంట్ క్రియేటర్ నీతూ బిషత్ రావత్ ఒక వీడియో చేసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. తనకు ఉన్న చిన్నస్థలంలోనే వీధి కుక్కలకు ఆశ్రయం ఇస్తున్న దేవీజీ రోజూ వాటికి ఆహారం అందించడానికి నానా కష్టాలు పడుతోంది. ఈ నేపథ్యంలో దేవీజీకి తోచిన సహాయం చేయాలని నెటిజనులను కోరింది నీతు. ఆమె వీడియో షేర్ చేయడానికి ముందు దేవీజీ గురించి పెద్దగా ఎవరికీ తెలియదు. దేవీజీ గురించి తెలుసుకున్న ఎంతోమంది ఆమె దగ్గరికి వెళ్లి మాట్లాడడానికి ఆసక్తి చూపిస్తున్నారు. 'ఇన్ని కుక్కలను పెంచుకొని ఏం చేస్తావు?' అని ఎంతోమంది దేవీజీని వెటకారంగా అడిగేవారు. దీనికి ఆమె చిరునవ్వు మాత్రమే సమాధానం అయ్యేది. అయితే అసలుసిసలు సమాధానం తరచుగా కనిపించే ఒక దృశ్యంలో దొరుకుతుంది.

**ఆ దృశ్యం:** తల్లి చుట్టూ పిల్లలు చేరినట్లు దేవీజీ చుట్టూ శునకాలు చేరుతాయి. తన పిల్లలతో మాట్లాడినట్లుగానే శునకాలతో ప్రేమగా మాట్లాడుతూ కనిపిస్తుంది దేవీజీ.



● రంగస్థలం

## కోటి కాంతులతో కొత్త కళ



అస్సాంలోని వైవిధ్య, సాంస్కృతిక సంప్రదాయ చరిత్రలో 'మొబైల్ థియేటర్'కు ప్రత్యేక స్థానం ఉంది. అస్సాంలో ఊరూరూ తిరుగుతూ కళా కాంతులు వెదజల్లే ఈ థియేటర్‌కు కొత్త శక్తిని తీసుకువస్తున్నారు మహిళా కళాకారులు. రంగస్థల అలంకరణ, లైటింగ్, నటనలో కొత్తదనం తీసుకువస్తున్నారు. ఒకప్పుడు 'మొబైల్ థియేటర్'లోని స్త్రీల పాత్రలు 'ఇలా మాత్రమే ఉండాలి' అన్నట్లుగా మూస పోసినట్లుగా ఉండేవి. ఇప్పుడు దృశ్యం మారిపోయింది. వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. ఒకప్పుడు ప్రాధాన్యత లేని, పరాధీన పాత్రలలో మాత్రమే కనిపించిన మహిళలు ఇప్పుడు ప్రధాన పాత్రలలో, పోరాట స్ఫూర్తిని రగిలించే పాత్రలలో మెప్పిస్తున్నారు. స్త్రీల హక్కులు, స్త్రీ సాధికారత, లింగసమానత్వం... మొదలైన ఇతివృత్తాలపై నాటకాలు ప్రదర్శిస్తున్నారు. బర్ష రాణి బిషాయ, జుపితోర భూయాన్‌లాంటి అస్సామీ సినీ నటులు కూడా 'మొబైల్ థియేటర్'లో భాగం కావడం విశేషం. మహిళల ఆధ్వర్యంలో 'మొబైల్ థియేటర్' నిర్వహణ అనేది ఒకప్పుడు ఊహకు కూడా అందని విషయం. ఇప్పుడు మాత్రం మహిళా కళాకారుల ఆధ్వర్యంలో 'మొబైల్ థియేటర్' కోటి కాంతులతో కొత్తగా వెలిగిపోతోంది. వారు నాటకాలనే కాదు చరిత్రనూ తిరగరాస్తున్నారు.

● సృజన

## స్నేహ ముద్ర



ఒక వైపు మెయిన్‌స్ట్రీమ్ టీవీ షోలు, మరో వైపు 'మహారాజ్' 'లాపతా లేడీస్' లాంటి భిన్నమైన బాలీవుడ్ చిత్రాలతో చిన్న వయసులోనే రచయిత్రిగా పెద్ద పేరు తెచ్చుకుంది స్నేహా దేశాయ్. గుజరాత్ నాటక రంగం నుంచి టీవీరంగంలోకి అడుగు పెట్టిన స్నేహ అప్పుడప్పుడు టీవీ షోలలో నటించినప్పటికీ రచనకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేది. ఎంతోమంది సీనియర్ రచయితల దగ్గర సహాయకురాలిగా పనిచేసింది. 'మిసెస్ తెందూల్కర్'తో టీవీ రైటర్‌గా ప్రయాణం మొదలుపెట్టింది. ఆ తరువాత రాసిన 'ఆర్‌కే లక్ష్మణ్ కే దునియా' 'బిహా హమారీ బహు కా'లాంటి టీవీ షోలతో రైటర్‌గా పేరు తెచ్చుకుంది. 'టీవీ అంటే అప్పుడే కాదు నాకు ఎప్పటికీ ఇష్టమే' అని చెప్పే స్నేహ టీవీ కోసం ప్రతి నెల 56 ఎపిసోడ్‌లు రాసేది. గుజరాతీ ప్రాంతీయ టీవీకి రాస్తున్న స్నేహకు 'మహారాజ్' సినిమా అవకాశం వచ్చింది. దీనికి కారణం 'మహారాజ్' అనేది గుజరాతీ నేపథ్యం ఉన్న కథ. ఈ సినిమాకు స్నేహ రాసిన స్క్రీన్‌ప్లే ఆమిర్‌ఖాన్‌కు బాగా నచ్చింది. దీంతో 'లా పతా లేడీస్'కు పనిచేసే అవకాశం వచ్చింది. బిప్లబ్ గోస్వామి రాసిన కథకు స్క్రీన్‌ప్లే రాయల్సిందిగా ఆమిర్‌ఖాన్ నుంచి పిలుపు వచ్చింది. ఈ సినిమాకు కూడా మంచి మార్కులు తెచ్చుకుంది. 'మహిళలు రాసేవి పురుషులు కూడా రాస్తారు. అయితే ఇద్దరి దృష్టి కోణం వేరుగా ఉంటుంది. మహిళగా నా అనుభవాలు, ఆలోచనలు పురుషులతో భిన్నంగా ఉండడం అనేది సహజం. లాపతా లేడీస్‌లో ఎన్నో స్త్రీ పాత్రలు ఉంటాయి. ఒక మహిళగా ఆ పాత్రలను అర్థం చేసుకొని రాయడం నాకు సులువు అయింది' అంటోంది స్నేహ దేశాయ్.

మెన్స్ వరల్డ్

## ఏక్ దిన్ ఏక్ గల్లీ






ఇండియాకు వచ్చిన ఈ సెర్బియన్ యువకుడు తిరిగి స్వదేశం వెళ్లిన తరువాత... 'నువ్వు ఇండియాకు వెళ్లింది రోడ్లు ఊడ్వడానికా!' అని అతడి ఫ్రెండ్స్ వెటకారం చేస్తారో ఏమో! సెర్బియన్ యువకుడు ఇండియాలో రోడ్లు ఊడ్వడం ఏమిటి! అని ఆశ్చర్యపోతున్నారా?

**విషయంలోకి వస్తే...** మన దేశానికి వచ్చిన సెర్బియన్ యువకుడు 'ఏక్ దిన్-ఏక్ గల్లీ' కార్యక్రమాన్ని చేపట్టాడు. హరియాణాలోని గురుగ్రామ్‌లో ఇతడు చేపట్టిన కార్యక్రమానికి నెట్టింట మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా అతడు రోజుకో గల్లీకి వెళ్లి చెత్త ఏరేస్తుంటాడు. 'ఏక్ దిన్-ఏక్ గల్లీ' కార్యక్రమంలో స్థానికులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. 'వచ్చామా, వెళ్లామా అని కాకుండా చెత్త సమస్యను దృష్టిలో పెట్టుకొని ఏక్ దిన్-ఏక్ గల్లీ కార్యక్రమాన్ని చేపట్టిన సెర్బియన్ మనకు ఆదర్శం కావాలి'. 'జపాన్‌లో మాదిరిగా విద్యార్థులు తమ క్లాసురూమ్‌లు, స్కూల్ పరిసరాలను శుభ్రం చేయాలి. పరిసరాల పరిశుభ్రతపై చిన్ననాటి నుంచే వారిలో అవగాహన పెరగడానికి ఈ పనులు ఉపయోగపడతాయి'. 'ఏక్ దిన్-ఏక్ గల్లీ కార్యక్రమాన్ని మా ప్రాంతంలో కూడా చేపట్టాలనుకుంటున్నాం'... ఇలాంటి కామెంట్స్ ఎన్నో నెటిజనుల నుంచి వచ్చాయి.

# హెల్త్



**బ్రెయిన్ స్ట్రోక్ అంటే పక్షవాతం రావడానికి మన సీజన్స్ కూడా ఓ అంశంగా ఉంటాయన్న విషయం తెలుసా? వేసవిలో ఒక రకంగా, వర్షకాలంలో మరో రకంగా, చలికాలంలో ఇంకో రకంగా ఇలా వేర్వేరు తీరుల్లో స్ట్రోక్ వచ్చేలా ఆయా కాలాలు పక్షవాతాన్ని పరోక్షంగా ట్రిగర్ చేస్తాయన్న సంగతీ మీకు తెలుసా? చాలామందికి తెలియని ఈ విషయాన్ని చూద్దాం... రండి...**

● పక్షవాతంపై సీజన్స్ ప్రభావం!

## కాలమూ... కాటేస్తది!

## సీజన్‌లూ... స్ట్రోక్‌పై ప్రభావాలు

స్ట్రోక్ రావడానికి ఆ సీజన్ తాలూకు వాతావరణం కూడా కొంత మేర కారణమవుతుంటుంది. అలా కాలాలకూ స్ట్రోక్‌కూ సంబంధముంటుంది. ఆరుబయట అప్పుడుండే వాతావరణం దేహంలోపల ఉండే మెదడు స్ట్రోక్‌కు ఎలా కారణమవుతుందన్న కోణంలో చూసినప్పుడు... వాతావరణంలోని అప్పుడుండే ఉష్ణోగ్రత, తేమ... ఆమాటకొస్తే అప్పుడున్న వాతావరణంలోని గాలిలోని కాలుష్యాలూ (ఎయిర్ క్వాలిటీ) ఇవన్నీ స్ట్రోక్‌ను ప్రేరేపిస్తాయి. అదెలాగో తెలుసుకునే ముందు అసలు స్ట్రోక్ (బ్రెయిన్ స్ట్రోక్ / పక్షవాతం) అంటే ఏమిటో చూద్దాం.

### బ్రెయిన్ స్ట్రోక్ అంటే...

అన్ని అవయవాల్లాగే మెదడుకూ ప్రతినిత్యం రక్తం ద్వారా ఆక్సిజన్, పోషకాలు అందుతుండాలి. పైగా మెదడు కీలకమైన అవయవం కావడంతో మొత్తం దేహానికి సరఫరా అవుతుండే రక్తంలోంచి 20 శాతం మెదడుకే సప్లై అవుతుంటుంది. ఇంతటి కీలకమైన మెదడుకు ఏ కారణంగానైనా రక్తసరఫరా జరగకపోవడం వల్ల పక్షవాతం / స్ట్రోక్ వస్తుంది. ఇందులోనూ మళ్లీ రెండు రకాలుగా రక్తం అందకపోవడం జరుగుతుంది. అవి...

**1) ఇస్కిమిక్ స్ట్రోక్ :** మెదడులోని రక్తనాళాల్లో ఏదైనా అడ్డంకి ఏర్పడటం వల్ల అక్కడి భాగాలకు రక్తప్రసరణ సరిగా జరగక వచ్చే స్ట్రోక్‌ను ఇస్కిమిక్ స్ట్రోక్ అంటారు. మెదడులోని ఏయే భాగాలకు రక్తం అందదో ఆ సెంటర్స్ నియంత్రించే అవయవాలు చచ్చుబడతాయి.

**2) హేమరేజిక్ స్ట్రోక్ :** మెదడులో రక్తనాళాలు చిట్లడంతో అక్కడ రక్తస్రావం అయి వచ్చే పక్షవాతాన్ని హేమరేజిక్ స్ట్రోక్ అంటారు. మెదడులోని ఏ భాగంలో రక్తస్రావం అవుతుందో ఆ భాగం నియంత్రించే అవయవాలు చచ్చుబడతాయి.

**3) ట్రాన్సియెంట్ ఇస్కిమిక్ అటాక్ (టీఐఏ) :** ఇది ఒక రకంగా చూస్తే ఇస్కిమిక్ అటాకే గానీ... ఇందులో తొలుత పక్షవాతం లక్షణాలు కనిపించాక మళ్లీ అవి 24 గంటల లోపు తగ్గిపోయి బాధితులు దాదాపుగా రికవర్ అయితే దాన్ని 'ట్రాన్సియెంట్ ఇస్కిమిక్ అటాక్'గా చెబుతారు. అంటే... భారీ భూకంపం రావడానికి ముందు చిన్న చిన్న ప్రకంపనల (ట్రిమర్స్)లాగే... ఓ పెద్ద స్ట్రోక్ రావడానికి ముందస్తు సూచనగా ఇలాంటివి వస్తుంటాయి. ఒకవేళ ఈ మినీ-స్ట్రోక్ తాలూకు చిన్న చిన్న లక్షణాలు కనిపించాక 24 గంటల తర్వాత కూడా బాధితుడు వాటి ప్రభావం నుంచి బయటపడకపోతే అప్పుడు దాన్ని పూర్తిస్థాయి స్ట్రోక్‌గా పరిగణిస్తారు.

**ఇక స్ట్రోక్ లక్షణాలైన...** దేహంలోని ఒకవైపు భాగాలు బలహీనంగా మారడం, అయోమయం, మాట్లాడటంలో ఇబ్బంది / మాట ముద్దగా రావడం, ముఖంలో ఒకవైపు భాగంపై నియంత్రణ కోల్పోవడం వంటివి కనిపిస్తే... ఆ బాధితులను తక్షణం ఆసుపత్రికి తరలించాలి.

**చివరగా...** వాతావరణాన్నీ అందులోని మార్పులనూ మనమెవరమూ మార్చలేమూ, నియంత్రించలేం. అయితే మన వ్యక్తిగత అలవాట్లతో మంచి జీవనశైలి మార్పులతో ఆరోగ్యంగా ఉండటం ద్వారా పక్షవాతం ముప్పును నివారించగలం. కాబట్టి మంచి జీవనశైలితో వ్యక్తిగత ఆరోగ్య నిర్వహణతో స్ట్రోక్ ముప్పును తప్పించుకోవచ్చు.



డాక్టర్ నీహారిక ఎల్. మతుకుమల్లి
సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్

### వేసవిలోని వేడిమి...

● **డీ-హైడ్రేషన్ :** ఎండాకాలంలో వాతావరణంలో విపరీతమైన వేడిమి ఉంటుంది. దాంతో ఒంట్లోని నీళ్లు చెమట రూపంలో చాలా ఎక్కువగా వాతావరణంలోకి చేరుతుండటంతో దేహం డీ-హైడ్రేట్ అవుతుంది. ఎప్పుడైతే రక్తంలోని నీటిపాళ్లు తగ్గుతాయో అప్పుడు రక్తం చిక్కబడుతుంది. చిక్కబడ్డ రక్తం కాస్తా క్లాట్స్‌కు కారణమవుతాయనీ, దాంతో అవి స్ట్రోక్‌నూ ప్రేరేపించవచ్చన్న విషయం తెలిసిందే.

● **వడదెబ్బ (హీట్‌స్ట్రోక్) :** వడదెబ్బ కూడా స్ట్రోక్ ముప్పును పెంచడంతో పాటు ఆ టైమ్‌లో కనిపించే లక్షణాలనూ కనిపించేలా చేస్తుంది.

● **అత్యంత ఎక్కువగా అలసటకూ / నీరసానికి గురి కావడం (ఓవర్ ఎగ్జర్షన్) :** వేసవిలో తక్కువగా శ్రమ చేసినప్పటికీ ఆ శ్రమ తాలూకు లక్షణాలైన అలసటా, నీరసం, నిస్సత్తువగా, తీవ్రంగా చెమటలు పట్టడం చాలా ఎక్కువగా జరుగుతుంటాయి. ఎర్రటి ఎండలో దేహానికి తీవ్రమైన శ్రమ కలిగించడం జరిగితే... ఒకవేళ బాధితుల్లో ఇంతకు మునుపే రక్తపోటు వంటి రిస్క్‌ఫ్యాక్టర్లు ఉన్నవారైతే వాళ్లలో స్ట్రోక్ ముప్పు మరింతగా పెరుగుతుంది.

### వర్షాకాలంలో...

● **ఇన్ఫెక్షన్లు :** నీళ్లు పెరగడం కారణంగా అందులో వృద్ధి చెందే బ్యాక్టీరియల్ / వైరల్ ఇన్ఫెక్షన్ల కారణంగా దేహంలో ఇన్‌ఫ్లమేషన్ పెరగడం వల్ల.

● **రక్తపోటులో హెచ్చుతగ్గులు (బ్లడ్ ప్రెషర్ ఫ్లక్చుయేషన్స్) :** వాతావరణంలో వర్షం కురవబోయే ముందర తీవ్రమైన ఉక్కబోత లేదా వర్షం కురవగానే ఉండే చలి... ఇలా వర్షాకాలంలో వాతావరణంలోని వేడిమి అస్థిమితంగా ఉండటం వల్ల దానికి అనుగుణంగా రక్తపోటూ మారుతుంటుంది. ఇలా రక్తపోటులోని హెచ్చుతగ్గులు (బీపీ ఫ్లక్చుయేషన్స్) స్ట్రోక్ ముప్పును పెంచుతాయి.

● **వాతావరణంలోని అధిక తేమ, డీ హైడ్రేషన్ :** మాన్‌సూన్ సీజన్‌లో వర్షం కురవబోయే ముందరి ఉక్కపోతతో దేహం డీ-హైడ్రేషన్‌కు గురికావడం... దాంతో రక్తం చిక్కబడటం వంటి అంశాలు రక్తపోటు ముప్పును పెంచుతాయి.

● **ముప్పును పెంచే వ్యక్తిగత అంశాలు :** నిజానికి సీజన్‌ల తాలూకు ఈ మార్పులన్నీ స్ట్రోక్ ముప్పును ప్రతి ఒక్కరిలోనూ సమానంగా పెంచవు. అంతకు మునుపే వ్యక్తిగతంగా రిస్క్ ఎక్కువగా ఉన్న వారిలో ఇవి స్ట్రోక్ ముప్పును పెంచుతాయి.

### చలికాలంలో...

వాతావరణంలోని వేడిమి ఒక సెంటీగ్రేడ్ తగ్గినా... అది స్ట్రోక్ వచ్చే ముప్పును నాలుగు శాతం పెంచుతుందన్నది నిపుణులు గమనించిన అంశం.

● **వాసోకన్‌స్ట్రిక్షన్ :** చలికాలంలోని తీవ్రమైన చల్లదనం కారణంగా రక్తనాళాలు సన్నబారతాయి. ఇలా రక్తనాళాలు సన్నబారడాన్ని వాసోకన్‌స్ట్రిక్షన్ అంటారు. నాళం సన్నబారడంతో రక్తం ప్రవహించే వేగం (రక్తపోటు / బీపీ) పెరుగుతుంది.

● **రక్తపు సాంద్రత పెరగడం :** చల్లదనం కారణంగా అన్ని ద్రవాలూ చిక్కబడ్డట్టే రక్తమూ చిక్కబడుతుంది. ఇలా రక్తం చిక్కబడటం అన్నది రక్తంలో క్లాట్స్ పెరిగేలా చేసి స్ట్రోక్ ముప్పును పెంచుతుంది.

● **చురుకుదనం తగ్గడం :** చలికాలంలో జనం వేసవిలో ఉన్నంత చురుగ్గా ఉండరు. వాళ్ల కదలికలూ మందగిస్తాయి. ఇలా చురుకుదనం తగ్గి, కదలికలు తగ్గడంతో దేహానికి అవసరమైన వ్యాయామం అందక బరువు పెరుగుతారు. అంతేకాదు... చురుకుదనం తగ్గడంతో రక్తంలో (కొలెస్ట్రాల్ వంటి) కొవ్వుల మోతాదులూ పెరుగుతాయి. బరువూ, కొవ్వులూ పెరగడం స్ట్రోక్ ముప్పును పెంచుతుందన్న విషయం తెలిసిందే.

● **డీ-హైడ్రేషన్ :** చలికాలంలో నీళ్లు తాగడం తగ్గుతుంది. దాంతో రక్తంలో నీటి మోతాదులూ తగ్గడంతో రక్తం చిక్కబడుతుంది. ఇలా చిక్కబడటమన్నది స్ట్రోక్ వచ్చే అవకాశాలను పెంచుతుంది.

● **ఇన్ఫెక్షన్లు :** చలికాలంలో ఫ్లూ, శ్వాసకోశ సమస్యలకు కారణమయ్యే ఇన్ఫెక్షన్ల ముప్పు పెరగడంతో... అది స్ట్రోక్ ముప్పు కూడా పెరిగేలా చేస్తుంది.


● **వాతావరణ కాలుష్యాలు :** చలికాలంలో వాతావరణంలోకి చేరే పొగ, కాలుష్యాలన్నీ అప్పుడు కురిసే మంచు (ఫాగ్)తో కలిసి 'స్మాగ్' అనే మందపాటి కాలుష్యాల తెరలు ఏర్పడేలా చేస్తాయి. కాలుష్యాలతో కూడిన స్మాగ్ కూడా స్ట్రోక్ ముప్పును పెంచేస్తుంది.

### నివారణ...

- ప్రతి ఒక్కరూ తగినన్ని నీళ్లూ ద్రవాహారాలు తీసుకుంటూ హైడ్రేటెడ్‌గా ఉండటం.
- అన్ని సీజన్‌లలోనూ ఆయా సీజన్‌లో దొరికే పోషకాలతో కూడిన మంచి సమతులాహారం తీసుకోవడం.
- ఏ సీజన్‌లోనైనా తగినంత వ్యాయామం చేస్తూ, దేహాన్ని చురుగ్గా ఉంచడం.
- కంటినిండా తగినంత నిద్రపోతుండటంతో పాటు ఒత్తిడి లేకుండా చూసుకోవడం.
- ఒకవేళ అధికరక్తపోటు (హైబీపీ), డయాబెటిస్ ఉంటే... మందులతో వాటిని ఎప్పుడూ అదుపులో ఉండేలా చూసుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలి.



నిర్వహణ: యాసీన్



● నార్కోలెప్సీ

## స్లీప్‌లోకి స్లిప్!

కొందరు ఎక్కడ ఉంటే అక్కడ నిద్రలోకి జారిపోతుంటారు. ఇలా బస్సెక్కగానే అలా నిద్రపోతుంటారు. వాళ్లను చూసినప్పుడు కొంతమంది వాళ్లంత అదృష్టవంతులు లేరని అంటుంటారు. ఇలా పడుకోగానే అలా నిద్రపట్టేయడం మంచిదే. అయితే నిద్రకు ఉపక్రమించినప్పుడు నిద్రపట్టడానికీ... తమకు తెలియకుండానే నిద్రలోకి జారిపోవడానికీ తేడా ఉందంటున్నారు వైద్యనిపుణులు.

కొందరు కూర్చుని పనిచేస్తూ చేస్తేనే... మరికొందరు కూర్చుని తింటూ తింటూ కూడా నిద్రలోకి జారుకుంటూ ఉంటారు. 'నార్కోలెప్సీ' అనే స్లీప్ సమస్య ఉన్నవారు పట్టపగలు తాము పని చేస్తూ చేస్తూనే తమకు తెలియకుండానే నిద్రలోకి వెళ్లిపోతుంటారు. దీన్ని ఒక రకం స్లీప్ డిజార్డర్‌గా పరిగణించాలి.



డా॥ రమణ ప్రసాద్
సీనియర్ స్లీప్ స్పెషలిస్ట్ & పల్మనాలజిస్ట్, హైదరాబాద్

### నార్కోలెప్సీ ఎలా వస్తుందంటే...?

నిద్రలో కొన్ని దశలు అంటే స్లీప్ సైకిల్స్ నడుస్తుంటాయి. మొదట ప్రారంభ దశ తర్వాత గాఢ నిద్ర దశ, ఆ తర్వాత కనుపాపలు వేగంగా కదిలే దశ... ఇలాగ దశలవారీగా స్లీప్‌సైకిల్స్ కొనసాగుతుంటాయి. కనుపాపలు వేగంగా కదిలే దశను ర్యాపిడ్ ఐ మూవ్‌మెంట్ (ఆర్‌ఈఎమ్) నిద్ర దశగా పేర్కొంటారు. నార్కోలెప్సీతో బాధపడేవారిలో నిద్రలోకి జారుకున్న వెంటనే ఈ ఆర్‌ఈఎమ్ నిద్ర దశ సాధారణం కంటే వేగంగా వచ్చేస్తుంది. ఈ దశలో కనుపాపలు, ఊపిరితిత్తులను పనిచేయించే డయాఫ్రమ్ తప్ప మిగతా అన్ని కండరాలూ పూర్తిగా అచేతన స్థితిలో ఉంటాయి.

### ఎందుకో ఇప్పటికీ పెద్దగా తెలియదు...

ఈ సమస్య జన్యువులతో ముడిపడి ఉన్నందున చాలామందిలో నార్కోలెప్సీతో బాధపడేవారి కుటుంబాల్లోని పిల్లల్లో కనిపించడాన్ని పరిశోధకులు గమనించారు. అయితే నార్కోలెప్సీ ఎందుకొస్తుందనే అంశం ఇంకా నిర్దిష్టంగా తెలియరాలేదు. ఈ సమస్యతో బాధపడేవారు హెవీ మెషిన్స్, డ్రైవింగ్ వంటి వాటికి దూరంగా ఉండటం మంచిది.

**చికిత్స...** నార్కోలెప్సీ వచ్చినప్పుడు మనం చేతనావస్థలో ఉపయోగించే కండరాలు అకస్మాత్తుగా అచేతనం అయిపోతాయి. మాట కూడా ముద్దముద్దగా వస్తుంది. వారు కొన్ని రకాల భ్రాంతులకూ గురికావచ్చు. ఇప్పటికి దీనికి పూర్తిగా చికిత్స లేకపోయినా నార్కోలెప్సీతో బాధపడేవారు స్లీప్ స్పెషలిస్టులను సంప్రదిస్తే... వారు కొన్ని రకాల యాంటీడిప్రెసెంట్స్, యాంఫిటమైన్ మందులతో కొంతవరకు మంచి ఫలితాలు వచ్చేలా చూస్తారు. అలాగే ఈ సమస్య తాలూకు మేనేజ్‌మెంట్ ఎలాగో సూచిస్తారు.

## తాన్యా హేమంత్‌కు సింగిల్స్ టైటిల్

న్యూఢిల్లీ: సైపాన్ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత యువ షట్లర్ తాన్యా హేమంత్ విజేతగా నిలిచింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ 86వ ర్యాంకర్ తాన్యా 15-10, 15-8తో కానాయ్ సకాయ్ (జపాన్)పై విజయం సాధించింది. ఈ టోర్నీలో టాప్ సీడ్‌గా బరిలోకి దిగిన తాన్యా తుదిపోరులో ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా వరుస గేమ్‌ల్లో గెలుపొందింది. 21 ఏళ్ల తాన్యాకు ఇది నాలుగో అంతర్జాతీయ టైటిల్. అంతకుముందు ఇండియా ఇంటర్నేషనల్ (2022), ఇరాన్ ఫజ్ర్ ఇంటర్నేషనల్ (2023), బెండిగో ఇంటర్నేషనల్ (2024)లో తాన్యా టైటిల్స్ గెలుచుకుంది. గతేడాది అజర్‌బైజాన్ ఇంటర్నేషనల్ టోర్నమెంట్ ఫైనల్లో భారత షట్లర్ మాళవిక బన్సోద్ చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచింది. తాజా టోర్నీలో తాన్యా... సెమీఫైనల్లో రిరినా హిరామొటో (జపాన్)పై, క్వార్టర్ ఫైనల్లో లీ జిన్ యీ మెగన్ (సింగపూర్)పై, ప్రిక్వార్టర్స్‌లో నొడొకా సునకవా (జపాన్)పై విజయాలు సాధించింది. ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) ట్రయల్స్‌లో భాగంగా... ఈ టోర్నమెంట్‌లో ఒక్కో గేమ్‌లో 21 పాయింట్లకు బదులు 15 పాయింట్లుగా నిర్వహించారు.





## ఫైనల్లో అనాహత్

బేగా (ఆస్ట్రేలియా): ప్రొఫెషనల్ స్క్వాష్ అసోసియేషన్ (పీఎస్‌ఏ) చాలెంజర్ టూర్ ఈవెంట్‌లో భారత ప్లేయర్ అనాహత్ సింగ్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. న్యూ సౌత్‌వేల్స్ స్క్వాష్ బేగా ఓపెన్ మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో శనివారం 17 ఏళ్ల అనాహత్ సింగ్ 3-2 (10-12, 11-5, 11-5, 10-12, 11-7)తో నూర్ ఖఫాగీ (ఈజిప్ట్)పై విజయం సాధించింది. 54 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన పోరులో టాప్‌సీడ్‌గా బరిలోకి దిగిన భారత ప్లేయర్ అదరగొట్టింది. 14 ఏళ్ల వయసులోనే జాతీయ జట్టులో చోటు దక్కించుకున్న అనాహత్... అంతర్జాతీయ స్థాయిలో నిలకడైన ప్రదర్శనతో దూసుకెళ్తోంది. ఇప్పటివరకు 18 పీఎస్‌ఏ టోర్నీల్లో పాల్గొన్న అనాహత్... అందులో 12 టైటిల్స్ గెలిచింది. మరో సెమీఫైనల్లో భారత ప్లేయర్ ఆకాంక్ష సాలుంఖే 1-3 (9-11, 11-7, 10-12, 6-11)తో హబీబా హనీ (ఈజిప్ట్) చేతిలో ఓడింది. 42 నిమిషాల పాటు సాగిన పోరులో ఆకాంక్ష చక్కటి పోరాట పటిమ కనబర్చినా... కీలక సమయంలో పాయింట్లు కోల్పోయి పరాజయం వైపు నిలిచింది. ఫైనల్లో హబీబా హనీతో అనాహత్ తలపడనుంది. పీఎస్‌ఏ స్క్వాష్ టూర్ సీజన్‌లో ఇదే తొలి ప్రపంచ స్థాయి ఈవెంట్ కాగా... టైటిల్ సాధించడమే లక్ష్యంగా అనాహత్ బరిలోకి దిగనుంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

# తీవ్రంగా గాయపడితే బరిలోకి మరో ఆటగాడు

## దేశవాళీ క్రికెట్‌లో కొత్త నిబంధన

**ముంబై: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) దేశవాళీ క్రికెట్‌లో తొలిసారి ఆటగాళ్ల గాయానికి సంబంధించి కొత్త నిబంధనను తీసుకొచ్చింది. రాబోయే రంజీ ట్రోఫీ సీజన్ (2025-26)లో** ప్రయోగాత్మకంగా దీనిని అమలు చేయనుంది. కొత్త నిబంధన ప్రకారం ఎవరైనా ఆటగాడు మైదానంలో తీవ్రంగా గాయపడితే ఆ మ్యాచ్‌లో అతని స్థానాన్ని మరో ఆటగాడితో భర్తీ చేసుకునేందుకు అనుమతించనుంది. ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్‌లో తలకు దెబ్బ తగిలినప్పుడు మాత్రమే 'కన్‌కషన్ సబ్‌స్టిట్యూట్'ను అనుమతిస్తున్నారు. ఇతర గాయాలు ఎంత తీవ్రమైనవి అయినా సబ్‌స్టిట్యూట్‌కు అనుమతి లేదు. ఇటీవల భారత్, ఇంగ్లండ్ సిరీస్‌లో జరిగిన రెండు ఘటనలు భారత బోర్డు ఈ తరహాలో ఆలోచించేందుకు బీజం వేసింది. మాంచెస్టర్ టెస్టులో వోక్స్ బౌలింగ్‌లో కాలికి గాయం కావడంతో పంత్ ఆటకు దూరం కావాల్సి వచ్చింది. అది తీవ్రమైన గాయమే అయినా నిబంధనల ప్రకారం మరో ఆటగాడిని తీసుకునే అవకాశం లేదు. ఆ తర్వాత ఓవల్ టెస్టులో ఫీల్డింగ్‌లో భుజానికి గాయం కావడంతో క్రిస్ వోక్స్ కూడా ఇదే తరహాలో ఇబ్బంది పడ్డాడు. సిరీస్ సమయంలో సబ్‌స్టిట్యూట్‌ను అనుమతిస్తే బాగుంటుందని భారత కోచ్ గంభీర్ మద్దతు పలకగా...ఇంగ్లండ్ కెప్టెన్ స్టోక్స్ దీనిని పూర్తిగా వ్యతిరేకించాడు. వీటిని దృష్టిలో ఉంచుకుంటూ వచ్చిన పలు సూచనల అనంతరం బీసీసీఐ మార్పుకు సిద్ధమైంది. 'క్రికెటర్ మైదానంలో ఆట జరుగుతున్న సమయంలోనే గాయపడాలి. గాయం బయటకు కనిపిస్తూ దాని తీవ్రతను బట్టి, అతను ఆడలేని పరిస్థితి ఉంటేనే అనుమతిస్తారు. అందుబాటులో ఉన్న వైద్యుల సూచనలతో అంపైర్లు, రిఫరీ కలిసి తుది నిర్ణయం తీసుకుంటారు. ఎవరైనా ఆటగాడు గాయపడితే అతని తరహా ఆటగాడినే అనుమతిస్తారు' అని కొత్త నిబంధనలో వివరించారు.

**మరో రెండు మార్పులు...**

బీసీసీఐ దేశవాళీ క్రికెట్‌లో మరో రెండు కీలక మార్పులు చేసింది. కొందరు బ్యాటర్లు క్రీజ్‌లో ఉన్నప్పుడు ఉద్దేశపూర్వకంగా 'షార్ట్ రన్' పరుగెడుతున్నారు. రెండో పరుగు రాదని తెలిసినా షార్ట్ రన్‌తో దానిని పూర్తి తాము అనుకున్న బ్యాటర్‌కు స్ట్రయికింగ్ ఇస్తున్నారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం అంపైర్లు దానిని గుర్తిస్తే ఒక పరుగు తగ్గిస్తున్నారు. కానీ స్ట్రయికింగ్ మాత్రం ముందుగా షాట్ ఆడిన బ్యాటర్‌కే వస్తోంది. ఇకపై ఇది జరగకుండా మార్పు తీసుకొచ్చారు. ఇకపై తర్వాతి బంతికి ఎవరు బ్యాటింగ్ చేయాలో నిర్ణయించే అధికారం ప్రత్యర్థి కెప్టెన్‌కు ఇవ్వనున్నారు. మరో కీలక నిబంధన కూడా అమల్లోకి రానుంది. గాయంవంటి సరైన కారణం లేకుండా కొందరు బ్యాటర్లు ఆట మధ్యలో రిటైర్డ్‌గా పెవిలియన్‌కు వెళ్లిపోతున్నారు. అవసరమైతే ఆ తర్వాత మళ్లీ బ్యాటింగ్‌కు దిగుతున్నారు. దీనిని నివారించేందుకు బీసీసీఐ సిద్ధమైంది. ఒక సారి ప్లేయర్ రిటైర్డ్‌గా బయటకు వెళితే అతడిని మళ్లీ ఆడేందుకు అనుమతించరు. స్కోరు బోర్డు అది 'రిటైర్డ్ అవుట్'గా వెంటనే నమోదవుతుంది.



### సూర్యకుమార్ ఫిట్



భారత టి20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఫిట్‌నెస్ పరీక్ష పాసయ్యాడు. వచ్చే నెలలో జరగనున్న ఆసియా కప్ టి20 టోర్నమెంట్‌కు అజిత్ అగార్కర్ నేతృత్వంలోని భారత సెలెక్షన్ కమిటీ త్వరలో జట్టును ప్రకటించనున్న నేపథ్యంలో తాజాగా సూర్యకుమార్ బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఫిట్‌నెస్ పరీక్ష ఎదుర్కొన్నాడు. ఐపీఎల్ అనంతరం స్పోర్ట్స్ హెర్నియాకు సూర్యకుమార్ శస్త్ర చికిత్స చేయించుకోగా... ప్రస్తుతం అతడు ఫిట్‌నెస్ సాధించాడు. 'జట్టులోకి తిరిగి వచ్చే ముందు ఎవరికైనా ఫిట్‌నెస్ పరీక్ష తప్పనిసరి. అందులో సూర్య ఉత్తీర్ణుడయ్యాడు' అని బీసీసీఐ అధికారి తెలిపారు. మంగళవారం ముంబై వేదికగా జరగనున్న సెలెక్షన్ కమిటీ సమావేశంలో సూర్య పాల్గొననున్నాడు.

# ఆసీస్ దిగ్గజం సింప్సన్ కన్నుమూత

## బ్యాటర్‌గా, కోచ్‌గా పలు ఘనతలు

సిడ్నీ: ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్, మాజీ కోచ్ బాబ్ సింప్సన్ కన్నుమూశారు. ఆయన వయస్సు 89 ఏళ్లు. అనారోగ్యంతో ఆయన మృతిచెందినట్లు క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) వెల్లడించింది. సంప్రదాయ టెస్టు క్రికెట్‌లో ఆస్ట్రేలియాకు బ్యాటింగ్ ఆల్‌రౌండర్‌గా, కెప్టెన్‌గా చెప్పుకోదగ్గ విజయాలందించారు. తదనంతరం కోచ్‌గానూ విజయవంతమయ్యారు. ఆస్ట్రేలియా 1987లో సాధించిన తొలి వన్డే ప్రపంచకప్‌కు కోచ్‌గా పనిచేశారు. 16 ఏళ్లకే ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడిన సింప్సన్ 1957 డిసెంబర్లో జొహన్నెస్‌బర్గ్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టుతో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేశారు. 1978, ఏప్రిల్‌లో వెస్టిండీస్‌తో కింగ్‌స్టన్‌లో ఆఖరి టెస్టు ఆడారు. ఈ 21 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో 62 టెస్టులాడి 111 ఇన్నింగ్స్‌ల్లో 46.81 సగటుతో 4869 పరుగులు చేశారు. ఇందులో 10 శతకాలు, 27 అర్ధసెంచరీలున్నాయి. స్పిన్ బౌలింగ్‌తో 71 వికెట్లు కూడా పడగొట్టారు. అత్యుత్తమ ప్రదర్శన 8/97 కాగా రెండు వన్డేలు మాత్రమే ఆడారు. ఆయన చురుకైన ఫీల్డర్ కూడా! స్లిప్‌లో మేటి ఫీల్డర్‌గా పేరుతెచ్చుకున్నారు. ఆయన 110 క్యాచ్‌లు అందుకున్నారు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో సింప్సన్‌ది అసాధారణ ఘనత. 257 మ్యాచ్‌లాడిన ఈ దిగ్గజం 21,029 పరుగులు చేశారు. బౌలింగ్‌లో ఏకంగా 349 వికెట్లను చేజిక్కించుకున్నారు. కెరీర్‌లో 62 టెస్టు ఆడితే... సగం కంటే ఎక్కువగా 39 మ్యాచ్‌లకు సారథ్యం వహించారు. క్రికెటర్‌గా కెరీర్ ముగిశాక 1986 నుంచి 1996 వరకు ఆసీస్ కోచ్‌గా వ్యవహరించారు. కోచింగ్‌లో ప్రపంచకప్, యాషెస్ సహా మరెన్నో గొప్ప విజయాలున్నాయి. 1999 వన్డే ప్రపంచకప్ సమయంలో భారత జట్టు పేస్ బౌలింగ్ కన్సల్టెంట్‌గా సైతం సింప్సన్ పనిచేశారు. 70 ఏళ్ల వయసులోనూ వన్నె తగ్గని కోచింగ్‌తో నెదర్లాండ్స్ జట్టును 2007 ప్రపంచకప్‌కు అర్హత సాధించేలా చేశారు. అంతర్జాతీయ క్రికెట్‌లో సింప్సన్ సేవల్ని గుర్తించిన అంతర్జాతీయ క్రికెట్ మండలి 2013లో 'ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్' (విశిష్ట క్రికెటర్ల) జాబితాలో చేర్చింది. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోని అల్బనెస్ తమ క్రికెట్ దిగ్గజానికి నివాళులు అర్పించారు. ఆటగాడిగా, సారథిగా, కోచ్‌గా విశేష సేవలందించారని కొనియాడారు.



1999 ప్రపంచకప్ సమయంలో భారత మాజీ పేసర్ దేవాశీష్ మొహంతీతో సింప్సన్ (ఫైల్)

# నిబంధనల ప్రకారమే తీసుకున్నాం!

చెన్నై: దక్షిణాఫ్రికా సంచలన బ్యాటర్ డెవాల్డ్ బ్రెవిస్‌ను ఐపీఎల్-2025 సీజన్ మధ్యలో జట్టులో తీసుకోవడం గురించి వివాదంపై చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) వివరణ ఇచ్చింది. సీజన్ మధ్యలో గాయపడిన పేస్ బౌలర్ గుర్‌జప్‌నీత్ సింగ్ స్థానంలో అతను జట్టులోకి వచ్చాడు. దీని కోసం సీఎస్‌కే బ్రెవిస్‌కు రూ.2.20 కోట్లు చెల్లించింది. సీజన్ ఆరంభానికి ముందు రూ.75 లక్షల కనీస విలువతో వచ్చిన బ్రెవిస్‌ను ఐపీఎల్ వేలంలో ఎవరూ తీసుకోలేదు. మంగళవారం దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో టి20లో బ్రెవిస్ 56 బంతుల్లోనే 125 పరుగులు బాది వార్తల్లో నిలిచాడు. ఈ నేపథ్యంలో సీఎస్‌కే టీమ్ సభ్యుడైన సీనియర్ బౌలర్ రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ చానల్‌లో బ్రెవిస్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 6 మ్యాచ్‌లు ఆడిన బ్రెవిస్ 180 స్ట్రయిక్‌రేట్‌తో 225 పరుగులు సాధించి చెన్నై గెలిచిన మ్యాచ్‌లలో కీలక పాత్ర పోషించాడు. 'బ్రెవిస్ అద్భుతమైన బ్యాటర్. అయితే కనీస ధర ఎక్కువ కావడంతో అతడిని ఎవరూ తీసుకోలేదు. సీజన్ మధ్యలో ఏ జట్టయినా తీసుకుంటే అతని కనీస ధరనే చెల్లించాలి. కానీ నేను ఫలానా మొత్తం ఇస్తేనే వస్తానంటూ బ్రెవిస్ ఏజెంట్ల ద్వారా డిమాండ్ చేశాడు. అయినా సరే సీఎస్‌కే తీసుకుంది' అని అన్నాడు. దీనిపై సీఎస్‌కే తాజాగా స్పందించింది. ఐపీఎల్ నిబంధనల ప్రకారమే తాము బ్రెవిస్‌ను తీసుకున్నామని చెప్పింది. 'గాయపడిన ఆటగాడి స్థానంలో ఎవరినైనా తీసుకుంటే ఆ ప్లేయర్‌కు ఇచ్చే మొత్తమే కొత్త ఆటగాడికి ఇవ్వాలని నిబంధనల్లో ఉంది. మేం దీనిని ఎక్కడా ఉల్లంఘించలేదు' అని సీఎస్‌కే పేర్కొంది. వచ్చే సీజన్ కోసం చెన్నైను వీడేందుకు అశ్విన్ దాదాపుగా సిద్ధమైన తరుణంలో ఇది చర్చనీయాంశమైంది.



# సాక్షి సినిమా



● నాగచైతన్య

## కథ విన్నారా?

హీరో నాగచైతన్య, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కేందుకు సన్నాహాలు మొదలయ్యాయని తెలుస్తోంది. ఇటీవల దర్శకుడు కొరటాల శివ ఓ కథను రెడీ చేసి, నాగచైతన్యకు వినిపించారట. ఈ కథ నాగచైతన్యకు నచ్చిందని, దీంతో ఈ కథకు మరింత మెరుగులుదిద్దే పనిలో దర్శకుడు కొరటాల శివ ప్రస్తుతం నిమగ్నమై ఉన్నారని టాక్. అయితే ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అలాగే దర్శకులు బోయపాటి శ్రీను, శివ నిర్వాణ కూడా నాగచైతన్యకు కథలు వినిపించారనే వార్తలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నాగచైతన్య ఏ దర్శకుడితో తన కొత్త సినిమాను ముందుగా సెట్స్‌కు తీసుకువెళ్తారనే సస్పెన్స్ వీడాలంటే మరికొన్ని రోజులు ఎదురుచూడక తప్పదు. ఇక ప్రస్తుతం 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలోని 'వృషకర్మ' (వర్కింగ్ టైటిల్) సినిమాతో నాగచైతన్య బిజీగా ఉన్నారు.

## మరోసారి పవర్‌ఫుల్‌గా..



● రమ్యకృష్ణ

శక్తిమంతమైన పాత్రల్లో రమ్యకృష్ణ ఏ స్థాయిలో విజృంభించగలరో చెప్పడానికి 'రాజమాత శివగామి' పాత్ర ఒక ఉదాహరణ. 'బాహుబలి'లోని ఆ పాత్రను రమ్యకృష్ణ మాత్రమే చేయగలరు అనేలా ఆమె నటించారు. ఇప్పుడు ఈ పాత్ర ప్రస్తావన ఎందుకంటే... మరోసారి ఈ తరహా పవర్‌ఫుల్ రోల్‌లో రమ్యకృష్ణ కనిపించనున్నారట. అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ భారీ బడ్జెట్ చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలోని ఓ పవర్‌ఫుల్ క్యారెక్టర్ చేయాలంటూ రమ్యకృష్ణను సంప్రదించారట అట్లీ. రమ్యకృష్ణ కూడా తన అంగీకారం తెలిపారని సమాచారం. ఈ చిత్రంలో అల్లు అర్జున్ పలు షేడ్స్ ఉన్న పాత్రల్లో కనిపిస్తారని భోగట్టా. అలాగే మొత్తం ఐదుగురు కథానాయికలు ఉంటారని సమాచారం. హీరోయిన్ దీపికా పదుకోన్ నటిస్తున్నట్లు యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఇంకా మృణాల్ ఠాకూర్, రష్మికా మందన్నా, జాన్వీ కపూర్ పేర్లు వినిపిస్తున్నాయి. ఇక భారీ ఎత్తున వీఎఫ్‌ఎక్స్ ఉన్న ఈ సైంటిఫిక్ యాక్షన్ థ్రిల్లర్ మూవీకి పలువురు హాలీవుడ్ సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు. వచ్చే ఏడాది ద్వితీయార్ధంలో ఈ చిత్రం విడుదల కానుంది.

## ప్రశాంతమైన కన్మణి



పవన్ కల్యాణ్, ప్రియాంకా అరుళ్ మోహన్ జోడీగా నటిస్తున్న చిత్రం 'ఓజీ'. సుజీత్ దర్శకత్వంలో డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య నిర్మిస్తున్న ఈ సినిమా సెప్టెంబర్ 25న విడుదల కానుంది. ఈ చిత్రంలో ప్రియాంకా అరుళ్‌మోహన్ పోషించిన కన్మణి పాత్ర ఫస్ట్ లుక్‌ను చిత్రబృందం శనివారం విడుదల చేసింది. ''ఓజీ'లో పవన్ కల్యాణ్ గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపిస్తారు. ప్రతి తుపానుకు అవసరమైన ప్రశాంతత ప్రియాంకా అరుళ్‌మోహన్ కన్మణి పాత్ర. మా సినిమా నుంచి ఇటీవల విడుదలైన మొదటి పాట 'ఫైర్ స్టార్మ్..'కు విశేష స్పందన లభించింది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఇమ్రాన్ హష్మి, అర్జున్ దాస్, ప్రకాశ్ రాజ్, శ్రియా రెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకి సంగీతం ఎస్. తమన్, కెమెరా: రవి కె. చంద్రన్, మనోజ్ పరమహంస.

● ప్రియాంక

## పల్లెటూరి ప్రేమకథ



● శ్రీచరణ్, మధుశాలిని, గీత్ సైని

గీత్ సైని, శ్రీచరణ్ రాచకొండ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కన్యాకుమారి'. నటి మధుశాలిని సమర్పణలో సృజన్ అట్టాడ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ నెల 27న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన సమావేశంలో మధుశాలిని మాట్లాడుతూ– ''మా అమ్మానాన్న ప్రేమ వివాహం చేసుకున్నారు. పెళ్లి తర్వాత కూడా మా అమ్మ ఉన్నత విద్య అభ్యసించారు. 'కన్యాకుమారి' చూసిన తర్వాత మా అమ్మానాన్న ప్రేమ కథ కూడా ఇలానే స్టార్ట్ అయ్యుంటుందనిపించింది. ఈ సినిమాకి అందరి సపోర్ట్ కావాలి'' అని తెలిపారు. సృజన్ అట్టాడ మాట్లాడుతూ– ''కన్యాకుమారి' దర్శకుడిగా నాకు రెండో చిత్రం... నిర్మాతగా మొదటి సినిమా. అందమైన పల్లెటూరి ప్రేమకథగా రూపొందిన చిత్రమిది. నిజమైన భావోద్వేగాలు ఉంటాయి. మా సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్న మధుశాలినిగారికి కృతజ్ఞతలు'' అని పేర్కొన్నారు. ''పల్లెటూరి నేపథ్యంలో సాగే వినూత్న ప్రేమకథా చిత్రం ఇది. ఇందులో కన్యాకుమారి పాత్ర చేయడం ఆనందంగా ఉంది'' అన్నారు గీత్ సైని. ''ఈ సినిమా ప్రేక్షకులకు చాలా కొత్త అనుభూతిని అందిస్తుంది'' అని డైరెక్టర్ ప్రవీణ్, మ్యూజిక్ డైరెక్టర్ రవి, ఎడిటర్ నరేశ్, సహ నిర్మాతలు అప్పల నాయుడు, సతీష్ రెడ్డి తెలిపారు.

## పరదా చర్చనీయాంశమవుతుంది

**- దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగుల**



''పరదా' కోసం మేం సృష్టించిన ఊరు, సంస్కృతి, పాత్రలన్నీ కల్పితాలే. ఈ సినిమా చూస్తున్నప్పుడు ప్రేక్షకులు కన్నీళ్లు పెట్టుకుంటారు. మా సినిమాకు అవార్డులు రావాలని కోరుకుంటున్నాను. అయితే డబ్బులు వస్తే, ఈ తరహా చిత్రాలను నిర్మించేందుకు మరింతమంది నిర్మాతలు ముందుకొస్తారు. అందుకని వసూళ్లు బాగుండాలని కోరుకుంటున్నాను'' అన్నారు ప్రవీణ్ కాండ్రేగుల. అనుపమా పరమేశ్వరన్ కథానాయికగా, దర్శనా రాజేంద్రన్, సంగీత ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రం 'పరదా'. ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వంలో శ్రీనివాసులు పీవీ శ్రీధర్ మక్కువతో కలిసి విజయ్ డొంకడ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం విలేకరుల సమావేశంలో దర్శకుడు ప్రవీణ్ మాట్లాడుతూ–''నా తొలి చిత్రం 'సినిమా బండి'కి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా చేసిన విజయ్‌గారికి 'పరదా' కథ చెప్పగా, ఎగ్జైట్ అయ్యారు. ఆ తర్వాత అనుపమ గారికి కథ వినిపించగా ఎమోషనల్ అయ్యారు. ఆ నెక్ట్స్ దర్శన, సంగీతగారు ఈ ప్రాజెక్ట్‌లోకి వచ్చారు. ఓ ఊర్లో మహిళలందరూ ఎందుకు పరదాలు ధరిస్తారనే విషయాన్ని సినిమా స్టార్టింగ్‌లోనే చెప్పాం. ఆడవాళ్లలోనే కాదు... మగవాళ్లల్లో కూడా ఒక పరదా ఉంటుందని ఈ 'పరదా'తో చెప్పే ప్రయత్నం చేశాం. 'హైవే' సినిమాలో ఆలియా భట్‌గారి నటకు నేను పెద్ద అభిమానిని. 'పరదా'లో ఆలియా స్థాయి నటను అనుపమ చేశారు. దర్శన, సంగీతగార్లు బాగా యాక్ట్ చేశారు. గోపీసుందర్ గారు మంచి మ్యూజిక్ ఇచ్చారు. మృదుల్ సేన్ అనే అమ్మాయి అద్భుతమైన విజువల్స్‌ను అందించారు. 'సినిమాబండి, శుభం, పరదా'లాంటి డిఫరెంట్ సినిమాలు చేస్తున్న నాకు కమర్షియల్ సినిమాలపై కూడా మంచి గ్రిప్ ఉంది. చాన్స్ వస్తే పెద్ద హీరోలతో కమర్షియల్ సినిమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నాను'' అని అన్నారు.

## ఓ మంచి జ్ఞాపకంలాంటి సినిమా



● నారా రోహిత్, శ్రీదేవి

''సుందరకాండ' చిత్రం ట్రైలర్‌ను లాంచ్ చేసిన ప్రభాస్‌గారికి థ్యాంక్స్. మా మూవీ ట్రైలర్, పాటలకి చాలా మంచి స్పందన వచ్చింది. మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ సినిమాని కుటుంబమంతా చూడొచ్చు. వినాయక చవితికి మా చిత్రం విడుదలవుతుండటం సంతోషంగా ఉంది. నటీనటులు, సాంకేతిక నిపుణులందరికీ ఈ సినిమా మంచి జ్ఞాపకంలా ఉంటుంది'' అని నారా రోహిత్ చెప్పారు. వెంకటేశ్ నిమ్మలపూడి దర్శకత్వంలో నారా రోహిత్, వృతి వాఘాని, శ్రీదేవి విజయ్ కుమార్ లీడ్ రోల్స్‌లో నరేశ్ విజయకృష్ణ, వాసుకి ఆనంద్ ఇతర పాత్రలు పోషించిన చిత్రం 'సుందరకాండ'. సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేశ్ మహంకాళి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో శ్రీదేవి విజయ్ కుమార్ మాట్లాడుతూ–''చాలా కాలం తర్వాత 'సుందరకాండ' లాంటి సినిమా చేయడం చాలా ఆనందాన్నిచ్చింది. మంచి వినోదాత్మక చిత్రమిది... అందరూ సంతోషంగా చూడొచ్చు'' అన్నారు. ''నా తొలి సినిమా వినాయక చవితి పండగ రోజు రిలీజ్ అవడం సంతోషంగా ఉంది. మా చిత్రం అందరికీ నచ్చుతుందనుకుంటున్నాను'' అన్నారు వెంకటేశ్ నిమ్మలపూడి. ''మా సినిమాని చూసి, మా యూనిట్‌ని ఆశీర్వదించాలి'' అని సంతోష్ చిన్నపొల్ల పేర్కొన్నారు. ''సుందరకాండ' లాంటి రొమాంటిక్ కామెడీ మూవీ ఇప్పటివరకు రాలేదు.. ఈ సినిమా అందర్నీ అలరిస్తుంది'' అన్నారు నరేశ్ విజయకృష్ణ. నటి వాసుకి మట్లాడారు.

## పోలీస్ జాబ్ వస్తే...



● మణికాంత్

'యముడికి పోలీస్ జాబ్ వస్తే ఎలా ఉంటదో చూపిస్తా..' అంటూ సునీల్ చెప్పే డైలాగ్‌తో 'ఫైటర్ శివ' టీజర్ సాగుతుంది. మణికాంత్, ఐరా బన్సల్ జంటగా సునీల్, వికాస్ వశిష్ఠ కీలక పాత్రలు పోషించిన చిత్రం 'ఫైటర్ శివ'. ప్రభాస్ నిమ్మల దర్శకత్వం వహించారు. ఉన్నం రమేశ్, నర్సింహ గౌడ్ నిర్మించారు. ఈ సినిమా టీజర్‌ని నిర్మాత సి. అశ్వనీదత్ విడుదల చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మణికాంత్ మాట్లాడుతూ–''ఫైటర్ శివ' అందర్నీ ఆకట్టుకునేలా ఉంటుంది'' అని చెప్పారు. ప్రభాస్ నిమ్మల మాట్లాడుతూ– ''ఓ సందేశాత్మక చిత్రంగా 'ఫైటర్ శివ'ని తెరకెక్కించాం'' అని తెలిపారు. ''డ్రగ్స్ నిర్మూలనకు ప్రభుత్వం చేసే పోరాటం ఆధారంగా 'ఫైటర్ శివ'ను తెరకెక్కించారు'' అన్నారు ఎమ్మెల్యే రామలింగం. ''యువతను మేల్కొలిపేలా మా 'ఫైటర్ శివ' ఉంటుంది'' అని నర్సింహ గౌడ్, ఉన్నం రమేశ్ తెలిపారు. మ్యూజిక్ డైరెక్టర్ గౌతం రవిరామ్, కెమెరామెన్ సురేందర్ రెడ్డి, నటులు శ్రీధర్, ఆనంద్, ఎడిటర్ విశ్వనాథ్ మాట్లాడారు.

## వినోదాల దెయ్యం



● 'సత్యం' రాజేశ్

'సత్యం' రాజేశ్, రియా సచ్చదేవ్ ప్రధాన పాత్రల్లో రూపొందిన చిత్రం 'ఫ్రెండ్లీ ఘోస్ట్'. జి. మధుసూదన్ రెడ్డి దర్శకత్వం వహించారు. మాస్టర్ జియాన్స్ సమర్పణలో విశ్వనాథ్ .డి.కె నిర్మించారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని హీరో మంచు మనోజ్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించే మంచి కథాంశంతో 'ఫ్రెండ్లీ ఘోస్ట్' రూపొందింది. ఈ చిత్రం మంచి విజయం సాధించి రాజేశ్, విశ్వనాథ్‌గారికి, జి. మధుసూదన్ రెడ్డిగారికి మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నాను'' అని తెలిపారు. ''సస్పెన్స్‌తో పాటు వినోదానికి పెద్ద పీట వేస్తూ 'ఫ్రెండ్లీ ఘోస్ట్'ని మధుసూదన్ రూపొందించారు. పాటలు, టీజర్, ట్రైలర్‌ను త్వరలో విడుదల చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకి సంగీతం: భీమ్స్, కెమెరా: హారిజ్ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సాయి తరుణ్.

## గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.



## తిరుమలలో గోకులాష్టమి ఆస్థానం

తిరుమల: గోకులాష్టమి సందర్భంగా టీటీడీ ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో శనివారం తిరుమలలోని గోగర్భం ఉద్యాన వనంలో కాళీయ మర్దన కృష్ణుడికి అభిషేకం ఘనంగా నిర్వహించారు. స్వామికి పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, గంధపు ముద్దతో ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం అన్నప్రసాదం పంపిణీ చేశారు. తరువాత జరిగిన ఉట్టి ఉత్సవంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సాయంత్రం 8 గంటల నుంచి 9 గంటల మధ్య తిరుమల ఆలయంలోని బంగారు వాకిలి లోపల శ్రీ కృష్ణ జన్మాష్టమి ఆస్థానం నిర్వహించారు.

## సెప్టెంబర్ 22 నుంచి శ్రీశైలంలో దసరా మహోత్సవాలు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానంలోని అన్ని విభాగాలు పరస్పర సమన్వయంతో దసరా మహోత్సవాలను విజయవంతం చేయాలని శ్రీశైలం దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు కోరారు. శనివారం దేవస్థాన పరిపాలన భవనంలోని సమీక్షా సమావేశ మందిరంలో దసరా మహోత్సవాల ఏర్పాట్లపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2 వరకు దసరా మహోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టడంలో అన్ని విభాగాలు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఆదేశించారు.

# ఫార్మా విలేజ్‌లకు భూసేకరణ గండం

- అర్ధాంతరంగా నిలిచిపోయిన 'లగచర్ల'భూ సేకరణ
- సంగారెడ్డి జిల్లా దుప్పూరులో నిలిచిన ఫార్మా విలేజ్ ప్రతిపాదన
- మిగతా జిల్లాల్లోనూ ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం
- హైదరాబాద్ ఫార్మా సిటీ భూములు ఇతర అవసరాలకు కేటాయింపు?
- ఫార్మా విలేజ్‌ల ఏర్పాటు జరగకుంటే బల్క్ డ్రగ్ పరిశ్రమపై ప్రభావం
- ఫార్మా పెట్టుబడులు కర్ణాటకకు తరలుతున్నాయంటూ ప్రచారం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఫార్మా విలేజ్‌ల ఏర్పాటుకు భూ సేకరణ సవాలుగా మారింది. వికారాబాద్ జిల్లా లగచర్లలో భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఫార్మా విలేజ్ ప్రతిపాదనను ప్రభుత్వం ఉపసంహరించుకుంది. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోనూ ఫార్మా విలేజ్ ఏర్పాటు కోసం నోటిఫికేషన్ విడుదల చేసినా.. భూసేకరణ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. మిగతా చోట్ల ఫార్మా విలేజ్‌ల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలు, భూమి లభ్యతను గుర్తించే దశలోనే అధికార యంత్రాంగం నిమగ్నమైంది. 'హైదరాబాద్ ఫార్మా సిటీ'ఏర్పాటు కోసం సేకరించిన 13వేల ఎకరాల భూమిని ఫ్యూచర్ సిటీతోపాటు యంగ్ ఇండియా యూనివర్సిటీ వంటి ఇతర అవసరాలకు ప్రభుత్వం కేటాయిస్తుందనే ప్రచారం జరుగుతోంది. మరోవైపు రాష్ట్రంలో ఫార్మా యూనిట్ల ఏర్పాటుకు భూకేటాయింపుల కోసం పారిశ్రామికవేత్తలు ప్రభుత్వాన్ని సంప్రదిస్తున్నారు.

### పది ఫార్మా విలేజ్‌లకు ప్రతిపాదన

ఫార్మారంగానికి రాష్ట్రాన్ని అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఫార్మా విలేజ్‌లు (లైఫ్ సైన్సెస్ హబ్)లు ఏర్పాటు చేస్తామని 2024 ఫిబ్రవరి 27న జరిగిన బయో ఆసియా సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేశారు. హైదరాబాద్ మినహా మిగిలిన 9 ఉమ్మడి జిల్లా పరిధిలో రూ.లక్ష కోట్ల పెట్టుబడులు, 5 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. రెండు వేల నుంచి మూడు వేల ఎకరాల విస్తీర్ణంలో ఫార్మా విలేజ్‌ల ఏర్పాటుకు 20వేల ఎకరాలు అవసరమవుతాయని అంచనా వేశారు.

### తొలి దశలో లగచర్ల, న్యాల్‌కల్‌లో..

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం పరిధిలో ఫార్మా విలేజ్ కోసం భూ సేకరణకు 2024 జూలై 19న ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. లగచర్ల, దుద్యాలలో 580 మంది రైతుల నుంచి 1,358 ఎకరాలు సేకరిస్తామని చెప్పింది. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం డప్పూరు, వడ్డి, మల్గి గ్రామాల్లోనూ మరో ఫార్మా విలేజ్ ఏర్పాటుకు అవసరమయ్యే 2003.39 ఎకరాల భూ సేకరణకు 2024 ఆగస్టు 6న నోటిఫికేషన్ విడుదల చేశారు. అయితే ఫార్మా విలేజ్‌తో తాము ఉపాధి కోల్పోతామని లగచర్ల రైతులు చేపట్టిన ఆందోళన తీవ్ర రూపం దాల్చడంతో ప్రభుత్వం ఈ ప్రతిపాదనను వెనక్కి తీసుకుంది. అయితే ఫార్మా విలేజ్‌కు బదులుగా 'మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్కు'ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించి 1,358 ఎకరాల భూసేకరణకు గత నవంబర్ 29న మరో నోటిఫికేషన్ విడుదల చేసింది.

మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు భూసేకరణ ప్రక్రియ దాదాపు పూర్తి కాగా, మరో 150 ఎకరాల మేర సేకరించాల్సి ఉందని ప్రభుత్వ వర్గాలు చెప్పాయి.

### హైదరాబాద్ ఫార్మాసిటీ ఏర్పాటు పైనా..

రంగారెడ్డి జిల్లా యాచారం, కందుకూరు మండలాల పరిధిలో 19వేల ఎకరాల్లో హైదరాబాద్ ఫార్మా సిటీ ఏర్పాటుకు గత ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇప్పటివరకు 11వేల ఎకరాల మేర భూ సేకరణ జరగ్గా, ఇందులో కొన్ని న్యాయపర వివాదాలు సాగుతున్నాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ ఫార్మా సిటీ లక్ష్యాన్ని పునర్నిర్వచిస్తూ గ్రీన్ ఫార్మాసిటీతోపాటు సకల హంగులతో కూడిన ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఇందులో యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీ, ఏఐ సిటీ వంటి ప్రాజెక్టులను ప్రకటించింది. ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను అదే అవసరాలకు ఉపయోగించాలని లేని పక్షంలో తమ భూములు తిరిగి అప్పగించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఓ వైపు ఫార్మా విలేజ్‌లకు భూసేకరణ క్లిష్టంగా మారుతుండగా, మరోవైపు పొరుగునే ఉన్న కర్ణాటక ఫార్మా పెట్టుబడిదారులను ఆకట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తోందని పరిశ్రమల శాఖ వర్గాలు చెబుతున్నాయి.

ఇదిలాఉంటే న్యాల్‌కల్‌లోనూ రైతుల నుంచి వ్యతిరేకత వెల్లువెత్తడంతో భూసేకరణ ప్రక్రియ నిలిచిపోయింది. ఇతర జిల్లాల నుంచి ఫార్మా విలేజ్‌ల ఏర్పాటుకు అవసరమైన భూమి లభ్యతకు సంబంధించి తమకు ఎలాంటి సమాచారం లేదని టీజీఐఐసీ వర్గాలు చెప్తున్నాయి.

## అమెరికాకు బయల్దేరిన కవిత



సాక్షి, హైదరాబాద్: తన చిన్న కుమారుడు ఆర్యను అమెరికాలోని కాలేజీలో చేర్పించేందుకు బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కె.కవిత శనివారం బయల్దేరి వెళ్లారు. శంషాబాద్ విమానాశ్రయంలో ఆమెకు వీడ్కోలు పలికేందుకు.. భర్త అనిల్, కుటుంబ సభ్యులతో పాటు తెలంగాణ జాగృతి నాయకులు, కార్యకర్తలు వచ్చారు. పెద్ద కుమారుడు ఆదిత్య, చిన్న కుమారుడు ఆర్యతో కలిసి అమెరికా వెళ్లారు.

## 'ప్రభుత్వ పథకాల బోర్డు' పనిచేయదేం?



సాక్షి, హైదరాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయం గేట్-2 నుంచి వెళ్లే దారిలో భారీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఈ స్క్రీన్‌లో ప్రభుత్వ పథకాలు, ప్రజలకు ఇచ్చిన హామీలు, నెరవేర్చిన పథకాలు, ప్రభుత్వం చేసిన పనులు ఇందులో చూపించేలా ఏర్పాటు చేశారు. అయితే దీన్ని ఏర్పాటు చేసి నెలలు గడుస్తున్నా.. ఒక్కసారి కూడా పనిచేసింది లేదు. సమాచారం ఇచ్చింది లేదు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే ప్రజలు, అర్జీదారులకు కనిపించేలా ఏర్పాటు చేసిన అధికారులు.. దీని నిర్వహణ మాత్రం అటకెక్కించారు. లక్షలు దారపోసి ఏర్పాటు చేసిన ఈ స్క్రీన్‌బోర్డు ఒక్కసారైనా ప్లే అయితే చూద్దామనుకునేవారికి నిరాశే తప్ప.. అది ప్లే అయిన దాఖలాలు లేవు. అయినా ఈ బోర్డు ఏర్పాటు చేసింది ఎందుకు? డిస్‌ప్లే కాకుండా కేవలం ద్వారం ముందు బొమ్మలా ఉంచడం ఎందుకు అంటూ ప్రజలు అసహనం వ్యక్తంచేస్తున్నారు.

## 1 నుంచి నెలవారీ రేషన్ కోటా



సాక్షి, హైదరాబాద్: సెప్టెంబర్ 1 నుంచి యథావిధిగా ప్రజా పంపిణీ కేంద్రాల (రేషన్ దుకాణాలు) ద్వారా సన్న బియ్యం సరఫరా చేసేందుకు పౌరసరఫరాల శాఖ సిద్ధమవుతోంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో జూన్ నెలలో ఒకేసారి మూడు నెలల కోటా బియ్యం పంపిణీ చేసిన నేపథ్యంలో జూలై, ఆగస్టు నెలల్లో రేషన్ దుకాణాలు మూసివేశారు. సెప్టెంబర్ నుంచి తిరిగి నెలవారీ సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు సెప్టెంబర్ నెల కోటా సన్న బియ్యాన్ని రాష్ట్ర స్థాయి గోదాముల (స్టేజ్-1) నుంచి మండల్ లెవల్ స్టాక్ (ఎంఎల్‌ఎస్) పాయింట్లకు పంపించేందుకు అవసరమైన ఏర్పాట్లను పౌరసరఫరాల సంస్థ పర్యవేక్షిస్తోంది. సోమవారం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభించాలని నిర్ణయించినట్లు సమాచారం. కొత్తగా రేషన్‌కార్డులు పొందిన వారందరికీ సెప్టెంబర్ నెలలో సన్నబియ్యం పంపిణీ చేయాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికార యంత్రాంగానికి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. కాగా, ఈసారి లబ్ధిదారులకు బియ్యంతో పాటు చేతి సంచిని (బ్యాగ్) అందజేయనున్నట్టు పౌర సరఫరాల శాఖ వెల్లడించింది.

## సీఎం రిలీఫ్ ఫండ్ స్కాంలో ఆరుగురి అరెస్ట్

- నిందితుల నుంచి రూ.9.30 లక్షలు స్వాధీనం
- కేసు వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ కె.నరసింహ



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కె.నరసింహ

సూర్యాపేటటౌన్ : సీఎం రిలీఫ్ ఫండ్ స్కాం కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహ తెలిపారు. నిందితుల నుంచి రూ.9.30 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ కేసు వివరాలను వెల్లడించారు. 'గతంలో కోదాడ ఎమ్మెల్యేగా బొల్లం మల్లయ్యయాదవ్ ఉన్న సమయంలో ఆయన సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా చెడపంగు నరేశ్, ప్రైవేట్ పీఏలుగా ఉప్పల మధు, మర్ల వీరబాబు పనిచేశారు. వీరిలో మధు, వీరబాబులు క్యాంప్ ఆఫీసుకు వచ్చే సీఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తులకు సంబంధించిన వ్యవహారాలు చూసేవారు. గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ వచ్చే సమయానికి 44 చెక్కులు పెండింగ్‌లో ఉండగా వాటిని దురుద్దేశంతో కాజేయాలని పథకం వేశారు. వీరికి తోడుగా సురగాని రాంబాబు అనే వ్యక్తి కూడా జత కలిశాడు. అలాగే వీరికి శాసన మండలిలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసే గుంటుక సందీప్‌తో స్నేహం ఉంది. సందీప్‌కు ఉన్న పరిచయాలతో వాలిడేషన్ డేట్ దాటి పోయిన 44 చెక్కులను రీవాలిడేషన్ చేయించారు. ఆ చెక్కులలో ఉన్న లబ్ధిదారుల పేర్లకు సరిపోలే పేర్లు కలిగిన ఇతర వ్యక్తులకు కమీషన్ ఆశ చూపించి, వారితో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను డ్రా చేస్తూ.. వచ్చిన డబ్బులను పంచుకున్నారు. ఈ చెక్కులను డ్రా చేసే విషయంలో నిందితుడైన నరేశ్ స్నేహితుడు రంగిశెట్టి వెంకట్రావు వీరికి సహకరించాడు. ఈ విధంగా 38 చెక్కులను డ్రా చేసుకుని రూ.13 లక్షల 63 వేలు కాజేశారు'అని ఎస్పీ వివరించారు. కోదాడ పోలీసులు ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా వారు నేరం ఒప్పుకున్నారన్నారు. వారి వద్ద నుంచి ఇంకా డ్రా చేయకుండా ఉన్న 6 చెక్కులు, రూ.9.30 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.

## సాగు న్యాయయాత్ర @ 1,000 కి.మీ.

- రైతులకు చట్టాలపై అవగాహనే లక్ష్యంగా సాగుతూ..
- అక్టోబర్ 2న బాపూఘాట్ వద్ద ముగియనున్న యాత్ర



సాగు న్యాయ యాత్రలో ఎం సునీల్ కుమార్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: 'చెరువులు, కుంటలు, కాల్వల్లో ఉన్న నీరు దానంతట అదే పొలంలోకి రాదు. ఆ నీటిని పొలంలోకి తెచ్చుకునేందుకు ప్రయత్నాలు చేయాలి. అలాగే చట్టాలున్నాయి కదా అని వదిలేస్తే వాటి వల్ల న్యాయం జరగదు. చట్టం గురించి తెలుసుకుని హక్కులను కాపాడుకుంటేనే ప్రయోజనం...' అంటూ రైతాంగానికి అవసరమైన చట్టాల గురించి అవగాహన కల్పించడమే లక్ష్యంగా లీగల్ ఎంపవర్‌మెంట్ అండ్ అసిస్టెన్స్ ఫర్ ఫార్మర్స్ సొసైటీ (లీఫ్స్) సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన సాగు న్యాయ యాత్ర 1000 కి.మీ. పూర్తి చేసుకుంది. గత జూన్ 28న భూదాన్ పోచంపల్లిలో ప్రారంభమైన ఈ యాత్ర ఇప్పటివరకు ఏడు జిల్లాల్లో ఉన్న 40 మండలాల మీదుగా సాగింది. 4 వేల మందికి పైగా రైతులతో సమావేశమై వారికి చట్టాల గురించి అవగాహన కల్పించే ప్రయత్నం చేసింది. భూచట్టాల నిపుణుడు ఎం.సునీల్ కుమార్ నేతృత్వంలో జరుగుతున్న ఈ యాత్ర అక్టోబర్ 2న హైదరాబాద్‌లో బాపూఘాట్ వద్ద ముగియనుంది.

### ఈ యాత్ర ఎందుకు?

దేశంలో చట్టాలపై పేదలు, రైతులకు అవగాహన చాలా తక్కువ. ఈ నేపథ్యంలోనే ఆర్థిక స్తోమత లేని వారికీ న్యాయం దూరం కాకూడదనే ఉద్దేశంతో 1996లోనే కేంద్రం ఉచిత న్యాయ సేవల చట్టం తెచ్చింది. ఈ చట్టం వచ్చి మూడు దశాబ్దాలవుతున్నా సాగు రంగంపై రైతుకు అవగాహన కల్పించే ప్రయత్నం జరగలేదు. అందుకే లీఫ్స్ సంస్థ దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో సాగు న్యాయ యాత్ర చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 2,500 కి.మీ. తిరిగి రైతులకు అవగాహన కల్పించే లక్ష్యంతో యాత్ర సాగుతోంది. 'రైతుకు అవసరమైన ఆరు ప్రధానాంశాలపై చట్టపరమైన అవగాహన కల్పిస్తున్నాం. భూమి, విత్తనం, సాగునీరు, పంటరుణాలు, పంటల బీమా, మార్కెట్ చట్టాల గురించి వివరిస్తున్నాం. చట్టం రైతుకు చుట్టం కావాలి. ఇదే మా లక్ష్యం' అని సునీల్‌కుమార్ చెప్పారు.

## 70 మంది గురుకుల విద్యార్థులకు అస్వస్థత




విద్యార్థులకు వైద్యం చేస్తున్న దృశ్యం

పుల్‌కల్ (అందోల్): 70 మంది గురుకుల విద్యార్థులు అస్వస్థత కు గురయ్యారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా పుల్‌కల్ మండలంలో చోటు చేసుకుంది. సింగూరు గురుకుల పాఠశాలలో విద్యార్థులు మూడు రోజుల నుంచి అస్వస్థతకు గురికావడంతో శనివారం పుల్‌కల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ సాయికిరణ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తున్నారు. గురుకుల పాఠశాల లోనే వైద్యశిబిరం నిర్వహించి అవసరమున్న విద్యార్థులకు సెలైన్‌లు ఎక్కిస్తున్నారు. 70 మంది విద్యార్థులకు వైద్యం అందిస్తున్నామని ప్రిన్సిపాల్ తెలి పారు. కాగా, విద్యార్థులకు జ్వరాలు రావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను గురుకుల పాఠశాల నుంచి ఇంటికి తీసుకెళ్తున్నారు.

**శ్రీకృష్ణుడి ఆయుధమైన సుదర్శన చక్రం స్ఫూర్తితో.. దేశానికి భద్రతా కవచాన్ని ఏర్పాటు చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ఆగస్టు 15న ప్రకటించారు. దీంతో ప్రపంచదేశాల దృష్టి ఒక్కసారిగా మనపై పడింది. నిజమే.. రక్షణ రంగంలో ఇప్పుడున్నది ఒకప్పటి భారత్ కాదు. గత పదేళ్లలోనే రక్షణ రంగంలో ఉత్పత్తుల విలువ పెరగడం.. దిగుబడులు తగ్గడమే ఇందుకు నిదర్శనం. అప్పట్లో మన ఆయుధాల్లో 65 శాతం దిగుమతులే. అది ఇప్పుడు 35 శాతానికి పరిమితం చేయగలిగాం. 'మేడిన్ ఇండియా' ఆయుధాలతో మన సత్తా ఏంటో ఇటీవలే 'ఆపరేషన్ సిందూర్'తో ప్రపంచానికి చాటాం.**

త్వరలో దేశానికి సుదర్శన చక్ర రక్షణ వ్యవస్థ రానుంది. ఇందులో భాగంగా దేశంలోని కీలక ప్రాంతాలను గగనతల దాడుల నుంచి రక్షించేలా బహుళ అంచెల కవచాన్ని ఏర్పాటు చేయనున్నారట. అంతేకాదు, ప్రతిదాడి వ్యవస్థను కూడా రూపొందిస్తారు. యాంటీ బాలిస్టిక్ మిస్సైల్ సిస్టం వంటి వాటితో ఇది ఇజ్రాయెల్ ఐరన్‌డోమ్ తరహాలో పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇది రక్షణ ఉత్పత్తుల్లో మన దేశం స్వయం సమృద్ధి దిశగా పయనిస్తోందనడానికి ప్ర'బల' నిదర్శనం. - సాక్షి, స్పెషల్ డెస్క్



# నా దేశం.. శత్రుదుర్భేద్యం!

### ఎగుమతుల జోరు

2013-14లో రూ.686 కోట్లుగా ఉన్న మన రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు.. 2024-25 నాటికి ఏకంగా 34 రెట్లు పెరిగి రూ.23,622 కోట్లకు చేరాయి. ఈ ఎగుమతుల్లో రక్షణ రంగ సంస్థలు, ఇతర ప్రభుత్వ సంస్థల వాటా 77 శాతం కాగా.. ప్రైవేటు రంగ వాటా 23 శాతం కావడం విశేషం. వీలైనంత త్వరలో రక్షణ పరికరాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించే దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. మనదేశ రక్షణ ఉత్పత్తులు అమెరికా, ఫ్రాన్స్ వంటి 100 దేశాలకు వెళ్తున్నాయి.

### అమెరికా వాటా 10% లోపే!

గత దశాబ్దకాలంలో మనదేశ రక్షణ దిగుమతులు తగ్గుతూ వస్తున్నాయి. మనకు ప్రధాన ఎగుమతిదారులు రష్యా, ఫ్రాన్స్. స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిప్రి) గణాంకాల ప్రకారం..

మన మొత్తం దిగుమతుల్లో సుమారు 40 శాతం రష్యా నుంచే వస్తున్నాయి.

2020లో ఫ్రాన్స్ నుంచి దిగుమతులు 25 శాతానికిపైగా ఉంటే.. 2021లో ఏకంగా 50 శాతానికి పెరిగాయి. ఆ తరవాత తగ్గుతూ 2024లో సుమారు 15 శాతానికి పరిమితమయ్యాయి.

మొత్తం దిగుమతుల్లో ఇజ్రాయెల్ నుంచి 2022 వరకు 10 శాతంగానే ఉన్న వాటా.. 2023లో ఒక్కసారిగా 40 శాతానికి చేరింది. 2024లో అది సుమారు 28 శాతానికి చేరింది.

2020 నుంచి చూస్తే అమెరికా వాటా ఎప్పుడూ 20 శాతం కూడా దాటలేదు. ప్రస్తుతం 10 శాతంలోపే ఉంది.

### రక్షణ రంగంలో స్వయంసమృద్ధి దిశగా అడుగులు

2024-25లో రక్షణ ఉత్పత్తుల విలువ రూ.లక్షన్నర కోట్లు

పదేళ్లలో మూడు రెట్లకుపైగా పెరిగిన డిఫెన్స్ ఉత్పత్తులు

2013-14లో రూ.686 కోట్లుగా ఉన్న రక్షణ ఎగుమతులు

దశాబ్దకాలంలో 34 రెట్లు పెరిగి రూ.23,622 కోట్లకు చేరిక

ఇప్పుడు 'సుదర్శన చక్రం'తో దుర్భేద్యంగా భారతావని

### ఉత్పత్తుల్లో రికార్డు



2013-14లో దేశ రక్షణ రంగ బడ్జెట్ రూ.2.53 లక్షల కోట్లు. 2025-26లో అది 2.6 రెట్లు పెరిగి రూ.6.81 లక్షల కోట్లకు చేరింది. 2024-25లో మనదేశం రికార్డు స్థాయిలో రూ.2.09 లక్షల కోట్ల విలువైన 193 డిఫెన్స్ కాంట్రాక్టులు కుదుర్చుకుంది. ఇందులో 1.69 లక్షల కోట్ల విలువైన 177 కాంట్రాక్టులు దేశీయ సంస్థలవే కావడం గమనార్హం.

2014-15లో దేశ రక్షణ ఉత్పత్తుల విలువ రూ.46,429 కోట్లు. 2024-25లో ఇది రికార్డు స్థాయిలో రూ.1.50 లక్షల కోట్లకు చేరిందని ఇటీవల కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. అంటే మూడు రెట్లకుపైగా పెరిగింది! 2019-20లో ఇది కేవలం రూ.79,071 కోట్లే. అంటే 5 ఏళ్లలోనే దాదాపు రెట్టింపయిందన్నమాట.

### గత 5 ఏళ్లలో..

2021లో రష్యా నుంచి అత్యధికంగా 1,222 ఆయుధాలు దిగుమతి చేసుకుంటే ఆ సంఖ్య క్రమంగా తగ్గి, 2024లో 463కు చేరింది. 2020-25 మధ్య ఏ దేశం మనకు ఎన్నెన్ని ఆయుధాలు సరఫరా చేసిందంటే...

| దేశం | ఆయుధాల సంఖ్య | దేశం | ఆయుధాల సంఖ్య |
|---|---|---|---|
| రష్యా | 4,273 | అమెరికా | 1,136 |
| ఫ్రాన్స్ | 3,917 | యూకే | 355 |
| ఇజ్రాయెల్ | 1,495 | దక్షిణ కొరియా | 217 |
| | | జర్మనీ | 175 |

### ఆ మూడు దేశాలే..

మనదేశానికి యుద్ధ విమానాల సరఫరాలో ఫ్రాన్స్ కీలకపాత్ర పోషిస్తోంది. 2020-25 మధ్య రికార్డు స్థాయిలో 2,543 సరఫరా చేయగా, రష్యా నుంచి 1,280 దిగుమతి చేసుకున్నాం. ఇక మిస్సైళ్ల విషయానికొస్తే రష్యా నుంచి 1,149, ఇజ్రాయెల్ నుంచి 802 వచ్చాయి. శత్రువుల దాడులను తట్టుకోగలిగే దుర్భేద్యమైన రక్షణ వాహనాలు రష్యా నుంచి మాత్రమే 963 వచ్చాయి. గగన తల భద్రతా వ్యవస్థలు రష్యా నుంచి 390, ఇజ్రాయెల్ నుంచి 376 వచ్చాయి. ఫ్రాన్స్ నుంచి 899, రష్యా నుంచి 304 షిప్స్ దిగుమతి చేసుకున్నాం.

**ఏయే ఆయుధాల కోసం ప్రధానంగా ఏయే దేశాలపై ఆధారపడుతున్నామంటే..**

విమానాలు: ఫ్రాన్స్, రష్యా, అమెరికా
గగనతల రక్షణ వ్యవస్థలు: రష్యా, ఇజ్రాయెల్
దుర్భేద్యమైన రక్షణ వాహనాలు: రష్యా
మిస్సైళ్లు: రష్యా, ఇజ్రాయెల్, ఫ్రాన్స్
సెన్సర్లు: ఇజ్రాయెల్, జర్మనీ, ఫ్రాన్స్
షిప్స్ : ఫ్రాన్స్, రష్యా



# ఖమ్మం జిల్లాలో నీలి పుట్టగొడుగులు

**అరుదైన జాతిని గుర్తించిన అధికారులు**
**ఇవి విషపూరితమని, తినొద్దని సూచన**



ఖమ్మం వ్యవసాయం: ఖమ్మం జిల్లాలోని పులిగుండాల అటవీ ప్రాంతంలో అరుదైన నీలి పుట్టగొడుగులను అటవీ శాఖ అధికారులు గుర్తించారు. వీటిని 'బ్లూ పిన్కిగిల్ మష్రూమ్ ఎంటొలోమా హోచెస్టెటెరి'జాతికి చెందిన పుట్టగొడుగులుగా నిర్ధారించారు. గతంలో ఆదిలాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ అటవీ విభాగంలో ఈ జాతి పుట్టగొడుగును గుర్తించగా, ఇప్పుడు ఖమ్మం జిల్లాలో కనిపించాయి. ఈ నీలిరంగు పుట్టగొడుగులకు పలు ప్రత్యేకతలు ఉన్నాయి. ఇది ఆకర్షణీయంగా ఆకాశ నీలిరంగులో ఉంటుంది. దీంతో దీన్ని స్కై బ్లూ మష్రూమ్ అని అంటారు. న్యూజిలాండ్‌కు చెందిన ఈ జాతి మనదేశంలో అరుదుగా కనిపిస్తోంది. ఎంటొలోమా జాతికి చెందిన ఈ పుట్టగొడుగులు విషపూరితమని అటవీ అధికారులు భావిస్తున్నారు. దీంతో వీటిని ఆహారంగా వినియోగించవచ్చా.. లేదా అన్న అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. కాగా, పులిగుండాల అటవీ ప్రాంతంలో ఈ పుట్ట గొడుగు కనిపించడంతో ఖమ్మం అటవీ ప్రాంతంలో జీవవైవిధ్యం ప్రత్యేకతను సంతరించుకుంది.

### అధ్యయనానికి చర్యలు



ఖమ్మం అడవుల్లో అరుదైన పుట్టగొడుగు జాతి దర్శనమిచ్చింది. ఇది ఇక్కడి పర్యావరణ ప్రాధాన్యతను మరింతగా బలపరుస్తోంది. జీవవైవిధ్యం రక్షణలో ఇది ఒక ముఖ్యమైన అడుగు. అయితే, ప్రజలు అడవుల్లో తెలియని పుట్టగొడుగులను తాకొద్దు, తినొద్దు. ఎందుకంటే ఇవి విషపూరితమై ఉండొచ్చు. అందువల్ల ఈ జాతిపై మరింతగా అధ్యయనం చేయనున్నాం.
–సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, ఖమ్మం జిల్లా అటవీ అధికారి

# 'ఖజానా' దోచింది బిహార్ గ్యాంగే!

- చోరీ ఘటనలో ఇద్దరి అరెస్ట్
- 10 కిలోల వెండి ఆభరణాల్లో 900 గ్రాముల స్వాధీనం



గచ్చిబౌలిలోని మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాదాపూర్ డీసీపీ వినీత్





నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న 900 గ్రాముల వెండి ఆభరణాలు

చందానగర్: సంచలనం సృష్టించిన ఖజానా జ్యువెలరీ దోపిడీ కేసులో బిహార్‌కు చెందిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్‌చేశారు. శనివారం గచ్చిబౌలిలోని మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ వినీత్ ఈమేరకు మీడియాకు వెల్లడించారు. ఈ నెల 12న చందానగర్‌లోని ఖజానా షోరూంలో ఆరుగురు దొంగలు ముసుగులు ధరించి దొరికినకాడికి వెండి వస్తువులను అపహరించారు. దీన్ని చాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలను నియమించి 48 గంటల్లోనే ఇద్దరిని పట్టుకున్నారు.


**వీరి టార్గెట్ పెద్ద బంగారు దుకాణాలే...**

బిహార్‌కు చెందిన ఆశిష్ (22)తోపాటు మరో ఐదుమంది జీడిమెట్లలోని ఆస్బెస్టస్ కాలనీలో అద్దె ఇల్లు తీసుకొని కూలి పనులు చేసుకుంటున్నారు. వీరిని బిహార్‌లోని శరణ్, శివాన్ జిల్లాలకు చెందిన వారీగా గుర్తించారు. జగద్గిరిగుట్టలో ఉంటున్న ఆశిష్ స్నేహితుడు దీపక్ కుమార్ (22) వీరికి కావలసిన సౌకర్యాలు చూసుకుంటున్నాడు. వీరు ఏ1 మోటార్స్ వద్ద రెండు సెకండ్ హ్యాండ్ బైకులు కొనుగోలు చేశారు. కొద్దిరోజుల నుంచి ఆరుగురు మూడు జ్యువెలరీ దుకాణాలపై రెక్కీ నిర్వహించారు. అయితే ఖజానా జ్యువెలరీ వద్ద భద్రత తక్కువ ఉండటంతో దీన్ని లక్ష్యంగా ఎంచుకున్నారు. బిహార్‌లోని శరణ్ జిల్లాకు చెందిన ఆశిష్ గ్యాంగ్ టార్గెట్ పెద్ద బంగారు దుకాణాలే. ఒకసారి ఒక నగరంలో దొంగతనం చేస్తే మళ్లీ ఆ నగరానికి రాకపోవడం వీరి ప్రత్యేకత. ఇప్పటివరకు బిహార్, రాజస్తాన్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్‌లో దొంగతనాలు చేశారు. ఈ గ్యాంగ్ తెలుగు రాష్ట్రాల్లో దోపిడీ చేయడం ఇదే మొదటిసారి. వీరు దోచుకున్న ఆభరణాలను బిహార్, ఢిల్లీలో విక్రయిస్తుంటారు. వేర్వేరు రాష్ట్రాల్లో గ్యాంగ్ ముఖ్యనాయకుడిపై రెండు హత్య కేసులు సహా మొత్తం 10 కేసులుండగా, ఆశిష్‌పై 4 కేసులున్నాయి.

**దొంగ చిక్కాడు ఇలా....**

ఖజానాలో చోరీ అనంతరం ఆరుగురు నిందితులు రెండు బైకులపై బీదర్ వైపు వెళ్లారు. ప్రధాన రోడ్లపై కాకుండా గ్రామాల వైపు నుంచి రాష్ట్రాన్ని దాటారు. బైకులను రాష్ట్ర సరిహద్దు వద్ద వదిలేసి ప్రజా రవాణాలో వెళ్లారు. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నిందితులు వాడిన సెల్‌ఫోన్ టవర్ ఆధారంగా గుర్తించి బీదర్ నుంచి వారిని వెంబడించారు. వారు బీదర్ వద్ద త్రుటిలో పోలీసుల నుంచి తప్పించుకున్నారు. దీంతో రెండు పోలీసు బృందాలు కర్ణాటక, మహారాష్ట్ర వెళ్లాయి. ఈ క్రమంలో పుణేలో ఆశిష్‌ను పట్టుకున్నారు. తర్వాత వీరికి సహకరించిన దీపక్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. త్వరలోనే మిగతా వారందరినీ పట్టుకుంటామని డీసీపీ వినీత్ తెలిపారు. 'జ్యువెలరీ షోరూంల నిర్వాహకులు దుకాణంలో చొరబాటు హెచ్చరిక అలారమ్‌ను బిగించుకోవాలి. ఆ అలారమ్ స్థానిక పోలీస్ స్టేషన్‌కు అనుసంధానమై ఉండాలి' అని చెప్పారు.

# స్పెషల్ బస్సు.. ఫ్రీ లేదు





కదిరి అర్బన్: స్పెషల్ సర్వీసు పేరుతో ఆర్టీసీ అధికారులు మహిళల ఉచిత ప్రయాణానికి బ్రేక్ వేశారు. దీనిపై మహిళల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శ్రావణ శనివారం సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లా నల్లచెరువు మండలం పాలపాటిదిన్నె ఆంజనేయస్వామిని దర్శించుకుందామని ఎంతో ఆశతో బయలుదేరిన మహిళా భక్తులకు నిరాశ మిగిలింది. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులకే 'స్పెషల్ సర్వీసులు' అని పేర్కొంటూ.. స్త్రీ శక్తి పథకం కింద 'మహిళలకు ఉచిత ప్రయాణం లేదు' అని పోస్టర్లు అతికించారు. దీంతో మహిళా భక్తులు అధికారులు, ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించారు. రాష్ట్రమంతా మహిళలకు ఉచిత ప్రయాణమని గొప్పలు చెబుతూనే ఇలా మెలికలు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. దీనిపై కదిరి ఆర్టీసీ డీఎం మైనోద్దీన్ మాట్లాడుతూ.. పాలపాటిదిన్నెకు మొత్తం 7 స్పెషల్ సర్వీసులు వేశామని, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వాటిలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం లేదని చెప్పారు.



అందెశ్రీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

# నిజమైన ఉద్యమకారులు ఆ విషయం చెప్పకోరు

- అందుకే కవి అందెశ్రీ కూడా ఏనాడూ ఉద్యమకారుడినని చెప్పుకోలేదు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- అందెశ్రీ ప్రచురించిన 'హసిత భాష్పాలు' పుస్తకాన్ని ఆవిష్కరించిన సీఎం

వెంగళరావునగర్ (హైదరాబాద్): తెలంగాణలో నిజమైన ఉద్యమకారులు ఎవరూ కూడా తాము ఉద్యమకారులమని చెప్పుకోరని, అదేవిధంగా ప్రముఖ కవి అందెశ్రీ కూడా తాను ఏనాడూ తెలంగాణ ఉద్యమకారుడినని చెప్పుకోలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అందెశ్రీ ప్రచురించిన 'హసిత భాష్పాలు'అనే పుస్తకావిష్కరణ కార్యక్రమం శనివారం వెంగళరావునగర్‌లోని జెన్‌కో ఆడిటోరియంలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పుస్తక రచయిత శ్రీరామ్ పాలమూరు బిడ్డ కావడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. కాగా, తాము ఉద్యమకారులమని చెప్పుకుంటున్న వారికి సొంతంగా టీవీ చానళ్లు, పేపర్లు, వేలకోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. తాను ఎవరినీ శత్రువుగా చూడనని, అలా చూడాలంటే వారికి ఆ స్థాయి ఉండాలని పేర్కొన్నారు. నచ్చని వారి మీద అధికారాన్ని ఉపయోగించేంత మూర్ఖుడిని కాదని, రాష్ట్ర ప్రజలు తనపై పెద్ద బాధ్యత పెట్టారని, ప్రజల అభ్యున్నతి కోసమే అధికారాన్ని ఉపయోగిస్తానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గూడ అంజయ్య, అందెశ్రీ, గద్దర్, గోరటి వెంకన్న లాంటి కవులు తెలంగాణ ప్రజల్లో స్ఫూర్తిని నింపారని పేర్కొన్నారు. 109 దేశాల నుంచి వచ్చిన సుందరీమణులతో 'జయ జయహే తెలంగాణ'పాట పాడించానని.. ఇంతకన్నా ఏం కావాలని అన్నారు. తెలంగాణ తల్లి ముందు వారు మోకరిల్లేలా చేశానన్నారు. 2047 నాటికి రాష్ట్రాన్ని ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే తన లక్ష్యమని, ప్రపంచంలోనే గొప్ప రాష్ట్రంగా తెలంగాణను మారుస్తానని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు.

# హృద్యంగా.. సరికొత్తగా..

- గుండె మార్పిడి రోగులకు రియల్ టైం సమాచారం కోసం వాట్సాప్ గ్రూప్
- హార్టియెస్ట్ పీపుల్ పేరిట సేవలందిస్తున్న 240 మంది గుండెమార్పిడి చేయించుకున్న వ్యక్తులు





సాక్షి, హైదరాబాద్: వారంతా సరికొత్త హృదయాలతో కొంగొత్త జీవనం గడుపుతున్నారు.. కానీ ఆ పునర్జన్మ పొందేందుకు పడిన కష్టనష్టాలు, వ్యయప్రయాసలు తమ లాంటి వైద్య పరిస్థితి ఎదుర్కొంటున్న వారికి రాకూడదని నిర్ణయించుకున్నారు. అందుకే గుండె మార్పిడి శస్త్రచికిత్సల కోసం నిరీక్షిస్తున్న రోగుల కోసం నిరంతరం హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్ల సంబంధ సమాచారం అందించేందుకు వీలుగా హార్టియెస్ట్ పీపుల్ పేరిట ఓ వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా గుండె మార్పిడి ఆపరేషన్లు చేయించుకున్న 240 మంది వ్యక్తులు, వారి కుటుంబీకులు కలిసి దీన్ని నిర్వహిస్తున్నారు. గుండె మార్పిడికి ముందు, ఆ తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తల వివరాలను ఎప్పటికప్పుడు గ్రూప్‌లో షేర్ చేస్తూ రోగులు, వారి కుటుంబ సభ్యులకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు.


**కీలక సమయంలో సహాయం..**

గ్రూప్ వ్యవస్థాపక సభ్యురాలు, గ్రూప్ అడ్మిన్లలో ఒకరైన ముంబైకి చెందిన ఆర్నెటీ హోమి ఇందులో కీలకంగా వ్యవహరిస్తున్నారు. పదేళ్ల క్రితం గుండె మార్పిడి ఆపరేషన్ కోసం తన కుమార్తెను ఎయిర్ అంబులెన్స్‌లో చెన్నైకి తరలించే క్రమంలో ఎదురైన సమస్యలు, సవాళ్లు ఇతర రోగులకు ఎదురవకుండా చూసేందుకే వాట్సాప్ గ్రూప్‌కు శ్రీకారం చుట్టినట్లు ఆమె పేర్కొన్నారు. 'చాలా మంది గుండె, ఇతర అవయవాల మార్పిడి కోసం చిన్న పట్టణాల నుంచి ముంబై, ఢిల్లీ, చెన్నై వంటి మహానగరాలకు వెళ్లాల్సి ఉంటుంది. ఈ కీలక సమయంలోనే మా గ్రూప్ సభ్యులు అవసరమైన సహాయం చేస్తారు'అని హోమి వివరించారు. ఐఐటీ బాంబే మాజీ ప్రొఫెసర్, ఏడేళ్ల క్రితం గుండె మార్పిడి చేయించుకున్న డా. వినీ కిర్పాల్ సైతం ఈ గ్రూప్‌లో చేరారు. తనకు ఎదురైన అనుభవాల సారంతో ఇప్పటికే 'న్యూ లైఫ్ న్యూ బిగినింగ్స్'పుస్తకం ద్వారా అవయవ గ్రహీతలు, దాతలు, అవయవ మార్పిడి వైద్యుల విశ్లేషణలు, అభిప్రాయాలను వినీ కిర్పాల్ వెలుగులోకి తీసుకొచ్చారు. మరో గ్రూప్ సభ్యురాలు, కిడ్నీ గ్రహీత జయ జైరామ్.. 28 ఏళ్లకుపైగా అవయవదాన రంగంలో కీలకపాత్ర పోషిస్తున్న మోహన్ ఫౌండేషన్ (మల్టీ ఆర్గాన్ హార్వెస్టింగ్ ఎయిడ్ నెట్‌వర్క్) ముంబై విభాగానికి ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. బ్రెయిన్ డెడ్‌కు గురయ్యే రోగుల కుటుంబాలను అవయవదానానికి ప్రోత్సహించడంపై ఆమె దృష్టిపెట్టారు.

# పదివేల ఏళ్లనాటి రాతి చిత్రాల తావు..


**కీసర సమీపంలో గుర్తింపు**





రాతి చిత్రాల తావును గుర్తించిన కరుణాకర్, నసీరుద్దీన్

సాక్షి, హైదరాబాద్: అదో కాన్వాస్..అందులో యుద్ధ భూమి దృశ్యాలున్నాయి.. జంతువులను వేటాడే చిత్రాలున్నాయి.. ఆనందంతో మనుషులు బృందంగా నర్తిస్తున్న బొమ్మలున్నాయి.. గుర్రాలు, పులులతోపాటు ప్రస్తుతం మనుగడలో లేని విచిత్రాకారపు జీవులూ కనిపిస్తున్నాయి.. కొన్ని ఎర్ర రంగుతో వేసిన చిత్రాలైతే, కొన్ని తెలుపు రంగు బొమ్మలు. ఈ బొమ్మలు ఒకే సమయంలో వేసినవి కావు. కొన్ని 10 వేల ఏళ్ల క్రితం చిత్రించినవైతే, మరికొన్ని 1300 ఏళ్ల నాటివి. అంటే మానవుడి పరిణామక్రమం జరుగుతున్న వివిధ కాలాల్లో వేసిన చిత్రాలు. ఇలాంటి బొమ్మల తావు ఒకటి తాజాగా వెలుగు చూసింది. మేడ్చల్ జిల్లా కీసర సమీపంలోని యాద్గార్‌పల్లి గ్రామ శివారులో గుర్తించారు. కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు నసీరుద్దీన్, అహోబిలం కరుణాకర్‌లు తాజాగా ఈ రాతి చిత్రాల ప్రాంతాన్ని వెలుగులోకి తెచ్చారు. తెలంగాణలో ఇప్పటి వరకు 86 ప్రాంతాల్లో రాతి చిత్రాలు వెలుగు చూడగా, కొన్ని ప్రాంతాల్లో మాత్రమే అరుదుగా తెలుపు రంగు చిత్రాలు కనిపించాయి. ఇక్కడ తెలుపు, ఎరుపు చిత్రాలు ఎక్కువ సంఖ్యలో ఉండటం విశేషం. మధ్య రాతి యుగం నాటి చిత్రాలతోపాటు చారిత్రక యుగం నాటి వరకు గీసిన చిత్రాలుగా భావిస్తున్నారు. ఆ ప్రాంతంలో ఆయా కాలాల మానవులు వినియోగించిన రాతి పరికరాలు, వాటిని నూరేందుకు వాడిన గ్రూవ్స్ కూడా వెలుగు చూశాయి. ఆయా కాలాల్లో ఆ ప్రాంతం ఆదిమానవుల ఆవాసంగా కొనసాగిందని ఇది స్పష్టం చేస్తోంది. పాత చిత్రాలు కొన్ని వెలిసిపోవటంతోపాటు, వాటిమీదే తదుపరి కాలంలో చిత్రాలు గీసినట్టు కనిపిస్తోంది. పాత చిత్రాల్లో జంతువుల బొమ్మలు, మనుషుల విన్యాసాలు, అంతుచిక్కని గీతల బొమ్మలుండగా, చారిత్రక యుగం చిత్రాల్లో యుద్ధ విన్యాసాలు కనిపిస్తున్నాయి. మనుషులు మారణాయుధాలు పట్టుకుని తలపడుతున్నవి, గుర్రాలెక్కి పోరాడుతున్నవి ఉన్నాయి. ఒకేచోట ఇలా భిన్న కాలాలకు సంబంధించి ఎక్కువ చిత్రాలు వెలుగు చూడటం అరుదు. వీటిపై పరిశోధనలు జరిపితే కొత్త విషయాలు వెలుగుచూసే వీలుంది. వీటిని భావి తరాలకు అందించేలా కాపాడాల్సిన అవసరం ఉందని కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ పేర్కొన్నారు.





యూరియా బస్తాల కోసం గూడూరు పీఏసీఎస్ ఎదుట బారులుదీరిన రైతులు


# యూరియా.. ఇప్పించండయ్యా

గూడూరు: మహబూబాబాద్ జిల్లాలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురవడంతో రైతులు ఎరువుల కోసం ఎగబడుతున్నారు. గూడూరు, బయ్యారం, కేసముద్రం, మహబూబాబాద్‌లలో శనివారం యూరియా కోసం పీఏసీఎస్‌ల వద్ద బారులు తీరారు. గూడూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఎదుట.. శనివారం తెల్లవారుజామున 5 గంటల నుంచే రైతులు యూరియా బస్తాల కోసం బారులు తీరారు. ఎస్‌ఐ గిరిధర్‌రెడ్డి తన సిబ్బందితో చేరుకొని రైతులను క్యూలో నిలబెట్టారు. వచ్చిన వారందరికీ ఒక్కొక్క బస్తా చొప్పున అందించారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. 


బయ్యారం గుట్టపై నుంచి జాలువారుతున్న పాండవుల జలపాతం


మనసు దోచుకుంటున్న బయ్యారం పెద్దచెరువు మత్తడి


కనుచూపు మేర కనిపిస్తున్న బయ్యారం పెద్దచెరువులోని నీరు


బయ్యారం పెద్దచెరువు మూడవ అలుగుల వద్ద బొగత జలపాతం అందాలు (ఫైల్)

# జలపాతాలు.. చెరువుల మత్తళ్లు..

## బయ్యారం అడవుల్లో మనసుదోచే సౌందర్యం

### ప్రకృతి అందాలను చూసేందుకు పలు ప్రాంతాల నుంచి వస్తున్న పర్యాటకులు

**బయ్యారం:** ప్రకృతి అందాలకు నెలవైన మహబూబాబాద్ జిల్లా బయ్యారం అడవులు చూపరుల మనసు దోచుకుంటున్నాయి. వానాకాలంలో అంతెత్తు నుంచి జాలువారుతున్న జలపాతాలు...నిండానీటితో మత్తడి దూకుతున్న చెరువుల అందాలు చూసేందుకు సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు బయ్యారం బాట పడుతున్నారు. జలపాతాల అందాలు చూసేందుకు ఇబ్బందులు ఎదురైనా, వెనుదిరగకుండా పర్యాటకులు ముందుకుసాగి ప్రకృతి ఒడిలో సేదతీరుతున్నారు.

**పాండవుల జలపాతం....**

బయ్యారం మండల కేంద్రం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇర్సులాపురం క్రాస్‌రోడ్డు వరకు టూ, ఫోర్ వీలర్ల వాహనాల ద్వారా పాండవుల జలపాతం వద్దకు చేరుకోవచ్చు. అక్కడినుంచి ఎడమవైపు ఉన్న గుట్టపైకి కొంతదూరం వరకు టూవీలర్‌పై ప్రయాణం చేసే అవకాశం ఉంది. ఫోర్ వీలర్‌పై వచ్చే వారు ఎడమవైపు ఉన్న ఖాళీ స్థలంలో వాహనాలను నిలిపివేసి గుట్టపైకి సుమారు మూడు నుంచి నాలుగు కిలోమీటర్ల వరకు నడిస్తే పాండవుల జలపాతం వస్తుంది. వర్షాలు కురిసిన సమయంలో ఎత్తైన ప్రాంతంనుంచి కిందికి నీళ్లు జాలువారుతూ ఈ జలపాతం ఆకట్టుకుంటుంది.

**చింతోని జలపాతం..**

బయ్యారం మండల కేంద్రానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న చింతోనిగుంపు గ్రామం సమీపంలోని వంకమడుగువాగు వద్దకు వాహనాల ద్వారా వెళ్లొచ్చు. ఆ తరువాత ఎడమవైపు ఉన్న కాలిబాట ద్వారా అర కిలోమీటర్ దూరం వరకు కాలినడకన నడిస్తే చింతోని జలపాతం వస్తుంది. రాళ్లపైనుంచి కిందికి జారుతున్న నీటి అందాలను చూసేందుకు కిందికి దిగాలి. జలపాతం కింది ప్రాంతం లోతుగా ఉంటుంది. నీళ్లలో దిగకుండా జలపాతం అందాలను చూడాలి.

**మనసుదోచే పెద్దచెరువు అలుగుల అందాలు**

బయ్యారం మండల కేంద్రంనుంచి ఇల్లందు వైపు వెళ్లే రహదారిపై నామాలపాడునుంచి ఎడమవైపు వెళ్తే మూడు కిలోమీటర్ల దూరంలో బయ్యారం పెద్దచెరువు అలుగుల ప్రాంతం ఉంటుంది. అలుగుల ప్రాంతం వరకు టూ, ఫోర్ వీలర్ వాహనాల ద్వారా వెళ్లవచ్చు. పచ్చని చెట్ల నడుమ నిండానీటితో పరవళ్లు తొక్కుతున్న మత్తడి అందాలు చూపరుల మనసును దోచుకుంటాయి. చెరువులోకి భారీగా వరద వచ్చినప్పుడు మూడవ అలుగు నుంచి వరదనీరు బయటకు వచ్చిన సమయంలో ఎత్తయిన ప్రాంతం నుంచి దూకుతున్న వరదనీరు బొగత జలపాత అందాలను గుర్తుకు తెస్తున్నాయి.

**సెలవు రోజుల్లో పెరుగుతున్న పర్యాటకుల రద్దీ**

బయ్యారం అడవుల్లోని ప్రకృతి అందాలను చూసేందుకు జిల్లాలోని పలు మండలాల వాసులతో పాటు వరంగల్, హనుమకొండ, ములుగు, భద్రాద్రి, ఖమ్మం, సూర్యాపేట తదితర జిల్లాల నుంచి పర్యాటకులు సెలవురోజుల్లో ఎక్కువగా వస్తున్నారు. యువత పెద్దఎత్తున తరలివచ్చి సందడి చేస్తున్నారు.


జాలువారుతున్న చింతోనిజలపాతం (ఫైల్)


పాండవుల జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

# ఎరువుల కొరతకు 'నానో'తో చెక్

**అందుబాటులోకి ద్రవరూప యూరియా**

- ఖర్చు తక్కువ.. ఫలితం ఎక్కువ
- వృథా కాకుండా మొక్కలకు సరిపడా పోషకాలు
- పిచికారీపై యంత్రాంగం విస్తృత అవగాహన


నానో యూరియా వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

**ఖమ్మం వ్యవసాయం:** పంటల సాగులో వినియోగించే ఎరువుల లభ్యత సక్రమంగా లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా యూరియా సమస్య అన్నదాతలను వేధిస్తోంది. పంటల సాగు విస్తీర్ణానికి అనుగుణంగా యూరియా సరఫరా కాకపోవటంతో సమస్య ఉత్పన్నమవుతోంది. ఈ నేపథ్యాన గుళికల రూపంలోని యూరియాకు ప్రత్యామ్నాయంగా ద్రవరూప 'నానో' ఎరువులు అందుబాటులోకి వచ్చాయి. ఎరువుల సమస్యలను అధిగమించేలా నానో ఎరువుల వినియోగంపై వ్యవసాయ అధికారులు రైతులకు విస్తృత అవగాహన కల్పిస్తున్నారు.

**ఖమ్మం జిల్లాలో ఇలా..**

ప్రస్తుత వానాకాలం సీజన్‌లో ఖమ్మం జిల్లాలో అన్ని పంటలు కలిపి 6,34,255 ఎకరాల్లో సాగవుతాయని అంచనా వేయగా.. ఇప్పటివరకు 5,77,776 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. ఇంకా మరో 57,139 ఎకరాల్లో పంటలు సాగు కావలసి ఉంది. ప్రధానంగా వరి 2.13 లక్షల ఎకరాల్లో, పత్తి 2.20 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. మరో 80 వేల ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశముంది. ఈ పంటల సాగులో యూరియా, డీఏపీ, ఎంవోపీ, కాంప్లెక్స్, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ ఎరువులను వినియోగిస్తారు. వానాకాలంలో పంటల సాగుకు మొత్తం 1,49,135 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉంటుందని అంచనా. ఇందులో యూరియా 54,825, డీఏపీ 17,466, ఎంవోపీ (మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 13,766, కాంప్లెక్స్ ఎరువులు (ఎన్‌పీకే) 58,594, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ (ఎస్ఎస్‌పీ) 4,484 మెట్రిక్ టన్నులు ఉన్నాయి. ఈ ఎరువులను కేంద్ర ప్రభుత్వం యూరియాను సబ్సిడీపై సరఫరా చేస్తుంది. యూరియా సబ్సిడీపై వస్తుండటంతో రైతులు అధికంగా వినియోగిస్తున్నారు. కానీ లక్ష్యం మేర సరఫరా కాక సమస్య ఉత్పన్నమవుతోంది.

**ప్రత్యామ్నాయం.. నానో**

యూరియా కొరతకు తోడు డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల ధరలు అధికంగా ఉండటంతో ప్రత్యామ్నాయంగా మార్కెట్‌లోకి 'నానో' ఎరువులు అందుబాటులోకి వచ్చాయి. ద్రవరూపంలో ఉండే ఈ యూరియా పిచికారీ విధానంలో వినియోగించాల్సి ఉండగా.. వ్యవసాయ శాఖ రైతుల్లో అవగాహన పెంచుతోంది. యూరియా బస్తా ధర రూ.266 కాగా నానో యూరియా 500 మిల్లీలీటర్ల సీసా రూ.225కే లభిస్తోంది. డీఏపీ బస్తా ధర రూ.1,400 ఉంటే.. నానో లీటరు బాటిల్ ధర రూ.600గా ఉంది. ఇలా అన్ని రకాల మిశ్రమ నానో ఎరువులు అందుబాటులోకి వచ్చాయి. ఎరువులను నేలపై చల్లితే.. 30 శాతమే తీసుకుంటుండగా.. 70 శాతం వృథాగా పోతుందని అధికారులు చెబుతున్నారు. అదే నానో ఎరువులను పిచికారీ చేస్తే పైరు 90 శాతం తీసుకుంటుందని అవగాహన కల్పిస్తున్నారు. దీని వినియోగంతో రైతులకు ఖర్చు తగ్గడమే కాక పంటలకు సరైన పోషకాలు అందుతాయని చెబుతున్నారు. యూరియా బస్తాలను పొలం గట్లపై మోసే బాధ తప్పుతుందని.. ద్రవరూపంలోని నానో యూరియా బాటిళ్లను సులువుగా తీసుకెళ్లవచ్చని క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. వీటి వాడకంతో చీడపీడల సమస్య కూడా తగ్గుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు చెబుతున్నారు.

**విస్తృత అవగాహన**



నానో ఎరువుల ప్రయోజనాలను రైతులకు వివరిస్తున్నాం. క్షేత్ర స్థాయిలో నానో యూరియా, నానో డీఏపీ వినియోగంపై అవగాహన కల్పిస్తున్నాం. వివిధ పంటలపై పలు దశల్లో నానో ఎరువు ఎంత మోతాదులో ఎలా వినియోగించాలనే అంశాన్ని చెబుతూనే నానో ఎరువులతో ప్రయోజనాలనూ వివరిస్తున్నాం. నానో ఎరువుల వినియోగంతో ఖర్చులు తగ్గుతాయి. వృథా తగ్గి పంటలకు పోషకాలు అందుతాయి. ఇవన్నీ కాక గుళికల యూరియా కొరత సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

– ధనసరి పుల్లయ్య, ఖమ్మం జిల్లా వ్యవసాయాధికారి


నానో యూరియా వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

**ఖమ్మం జిల్లాలో వానాకాలం సాగుకు యూరియా సరఫరా వివరాలు (మెట్రిక్ టన్నుల్లో)**

| నెల | సరఫరా ప్రణాళిక | సరఫరా | బ్యాలెన్స్ |
|---|---|---|---|
| ఏప్రిల్ | 419.00 | 419.00 | ---- |
| మే | 2,527.00 | 2,527.00 | ---- |
| జూన్ | 4,708.00 | 4,708.00 | ---- |
| జూలై | 7,500.00 | 6,434.00 | 1,066.00 |
| ఆగస్టు | 4,610.00 | 1,777.00 | 2,833.00 |
| సెప్టెంబర్ | 21,236.00 | ------ | 21,236.00 |
| మొత్తం | 41,000.00 | 15,865.00 | 25,135.00 |

# గణేశన్ మృతికి బండి, బండారు సంతాపం

**సాక్షి, హైదరాబాద్:** నాగాలాండ్ గవర్నర్ లా గణేశన్ మృతికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ వేర్వేరు ప్రకటనలో తీవ్ర సంతాపం తెలిపారు. గణేశన్ జీవితకాలమంతా బీజేపీ కోసం పనిచేశారని, ఉమ్మడి ఏపీ రాష్ట్ర ఇన్‌చార్జిగా పనిచేసి.. పార్టీ అభివృద్ధికి కృషి చేశారని సంజయ్ నివాళులర్పించారు. గణేశన్ మరణం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని దత్తాత్రేయ పేర్కొన్నారు. స్నేహశీలి, మృదు స్వభావి, లోతైన విషయ పరిజ్ఞానం ఉన్న నాయకుడని కొనియాడారు. నిజ జీవితంలో అన్నీ వదిలిపెట్టి.. కేవలం సమాజం కోసం సమర్థ భావంతో తన జీవితాన్ని అర్పించిన నాయకుడని శ్రద్ధాంజలి ఘటించారు. దేశభక్తి, జాతీయ భావం, భారతీయ సంస్కృతి పెంపొందించేందుకు అన్ని వర్గాలతో కలిసి కృషి చేశారని, ఆయనతో తనకున్న సాన్నిహిత్యాన్ని దత్తాత్రేయ గుర్తు చేసుకున్నారు. నాగాలాండ్ గవర్నర్ లా గణేశన్ అనారోగ్యంతో మృతి చెందారన్న వార్త తీవ్రంగా బాధించిందని బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు పేర్కొన్నారు. తన జీవితకాలం పార్టీ, ప్రజల కోసం పనిచేసిన వ్యక్తి అని ఒక ప్రకటనలో ఆయన ప్రగాఢ సంతాపం తెలిపారు.


శ్రీస్వామి దర్శనానికి ముఖ మండపం క్యూలైన్‌లో నిల్చున్న భక్తులు

# గుట్టకు పోటెత్తిన భక్తులు

వరుస సెలవులతో యాదగిరీశుడిని దర్శించుకునేందుకు శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శ్రీస్వామి వారి ధర్మ దర్శనానికి 3 గంటలు, వీఐపీ దర్శనానికి 45 నిమిషాల సమయం పట్టింది. 35 వేలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ పూజలతో ఆలయానికి నిత్యాదాయం రూ.50,84,453 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

– యాదగిరిగుట్ట


శ్రీస్వామి వారి దర్శనానికి క్యూకాంప్లెక్స్‌లో వేచి ఉన్న భక్తులు

# వాడవాడలా వేడుకగా..










తెలుగు రాష్ట్రాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గోపాలుడి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. చిన్ని కృష్ణుడి వేషాధారణలో అబ్బాయిలు, గోపిక వేషంలో అమ్మాయిలు ఆకట్టుకున్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు ఉట్టికొట్టి సంబరాలు చేసుకున్నారు. ఆ దృశ్యమాలిక... -సాక్షి,నెట్‌వర్క్

# పులస.. మారింది వలస



## ప్రాణభయంతో ముఖం చాటేసిన పులస

- ఒడిశా, బెంగాల్ వైపు పయనం
- మూసుకుపోయిన సముద్ర మొగలు
- కేజీ బేసిన్‌లో చమురు కార్యకలాపాలు
- ఒకప్పుడు నాలుగున్నర కేజీలుండే పులస
- ఇప్పుడు కిలో దొరకడమే గగనం

'గోదాట్లో నీరు ఎరుపెక్కిందంటే నా సామిరంగా.. సముద్రం నుంచి పులస లగెత్తుకు రావాల్సిందే. వెంటనే పుస్తెలు అమ్మయినా పులస పులుసు తినాల్సిందే' అంటుంటారు గోదావరి జిల్లాల వాసులు. ఏడాదికి ఒకసారి మాత్రమే అదికూడా గోదావరికి వరద నీరు వచ్చినప్పుడు మాత్రమే కనిపించే పులసలు ఈసారి మొహం చాటేస్తున్నాయి. గోదావరికి వరదలు వచ్చి ఎర్రనీరు పోటెత్తుతున్నా పులస జాడ లేదు. గత సీజన్లతో పోలిస్తే పులసలు ఎప్పుడూ ఈ స్థాయిలో తగ్గిపోలేదని ఇక్కడ మత్స్యకారులు మదనపడుతున్నారు. వాస్తవానికి జూలై మొదటి వారం నుంచే పులసలు గోదావరిలో సందడి చేస్తాయి. అయితే ఎక్కడా వాటి జాడ కూడా కనిపించడం లేదు. ఈ నెలలోనైనా రాకుండా పోతాయా అని గోదావరి జిల్లాల జనం ఆశగా ఎదురు చూస్తున్నారు.

- సాక్షి ప్రతినిధి, కాకినాడ



యానాం మార్కెట్‌లో పులస వేలం

### ముచ్చటగా మూడు

ఈ సీజన్‌లో ఇప్పటివరకూ ముచ్చటగా మూడంటే మూడు పులసలు మాత్రమే మత్స్యకారులకు దొరికాయి. అది కూడా కేంద్ర పాలిత ప్రాంతమైన యానాం పరిసర ప్రాంతాల్లో 20 రోజుల వ్యవధిలో మత్స్యకారుల వలలకు చిక్కాయి. కిలో పులస రూ.20 వేల నుంచి రూ.26 వేల వరకూ.. అది కూడా వేలంలో సొంతం చేసుకుంటున్నారు. కొందరైతే మత్స్యకారులకు రూ.5 వేలు, రూ.10 వేల చొప్పున చెల్లించి అడ్వాన్స్ బుకింగ్ కూడా చేసుకుంటున్నారు. ఒకప్పుడు కేజీ నుంచి మూడున్నర కేజీలు, కొన్ని 4.5 కేజీలున్న పులసలు కూడా మత్స్యకారుల వలకు చిక్కేవి. నాలుగైదు కేజీలున్న పులసలు ఐదారు వలలో పడ్డాయంటే వారి పంట పండినట్టే. నాలుగైదు కేజీల పులస రూ.10 వేల నుంచి రూ.15 వేలు పలికేది. గోదావరి తీరంలో యానాం, భైరవపాలెం, కోటిపల్లి, ఎదుర్లంక, రావులపాలెం, సిద్ధాంతం తదితర ప్రాంతాల్లో పులసలు విరివిగా లభించేవి. మత్స్యకారులు అర్ధరాత్రి నుంచి తెల్లారే వరకూ ఈ ప్రాంతాల్లోనే వేటాడేవారు. అటువంటిది ఇక్కడ కూడా పులసలు దొరక్క వారు నిరాశతో ఇళ్లకు తిరిగొచ్చేస్తున్నారు. గతంలో వరదల సీజన్ మొదలయ్యాక ప్రతి నెలా 40 టన్నులకు తక్కువ కాకుండా పులసలు పడేవి. ప్రస్తుతం ఇందులో 10 శాతం కూడా ఈసారి కనిపించడం లేదు.

### చమురు సంస్థల కార్యకలాపాలతో..

పులసలు పునరుత్పత్తి కోసం బంగాళాఖాతంలో 11 వేల నాటికల్ మైళ్లు ప్రయాణిస్తాయి. సాగర సంగమం వద్ద ఉండే మొగల నుంచి గోదావరి నదిలోకి ఇవి ప్రవేశిస్తాయి. సంతానోత్పత్తి కోసం సముద్రం నుంచి వచ్చే ఇలస (హిల్స-విలస) చేప ఏటికి ఎదురీదుతూ గోదావరిలోకి వచ్చేసరికి పులసగా రూపాంతరం చెందుతుంది. అయితే.. కృష్ణా, గోదావరి (కేజీ) బేసిన్‌లోని ఆఫ్‌షోర్‌లో జరుగుతున్న డ్రెడ్జింగ్‌తో ధ్వని కాలుష్యం పెరిగిపోయింది. గోదావరి నదీ ముఖద్వారం (సీ మౌత్) వద్ద రిలయన్స్, ఓఎన్‌జీసీ తదితర చమురు సంస్థలు నిర్వహిస్తున్న డ్రెడ్జింగ్ పనులు పులసల రాకకు ప్రతిబంధకంగా మారాయి. డ్రెడ్జింగ్ వల్ల నీటిలో సంభవించే కంపనాలు, శబ్దాల వల్ల పులసలు గోదావరి నదిలోకి రావడం లేదు. ఏపీ తీరం వైపు రావాల్సిన పులసలు ఒడిశా, బెంగాల్ వైపు వెళ్లిపోతున్నాయి. యానాం సమీపాన గాడిమొగ, భైరవపాలెంతో పాటు అంతర్వేది, కరవాక సమీప ప్రాంతాల్లో పారిశ్రామిక, ఆక్వా వ్యర్థాలు గోదావరి నదిలో కలుస్తున్నాయి. ప్రధానంగా సల్ఫర్, అమ్మోనియా, లెడ్, పాదరసం ఇతర కర్బనాలు నదిలో కలుస్తున్నాయి. ఆక్వా సాగులో వినియోగించే యాంటీబయోటిక్స్, పటిక (ఆలం) వంటివి కలుస్తూండటంతో పులస గోదావరి వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు.



వేలంలో రూ.26 వేలకు పులస దక్కించుకున్న పేరవరానికి చెందిన బెజవాడ సతీష్

### విలసలే లేవు.. ఇక పులసలెక్కడివి?






సముద్రంలో విలసలు గోదావరికి వస్తేనే కదా పులసలుగా మారేది. ఇప్పుడు సముద్రం నుంచి గోదావరి వైపు అసలు విలసలే రావడం లేదు. ఒకప్పుడు జూలై వచ్చిందంటే అర్ధరాత్రి వేటకు వెళ్తే తెల్లారేసరికి 10, 15 పులసలతో తిరిగొచ్చే వాళ్లం. ఇప్పుడు ఒకట్రెండు కూడా దొరకడం లేదు. గోదావరి, సముద్రం కలిసే యానాం సమీపాన భైరవపాలెం వద్ద చమురు కంపెనీలు గ్యాస్ పైప్‌లైన్ వేసే సమయంలో తవ్వకాల వల్ల ఇసుక మేటలు వేశాయి. ఈ మేటలు తొలగించడంతో పాటు కేజీ బేసిన్‌లో డ్రెడ్జింగ్‌పై నియంత్రణ ఉండాలి.

- పాలేపు పోసియ్య, మత్స్యకారుడు, యానాం

### శ్రీవారి దర్శనానికి 24 గంటలు



**తిరుమల :** తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ గోగర్భం డ్యాం ఆక్టోపస్ బిల్డింగ్ వద్దకు చేరుకుంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 77,043 మంది స్వామి వారిని దర్శించుకోగా 41,859 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.53 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం అవుతోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోనికి అనుమతించరని స్పష్టం చేసింది.

### రాజనాలబండలో తిరుణాల సందడి



**చౌడేపల్లె:** చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలంలో సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో శనివారం నుంచి తిరుణాల సందడి మొదలైంది. పూర్వీకుల నుంచి శ్రావణ మాసపు చివరి శనివారం, ఆదివారం భక్తిశ్రద్ధలతో తిరుణాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. తిరుణాలను పురస్కరించుకొని టీటీడీ అధికారులు ఆలయాన్ని విద్యుద్దీపాలు, పూలతో ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశారు. శనివారం మండలంలోని ప్రజలు, తిరుణాల నిర్వహించే సుమారు 18 గ్రామాల ప్రజలు, బంధుమిత్రులు భక్తిశ్రద్ధలతో రాజనాలబండకు చేరుకొని శ్రీవీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి రాజనాలబండకు సమీపంలో గల ఎత్తైన కొండపై వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి కాలినడకన చేరుకొని లక్ష్మీనరసింహస్వామి వారి స్వయంభు విగ్రహానికి అభిషేకాలు చేశారు. తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. కొండపై ఆహ్లాదకర వాతావారణం నడుమ సేద తీరారు. అనంతరం ఆలయం వద్ద శనివారం రాత్రి అఖండ దీపారాధన వెలిగించారు. రాజనాలబండ ఆలయం, లక్ష్మీనరసింహ స్వామి కొండపైకి నడిచి వెళ్తున్న భక్తులకు జీఆర్ఎస్ రమణయూత్, ఎస్ఎల్ఎన్ఎస్ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

### మమ్మేల్‌మురుగన్!



**గుడుపల్లె:** చిత్తూరు జిల్లా గుడుపల్లె మండలంలోని గుడివంక శ్రీవల్లీదేవ సేన సమేత సుబ్రమణ్యస్వామి కొండ హారోహర.. వేల్ మురుగా.. నామస్మరణంతో మార్మోగింది. శనివారం ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి భక్తులు పోటెత్తారు. కావళ్లు ఎత్తుకుని పశ్చిమ వాహినిలో స్నానాలు ఆచారించారు. అనంతరం స్వామి వారి నామస్మరణతో పశ్చిమ వాహిని కొండపైకి చెరుకున్నారు. కావళ్లను ఎత్తుకుని ఆలయం చట్టూ ప్రదక్షిణ చేసి మొక్కులు తీర్చుకున్నారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు స్వామి వారికి పలు ఆకృతులతో కావళ్ల ద్వారా మొక్కులు చెల్లించారు. తేరు కావళ్లు, రాగి గుండులు, ఇనుప శూలాలు, నిమ్మకాయలతో సూదులు శరీరానికి గుచ్చుకుని ఆలయం ఎదుట కావళ్లు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. కొంత మంది భక్తులు ఎస్కాట్ వాహనంపై వీపుకు కొక్కిళ్లు వేసుకుని వెలాడుతూ వేల్ మురుగా అంటూ నినాదాలు చేస్తూ ఆలయం చట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు.

### మద్దిలో అభిషేక సేవ

**జంగారెడ్డిగూడెం:** ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెంలో శ్రీ మద్ది ఆంజనేయస్వామికి శనివారం అభిషేక సేవ వైభవంగా నిర్వహించారు. ఆలయ ముఖమండపంపై స్వామివారి ఉత్సవమూర్తికి అర్చక స్వాములు శాస్త్రోక్తంగా పంచామృత అభిషేకం చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం వరకు దేవస్థానానికి వివిధ సేవలు, విరాళాల ద్వారా రూ.2,13,592 సమకూరినట్టు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. 17వ తేదీ ఆదివారం ఉదయం హనుమద్ హోమం నిర్వహించనున్నట్టు ఈవో చెప్పారు.

# అందని జీతం.. అప్పుల జీవనం!

## టీటీడీ విద్యాసంస్థల్లో తాత్కాలిక అధ్యాపకుల ఇక్కట్లు

## 3 నెలలుగా వేతనం కోసం పడిగాపులు.. పట్టించుకోని అధికారులు



తిరుమల శ్రీవారి సేవా పరివారంలో స్థానం.. టీటీడీ విద్యాసంస్థల్లో ఉద్యోగం.. తాత్కాలిక ప్రాతిపదికనే అయినా అపురూపమైన వరం.. వేలాది మంది పేద విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించే అద్భుత అవకాశం.. దేవదేవుని పాదాల చెంత గురువులుగా విధులు నిర్వర్తించే మహద్భాగ్యం.. అయితే దేవుడు వరమిచ్చినా పూజారి కనికరించని చందంగా తయారైంది కాంట్రాక్ట్ అధ్యాపకుల పరిస్థితి. వేతనం కోసం పడిగాపులు కాయల్సిన దుస్థితి దాపురించింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా మూడు నెలలుగా జీతాలు అందక.. అప్పులు చేసి జీవనం సాగించాల్సి వస్తోంది.



ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల

తిరుపతిలోని టీటీడీ విద్యాసంస్థలలో కాంట్రాక్టు ప్రాతిపదికన కొన్నేళ్లుగా 330 మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులు పనిచేస్తున్నారు. అధికారుల తీరుతో ఉద్యోగ భద్రత దేవుడెరుగు కనీసం జీతాలకు నోచుకోక అలమటిస్తున్నారు. జూన్ నుంచి వేతనాల ఊసేలేక పోవడంతో దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. ఒక వైపు పిల్లల స్కూల్ ఫీజులు చెల్లించలేక, మరో వైపు కుటుంబావసరాలను తీర్చుకోలేక దయనీయస్థితిలో బతుకీడుస్తున్నారు. కొందరు ఈఎంఐలు కట్టలేక అపరాధ రుసుంతో అప్పు చేసి చెల్లిస్తుండగా, మరికొందరు ఇంట్లోని బంగారు వస్తువులను తాకట్టు పెట్టి జీవనం సాగిస్తున్నారు. జీతాలు ఎప్పుడు జమ చేస్తారో తెలియని అయోమయంలో అధ్యాపకులు నలిగిపోతున్నారు. - తిరుపతి సిటీ

### పెరుమాళ్లకే ఎరుక!

టీటీడీ ఆధ్వర్యంలో మూడు జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 51మందికి రెన్యువల్ ఉత్తర్వులు అందినా వేతనాలు పడలేదు. డిగ్రీ కళాశాలలోని 161 మంది తాత్కాలిక అధ్యాపకులకు ఇప్పటి వరకు రెన్యువల్ ఉత్తర్వులే అందలేదు. ఈ పరిస్థితుల్లో ఇక జీతాలు ఎప్పుడు వేస్తారో పెరుమాళ్లకే ఎరుకని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే టీటీడీ ఆధ్వర్యంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాల్లో సుమారు 110 మందికి పైగా తాత్కాలిక ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరి పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా కుంగిపోయి మానసికంగా ఒత్తిడికి లోనవుతున్నారు.

### అధికారుల నిర్లక్ష్యం

వేతనాల ఫైల్‌ను సంబంధిత అధికారులకు పంపించడంలో కిందిస్థాయి ఉద్యోగులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు సైతం వేతనాల ఫైల్‌ను తమ వద్దకు తెప్పించుకుని పరిశీలించడంలో మనకేందుకులే...అంటూ అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు మాత్రం ప్రతి నెలా ఒకటో తారీఖున జీతాలను అందుకుంటూ కుటుంబాలను సాఫీగా నడుపుకుంటున్నారు. తాత్కాలిక ఉద్యోగులపై ఎందుకీ వివక్ష అంటూ అధ్యాపకులు మండిపడుతున్నారు. సెప్టెంబర్, అక్టోబర్‌లో అయినా వేతనాలు చేతికందేనా అంటూ ఏడుకొండలవైపు చూస్తున్నారు.

### కుటుంబాలు గడవడం కష్టంగా ఉంది

మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబాలు గడవడం కష్టంగా ఉంది. చేతిలో చిల్లిగవ్వ లేకుండా పండుగలు, ఫంక్షన్లకు దూరంగా ఉంటున్నాం. స్కూల్ ఫీజులు, ఈఎంఐలు కట్టేందుకు అవస్థలు పడుతున్నాం.

– టీటీడీ విద్యాసంస్థల్లోని తాత్కాలిక అధ్యాపకులు

# వీరీ వీరీ గుమ్మడిపండు ఈ సినిమా వచ్చేదెప్పుడు?


ప్రభాస్

**ఒకప్పుడు షూటింగ్ పూర్తి చేసుకుని, థియేటర్స్ దొరికితే చాలు... సినిమాలు రిలీజ్ అయ్యేవి. కానీ ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. నాన్-థియేట్రికల్ రైట్స్ అమ్మకాలు, బాక్సాఫీస్ పోటీ, ఓటీటీ సంస్థల నిబంధనలు... ఇలా ఓ సినిమా రిలీజ్ కావడానికి, కాకపోవడానికి చాలా కారణాలే ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే రిలీజ్ డేట్ ప్రకటించినప్పటికీ కొన్ని కారణాల వల్ల ఇంకా విడుదల వాయిదా పడుతూ వస్తున్న కొన్ని సినిమాలపై ఓ లుక్ వేద్దాం.**


చిరంజీవి

### సత్యలోకానికి పయనం

ఈ ఏడాది సంక్రాంతికి రిలీజ్ కావాల్సిన 'విశ్వంభర' సినిమా ఇంకా థియేటర్స్‌లోకి రాలేదు. సంక్రాంతికి 'విశ్వంభర' సినిమా విడుదల కాకపోవడంతో సమ్మర్‌కి థియేటర్స్‌లోకి వస్తుందని ఆడియన్స్ ఊహించారు. కానీ సమ్మర్‌లో కూడా థియేటర్స్‌లోకి రాలేదు. ఆ మాటకొస్తే... ఈ సినిమా విడుదల తేదీపై ఇంకా సరైన స్పష్టత లేదు. చిరంజీవి హీరోగా నటించిన ఈ సోషియో ఫ్యాంటసీ అడ్వెంచరస్ యాక్షన్ సినిమాకు వశిష్ఠ దర్శకత్వం వహించారు. త్రిష హీరోయిన్‌గా నటించగా, ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్ కీలక పాత్రల్లో నటించారు. బాలీవుడ్ నటి మౌనీ రాయ్ ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ చేశారు. యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్రమ్ రెడ్డి నిర్మించిన ఈ 'విశ్వంభర' ఈ ఏడాది సెప్టెంబరులో విడుదలయ్యే అవకాశం ఉందని తెలిసింది. ఇదిలా ఉంటే... ఈ సినిమా టీజర్ విడుదలైనప్పుడు గ్రాఫిక్స్ విషయంలో కొన్ని విమర్శలు వచ్చాయి. దీంతో క్వాలిటీ పరంగా చిత్ర యూనిట్ రాజీ పడకుండా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ చేయిస్తోందని సమాచారం. గ్రాఫిక్స్ కోసమే రూ. 25 కోట్లకుపైగా బడ్జెట్‌ను మేకర్స్ కేటాయించారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఈ నెల 22న చిరంజీవి బర్త్ డే. ఈ సందర్భంగా 'విశ్వంభర' సినిమా టీజర్ విడుదల కావొచ్చని, ఈ సినిమా విడుదల తేదీపై అప్పుడు ఓ స్పష్టత వస్తుందనే టాక్ వినిపిస్తోంది. ఇక పద్నాలుగు లోకాలను దాటి, హీరో సత్యలోకం వెళ్లి, అక్కడ హీరోయిన్‌ను ఎలా కలుసుకుంటాడు? అనే నేపథ్యంలో 'విశ్వంభర' సినిమా కథనం సాగుతుందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో దర్శకుడు వశిష్ఠ పేర్కొన్నారు. అలాగే ఈ చిత్రంలో విశ్వంభర అనే పుస్తకం కూడా చాలా కీలకంగా ఉంటుందని, ఈ పుస్తకంలోని అంశాల ఆధారంగానే హీరో సత్యలోకానికి వెళ్తాడని, ఈ క్రమంలో హీరోకు సహాయం చేసే వ్యక్తి పాత్రలో రావు రమేశ్ నటించారని టాక్.


నిఖిల్, సంయుక్త

### ఆలస్యంగా రాజాసాబ్

ప్రభాస్ హీరోగా నటిస్తున్న హారర్, కామెడీ అండ్ ఫ్యాంటసీ సినిమా 'ది రాజాసాబ్'. ఈ చిత్రంలో నిధీ అగర్వాల్, మాళవికా మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తుండగా, సంజయ్ దత్, వీటీవీ గణేశ్, యోగిబాబు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారని తెలిసింది. మారుతి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని డిసెంబరు 5న రిలీజ్ చేయనున్నట్లుగా ఇటీవల మేకర్స్ ప్రకటించారు. కానీ ఈ సినిమా డిసెంబరు 5న విడుదల కావడం లేదని, సంక్రాంతికి ఈ విడుదలయ్యే అవకాశం ఉందనే టాక్ ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఈ సినిమా షూటింగ్ ఇంకా పూర్తి కాకపోవడం, గ్రాఫిక్స్ వర్క్ పెండింగ్ ఉండటం 'ది రాజాసాబ్' విడుదల వాయిదాకు ప్రధాన కారణమట. పైగా ఈ సినిమా కోర్టు కేసులో ఇరుక్కుందనే టాక్ కూడా తెరపైకి వచ్చింది. అయితే ఈ చిత్రం కొత్త విడుదల తేదీకి సంబంధించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇక 'ది రాజాసాబ్' చిత్రం ప్రధానంగా తాత-మనవడి అనుబంధం నేపథ్యంలో సాగుతుందని తెలిసింది. ఈ చిత్రంలో ప్రభాస్ తాతయ్య పాత్రలో సంజయ్ దత్ కనిపిస్తారని సమాచారం. అలాగే ఈ సినిమాలో ప్రభాస్ క్యారెక్టర్‌లో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయని, ఫ్లాష్‌బ్యాక్ సన్నివేశాలు ఆడియన్స్‌కు కొత్త అనుభూతిని ఇవ్వనున్నాయని తెలిసింది. ఇంకా ఈ సినిమాలో 'రాజా డీలక్స్' అనే భవనం కూడా చాలా కీలకంగా ఉంటుందని, ఈ భవనం లోపలే ప్రధాన కథ జరుగుతుందని తెలిసింది.


లావణ్యా త్రిపాఠి, దేవ్ మోహన్


రవితేజ

### పండక్కి రానట్లే!

రవితేజ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మాస్ జాతర'. 'ధమాకా' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో రవితేజ, హీరోయిన్ శ్రీలీల మళ్లీ జంటగా కలిసి నటిస్తున్న సినిమా ఇది. రవితేజ కెరీర్‌లోని ఈ 75వ సినిమాకు భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సినిమాను వినాయక చవితి పండగ సందర్భంగా ఈ ఆగస్టు 27న విడుదల చేయాలనుకున్నారు మేకర్స్. కానీ విడుదల వాయిదా పడిందని భోగట్టా. ఇంకా రెండు పాటల చిత్రీకరణ ఉందని, అలాగే పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్‌కి కూడా ఇంకా సమయం పట్టేట్లు ఉందని... ఈ కారణాల వల్లే 'మాస్ జాతర' ఈ వినాయక చవితి పండక్కి థియేటర్స్‌లోకి వచ్చే అవకాశం లేదనే టాక్ తెరపైకి వచ్చింది. నిజానికి ఈ సినిమాను తొలుత ఈ ఏడాది సంక్రాంతికి రిలీజ్ చేయాలనుకున్నారు. ఆ తర్వాత మే 9కి వాయిదా వేశారు. ఇటీవల ఆగస్టు 27న రిలీజ్ అంటూ ప్రకటించారు మేకర్స్. కానీ ఇప్పుడు ఆగస్టు 27న కూడా 'మాస్ జాతర' సినిమా రిలీజ్ కావడం లేదనే టాక్ వినిపిస్తోంది. ఇక ఈ సినిమాలో లక్ష్మణ్ భేరీ అనే రైల్వే పోలీస్ ఆఫీసర్‌గా రవితేజ నటిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ సినిమాలో రైల్వేస్టేషన్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే ఓ యాక్షన్ సీక్వెన్స్ అదిరిపోతుందట. అలాగే హీరో రవితేజ-విలన్ నవీన్‌చంద్ర కాంబినేషన్‌లో వచ్చే యాక్షన్ సన్నివేశాలు మాస్ ఆడియన్స్‌ను అలరించేలా ఉంటాయని తెలిసింది.


తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా


సాయి దుర్గాతేజ్

### సంబరాలు ఎప్పుడు?

సాయి దుర్గా తేజ్ కెరీర్‌లోనే హయ్యెస్ట్ బడ్జెట్‌తో రూపొందుతున్న సినిమా 'సంబరాల ఏటిగట్టు'. రూ. 125 కోట్లతో తెరకెక్కుతున్న ఈ సినిమాతో కేపీ రోహిత్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. 'హనుమాన్' ఫేమ్ చైతన్యా రెడ్డి, కె. నిరంజన్ రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఐశ్వర్యా లక్ష్మి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో జగపతిబాబు, సాయికుమార్, శ్రీకాంత్, అనన్యా నాగళ్ల ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని తొలుత సెప్టెంబరు 25న రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. కానీ ఆ తర్వాత ఈ సెప్టెంబరు 25నే పవన్ కల్యాణ్ గ్యాంగ్‌స్టర్ డ్రామా 'ఓజీ', బాలకృష్ణ మైథలాజికల్ అండ్ యాక్షన్ డ్రామా 'అఖండ 2' రిలీజ్‌కు రెడీ అయ్యాయి. దీంతో సాయిదుర్గా తేజ్ 'సంబరాల ఏటిగట్టు' మూవీ విడుదల వాయిదా పడుతుందనే టాక్ తెరపైకి వచ్చింది. ఈ సినిమా షూటింగ్ ఇప్పటివరకు 80 శాతంపైనే పూర్తయింది. కానీ విడుదల తేదీపై మేకర్స్ నుంచి మరో సారి స్పష్టత ఇవ్వాల్సి ఉంది. సెప్టెంబరు 25న 'ఓజీ', 'అఖండ 2' సినిమాలు రిలీజ్‌కు రెడీ అవుతున్నాయి కాబట్టి ఈ తేదీకి 'సంబరాల ఏటిగట్టు' సినిమా రాకపోవచ్చనే టాక్ బలంగా వినిపిస్తోంది. కొత్త విడుదల తేదీపై మేకర్స్ నుంచి అతి త్వరలోనే ఓ స్పష్టత రావొచ్చు. ఇక రాయలసీమ నేపథ్యంలో సాగే ఈ సినిమా రెండు భాగాలుగా విడుదలవుతుందని తెలిసింది.


విజయ్ ఆంటోని

### స్వయంభూ

నిఖిల్ హీరోగా నటిస్తున్న భారీ బడ్జెట్ పీరియాడికల్ యాక్షన్ చిత్రం 'స్వయంభూ'. భరత్ కృష్ణమాచారి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. సంయుక్త, నభా నటేశ్ ఈ చిత్రంలో హీరోయిన్లుగా నటిస్తుండగా, సునీల్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారని తెలిసింది. 'ఠాగూర్' మధు సమర్పణలో భువన్, శ్రీకర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కాగా ఈ చిత్రాన్ని ఈ ఏడాదే రిలీజ్ చేయాలనుకుంటున్నారు మేకర్స్. కానీ ఈ సినిమా విడుదల తేదీపై ఇంకా సరైన స్పష్టత రాలేదు. ఓ దశలో ఈ దసరాకు 'స్వయంభూ' సినిమాను రిలీజ్ చేయాలనే ఆలోచన చేశారట మేకర్స్. కానీ భారీ వీఎఫ్ఎక్స్, యుద్ధ సన్నివేశాలు ఉండటంతో పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్‌కు మరింత సమయం పడుతుందని, ఈ పనులు ఓ కొలిక్కి వచ్చిన తర్వాత ఈ సినిమా విడుదల తేదీని మేకర్స్ ప్రకటిస్తారనే టాక్ వినిపిస్తోంది. శక్తికి, ధర్మానికి చిహ్నమైన సెంగోల్ (బంగారు రాజదండం) నేపథ్యంలో 'స్వయంభూ కథనం సాగుతుందట. మరో విషయం ఏంటంటే... ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని సమాచారం.

### ఓం శాంతి శాంతి శాంతిః

తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా హీరో హీరోయిన్లుగా నటించిన తాజా చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః'. ఏఆర్ సజీవ్ దర్శకత్వంలో బ్రహ్మానందం, బ్రహ్మాజీ, సురభి ప్రభావతి, గోపరాజు విజయ్, శివన్నారాయణ (అమృతం అప్పాజీ) ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. సృజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణ, అనూప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్, నవీన్ సనివరపు ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రంలో కొండవీటి ప్రశాంతి అనే పల్లెటూరి అమ్మాయి పాత్రలో ఈషా రెబ్బా, వ్యాన్ యజమాని అంబటి ఓంకార్ నాయుడుగా తరుణ్ భాస్కర్ నటించారు. ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఆ మధ్య ఈ సినిమాను ఆగస్టు 1న రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. కానీ, ఆగస్టు 1న ఈ సినిమా విడుదల కాలేదు. కొత్త విడుదల తేదీపై మేకర్స్ నుంచి త్వరలోనే ఓ స్పష్టత రానుంది. ఇక మలయాళంలో సూపర్‌డూపర్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'జయ జయ జయ జయహే' సినిమాకు తెలుగు రీమేక్‌గా 'ఓం శాంతి శాంతి శాంతిః' రూపొందిందని తెలిసింది. భార్యాభర్తల నేపథ్యంలో 'జయ జయ జయ జయహే' సినిమా కథనం సాగుతుంది. మహిళ లంటే చులకన భావం ఉన్న ఓ భర్తకు అతని భార్య ఏ విధంగా బుద్ధి చెప్పిందన్నదే ఈ సినిమా కథనం.

### భార్యాభర్తల కథ

లావణ్యా త్రిపాఠి, దేవ్ మోహన్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'సతీ లీలావతి'. భార్యాభర్తల అనుబంధం నేపథ్యంలో సాగే ఈ సినిమాకు 'భీమిలి కబడ్డీ జట్టు, ఎస్ఎమ్ఎస్ (శివ మనసులో శ్రుతి)' చిత్రాల ఫేమ్ తాతినేని సత్య దర్శకత్వం వహించారు. నాగ మోహన్ ఈ సినిమాను నిర్మించారు. ఈ సినిమా టీజర్, సాంగ్స్‌ను విడుదల చేశారు. అయితే విడుదల తేదీపై ఇంకా స్పష్టత రాలేదు.

ఇలా ఈ ఏడాదిలో రిలీజ్‌కు సిద్ధం అవుతూ, ఇంకా విడుదల తేదీని కన్ఫార్మ్ చేసుకోని సినిమాలు మరి కొన్ని ఉన్నాయి.


రష్మిక

ఈ సెప్టెంబరు 5న చాలా సినిమాలు విడుదలకు సిద్ధం అవుతున్నాయి. అనుష్కా శెట్టి 'ఘాటి', రష్మికా మందన్నా 'ది గర్ల్ ఫ్రెండ్', తేజ సజ్జా 'మిరాయ్', 'ది బెంగాలీ ఫైల్స్', శివకార్తికేయన్ 'మదరాసి' వంటి సినిమాలు రిలీజ్‌కు రెడీ అవుతున్నాయి. అయితే ఇన్ని సినిమాలు ఒకే తేదీకి రిలీజ్ కావడం కుదరకపోవచ్చు. ఈ నేపథ్యంలో వీటిలో ఒకట్రెండు సినిమాలు వాయిదా పడే అవకాశం ఉందని, ఈ వాయిదా పడే చిత్రాల్లో 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమా ఉండొచ్చనే టాక్ తెరపైకి వచ్చింది. రష్మికా మందన్నా, దీక్షిత్ శెట్టి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకు రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించారు. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి ఈ సినిమాను నిర్మించారు. మరోవైపు సెప్టెంబరు 5న రిలీజ్ కావాల్సిన విజయ్ ఆంటోనీ 'భద్రకాళి' చిత్రం సెప్టెంబరు 19కి వాయిదా పడింది. ఈ పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ సినిమాను అరుణ్ ప్రభు దర్శకత్వంలో రామాంజనేయులు జవ్వాజి నిర్మించారు. ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ - స్పిరిట్ మీడియా ఈ సినిమాను తెలుగులో విడుదల చేస్తున్నాయి. 200 కోట్ల రూపాయల భారీ కుంభకోణం నేపథ్యంలో ఈ 'భద్రకాళి' సినిమా కథనం సాగుతుంది.

### సంక్రాంతి సినిమాలపై ఎఫెక్ట్?

నిర్మాతలు- సినీ కార్మికుల మధ్య వేతనాల పెంపు విషయమై చర్చలు ఇంకా ఓ కొలిక్కి రాలేదు. దీంతో ప్రస్తుతం సినిమాల చిత్రీకరణలు జరగడం లేదు. ఈ ప్రభావం సంక్రాంతి రిలీజ్‌కు రెడీ అవుతున్న సినిమాలపై పడొచ్చు. చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలోని సినిమా వచ్చే సంక్రాంతికి రిలీజ్ కానుంది. సినీ కార్మికుల సమ్మె కారణంగా ఆగస్టు 5 నుంచి మొదలు కావాల్సిన ఈ సినిమా కొత్త షూటింగ్ షెడ్యూల్ చిత్రీకరణ మొదలు కాలేదు. దీంతో షూటింగ్‌కు ఆలస్యమౌతోంది. సమ్మె కారణంగా ఈ సినిమా సంక్రాంతికి విడుదలవుతుందా? లేదా? అనే సందేహాలు మొదలయ్యాయి. ఇంకా రవితేజ 'అనార్కలి', నవీన్ పొలిశెట్టి 'అనగనగ ఒక రాజు' చిత్రబృందాలు తమ సినిమాలను వచ్చే సంక్రాంతికి రిలీజ్ చేస్తామని ప్రకటించాయి. కానీ సినీ కార్మికుల ప్రస్తుత సమ్మె కారణంగా సంక్రాంతికి రిలీజ్ కావాల్సిన సినిమాలపై ఎఫెక్ట్ పడుతుందని తెలుస్తోంది. అలాగే డిసెంబరులో రిలీజ్‌కు సిద్ధమౌతున్న అడివి శేష్ 'డెకాయిట్' చిత్రంపై కూడా ఈ సమ్మె ప్రభావం కాస్త గట్టిగానే ఉండబోతున్నట్లుగా తెలుస్తోంది.

- ముసిమి శివాంజనేయులు

## అందుకే ఆ బంధం నుంచి బయటికొచ్చాను - మలైకా అరోరా

'రాత్రైనా నాకు ఓకే..', పవన్ కల్యాణ్ 'గబ్బర్ సింగ్' సినిమాలో 'కెవ్వు కేక...' పాటలతో తెలుగు ప్రేక్షకుల్లో తనకంటూ మంచి గుర్తింపు సొంతం చేసుకున్నారు మలైకా అరోరా. నటుడు సల్మాన్ ఖాన్ సోదరుడు అర్బాజ్ ఖాన్‌తో 1998లో వివాహ బంధంలోకి అడుగుపెట్టారామె. 2002లో వీరికి అర్హాన్ ఖాన్ జన్మించాడు. అయితే వ్యక్తిగత కారణాల వల్ల 2017లో వీరు విడాకులు తీసుకున్నారు. కానీ కుమారుడి బాధ్యతను మాత్రం ఇద్దరూ తీసుకున్నారు. ఇదిలా ఉంటే... తాజాగా ఓ ఇంటర్వ్యూలో కో పేరెంటింగ్ గురించి మలైకా అరోరా మాట్లాడుతూ- ''నేను, అర్బాజ్ భార్యాభర్తలుగా విడిపోయినా కుమారుడి కోసం తల్లిదండ్రులుగా నిలబడ్డాం. ఇప్పుడు వాడికి 22 ఏళ్లు. మేమిద్దరం ఎవరి హద్దుల్లో వాళ్లం ఉన్నాం. అయితే విడాకుల విషయాన్ని ప్రకటించగానే చాలామంది నాదే తప్పంటూ నిందించారు. నా వివాహ బంధం కొనసాగాలని నేను కూడా కోరుకున్నాను. కానీ, అది జరగలేదు. దానికి నేనేం చేయగలను? కొన్నిసార్లు బంధాలనేవి జటిలంగా ఉంటాయి.. కొన్నిసార్లు ఉండవు'' అని తెలిపారు. ఇదిలా ఉంటే... అర్జున్ కపూర్‌తో ప్రేమలో ఉండటం వల్లే అర్బాజ్‌కి మలైకా విడాకులిచ్చారనే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే అర్జున్-మలైకా కూడా బ్రేకప్ అయ్యారన్నది ప్రచారంలో ఉన్న తాజా వార్త.



''నేను, అర్బాజ్ ఖాన్ విడాకులతో వివాహ బంధాన్ని తెంచుకున్నాం. ఆ సమయంలో తప్పంతా నాదే అన్నట్లు అందరూ నావైపే వేలు చూపించారు. స్వార్థంగా ఆలోచించానని నాపై మండిపడ్డారు. అయితే విడాకుల విషయంలో వారికి అలా అనిపించి ఉండొచ్చు. కానీ, నేను ఆనందంగా ఉండాలనుకున్నాను. అందుకే వివాహ బంధం నుంచి బయటకు వచ్చేశాను.. ఇప్పుడు హ్యాపీగా ఉన్నా'' అని మలైకా అరోరా అన్నారు. మహేశ్‌బాబు 'అతిథి' చిత్రంలో

## బిజినెస్ రీల్

### ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో 'జీఎంఆర్' కార్గో సిటీ

న్యూఢిల్లీ: ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ విమానాశ్రయంలోని (ఐజీఐఏ) 50.5 ఎకరాల్లో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ సంస్థ కార్గో సిటీ నిర్మించనుంది. ఇందులో అధునాతన కార్గో, లాజిస్టిక్స్ సదుపాయాలు ఉంటాయి. భవిష్యత్తులో మరో 10 ఎకరాల మేర దీన్ని విస్తరించేందుకు వీలుంటుంది. కార్గో సిటీని నిర్మించి, 2036 వరకు నిర్వహించేందుకు బిడ్డింగ్‌లో ఎంపికైనట్లు కంపెనీ తెలిపింది. దీన్ని మరో 30 ఏళ్లు పొడిగించవచ్చు. ఐజీఐఏని జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ అనుబంధ సంస్థ ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (డీఐఏఎల్) నిర్వహిస్తోంది. ఒప్పందం ప్రకారం కార్గో సిటీ ఆదాయాన్ని డీఐఏఎల్‌తో పంచుకోవాల్సి ఉంటుంది. ఈ మొత్తం పరిమాణం సుమారు రూ. 416 కోట్లుగా ఉంటుందని జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ తెలిపింది.

### ఒప్పో నుంచి కే13 టర్బో ప్రో 5జీ స్మార్ట్‌ఫోన్

- ధర రూ. 24,999



న్యూఢిల్లీ: స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ ఒప్పో ఇండియా తాజాగా కే13 టర్బో సిరీస్ ప్రో 5జీ, టర్బో 5జీ ఫోన్లను ఆవిష్కరించింది. వీటిలో అంతర్గతంగా కూలింగ్ ఫ్యాన్ ఉంటుందని, దేశీయంగా స్మార్ట్‌ఫోన్లలో ఈ ఫీచరును అందించడం ఇదే ప్రథమం అని సంస్థ తెలిపింది. భారీగా మల్టీ టాస్కింగ్, గేమింగ్‌కి అనువుగా ఇవి ఉంటాయని వివరించింది. 7000 ఎంఏహెచ్ బ్యాటరీ, 80 వాట్స్ సూపర్‌వూక్ ఫాస్ట్ చార్జింగ్, 1.5 అమోలెడ్ డిస్‌ప్లే తదితర ఫీచర్లు వీటిలో ఉన్నాయి. దీని ధర రూ. 27,999 నుంచి ప్రారంభం అవుతుంది. అయితే, ఆఫర్లను కూడా పరిగణనలోకి తీసుకుంటే రూ. 24,999 నుంచి లభిస్తుందని సంస్థ తెలిపింది. టర్బో ప్రో 5జీ ఫోన్ల సేల్ ఆగస్టు 15 నుంచి, టర్బో 5జీ ఫోన్ల అమ్మకాలు 18 నుంచి ప్రారంభమవుతాయి.

### ఐసీఐసీఐ లాంబార్డ్‌తో మహీంద్రా ఫైనాన్స్ జట్టు

ముంబై: వాహన బీమా పంపిణీకి సంబంధించి ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్‌తో మహీంద్రా ఫైనాన్స్ ఒప్పందు కుదుర్చుకుంది. దీని ప్రకారం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని తమ విస్తృత నెట్‌వర్క్ ద్వారా ఐసీఐసీఐ లాంబార్డ్ మోటార్ ఇన్సూరెన్స్ పాలసీలను అందించనుంది. కస్టమర్ల అవసరాలకు అనుగుణమైన వాహన బీమా పాలసీలను మరింతగా అందుబాటు స్థాయిలో అందించాలనేది తమ లక్ష్యమని ఈ సందర్భంగా మహీంద్రా ఫైనాన్స్ ఎండీ రౌల్ రెబెల్లో తెలిపారు.

### ఐసీఎంఎంలో హిందుస్తాన్ జింక్

న్యూఢిల్లీ: దేశీ దిగ్గజం హిందుస్తాన్ జింక్ (హెచ్‌జెడ్ఎల్) తాజాగా ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆన్ మైనింగ్ అండ్ మెటల్స్‌లో (ఐసీఎంఎం) సభ్యత్వం దక్కించుకుంది. ఈ ప్రతిష్ఠాత్మక సంస్థలో చేరిన తొలి భారతీయ కంపెనీ తమదేనని హిందుస్తాన్ జింక్ తెలిపింది. సుస్థిర అభివృద్ధికి మైనింగ్, మెటల్స్ పరిశ్రమ తోడ్పడేలా దిగ్గజ కంపెనీలు కలిసి ఐసీఎంఎంని ఏర్పాటు చేసుకున్నాయి. ఇది బ్రిటన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తోంది. వేదాంత గ్రూప్ కంపెనీ అయిన హెచ్‌జెడ్ఎల్ వెండి, సీసం, జింకు ఉత్పత్తి కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

### ఆథమ్ ఇన్వెస్ట్‌మెంట్‌లో ప్రమోటర్ల వాటా విక్రయం

న్యూఢిల్లీ: ఎన్‌బీఎఫ్‌సీ కంపెనీ ఆథమ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రమోటర్ సంస్థల్లో ఒకటైన మెంటార్ క్యాపిటల్ గురువారం 2.7 శాతం వాటాలను విక్రయించింది. వీటి విలువ రూ. 1,165 కోట్లు. ఒక్కో షేరును సగటున రూ. 2,500.58 రేటుకి, ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా మెంటార్ క్యాపిటల్ మొత్తం 46.61 లక్షల షేర్లను విక్రయించింది. అటు అమెరికాకు ఫిడిలిటీ ఇంటర్నేషనల్ తన అనుబంధ సంస్థ ద్వారా 27.41 లక్షల షేర్లను సుమారు రూ. 685 కోట్లకు కొనుగోలు చేసింది. జూలైలో మెంటార్ క్యాపిటల్ 3.41 శాతం వాటాను రూ. 1,307 కోట్లకు విక్రయించింది.

### కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

17-18-2025

| | |
|---|---|
| విశాఖ | 515-00 |
| చిత్తూరు | 548-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 510-00 |
| విజయవాడ | 520-00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| హైదరాబాద్ | 485-00 |
| వరంగల్ | 487-00 |
| రిటైల్ ధర | 5.45 |



విజన్ ఎక్స్



విజన్ టి



విజన్ ఎస్ఎక్స్‌టీ



విజన్ ఎస్

# మహీంద్రా గ్లోబల్ విజన్!!

ముంబై: ఆటోమొబైల్ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా తమ గ్లోబల్ విజన్ కింద సరికొత్త స్పోర్ట్స్ యుటిలిటీ వాహనాల (ఎస్‌యూవీ) కాన్సెప్టులను ఆవిష్కరించింది. వీటిలో విజన్ ఎస్, విజన్ టి, విజన్ ఎస్ఎక్స్‌టీ, విజన్ ఎక్స్ ఉన్నాయి. వీటిని న్యూ-ఐక్యూ ప్లాట్‌ఫాంపై తీర్చిదిద్దినట్లు కంపెనీ తెలిపింది. ఈ ఎస్‌యూవీల ఉత్పత్తి 2027 నుంచి ప్రారంభమవుతుందని పేర్కొంది. ఇటు దేశీ మార్కెట్‌తో పాటు అటు అంతర్జాతీయంగా కూడా ప్రీమియం ఎస్‌యూవీ అనుభూతిని అందించేలా ఇవి ఉంటాయని కంపెనీ తెలిపింది. లెఫ్ట్-హ్యాండ్ డ్రైవింగ్ ఉండే దేశాలకు కూడా అనువుగా వీటి డిజైనింగ్ ఉంటుందని వివరించింది. ఈ ఎస్‌యూవీల్లో విశాలమైన క్యాబిన్, బూట్‌స్పేస్, హై-ఫై టెక్నాలజీ, తేలికపాటి డిజైన్, అత్యుత్తమ భద్రత ప్రమాణాలు ఉంటాయని తెలిపింది.

**4 ఎస్‌యూవీ కాన్సెప్టులు**

# నిర్ణయాల ప్రక్రియలో కీలకంగా ఏఐ

- 2025 ఆఖరుకి 30 శాతం సర్వీసుల ఆటోమేషన్
- మరింతగా ఇన్వెస్ట్ చేయనున్న సంస్థలు
- పెద్ద కంపెనీలపై సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ: కృత్రిమ మేథ (ఏఐ) పూర్తిగా ఆటోమేషన్ సాధనంగా కన్నా, మెరుగైన నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలోనే మరింత కీలకంగా ఉపయోగపడుతుందని పలు దిగ్గజ కంపెనీలు భావిస్తున్నాయి. పబ్లికేషన్ సంస్థ సీఐవోఅండ్‌లీడర్ నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. దీని ప్రకారం 2023 నుంచి వివిధ సృజనాత్మక ప్రక్రియల్లో కంటెంట్ మార్కెటింగ్ నుంచి సాఫ్ట్‌వేర్ కోడింగ్ వరకు జనరేటివ్ ఏఐ వినియోగం అయిదు రెట్లు పెరిగింది. 2025 ఆఖరు నాటికి కంపెనీలు 30 శాతం ఐటీ సర్వీసులు పూర్తిగా ఏఐతో ఆటోమేట్ చేయనున్నాయి. వ్యయాలను తగ్గించుకోవడం, ప్రాసెసింగ్, నిర్వహణ సామర్థ్యాలను పెంచుకోవాలన్న లక్ష్యాలే ఏఐని వినియోగించుకోవడానికి కారణమని 98.4 శాతం కంపెనీలు తెలిపాయి. కస్టమర్లకు మెరుగైన అనుభూతిని అందించేందుకు కృత్రిమ మేథ విలువైన సాధనంగా ఉపయోగపడుతుందని 96 శాతం కంపెనీలు వివరించాయి. 2025 మే-జూలై మధ్య నిర్వహించిన సర్వేలో రూ. 5,000 కోట్ల పైగా వార్షిక టర్నోవరు ఉన్న కంపెనీలకు చెందిన 350 మంది చీఫ్ ఐటీ (లేదా) చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్లు పాల్గొన్నారు.

**రిపోర్ట్‌లో మరిన్ని విశేషాలు..**

- 2025లో 93 శాతం కంపెనీలు ఏఐ, అనలిటిక్స్‌పై పెట్టుబడులను పెంచనున్నాయి. సగం పైగా సంస్థలు బడ్జెట్లను భారీగా పెంచే ఆలోచనలో ఉన్నాయి.
- ఐటీ కార్యకలాపాల్లో ఆటోమేషన్ కోసం, లోపాలను గుర్తించడం వంటి పనులకు 41 శాతం కంపెనీలు ఏఐని వినియోగిస్తున్నాయి.
- చాట్‌బాట్‌లు, పర్సనలైజేషన్ లాంటి అవసరాల కోసం ఫైనాన్స్ (31 శాతం), కస్టమర్ సర్వీస్ (28 శాతం) విభాగాల్లో ఏఐని వినియోగిస్తున్నారు.
- 90 శాతం కంపెనీలు డేటా భద్రత, గోప్యతను ఏఐ వినియోగానికి ప్రధాన సవాలుగా ఉంటోంది. డేటా నాణ్యతపరమైన సవాళ్లు ఆ తర్వాత స్థానంలో ఉన్నాయి.
- 85 శాతం సంస్థలు ఏఐ సాధనాలను అంతర్గతంగానే తయారు చేసుకునేందుకు ప్రాధాన్యమిస్తున్నాయి.

### రిస్కులను ఎదుర్కొనే చర్యలు అవసరం

- బ్యాంకులకు ఆర్‌బీఐ ప్యానెల్ సూచన



ముంబై: కృత్రిమ మేథ (ఏఐ) నుంచి వచ్చే రిస్కులను అధిగమించే విధానాన్ని బ్యాంక్‌లు, ఇతర ఆర్థిక సంస్థలు రూపొందించుకోవాలంటూ ఆర్‌బీఐ ప్యానెల్ ఒకటి సిఫారసు చేసింది. తగిన రక్షణలు లేకపోతే రిస్కులు మరింత పెరిగిపోవచ్చని పేర్కొంది. ఆర్థిక రంగంలో ఏఐని బాధ్యాయుత, నైతిక మార్గంలో వినియోగించేందుకు తగిన కార్యాచరణను సూచించాలంటూ గత డిసెంబర్‌లో ఆర్‌బీఐ ప్యానెల్‌ను ఏర్పాటు చేయడం గమనార్హం. ఈ ప్యానెల్ తన నివేదికను ఆర్‌బీఐకి సమర్పించింది. రిస్కులకు తగిన రక్షణలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఏఐతో ఆర్థిక సేవల రంగం తన సామర్థ్యాలను పెంచుకోవచ్చని ప్యానెల్ సూచించింది. అభివృద్ధికి సంబంధించిన సవాళ్లను పరిష్కరించేందుకు ఏఐ కొత్త మార్గాలను చూపిస్తుందని పేర్కొంది. బహుళ నమూనా, బహుభాషా ఏఐతో ఆర్థిక సేవలకు దూరంగా ఉన్న వారికి సైతం చేరువ కావొచ్చని సూచించింది. ఆర్‌బీఐ నియంత్రణల్లోని సంస్థలు బోర్డు ఆమోదిత ఏఐ విధానాన్ని రూపొందించుకోవాలని పేర్కొంది. సైబర్ భద్రత విధానాలను మెరుగుపరుచుకోవడం, ఘటనలకు సంబంధించి వెంటనే నివేదించడం తదితర సూచనలను కూడా ప్యానెల్ చేసింది.

### స్పోర్ట్స్ స్కూటర్ విభాగంలోకి ఓలా ఎలక్ట్రిక్



ముంబై: ఓలా ఎలక్ట్రిక్ తన ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియో విస్తరణలో భాగంగా స్పోర్ట్స్ స్కూటర్ విభాగంలోకి అడుగు పెట్టనుంది. తాజాగా స్పోర్టియర్ వెర్షన్‌లో కనిపిస్తున్న ఓ స్కూటర్ టీజర్‌ను బుధవారం విడుదల చేసింది. ఓలా 'కృత్రిమ్' ఏఐ ఫీచర్స్‌తో ఈ స్పోర్ట్స్ స్కూటర్లు రానున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం. ప్రతి ఏటా ఆగస్టు 15న నిర్వహించే తన వార్షిక 'సంకల్ప్' కార్యక్రమంలో ఇందుకు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడించే అవకాశం ఉంది. ఇప్పటికే దేశీయంగా టీవీఎస్ ఎన్‌టార్క్, యమహా ఏరోక్స్ 155, ఏప్రిలియా ఎస్ఆర్160 మోడళ్లు స్పోర్ట్స్ స్కూటర్ల విభాగంలో ఉన్నాయి. ఈ ఏడాది ప్రారంభంలో ఓలా ఎలక్ట్రిక్ డ్యూయల్ ఏబీఎస్, బ్రేక్ బై వైర్ సదుపాయాలతో పాటు సొంతంగా తయారు చేసిన 4680 సెల్ ఫీచర్లతో జెన్ 3 స్కూటర్లను ఆవిష్కరించింది.

### హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుతో విన్‌ఫాస్ట్ ఆటో ఎంఓయూ



న్యూఢిల్లీ: ఇన్వెంటరీ, ఆటో ఫైనాన్సింగ్ సదుపాయం కోసం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుతో భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు విన్‌ఫాస్ట్ ఆటో ఇండియా తెలిపింది. దీనికి సంబంధించి ఇరు సంస్థలు ఎంఓయూ పత్రాలపై సంతకాలు చేసినట్లు పేర్కొంది. భారత్‌లో ఒక బ్యాంకింగ్ సంస్థతో కుదుర్చుకున్న తొలి ఎంఓయూ ఇది, నూతన ఉత్పత్తుల ఆవిష్కరణలకు ముందు ఎలాంటి అంతరాయాలు లేని రుణ సదుపాయాలు అందించడం ఈ ఒప్పంద లక్ష్యమని కంపెనీ వివరించింది. భారతీయ కస్టమర్లకు సౌకర్యవంతమైన, ఆధునాతన ఎలక్ట్రిక్ వాహనాలను అందించే ప్రయత్నాల్లో ఈ ఎంఓయూ మైలురాయిగా నిలుస్తుందని విన్‌ఫాస్ట్ ఇండియా సీఈఓ ఫామ్ సాన్ చౌ తెలిపారు. "ఈవీల వినియోగం పెరుగుతున్న క్రమంలో ఫైనాన్సింగ్ కీలక పాత్ర పోషిస్తుంది. కస్టమర్ల ఆకాంక్షలకు పెద్దపీట వేయడంలో బ్యాంకు చేస్తున్న ప్రయత్నాల్లో ఇది ఒక భాగమని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రిటైల్ అసెట్స్ హెడ్ అరవింద్ వోహ్రా తెపారు. విన్‌ఫాస్ట్ ఆటో ఇండియా ఈ ఏడాది పండుగ సీజన్ ముందు వీఎఫ్7, వీఎఫ్6 మోడళ్లను లాంచ్ చేయనుంది.

## క్యూ1 ఫలితాలు

### గ్లెన్‌మార్క్ ఫార్మా డీలా

నికర లాభం రూ. 47 కోట్లకు పరిమితం

న్యూఢిల్లీ: ఔషధ రంగ దిగ్గజం గ్లెన్‌మార్క్ ఫార్మాస్యూటికల్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 86 శాతం పతనమై రూ. 47 కోట్లకు పరిమితమైంది. యూఎస్‌లో వివాద పరిష్కారానికి చేపట్టిన ప్రొవిజన్ ప్రభావం చూపింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 340 కోట్లకుపైగా ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 3,244 కోట్ల నుంచి రూ. 3,264 కోట్లకు నామమాత్రంగా బలపడింది. మొత్తం వ్యయాలు సైతం రూ. 2,813 కోట్ల నుంచి రూ. 2,872 కోట్లకు స్వల్పంగా పెరిగాయి. దేశీయంగా ఫార్ములేషన్ల బిజినెస్ రూ. 1,196 కోట్ల నుంచి రూ. 1,240 కోట్లకు పుంజుకుంది. ఉత్తర అమెరికా నుంచి రూ. 778 కోట్ల విలువైన అమ్మకాలు సాధించగా.. యూరప్ ఆదాయం స్వల్ప(4 శాతం) వెనకడుగుతో రూ. 668 కోట్లకు పరిమితమైంది. ఈ కాలంలో యూఎస్ యాంటీట్రస్ట్ అండ్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ లాసూట్స్ సెటిల్‌మెంట్‌లో భాగంగా 3.775 కోట్ల డాలర్లు(రూ. 323 కోట్లు) ప్రొవిజన్ చేపట్టింది. ఈ ఒప్పందానికి లిటిగేషన్‌ను విచారిస్తున్న కోర్టు అనుమతించవలసి ఉన్నట్లు కంపెనీ పేర్కొంది. అయితే కంపెనీ వివాద సంబంధ( లయబిలిటీ లేదా చట్టవిరుద్ధ) ఆరోపణలను తిరస్కరిస్తున్నట్లు స్పష్టం చేసింది.

### కాఫీ డే గ్లోబల్ నష్టాలు తగ్గాయ్

రూ. 11 కోట్లు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి త్రైమాసికంలో కేఫ్ కాఫీ డే చైన్ కంపెనీ కాఫీ డే గ్లోబల్ ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర నష్టం భారీగా తగ్గి రూ. 11 కోట్లకు పరిమితమైంది. ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 17 కోట్ల నికర నష్టం నమోదైంది. మొత్తం ఆదాయం 6 శాతం వృద్ధితో రూ. 263 కోట్లను తాకింది. గత క్యూ1లో రూ. 248 కోట్ల టర్నోవర్ సాధించింది. 2025 జూన్‌కల్లా కేఫ్ కాఫీ డే స్టోర్ల సంఖ్య 448 నుంచి 427కు తగ్గింది. వెండింగ్ మెషీన్ల సంఖ్య 1 శాతం పెరిగి 55,189కు చేరింది. కాగా.. మాతృ సంస్థ కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్ క్యూ1లో రూ. 23 కోట్లకుపైగా నికర లాభం ఆర్జించింది. గతేడాది క్యూ1లో రూ. 13 కోట్లకుపైగా నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం 4 శాతం వృద్ధితో రూ. 269 కోట్లను అధిగమించింది.

### జువారీ ఇండస్ట్రీస్‌కు తగ్గిన నష్టాలు

రూ. 0.5 కోట్లు

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం జువారీ ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర నష్టం భారీగా తగ్గి రూ. 0.5 కోట్లకు పరిమితమైంది. అధిక ఆదాయం ఇందుకు దోహదపడింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో దాదాపు రూ. 34 కోట్ల నికర నష్టం నమోదైంది. మొత్తం ఆదాయం 14% పుంజుకుని రూ. 257 కోట్లను అధిగమించింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 277 కోట్ల నుంచి రూ. 303 కోట్లకు పెరిగాయి. ఈ కాలంలో దేశీయంగా షుగర్ అమ్మకాలు 3.8 లక్షల టన్నుల నుంచి 3.6 లక్షల టన్నులకు తగ్గాయి. అమ్మకాల కోటా కేటాయింపులు తగ్గడం ప్రభావం చూపింది. కాగా.. ఇథనాల్ విక్రయాలు 9,672 కిలో లీటర్ల నుంచి నామమాత్ర వృద్ధితో 9,757 కిలో లీటర్లకు చేరాయి. అయితే లీటర్‌కు సగటు ధర రూ. 58.9 నుంచి రూ. 60.7కు మెరుగుపడింది.

### విరించి ఆదాయం రూ. 80 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో విరించి లిమిటెడ్ ఆదాయం (కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన) సుమారు రూ. 80 కోట్లుగా నమోదైంది. అంతక్రితం క్యూ1లో ఇది రూ. 76 కోట్లు. ఇక లాభం రూ. 1 కోటి నుంచి రూ. 37 లక్షలకు తగ్గింది. మరోవైపు ఫిన్‌టెక్ వ్యాపారం క్యాఫండ్.. అమెరికా మార్కెట్లో గత కొన్ని త్రైమాసికాలుగా గణనీయంగా వృద్ధి చెందినట్లు సంస్థ తెలిపింది. కొత్తగా చెక్‌ఎన్‌గో, మనీట్రీ కస్టమర్లు జతవడంతో మొత్తం క్లయింట్ల సంఖ్య 18కి చేరినట్లు తెలిపింది. విరించి హెల్త్‌కేర్‌లో మరింత మంది డాక్టర్లను చేర్చుకునే ప్రక్రియలో ఉన్నట్లు పేర్కొంది.

# యాపిల్ ఉత్పత్తుల సరఫరా 21% అప్

- ప్రథమార్ధంలో 59 లక్షల యూనిట్లు
- టాప్ మోడల్ ఐఫోన్ 16
- ఐడీసీ డేటాలో వెల్లడి



న్యూఢిల్లీ: ఈ ఏడాది ప్రథమార్ధంలో భారత్‌లో యాపిల్ ఉత్పత్తుల సరఫరా వార్షికంగా 21.5 శాతం పెరిగి 59 లక్షల యూనిట్లకు చేరుకుంది. అత్యధికంగా సరఫరా అయిన మోడల్‌గా ఐఫోన్ 16 నిల్చింది. మార్కెట్ రీసెర్చ్ సంస్థ ఇంటర్నేషనల్ డేటా కార్పొరేషన్ (ఐడీసీ) ఓ నివేదికలో ఈ విషయాలు తెలిపింది. దీని ప్రకారం గతేడాది ప్రథమార్ధంతో పోలిస్తే దేశీ మార్కెట్లో స్మార్ట్‌ఫోన్ల సరఫరా 0.9 శాతం పెరిగి 7 కోట్లకు చేరింది. పోకో, షావోమీ, వన్‌ప్లస్, రియల్‌మి తదితర చైనా సంస్థల ఫోన్ల సప్లై తగ్గింది. ఇక రెండో త్రైమాసికంలో మొత్తం 3.7 కోట్ల స్మార్ట్‌ఫోన్స్ సరఫరా అయ్యాయి. యాపిల్ ఐఫోన్ల సరఫరా 19.7 శాతం పెరిగి 27 లక్షల యూనిట్లకు చేరింది. స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో 7.5 శాతం వాటా దక్కించుకుంది.

**మరిన్ని విశేషాలు..**

- జూన్ క్వార్టర్‌లో 19 శాతం మార్కెట్ వాటాతో వివో అగ్ర స్థానంలో (23.5 శాతం వార్షిక వృద్ధి) నిల్చింది. 14.5 శాతం వాటాతో శాంసంగ్ (21 శాతం వృద్ధి) రెండో స్థానంలో ఉంది. ఒప్పో (13.4 శాతం వాటా, 25.4 శాతం వృద్ధి), మోటరోలా (8 శాతం వాటా, 39.4 శాతం వృద్ధి) ఆ తర్వాత ర్యాంకుల్లో ఉన్నాయి.
- వన్‌ప్లస్ మార్కెట్ వాటా 4.4 శాతం నుంచి 2.5 శాతానికి, సరఫరా 39.4 శాతం మేర పడిపోయాయి.
- రియల్‌మి మార్కెట్ వాటా 9.7 శాతానికి, స్మార్ట్‌ఫోన్ల సప్లై 17.8 శాతం మేర క్షీణించాయి. అటు షావోమీ మార్కెట్ వాటా కూడా 9.6 శాతానికి, వాల్యూమ్స్ 23.5 శాతం స్థాయిలో తగ్గాయి. పోకో 3.8 శాతానికి తగ్గగా, సరఫరా 28.8 శాతం మేర క్షీణించింది.
- ప్రీమియం సెగ్మెంట్ డివైజ్‌లు (రూ.52,000 నుంచి రూ. 70,000 వరకు) అత్యధికంగా 96.4% వృద్ధి చెందాయి. మార్కెట్ వాటా 2 నుంచి 4 శాతానికి పెరిగింది. ఈ విభాగంలో ఐఫోన్ 16/15ల వాటా అయిదింట మూడొంతులు ఉంది.
- సూపర్ ప్రీమియం సెగ్మెంట్ ఫోన్లు (రూ. 70,000 కన్నా పైన) 15.8% వృద్ధి చెందగా, మార్కెట్ వాటా పెద్దగా మార్పులు లేకుండా 7 శాతంగా కొనసాగింది. శాంసంగ్, యాపిల్ మార్కెట్ వాటా వరుసగా 49%, 48%గా ఉంది. ఈ సెగ్మెంట్లో ఐఫోన్ 16, గెలాక్సీ ఎస్25, ఎస్24 అల్ట్రా, ఎస్25, ఐఫోన్ 16ప్లస్ కీలక మోడల్స్‌గా ఉన్నాయి.
- స్మార్ట్‌ఫోన్ల సగటు విక్రయ ధర (ఏఎస్‌పీ) 10.8% పెరిగి రికార్డు స్థాయిలో 275 డాలర్లకు చేరింది.
- ఎంట్రీ స్థాయి (రూ. 8,700 లోపు) సెగ్మెంట్ 22.9 శాతం వృద్ధి చెందింది. గతేడాది క్వార్టర్‌తో పోలిస్తే మార్కెట్ వాటాను 14 శాతం నుంచి 16 శాతానికి పెరిగింది.
- మాస్ బడ్జెట్ సెగ్మెంట్ (రూ. 8,700 నుంచి రూ. 17,400 వరకు) ఫోన్ల సరఫరా పరిమాణం 1.1 శాతం పెరగ్గా, ఎంట్రీ ప్రీమియం సెగ్మెంట్ (రూ. 17,400 - రూ. 35,000) సరఫరా 2.5 శాతం, మార్కెట్ వాటా 30 శాతం నుంచి 27 శాతానికి తగ్గాయి.

# ట్యాబ్లెట్ పీసీ మార్కెట్ జోరు

- క్యూ2లో 20 శాతం జంప్
- 30 శాతం వాటాతో యాపిల్ టాప్
- క్యూ2పై సైబర్‌మీడియా రీసెర్చ్ నివేదిక



న్యూఢిల్లీ: దేశీయంగా ట్యాబ్లెట్ పీసీల మార్కెట్ ఈ ఏడాది రెండో త్రైమాసికంలో గణనీయంగా పెరిగింది. గతేడాది ఏప్రిల్-జూన్ క్వార్టర్‌తో పోలిస్తే ఈసారి 20 శాతం వృద్ధి నమోదు చేసింది. ఇందులో దాదాపు మూడో వంతు మార్కెట్ వాటా యాపిల్‌దే ఉంది. సైబర్‌మీడియా రీసెర్చ్ (సీఎంఆర్) నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం యాపిల్ ఐప్యాడ్ సరఫరాలు వార్షికంగా 10 శాతం, త్రైమాసికాలవారీగా 78 శాతం పెరిగాయి. 30 శాతం మార్కెట్ వాటా దక్కించుకున్నాయి. కొత్తగా ప్రవేశపెట్టిన ఐప్యాడ్ 11 సిరీస్‌కి డిమాండ్ నెలకొనడం ఇందుకు దోహదపడింది. సమీక్షాకాలంలో యాపిల్ మొత్తం విక్రయాల్లో దీని వాటా 70 శాతం పైగా నమోదైంది. ఇక, 15 శాతం వార్షిక వృద్ధి, 27 శాతం మార్కెట్ వాటాతో శాంసంగ్ రెండో స్థానంలో నిల్చింది. విస్తృతమైన ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియో కారణంగా అఫోర్డబుల్, ఎంటర్‌ప్రైజ్ సెగ్మెంట్లో కంపెనీ నిలకడగా రాణించింది. మొత్తం శాంసంగ్ ట్యాబ్‌ల విక్రయాల్లో గెలాక్సీ ట్యాబ్ ఏ9 ప్లస్ 5జీ వాటా ఏకంగా 81 శాతంగా నమోదైంది. 2025లో ట్యాబ్లెట్ మార్కెట్ 10-15 శాతం వృద్ధి నమోదు చేయొచ్చని సీఎంఆర్ అంచనా వేసింది.

**నివేదికలోని మరిన్ని విశేషాలు..**

- ట్యాబ్లెట్ పీసీల అమ్మకాలు 18 శాతం పెరిగినప్పటికీ లెనోవో మార్కెట్ వాటా ఫ్లాట్‌గా 16 శాతం స్థాయిలోనే కొనసాగింది.
- షావోమీ, వన్ ప్లస్‌ల అమ్మకాలు వరుసగా 81 శాతం, 95 శాతం పెరగ్గా, మార్కెట్ వాటా 15 శాతం, 6 శాతంగా నమోదైంది.
- రేటుకు తగ్గ విలువను అందించే షావోమీ, వన్‌ప్లస్ లాంటి బ్రాండ్ల ట్యాబ్లెట్లకు విద్యార్థులు, గిగ్ వర్కర్ల నుంచి డిమాండ్ కనిపించింది.
- దేశీ మార్కెట్ క్రమంగా మరింత ఉత్పాదకత, వినోదాన్ని అందించే 5జీ ఆధారిత ప్రీమియం, రేటుకు తగ్గ విలువను ఇచ్చే ఆండ్రాయిడ్ ట్యాబ్లెట్ల వైపు మళ్లుతోంది. పండుగ సీజన్ నేపథ్యంలో అమ్మకాలు నిలకడగా వృద్ధి చెందవచ్చు.

# మ్యాక్స్‌వెల్ మెరుపులు

## చివరి టి20లో 2 వికెట్లతో ఆస్ట్రేలియా గెలుపు





మ్యాక్స్‌వెల్

**కెయిన్స్ (ఆస్ట్రేలియా):** సొంతగడ్డపై దక్షిణాఫ్రికాతో జరిగిన టి20 సిరీస్‌ను ఆస్ట్రేలియా 2-1తో కైవసం చేసుకుంది. ఉత్కంఠభరితంగా జరిగిన చివరి మ్యాచ్‌లో గ్లెన్ మ్యాక్స్‌వెల్ (36 బంతుల్లో 62 నాటౌట్; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపులతో ఆస్ట్రేలియా 2 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాపై గెలిచింది. ముందుగా సఫారీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 172 పరుగులు చేసింది. డెవాల్డ్ బ్రెవిస్ (26 బంతుల్లో 53; 1 ఫోర్, 6 సిక్స్‌లు) చెలరేగగా, వాన్ డెర్ డసెన్ (26 బంతుల్లో 38 నాటౌట్; 3 ఫోర్లు) రాణించాడు. ఆ తర్వాత ఆసీస్ 19.5 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసి విజయాన్నందుకుంది. కెప్టెన్ మిచెల్ మార్ష్ (37 బంతుల్లో 54; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించాడు. తొలి టి20లో ఆసీస్ గెలువగా, రెండో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా నెగ్గింది. అనంతరం ఇదే వేదికపై 19న జరిగే తొలి వన్డేతో మూడు వన్డేల సిరీస్ మొదలవుతుంది.

### బ్రెవిస్ దంచేశాడు

దక్షిణాఫ్రికా టాపార్డర్ బ్యాటర్లు మార్క్‌రమ్ (1), రికెల్టన్ (13), ప్రిటోరియస్ (24) విఫలమయ్యారు. దీంతో 49 పరుగులకే 3 కీలక వికెట్లను కోల్పోయిన సఫారీని బ్రెవిస్, స్టబ్స్ (25) ఆదుకున్నారు. గత మ్యాచ్‌లో మెరుపు సెంచరీ సాధించిన బ్రెవిస్ ఈ సారి కూడా సిక్సర్లతో విరుచుకుపడి 22 బంతుల్లోనే అర్ధసెంచరీ సాధించాడు. నాలుగో వికెట్‌కు బ్రెవిస్, ట్రిస్టన్ స్టబ్స్ 29 బంతుల్లో 61 పరుగులు జోడించడంతో జట్టు స్కోరు 10.1 ఓవర్లలోనే వంద దాటింది. 110 స్కోరు వద్ద బ్రెవిస్‌ను అవుట్ చేసినఎలిస్ ఈ జోడీని విడగొట్టాడు. ఇతర సఫారీ బ్యాటర్లు ప్రభావం చూపలేకపోయారు.

### మార్ష్, మ్యాక్సీ ఫిఫ్టీలతో...

లక్ష్యఛేదనలో ఆస్ట్రేలియాకు ఓపెనర్లు మార్ష్, ట్రవిస్ హెడ్ (19; 3 ఫోర్లు) 8 ఓవర్లలో 66 పరుగులు జోడించి చక్కని ఆరంభమే ఇచ్చారు. కానీ తర్వాత వచ్చిన ఇన్‌గ్లిస్ (0), గ్రీన్ (9), టిమ్ డేవిడ్ (17)లు విఫలమయ్యారు. 14 ఓవర్లు ముగిసేసరికి ఆసీస్ 122/6 స్కోరు వద్ద నిలిచింది. చేతిలో 4 వికెట్లతో విజయం కోసం 36 బంతుల్లో 51 పరుగులు చేయాల్సి ఉంది. ఇలాంటి స్థితిలో మ్యాక్స్‌వెల్ తన ధాటిని ప్రదర్శించాడు. 30 బంతుల్లో అర్ధసెంచరీ సాధించిన మ్యాక్సీకి... 19వ ఓవర్ వేసిన కార్బిన్ బాష్ సవాల్ విసిరాడు. 12 బంతుల్లో 12 పరుగులు చేయాల్సిన చోట సఫారీ బౌలర్ వరుస బంతుల్లో డ్వార్షుయిస్ (1), ఎలిస్ (0)లను అవుట్ చేయగా రెండు పరుగులు వచ్చాయి. అయితే ఆఖరి ఓవర్లో మ్యాక్సీ తొలి ఐదు బంతుల్లో 2, 4, 0, 0, 4లతో మ్యాచ్‌ను ముగించాడు. ఆసీస్ గత ఏడు ద్వైపాక్షిక టి20 సిరీస్‌లను గెలుచుకోవడం ద్వారా అజేయంగా నిలిచినట్లయ్యింది. మరోవైపు దక్షిణాఫ్రికా ప్రపంచకప్ సహా గత పది టి20 సిరీస్‌లలో ఒక్కటి మాత్రమే నెగ్గింది.

# విజేత అరోనియన్

## గుకేశ్‌కు ఆరో స్థానం


అరోనియన్

**సెయింట్ లూయిస్ (అమెరికా):** గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా జరుగుతున్న సెయింట్ లూయిస్ ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేకపోయాడు. బ్లిట్జ్ విభాగంలో 18 పాయింట్లతో వియత్నాంకు చెందిన లియామ్ లె క్వాంగ్‌తో కలిసి సంయుక్తంగా ఆరో స్థానంలో నిలిచాడు. అమెరికా ప్లేయర్ లెవాన్ అరోనియన్ 24.5 పాయింట్లతో విజేతగా నిలిచాడు. ఈ టోర్నీలో సంపూర్ణ ఆధిపత్యం కనబర్చిన అరోనియన్... మరో రెండు రౌండ్‌లు మిగిలుండగానే టైటిల్ గెలుచుకున్నాడు. ఫాబియానో కరువానా (అమెరికా; 21.5 పాయింట్లు), మ్యాక్సిమ్ లాగ్రేవ్ (ఫ్రాన్స్; 21 పాయింట్లు) వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఇటీవల లాస్ వెగాస్ ఫ్రీస్టయిల్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలిచిన 42 ఏళ్ల అరోనియన్... అదే జోరులో ఇక్కడ కూడా విజేతగా నిలిచాడు. అరోనియన్‌కు 40 వేల డాలర్లు (సుమారు రూ. 35 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. రెండు రోజుల విశ్రాంతి అనంతరం గుకేశ్ సింక్యూఫీల్డ్ కప్‌లో బరిలోకి దిగనున్నాడు. దీంట్లో భారత్ నుంచి యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద కూడా పాల్గొననున్నాడు. సింక్యూఫీల్డ్ టోర్నీ క్లాసికల్ పోరు కావడంతో ఈ విభాగంలో ప్రపంచ చాంపియన్ అయిన గుకేశ్ తన స్థాయికి తగ్గ ప్రదర్శనతో చెలరేగే అవకాశం ఉంది.




# అండర్-19 వరల్డ్‌కప్‌నకు అమెరికా

**దుబాయ్:** వచ్చే ఏడాది జరగనున్న అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) అండర్-19 పురుషుల ప్రపంచకప్‌నకు అమెరికా జట్టు అర్హత సాధించింది. జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న ఈ టోర్నమెంట్‌కు అమెరికా... చివరిదైన 16వ జట్టుగా ఎంపికైంది. ఇటీవలి కాలంలో సీనియర్ స్థాయిలో చక్కటి ప్రదర్శన కనబరుస్తూ అందరి ప్రశంసలు దక్కించుకుంటున్న అమెరికా... ఇప్పుడు జూనియర్ స్థాయిలోనూ సంచలనాలు రేపేందుకు సిద్ధమైంది. 2024లో దక్షిణాఫ్రికా వేదికగా జరిగిన అండర్-19 ప్రపంచకప్‌లో పాల్గొన్న టాప్-10 జట్లు నేరుగా ఈ సారి బరిలోకి దిగనుండగా... ఆతిథ్య హోదాలో జింబాబ్వే వరల్డ్‌కప్ ఆడనుంది. మిగిలిన ఐదు జట్లను వేర్వేరు క్వాలిఫయింగ్ ఈవెంట్‌ల ద్వారా ఎంపిక చేశారు. తాజాగా అమెరికా అర్హత టోర్నీలో అదరగొట్టింది. బెర్ముడా, అర్జెంటీనా, కెనడాపై విజయాలు సాధించి... మరో మ్యాచ్ మిగిలుండగానే వరల్డ్‌కప్ బెర్త్ పట్టేసింది. జార్జియా వేదికగా డబుల్ రౌండ్‌రాబిన్ పద్ధతిలో జరుగుతున్న క్వాలిఫయింగ్ టోర్నీలో అర్జున్ మహేశ్ సారథ్యంలోని అమెరికా జట్టు చివరి మ్యాచ్‌లో 65 పరుగుల తేడాతో కెనడాపై విజయం సాధించింది. తద్వారా ప్రపంచకప్‌నకు అర్హత సాధించింది.

**2026 అండర్-19 పురుషుల ప్రపంచకప్‌లో పాల్గొననున్న జట్లు**

జింబాబ్వే, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇంగ్లండ్, భారత్, ఐర్లాండ్, న్యూజిలాండ్, పాకిస్తాన్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, వెస్టిండీస్, అఫ్గానిస్తాన్, జపాన్, స్కాట్లాండ్, టాంజానియా, అమెరికా.

# ఆంధ్రప్రదేశ్ ఓటమి

## జూనియర్ పురుషుల హాకీ చాంపియన్‌షిప్



**జలంధర్:** హాకీ ఇండియా (హెచ్ఐ) జూనియర్ పురుషుల జాతీయ చాంపియన్‌షిప్‌లో ఆంధ్ర ప్రదేశ్‌కు ఘోర పరాజయం ఎదురైంది. శనివారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో కర్ణాటక 10-1 గోల్స్ తేడాతో ఆంధ్రప్రదేశ్‌పై ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. కర్ణాటక తరఫున హర్‌పాల్ (12వ, 35వ నిమిషాల్లో), తనీశ్ రమేశ్ (17వ, 56వ ని.) చెరో రెండు గోల్స్ సాధించారు. మిగతా వారిలో రాజు మనోజ్ గైక్వాడ్ (5వ ని.) నితీశ్ శర్మ (10వ ని.) కెప్టెన్ ధ్రువ (25వ ని.), అచ్చయ్య (24వ ని.), కుశాల్ బోపయ్య (51వ ని.), పూజిత్ (58వ ని.) తలా ఒక గోల్ చేశారు. మిగతా మ్యాచ్‌ల్లో హరియాణా 3-0తో దాద్రా నగర్ హవేలిపై విజయం సాధించగా, ఉత్తర ప్రదేశ్ 9-2తో మహారాష్ట్రపై జయభేరి మోగించింది. ఆతిథ్య పంజాబ్ 8-4తో తమిళనాడుపై గెలుపొందింది.

# 'ఇలాగైతే ఐఎస్ఎల్‌ను మొత్తానికే మూసేస్తాం'

**న్యూఢిల్లీ:** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) నిర్వహణ కోసం అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) తక్షణం చర్యలు చేపట్టకపోతే క్లబ్ కార్యకలాపాలన్నీ మొత్తానికే ఆపేస్తామని ఐఎస్ఎల్ క్లబ్‌లు అల్టిమేటం జారిచేశాయి. ఇదే జరిగితే భారత్‌లో ఫుట్‌బాల్ ఆట అటకెక్కుతుందని ఐఎస్ఎల్‌కు చెందిన 11 క్లబ్‌లు ఘాటుగా హెచ్చరించాయి. భారత్‌లో ఐఎస్ఎల్ నిర్వహణ కోసం ఏఐఎఫ్ఎఫ్... ఫుట్‌బాల్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ లిమిటెడ్ (ఎఫ్ఎస్‌డీఎల్)తో మాస్టర్ రైట్స్ అగ్రిమెంట్‌ను పునరుద్ధరించుకోకపోవడంతో ఈ సీజన్ ఆపేశారు. ఇంత జరుగుతున్నా ఏఐఎఫ్ఎఫ్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో క్లబ్‌లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ మేరకు శనివారం సమాఖ్య అధ్యక్షుడు కల్యాణ్ చౌబేకు లేఖ రాశాయి. భారత్‌లో క్లబ్ కార్యకలాపాల్ని మొత్తానికే రద్దు చేసుకుంటామని హెచ్చరించాయి. 11 ఏళ్లుగా దేశంలో ఫుట్‌బాల్ క్రీడ అభివృద్ధి కోసం ఐఎస్ఎల్ క్లబ్‌లు కోట్ల రూపాయలు వెచ్చించాయని, యువ ఆటగాళ్లకు శిక్షణ శిబిరాలు, మౌలిక వసతులు, అకాడమీల ఏర్పాటుకు ఎంతగానో కృషి చేశాయని ఆ లేఖలో గుర్తుచేశాయి. ఉన్నపళంగా అన్నీ మూతబడితే దేశంలో ఫుట్‌బాల్ ఆట పాతాళానికి పడిపోతుందని వెంటనే ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశాయి.

# మెయిన్ 'డ్రా'కు యశస్విని

**మాల్మో (స్వీడన్):** యూరోప్ స్మాష్ వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) టోర్నమెంట్‌లో భారత ప్లేయర్ యశస్విని మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించింది. మహిళల క్వాలిఫయింగ్ సింగిల్స్ మూడో రౌండ్‌లో శనివారం యశస్విని 3-1 (7-11, 11-8, 11-8, 11-6)తో ఇజాబెలా లుపులెస్కు (సెర్బియా)పై విజయం సాధించింది. ఇతర మ్యాచ్‌ల్లో దియా చిటాలె రెండో రౌండ్‌లో 3-2 (9-11, 11-7, 11-9, 5-11, 11-9)తో మే యెరిమ్ (కొరియా)పై గెలవగా... స్వస్తిక ఘోష్ రెండో రౌండ్‌లో 0-3 (10-12, 4-11, 2-11)తో యేహ్ యీ టియాన్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడింది. భారత స్టార్ ప్యాడ్లర్లు మనిక బత్రా, ఆకుల శ్రీజకు మహిళల సింగిల్స్ మెయిన్ 'డ్రా'లో నేరుగా చోటు లభించింది. అయితే తొలి రౌండ్‌లోనే వీరిద్దరూ ముఖాముఖీ తలపడనున్నారు. మరోవైపు పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ మూడో రౌండ్‌లో మనుశ్ షా 2-3 (11-7, 4-11, 9-11, 11-3, 7-11)తో లూకా మ్లాడెనోవిక్ (లగ్జంబర్గ్) చేతిలో ఓడాడు. అంతకుముందు రెండో రౌండ్‌లో మనుశ్ షా 3-1 (11-7, 11-6, 10-12, 11-9)తో అమిరెజా అబ్బాసి (మాల్టా)పై విజయం సాధించగా... హర్మీత్ దేశాయ్ 2-3 (9-11, 11-8, 7-11, 11-8, 9-11)తో లూకా మ్లాడెనోవిక్ (లక్సెంబర్గ్) చేతిలో ఓడాడు.

# సునీల్ ఛెత్రీకి దక్కని చోటు

- 35 మంది భారత ఫుట్‌బాల్ ప్రాబబుల్స్ ప్రకటన
- నేషన్స్ కప్‌నకు ముందు శిక్షణ శిబిరం ప్రారంభం



**న్యూఢిల్లీ:** సుదీర్ఘ కాలంగా భారత ఫుట్‌బాల్ జట్టులో కీలక ఆటగాడిగా కొనసాగుతున్న సునీల్ ఛెత్రీకి... తాజా ప్రాబబుల్స్‌లో చోటు దక్కలేదు. త్వరలో జరగనున్న సీఏఎఫ్ఏ నేషన్స్ కప్ కోసం కొత్త కోచ్ ఖాలిద్ జమీల్ శనివారం 35 మందితో ప్రాబబుల్స్‌ను ప్రకటించాడు. అందులో స్టార్ స్ట్రయికర్ ఛెత్రి పేరు లేదు. ఇప్పటికే అంతర్జాతీయ కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించి... ఆ తర్వాత జట్టు అవసరాల కోసం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని తిరిగి బరిలోకి దిగిన సునీల్ ఛెత్రి గత నాలుగు మ్యాచ్‌ల్లోనూ ప్రభావం చూపలేకపోయాడు. అయితే కేవలం ప్రదర్శన ఆధారంగానే ఛెత్రిని ఎంపిక చేయలేదా లేక... అతడే స్వయంగా ఈ టోర్నీకి దూరంగా ఉంటానని చెప్పాడా అనే విషయంలో స్పష్టత కొరవడింది. దీనిపై అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) అధికారులను వివరణ కోరగా... 'జట్టు ఎంపికలో మా ప్రమేయం లేదు. దీనికి సంబంధించిన అన్నీ విషయాలు హెడ్ కోచ్ చూసుకుంటారు' అని వెల్లడించారు. రెండేళ్ల పదవీ కాలానికి గానూ భారత మాజీ ప్లేయర్ జమీల్ ఇటీవలే టీమిండియా కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. ప్రాబబుల్స్‌కు ఎంపికైన వారితో శనివారమే బెంగళూరులో శిక్షణ శిబిరం ప్రారంభమైంది. అందులో 22 మంది పాల్గొనగా... మిగిలిన 13 మంది ఆటగాళ్లు డ్యురాండ్ కప్ మ్యాచ్‌లు ముగియగానే జట్టుతో చేరనున్నారు. ప్రాబబుల్స్‌లో గోల్‌కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ సంధు, చింగ్లెన్‌సనా సింగ్, రాహుల్ భేకె, రోషన్ సింగ్, సురేశ్ సింగ్, అనిరుధ్ థాపా, దీపక్ టాంగ్రి, లాలెంగ్‌మావియా రాల్టె, లిస్టన్ కొలాకో, మన్‌వీర్ సింగ్, అబ్దుల్ సమద్, అన్వర్ అలీ, జాక్సన్ సింగ్, మహేశ్ సింగ్ తదితరులు ఉన్నారు.

### రిటైర్మెంట్ వెనక్కి తీసుకొని...

గతేడాది జూన్‌లో కువైట్‌తో మ్యాచ్ అనంతరం ఛెత్రీ అంతర్జాతీయ కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. అయితే ఆ తర్వాత భారత జట్టు ప్రదర్శన మరింత పడిపోవడంతో... ఈ ఏడాది మార్చిలో మాల్దీవులుతో మ్యాచ్‌కు ముందు అప్పటి టీమిండియా హెడ్ కోచ్ మార్ మనోలో విజ్ఞప్తి మేరకు తన నిర్ణయాన్ని పక్కన పెట్టి ఛెత్రీ తిరిగి జట్టుతో చేరాడు. మాల్దీవులుతో మ్యాచ్‌లో భారత జట్టు విజయం సాధించగా.. అందులో ఛెత్రీ ఒక గోల్ చేశాడు. ఆ తర్వాత బంగ్లాదేశ్‌తో మ్యాచ్ 'డ్రా' కాగా... హాంకాంగ్ చేతిలో టీమిండియా ఓడింది. థాయ్‌లాండ్‌తో స్నేహపూర్వక మ్యాచ్‌లో సైతం పరాజయం పాలైంది. దీంతో జట్టు ప్రదర్శనకు నైతిక బాధ్యత వహిస్తూ మనోలో హెడ్ కోచ్ పదవి నుంచి తప్పుకున్నాడు. అతడి స్థానంలో ఏఐఎఫ్ఎఫ్ జమీల్‌ను కొత్తకోచ్‌గా ఎంపిక చేసింది. అతడి ఆధ్వర్యంలో భారత జట్టు నేషన్స్ కప్‌లో బరిలోకి దిగనుంది. ఇందులో భాగంగా ఈ నెల 29న తజకిస్తాన్‌తో టీమిండియా తొలి మ్యాచ్ ఆడనుంది. ఆ తర్వాత సెప్టెంబర్ 1న ఇరాన్‌తో, 4న అఫ్గానిస్తాన్‌తో తలపడుతుంది. అనంతరం ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లో భాగంగా అక్టోబర్‌లో సింగపూర్‌తో టీమిండియా ఇంటా బయట మ్యాచ్‌లు ఆడనుంది.



# టాప్ షూటర్లంతా బరిలోకి...

## రేపటి నుంచి ఆసియా చాంపియన్‌షిప్

**న్యూఢిల్లీ:** కజకిస్తాన్‌లో జరిగే ఆసియా చాంపియన్‌షిప్‌లో భారత టాప్ షూటర్లంతా పతకాలపై గురిపెట్టేందుకు సిద్ధమయ్యారు. డబుల్ ఒలింపిక్ పతకాల విజేత మను భాకర్, సిఫ్ట్ కౌర్, అర్జున్ బబుతా, సౌరభ్ చౌదరి తదితర మేటి షూటర్లు సహా 182 మందితో కూడిన భారత బృందం ఆసియా చాంపియన్‌షిప్‌లో పాల్గొంటోంది. ఈ టోర్నీ బరిలోకి దిగుతున్న భారీ సేన మన జట్టే కావడం విశేషం. సోమవారం నుంచి కజకిస్తాన్‌లోని షింకెంట్ నగరంలో ఈ పోటీలు జరుగనున్నాయి. రైఫిల్, పిస్టల్, షాట్‌గన్ విభాగాల్లో 58 ఈవెంట్లలో పోటీలుంటాయి. ఇందులో 46 వ్యక్తిగత ఈవెంట్లు కాగా, 12 మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ పోటీలు నిర్వహిస్తారు. భారత్ సీనియర్ విభాగంలోనే ఒక్కో ఈవెంట్‌లో ఐదుగురు చొప్పున షూటర్లను బరిలోకి దింపుతోంది. వీటిలో మూడు పతకాలకు ఆస్కారం ఉండగా, మరో ఇద్దరు ర్యాంకింగ్ పాయింట్స్ కోసం ఆడతారు.

ఇప్పటివరకు జరిగిన ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లలో భారత్ 59 పతకాలు గెలుపొందింది. ఇందులో 21 స్వర్ణాలు, 22 రజతాలు, 16 కాంస్యాలున్నాయి. చివరిసారిగా చాంగ్వాన్ (దక్షిణ కొరియా)లో జరిగిన ఈవెంట్‌లో భారత జట్టు ఆరు బంగారు పతకాలు, 8 రజతాలు, ఐదు కాంస్యాలతో మొత్తం 19 పతకాలతో టాప్-3లో నిలిచింది. గత టోర్నీలో సత్తా చాటిన మను భాకర్ ఇప్పుడు పారిస్ ఒలింపిక్స్ విజయోత్సాహంతో ఉంది. ఆమె 10 మీ., 25 మీ పిస్టల్ ఈవెంట్లతో పాటు మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లోనూ పోటీపడనుంది. ఆమెతో పాటు ఐశ్వరి ప్రతాప్ సింగ్ తోమర్, రుద్రాంక్ష్ పాటిల్, అర్జున్ బబుతా, సౌరభ్, అనిశ్ భన్వాలాలపై భారత్ పతకాల ఆశలు పెట్టుకుంది. సీనియర్, జూనియర్ విభాగాల్లో ఒలింపిక్ ఈవెంట్స్‌తో పాటు ఒలింపిక్స్‌లో లేని సెంటర్ ఫైర్, స్టాండర్డ్, ఫ్రీ పిస్టల్, రైఫిల్ ప్రోన్, డబుల్ ట్రాప్ ఈవెంట్లలో కూడా పోటీలు నిర్వహిస్తారు.



భారత స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా అమెరికాలోని సియాటెల్‌లోని 605 అడుగుల ఎత్తైన ప్రఖ్యాత 'స్పేస్ నీడిల్'పై త్రివర్ణ పతాక

# టీ ఒక్కటి వెయ్యి రూపాయలా..?

- భారత్‌లో ధరలు మరీ మండిపోతున్నాయబ్బా..!
- ఎన్నారై వ్లాగర్ పరీక్షిత్ బలోచి వ్యాఖ్యలపై భారీ స్పందన

**దుబాయ్:** భారత్‌లో ఒక్క టీ ఖరీదు వెయ్యి రూపాయలుందంటూ వ్లాగర్ పరీక్షిత్ బలోచ్ ఆశ్చర్యంతో చేసిన పోస్ట్‌కు భారీగా స్పందన లభిస్తోంది. దుబాయ్‌లో ఉంటున్న భారతీయ ట్రావెల్ వ్లాగర్, రేడియో ప్రజెంటేటర్ ఇటీవల ముంబైలో తనకు కలిగిన అనుభవాన్ని ఇన్‌స్టాలో పంచుకున్నారు. 'ముంబైలోని ఓ హోటల్‌లో ఒక కప్పు టీ తాగితే నాకు వెయ్యి రూపాయల బిల్లయింది. అది చూసి షాకయ్యా. సాధారణమైన అవసరాలు సైతం ఇంత ఖరీదుగా మారడం చూసి నమ్మలేకపోయా. దుబాయ్‌లో ఉంటూ దిర్హామ్‌లలో సంపాదన కలిగిన నేను భారత్‌లో ఉండగా ఎన్నడూ పేదవానిగా భావించలేదు. కానీ, టీ బిల్లు చూసి మునుపటిలా కాకుండా, భారత్‌లో సైతం పరిస్థితులు మారాయని అనిపించింది'అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. దీనికి 5 లక్షలకు పైగా వ్యూస్ వచ్చాయి. భారత్‌లో విపరీతంగా పెరిగిన జీవన వ్యయంపై నెటిజన్లు పెద్ద ఎత్తున స్పందించారు. పలువురు ఇలాంటి అనుభవాల్నే పంచుకున్నారు. ముంబైలాంటి ప్రధాన నగరాల్లో పెరుగుతున్న జీవన వ్యయంపై ఆశ్చర్యం వ్యక్తపరిచారు.

'నేను ఏటా ముంబై వెళ్తుంటా. కొన్నిటికైతే దుబాయ్ కంటే ముంబైలోనే ఖరీదెక్కువ'అని ఒకరంటే, 'చివరికి ఏవరో ఒకరు ఈ విషయాన్ని బహిరంగంగా ఒప్పుకున్నారు. భారత్‌కు వచ్చాక పేదవానిగా మారింది నేను ఒక్కడినే అని ఇప్పటిదాకా అనుకునేవాణ్ని' అంటూ మరొకరు వ్యాఖ్యానించారు. 'ఇండియా వెళ్లిన ప్రతిసారీ నాకు ఇదే అనుభవం ఎదురవుతోంది. డాలర్లలో సంపాదన కలిగిన నేనే ఇంతగా ఇబ్బంది పడితే, స్థానికంగా ఉండే వారు ఎలా బతుకుతున్నారో ఏమో? ఇంత డబ్బు వారికి ఎలా వస్తుంది? నాకీ విషయం తెలిస్తే, ఇండియాను వదిలేసే వాణ్నే కాదు' అంటూ ఇంకొకరు ముక్తాయింపునిచ్చారు.



## స్ఫూర్తి ప్రదాత వాజ్‌పేయి: మోదీ

**న్యూఢిల్లీ:** అభివృద్ధి చెందిన, స్వయం సమృద్ధ భారతదేశాన్ని నిర్మించడంలో మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి అందరికీ స్ఫూర్తినిస్తూనే ఉంటారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. వాజ్‌పేయి ఏడో వర్ధంతిని పురస్కరించుకుని శనివారం ప్రధాని మోదీ 'సదైవ్ అటల్'ను సందర్శించి, నివాళులర్పించారు. సదైవ్ అటల్‌ను సందర్శించిన వారిలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, పలువురు కేంద్ర మంత్రులు, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఉన్నారు. 'వాజ్‌పేయి తన జీవితాన్ని దేశ సేవకే అంకితం చేశారు. ఆయన ఆలోచనలు, ఆశయాలు, సిద్ధాంతాలు ప్రగతి దిశగా సాగే భారత్ పయనానికి దిక్సూచిగా నిలుస్తాయి'అని ప్రధాని మోదీ ఎక్స్‌లో తెలిపారు. అటల్ బిహారీ వాజ్‌పేయి 1998–2004 సంవత్సరాల మధ్యకాలంలో దాదాపు ఆరేళ్లపాటు దేశ ప్రధానిగా పనిచేశారు.

## జెలెన్‌స్కీకి ప్రధాని మోదీ కృతజ్ఞతలు

**న్యూఢిల్లీ:** భారత్‌కు స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి ప్రధాని నరేంద్ర మోదీ కృతజ్ఞతలు తెలిపారు. భారత్–ఉక్రెయిన్ మధ్య మరింత బలమైన సంబంధాలను కోరుకుంటున్నామని ఉద్ఘాటించారు. ఉక్రెయిన్ ప్రజలు శాంతి, సౌభాగ్యాలతో విలసిల్లాలని ఆకాంక్షిస్తున్నట్లు వెల్లడించారు. ఉక్రెయిన్ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలన్నదే తన కోరిక అని పేర్కొన్నారు. ఈ మేరకు మోదీ శనివారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుకు సైతం మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఇండియా–ఇజ్రాయెల్ మధ్య స్నేహ సంబంధాలు ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. శాంతి, అభివృద్ధి కోసం ఇరుదేశాలు ఎప్పటిలాగే కలిసి పనిచేయాలన్నారు.

## తమిళనాడు మంత్రి ఇళ్లపై ఈడీ దాడులు

**చెన్నై:** మనీ లాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)అధికారులు శనివారం డీఎంకే నేత, తమిళనాడు మంత్రి పెరియస్వామి, ఆయన కుమారుడు, ఎమ్మెల్యే సెంథిల్ కుమార్ ఇళ్లపై దాడులు జరిపారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా ఉన్న పెరియస్వామి(72), ఎమ్మెల్యే సెంథిల్ కుమార్‌లకు చెందిన చెన్నై, దిండిగల్‌లలోని నివాసాలపై దాడులు జరిగాయి. రూ.2.1 కోట్ల ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో మద్రాస్ హైకోర్టు ఏప్రిల్‌లో ఇచ్చిన ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టినట్లు ఈడీ వర్గాలు తెలిపాయి. ఈ కేసు విచారణను ఆరు నెలల్లోగా ముగించాలని హైకోర్టు ప్రత్యేక న్యాయస్థానాన్ని ఆదేశించింది.

## 10 అడుగుల దూరం లాక్కెళ్లిన కారు

- అక్కడే ప్రాణాలు కోల్పోయిన రిటైర్డు ఆర్మీ కెప్టెన్

**జైపూర్:** నిర్లక్ష్యంగా కారు నడిపిన ఓ మహిళ ఆర్మీ రిటైర్డు కెప్టెన్‌ను ఢీకొట్టడంతోపాటు 10 అడుగుల దూరం లాక్కెళ్లింది. పట్టించుకోకుండా వెళ్లిపోవడంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. రాజస్తాన్‌లోని జైపూర్‌లో ఈ నెల 15న ఉదయం చోటుచేసుకున్న ఈ భయానక ఘటన సీసీటీవీలో నమోదైంది. మృతుడిని నర్సారాం జజ్రాగా గుర్తించారు. స్థానిక చిత్రకూట్ స్టేడియం వైపు సైకిల్ వైపు వెళ్తుండగా గుర్తు తెలియని కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఫుటేజీ ఆధారంగా కారును నడిపింది మహిళ అని, ముందు సీట్లో పక్కన ఒక చిన్నారి కూర్చుని ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బాధ్యురాలైన మహిళను అరెస్ట్ చేయలేదని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని కర్ని విహార్ పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి హవా సింగ్ చెప్పారు.

## అగ్ని ప్రమాదంలో ఐదుగురు మృతి

**బెంగళూరు:** బెంగళూరులోని నగర్తపేట్‌లో ఓ ప్లాస్టిక్ వస్తువుల తయారీ యూనిట్‌లో ఘోర అగ్ని ప్రమాదం సంభవించింది. కుటుంబంలోని నలుగురు సహా మొత్తం ఐదుగురు ప్రాణాలు ఈ ఘటనలో కోల్పోయారు. మృతులను మదన్ సింగ్(38), సంగీత(33) వారి ఇద్దరు పిల్లలు రితేశ్(7), విహాన్(5), పొరుగునుండే సురేశ్ కుమార్(26)గా గుర్తించారు. రాజస్తాన్‌కు చెందిన మదన్ సింగ్ పదేళ్లుగా ఈ భవనంలోని పై అంతస్తులో నివాసం ఉంటూ కింద అంతస్తులో ప్లాస్టిక్ వస్తువుల తయారీ యూనిట్ నిర్వహిస్తున్నాడు. తెల్లవారు జామున 3.14 గంటల సమయంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో, నిద్రలో ఉన్న మదన్ సింగ్ కుటుంబానికి ప్రమాదం నుంచి తప్పించుకునే అవకాశం కూడా లేకుండా పోయిందని భావిస్తున్నారు. భవనం నిండా పెద్ద మొత్తంలో ప్లాస్టిక్ సామగ్రి గోదాములో మాదిరిగా ఉండటంతో మంటలను ఆర్పడం కష్టసాధ్యమైందని అధికారులు తెలిపారు. మంటలను అదుపు చేసేందుకు 8 అగ్నిమాపక శకటాలతో 55 మంది సిబ్బంది, 21 మంది అధికారులు తరలివచ్చారు. విద్యుత్ షార్ట్ సర్క్యూటే ఘటనకు కారణమని అనుమానిస్తున్నారు.

## కొన్ని పార్టీలు సకాలంలో స్పందించలేదు

- ఓటరు జాబితాల్లో పొరపాట్లపై ఈసీ

**న్యూఢిల్లీ:** ఓటరు జాబితాల్లో అక్రమాలు జరిగాయంటూ ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న తీవ్ర ఆరోపణలపై ఈసీ మరోసారి స్పందించింది. ఓటరు జాబితాలో దొర్లిన పొరపాట్లను సరైన సమయంలో లేవనెత్తడంలో కొన్ని పార్టీలు విఫలమైనట్లుగా కనిపిస్తోందని శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఓటరు జాబితాల్లో లోపాలను సరిచేయడంలో అధికారులకు సహకరించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపింది. కొన్ని పార్టీలు, బూత్ స్థాయి ఏజెంట్లు ఓటరు జాబితాలో ఏవైనా పొరపాట్లను గుర్తిస్తే నిర్ణీత సమయంలో వాటిని తమ దృష్టికి తీసుకురావాలని కోరింది. ఓటరు జాబితాలను అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు తాము చేస్తున్న ప్రయత్నాల వెనుక ప్రధాన ఉద్దేశం ఇదేనని తెలిపింది.

## బిహార్‌లో ఓటర్ అధికార్ యాత్ర

**ససరాం:** కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆదివారం బిహార్‌లోని ససరాం నుంచి ఓటర్ అధికార్ యాత్రను ప్రారంభించనున్నారు. 'ఒక వ్యక్తి–ఒక ఓటు'తమ విధానమని కాంగ్రెస్ తెలిపింది. బీజేపీ చెప్పుకునే డబుల్ ఇంజిన్‌కు ఎన్నికల కమిషన్ ఒక కంపార్టుమెంట్‌గా మారడాన్ని తాము అంగీకరించబోమని స్పష్టం చేసింది. మరో మూడు నెలల్లో బిహార్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనుండగా రాహుల్ చేపట్టే ఈ కార్యక్రమంలో చేపట్టడం గమనార్హం. సెప్టెంబర్ ఒకటో తేదీన పట్నాలో జరిగే భారీ ర్యాలీతో ముగిసే ఈ కార్యక్రమం రాష్ట్రంలోని 20కి పైగా జిల్లాలను కలుపుతూ 1,300 కిలోమీటర్ల దూరం మేర సాగనుంది. ఇందులో ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ సహా పలువురు మహాఘట్‌బంధన్ నేతలు పాల్గొననున్నారు. ఈ యాత్ర హైబ్రిడ్ మోడల్‌లో కొంత దూరం కాలినడకన, కొంతదూరం వాహనంపై కొనసాగనుంది.

# ఇంకా చిక్కని 82 మంది ఆచూకీ

- చోసితీలో కొనసాగుతున్న సహాయక చర్యలు

**జమ్మూ:** జమ్మూకశ్మీర్‌లోని కిష్త్వాడ్ జిల్లాలో క్లౌడ్ బరస్ట్ వల్ల విధ్వంసానికి గురైన చోసితీ గ్రామంలో సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. గురువారం సంభవించిన ఆకస్మిక వర్షాలు, వరదల ధాటికి ముగ్గురు సీఐఎస్ఎఫ్ జవాన్లు, ఒక స్పెషల్ పోలీసు ఆఫీసర్ సహా 60 మంది దుర్మరణం పాలయ్యారు. 167 మందిని అధికారులు రక్షించారు. మరో 82 మంది జాడ గల్లంతయ్యింది. వారి కోసం సహాయక బృందాలు గాలిస్తున్నాయి. సహాయక చర్యలకు అడ్డంకిగా మారిన భారీ బండరాళ్లను పేలుడు పదార్థాలతో పేల్చేస్తున్నారు. జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా శనివారం ఉదయం చిసోతీని సందర్శించారు. బాధిత కుటుంబాలకు సీఎం సహాయ నిధి నుంచి పరిహారం అందజేస్తామని వెల్లడించారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.లక్ష చొప్పున, స్వల్పంగా గాయపడినవారికి రూ.50 వేలు చొప్పున ఇస్తామన్నారు. ధ్వంసమైన ఇళ్లకు సైతం పరిహారం ప్రకటించారు. వరదల్లో ఆప్తులను కోల్పోయిన గ్రామస్థులను ఒమర్ అబ్దుల్లా ఓదార్చారు. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, జమ్మూకశ్మీర్ డీజీపీ నళిన్ ప్రభాత్ శుక్రవారం అర్ధరాత్రి చోసితీ గ్రామానికి చేరుకున్నారు. సహాయక చర్యలను సమీక్షించారు. శనివారం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను జితేంద్ర సింగ్ పరామర్శించారు. సహాయ పునరావాస చర్యలను ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా పర్యవేక్షిస్తున్నారని ఆయన తెలిపారు. అధికారులు ఇప్పటిదాకా 50 మృతదేహాలను గుర్తించి, సంబంధిత కుటుంబాలకు అప్పగించారు. క్లౌడ్ బరస్ట్‌లో కనీసం 16 నివాస గృహాలతోపాటు పలు ప్రభుత్వ భవనాలు, మూడు ఆలయాలు, 30 మీటర్ల వంతెన ధ్వంసమయ్యాయి. పదుల సంఖ్యలో వాహనాలో వరదలో కొట్టుకుపోయాయి. మరోవైపు మచైల్ మాత యాత్రను వరుసగా మూడో రోజు శనివారం సైతం రద్దు చేశారు.

# వాస్తవాల్ని వదిలి.. చరిత్ర వక్రీకరణ.!

- ఎన్‌సీఈఆర్‌టీ మాడ్యూల్‌పై కాంగ్రెస్ ధ్వజం

**న్యూఢిల్లీ:** దేశ విభజన సమయంలో జరిగిన ఘోరాలపై ఎన్‌సీఈఆర్‌టీ 'పార్టిషన్ హారర్స్ రిమెంబ్రెన్స్ డే'పేరుతో విడుదల చేసిన మాడ్యూల్‌పై కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎంతో కీలకమైన అంశాలను విస్మరించడమే కాకుండా, చరిత్రను వక్రీకరించారని ఆరోపించింది.

మహ్మద్ అలీ జిన్నా, కాంగ్రెస్, అప్పటి వైస్రాయ్ మౌంట్‌బాటెన్‌లను భారతదేశ విభజనకు కారకులని పేర్కొనడాన్ని ఆ పార్టీ తప్పుపట్టింది. కాంగ్రెస్ నేత పవన్ ఖేరా ఎన్‌సీఈఆర్‌టీ మాడ్యూల్‌పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ..'1938లో గుజరాత్‌లో హిందూ మహాసభ సమావేశంలో హిందువులు, ముస్లింలు ఒకే దేశంలో కలిసి జీవించలేరంటూ తీర్మానం చేసింది. దాదాపు ఇదే రకమైన తీర్మానాన్ని 1940లో ముస్లిం లీగ్ పార్టీ లాహోర్ సమావేశంలో చేసింది. ఈ రెండింటిని గురించి ఎన్‌సీఆర్‌టీ మాడ్యూల్‌లో లేదెందుకు?'అని ప్రశ్నించారు. అదేవిధంగా, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనేందుకు 1942లో కాంగ్రెస్ నేతలు ప్రొవిన్షియల్ అసెంబ్లీల సభ్యత్వాలకు రాజీనామాలు చేయగా, సింధ్ అసెంబ్లీలో హిందూ మహాసభ, ముస్లింలీగ్‌లో విభజన తీర్మానాన్ని ప్రవేశపెట్టాయని గుర్తు చేశారు. ఇటువంటి కీలక అంశాలను విస్మరించిన ఎన్‌సీఈఆర్‌టీ మాడ్యూల్ తగులబెట్టడానికా అంటూ పవన్ ఖేరా మండిపడ్డారు. హిందూ మహాసభ, ముస్లింలీగ్ వల్లే దేశ విభజన జరిగిందని ఆరోపించారు. దేశ చరిత్రలో విలన్ అంటూ ఉన్నారంటే అది ఆర్ఎస్ఎస్ తప్ప మరెవరూ కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**మాడ్యూల్‌లో ఏముందంటే..**

విభజనకు కారకులు అనే హెడ్డింగ్‌తో ఉన్న ఎన్‌సీఈఆర్‌టీ మాడ్యూల్‌లో..'దురదృష్టవశాత్తూ 1947 ఆగస్ట్ 15వ తేదీన దేశ విభజన జరిగింది. ఇది ఏ ఒక్క వ్యక్తి వల్లనో సాధ్యం కాలేదు. భారత దేశ విభజనకు ప్రధానంగా ముగ్గురు కారకులు...జిన్నా విభజనను డిమాండ్ చేయగా, కాంగ్రెస్ పార్టీ ఆమోదం తెలిపింది..మౌంట్‌బాటెన్ అమలు పరిచాడు' అని ఉంది. 'సరిహద్దులను అత్యంత నిర్లక్ష్యంగా నిర్ణయించారు. పంజాబ్‌లో ఆగస్ట్ 15 తర్వాత రెండు రోజుల వరకు కూడా తాము భారత్‌లో ఉన్నామా లేక పాక్‌లో ఉన్నామా అనేది అక్కడి వారికి తెలియలేదు. దేశ విభజనను మహాత్మాగాంధీ సమర్థించలేదు. కానీ, దేశ విభజనకు అంగీకరించకుండా కాంగ్రెస్‌ను ఆయన ఆపలేదు. సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ దేశ విభజనను చేదు మందుగా అభివర్ణించగా జవహర్‌లాల్ నెహ్రూ చెడు, తప్పించుకోలేని పరిణామంగా వర్ణించారు' అని పేర్కొంది. ఎన్‌సీఈఆర్‌టీ ఈ మాడ్యూల్‌ను 6–8 తరగతులు, 9–12 తరగతుల వారికి రెండు వేర్వేరు వెర్షన్లలో విడుదల చేసింది.

## బీజేపీ పార్లమెంటరీ బోర్డు సమావేశం నేడు

**సాక్షి, న్యూఢిల్లీ:** ఉపరాష్ట్రపతి ఎన్నికపై అధికార బీజేపీ దృష్టి పెట్టింది. తమ అభ్యర్థిని సాధ్యమైనంత త్వరగా ఖరారు చేయాలని భావిస్తోంది. ఇందుకోసం బీజేపీ పార్లమెంటరీ బోర్డు ఆదివారం భేటీ కానుంది. పార్టీ అభ్యర్థి పేరుపై ఈ సమావేశంలో చర్చించి, నిర్ణయం తీసుకొనే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఆగస్టు 4న ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ ఆకస్మికంగా రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. సెప్టెంబర్ 9న కొత్త ఉపరాష్ట్రపతి ఎన్నిక నిర్వహించనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటించింది. లోక్‌సభ, రాజ్యసభలో కలిపి మొత్తం 781 మంది సభ్యులు కలిగిన ఎలక్టోరల్ కాలేజీ ద్వారా ఉపరాష్ట్రపతి ఎన్నిక జరుగుతుంది. ఈ ఎన్నికలో నెగ్గాలంటే కనీసం 391 ఓట్లు అవసరం. 422 మంది ఎంపీల బలం కలిగిన అధికార ఎన్డీయేకు స్పష్టమైన విజయావకాశాలు ఉన్నాయి. మరోవైపు విపక్ష 'ఇండియా'కూటమి సైతం తమ ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టడానికి ప్రయత్నాలు సాగిస్తోంది.

## ఈసీపై రాహుల్ మరో వీడియో

### లాపతా ఓట్ పేరిట వీడియో విడుదల

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కేంద్ర ఎన్నికల సంఘంపై మరోమారు వీడియో అస్త్రం ప్రయోగించారు. లక్షలాది ఓట్లు చోరీకి గురికావడంతో వాటి జాడ గల్లంతైందని వ్యాఖ్యానించారు. లాపతా లేడీస్ సినిమాలోని 'చోరీ చోరీ చుప్కే చుప్కే..అబ్ ఔర్ నహీ, జనతా జాగ్ గయీ హై..'అనే పాటకు పేరడీగా ఒక నిమిషం నిడివి ఉన్న వీడియో 'లాపతా ఓట్'పేరుతో రాహుల్ విడుదల చేశారు. ఓ వ్యక్తి దొంగతనం జరిగిందంటూ ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లడం..ఏం పోయాయంటూ పోలీసులు కొన్ని వస్తువుల పేర్లు చెప్పగా..అవేవీ కావు తన ఓటు చోరీ అయ్యిందంటూ ఆ వ్యక్తి చెప్పడం వీడియోలో ఉంది. లక్షలాది మంది ఓట్లు పోయాయని అతడు చెప్పగానే, తమ ఓట్లూ చోరీ అయ్యాయా అంటూ పోలీసులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నట్లుగా ఉంది. ఓటు చోరీ అంటే హక్కులను, గుర్తింపును కొల్లగొట్టడమే అంటూ స్క్రీన్‌పై డిస్‌ప్లే అవుతుంది.

## ప్రజల దృష్టిని మళ్లించడానికే ఈడీ సోదాలు: డీఎంకే

**చెన్నై:** తమిళనాడు మంత్రి ఐ.పెరియసామీ నివాసాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు సోదాలు చేపట్టడం పట్ల అధికార డీఎంకే ఆగ్రహం వ్యక్తం చేసింది. ఓట్ల చోరీపై ప్రజల దృష్టిని మళ్లించడానికి కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం డ్రామాలు ఆడుతోందని మండిపడింది. ఈడీ అధికారులు శనివారం పెరియసామీతోపాటు ఆయన కుమారుడు సెంథిల్‌కుమార్ నివాసాలు, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించారు. మనీ లాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ఈ సోదాలు జరిగాయి. పల కీలకపత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంపై డీఎంకే సంస్థాగత కార్యదర్శి ఆర్.ఎస్.భారతి ఆదివారం స్పందించారు. ఓట్ల చోరీ బాగోతం బయటపడడంతో బీజేపీ భయపడుతోందని వ్యాఖ్యానించారు. దీనిపై ప్రజల దృష్టిని మళ్లించడానికి ప్రత్యర్థులపైకి దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతోందని ఆరోపించారు.



ప్రధాని ప్రారంభించనున్న అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్



ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే గోడలపై ఆకర్షణీయ చిత్రాలు

- నేడు ఢిల్లీలో ప్రధాని మోదీ..

# కీలక ప్రాజెక్టుల ప్రారంభం, శంకుస్థాపన

**సాక్షి, న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో రవాణా సౌకర్యాలకు కొత్త ఊపిరి పోసే రెండు కీలక జాతీయ రహదారి ప్రాజెక్టులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు ఢిల్లీలోని రోహిణిలో రూ.11 వేల కోట్లతో నిర్మించిన ఈ ప్రాజెక్టులను దేశానికి అంకితం చేయనున్నారు.

**అనుసంధానత మెరుగు**

ఢిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతాల్లో ట్రాఫిక్ భారాన్ని తగ్గించడం, ప్రయాణ సమయాన్ని తగ్గించడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన సమగ్ర ప్రణాళికలో భాగంగా ద్వారకా ఎక్స్‌ప్రెస్ వే, అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్–2 (యూఈఆర్–2) ప్రాజెక్టులను చేపట్టారు. ప్రపంచ స్థాయి రవాణా సదుపాయాలు, మల్టీ–మోడల్ కనెక్టివిటీ కల్పించడమే వీటి ప్రధాన ఉద్దేశం. ద్వారకా ఎక్స్‌ప్రెస్ వేపై దాదాపు రూ.5,360 కోట్లతో 10.1 కిలోమీటర్ల ఢిల్లీ భాగం అభివృద్ధి చేశారు. ప్యాకేజీ–1 కింద శివమూర్తి కూడలి నుంచి ద్వారకా సెక్టార్–21 ఆర్‌యూబీ వరకు (5.9 కి.మీ), ప్యాకేజీ–2 కింద ద్వారకా సెక్టార్–21 ఆర్‌యూబీ నుంచి ఢిల్లీ–హరియాణా సరిహద్దు వరకు (4.2 కి.మీ) నిర్మాణం చేశారు. ఇది యశోభూమి, డీఎంఆర్‌సీ బ్లూ, ఆరెంజ్ లైన్లు, కొత్తగా వచ్చే బిజ్వాసన్ రైల్వే స్టేషన్, ద్వారకా బస్ డిపోలతో నేరుగా అనుసంధానమవుతుంది. గత సంవత్సరం మార్చిలో హరియాణా విభాగంలోని 19 కి.మీ భాగాన్ని మోదీ ప్రారంభించారు.

**యూఈఆర్–2 ప్రాజెక్టు**

రూ.5,580 కోట్లతో యూఈఆర్–2లోని అలీపూర్–డిచాన్ కలాన్ రహదారితోపాటు, బహదూర్‌గఢ్, సోనిపట్‌లకు కొత్త లింక్ రోడ్లు కూడా ప్రజల వినియోగానికి అందించనున్నారు. ఇవి ఢిల్లీ ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లు, ముకర్బా చౌక్, ధౌలా కువాన్, ఎన్‌హెచ్–09 వంటి రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీని తగ్గిస్తాయి. అంతేగాక పరిశ్రమల మధ్య అనుసంధానాన్ని పెంచడంతో పాటు ఎన్‌సీఆర్‌లో రవాణా వేగవంతం అవుతుంది. ప్రాజెక్టుల ప్రారంభం సందర్భంగా రోహిణిలో నిర్వహించే భారీ బహిరంగ సభలో ప్రధాని మోదీ ప్రసంగించనున్నారు.

## యూట్యూబర్ జ్యోతి పాక్ ఏజెంటే

- పక్కా ఆధారాలున్నాయన్న హరియాణా పోలీసులు

**న్యూఢిల్లీ:** యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా(33) పాకిస్తాన్ తరఫున గూఢచర్యం చేస్తోందనడానికి పక్కా ఆధారాలు దొరికాయని హరియాణా పోలీసులు తెలిపారు. ఈ మేరకు 2,500 పేజీల చార్జిషీట్‌ను కోర్టుకు సమర్పించారు. 'ట్రావెల్ విత్ జో'పేరుతో యూట్యూబ్ చానెల్‌ను నిర్వహించే జ్యోతి మల్హోత్రా అలియాస్ జ్యోతి రాణిని మేలో హరియాణాలోని హిసార్‌లో పోలీసులు అరెస్ట్ చేయడం తెల్సిందే. ఈమె ఢిల్లీలోని పాకిస్తాన్ హై కమిషన్ కార్యాలయం ఉద్యోగి ఎహ్సాన్ ఉర్ రహీం అలియాస్ డానిష్‌తో సన్నిహితంగా మెలుగుతూ కనీసం రెండు పర్యాయాలు పాకిస్తాన్ వెళ్లి వచ్చింది. ఐఎస్ఐ ఏజెంట్లయిన షకీర్, హసన్ అలీ, నసీర్ ధిల్లాన్‌తోనూ ఈమెకు సంబంధాలున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలను విచారణలో జ్యోతి మల్హోత్రా వెల్లడించింది. 'గతేడాది ఏప్రిల్ 17న పాకిస్తాన్ వెళ్లిన ఈమె మే 15న తిరిగి వచ్చింది. తిరిగి 25 రోజులకే, జూన్ 10న చైనా వెళ్లి జూలైలో తిరిగి వచ్చింది. ఆ తర్వాత నేపాల్ సైతం వెళ్లింది. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ అనంతరం కేంద్రం గూఢచర్యం ఆరోపణలు ఎదుర్కొంటున్న రహీంను 24 గంటల్లోగా దేశం విడిచి వెళ్లాలని ఆదేశించింది' అని చార్జిషీట్‌లో పోలీసులు పేర్కొన్నారు. అయితే, మిలటరీ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని నేరుగా ఈమె అందుకోలేదని స్పష్టం చేశారు. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.

### కోర్టు హాల్లోకి బియ్యం విసిరినందుకు..

## స్వల్ప కాల జైలు శిక్ష, జరిమానా

**న్యూఢిల్లీ:** కోర్టు హాల్లోకి ఉద్దేశపూర్వకంగా బియ్యం విసిరిన ఓ వ్యక్తికి కోర్టు సమయం ముగిసేవరకు జైలు శిక్ష, స్వల్ప జరిమానా విధించిన ఘటన ఇది. ఢిల్లీలోని అదనపు సెషన్స్ కోర్టులో ఈ నెల 11వ తేదీన చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓ కేసు విచారణ జరిగే సమయంలో కోర్టు హాల్లో జనం కిక్కిరిసి ఉండగా డాక్టర్ చందర్ విభాస్ బియ్యం విసిరారు. ఇదేదో మంత్రాలు సంబంధించిన వ్యవహారంగా ఉన్నదంటూ రెండు పక్షాల లాయర్లు వాదనలను నిలిపివేశారు. దీంతో, స్వీపర్ వచ్చి బియ్యాన్ని ఊడ్చేసే వరకు కోర్టు హాల్లో కార్యకలాపాలు స్తంభించిపోయాయి. అదనపు సెషన్స్ జడ్జి షెఫాలి బర్నాలా టాండన్ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. అయితే, నిందితుడు మోకాళ్లపై సాగిలపడి క్షమాపణ కోరుకున్నారు. దీంతో, కోర్టు సమయం ముగిసేవరకు జైలు శిక్ష అనుభవించాలని, రూ.2 వేలు జరిమానాగా చెల్లించాలని తీర్పు వెలువరించారు.

### రన్‌వేను తాకిన తోకభాగం..

## ఇండిగో విమానానికి తప్పిన ప్రమాదం

**ముంబై:** బ్యాంకాక్–ముంబై ఇండిగో విమానానికి త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. శనివారం వేకువజామున 3 గంటల సమయంలో ముంబై విమానాశ్రయంలో ఎయిర్‌బస్ విమానం లాండయ్యింది. ఆ సమయంలో విమానం తోకభాగం రన్‌వేను తాకింది. అననుకూల వాతావరణం కారణంగా విమానం తక్కువ ఎత్తులో విమానాశ్రయం చుట్టూ ఎగురుతూ ల్యాండ్ అయ్యే సమయంలో ఘటన చోటుచేసుకుంది. అనంతరం మరో ప్రయత్నంలో సురక్షితంగా ల్యాండైంది. ఈ నేపథ్యంలో విమానం పైలట్, కోపైలట్‌లను తాత్కాలికంగా విధుల నుంచి తప్పించారు. ఘటనపై విచారణకు ఆదేశించినట్లు డీజీసీఏ తెలిపింది.

## ల్యాండింగ్‌లో విఫలమైన ఎయిరిండియా విమానం

**గ్వాలియర్:** ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం శనివారం మధ్యాహ్నం గ్వాలియర్ విమానాశ్రయంలో ల్యాండవ్వలేక పోయింది. రెండో ప్రయత్నంలో సురక్షితంగా ల్యాండైందని అధికారులు తెలిపారు. బెంగళూరులో 160 మంది ప్రయాణికులతో టేకాఫ్ తీసుకున్న విమానం సురక్షితంగా ల్యాండవ్వలేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. అధికారుల సూచనల మేరకు విమానాశ్రయం చుట్టూ ఓ రౌండ్ వేశాక రెండో ప్రయత్నంలో సురక్షితంగా ల్యాండైందని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ తెలిపారు.

## రేపు ఢిల్లీకి చైనా విదేశాంగ మంత్రి

- సరిహద్దు సమస్యపై ఎన్ఎస్ఏ ధోవల్‌తో వాంగ్ యీ చర్చలు

**న్యూఢిల్లీ:** చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ రెండు రోజుల పర్యటనకు గాను సోమవారం ఢిల్లీకి చేరుకోనున్నారు. సరిహద్దుల్లో ఉద్రిక్తతలను తగ్గించుకునే విషయమై జాతీయ భద్రతా సలహాదారు(ఎన్ఎస్ఏ)అజిత్ ధోవల్‌తో ఆయన చర్చలు జరుపుతారని విదేశాంగ శాఖ శనివారం తెలిపింది. షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీవో) వార్షిక శిఖరాగ్ర భేటీలో పాల్గొనేందుకు ప్రధాని మోదీ ఈ నెలాఖరులో చైనా వెళ్లనున్న సమయంలో వాంగ్ యీ చేపట్టనున్న ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. సరిహద్దు సమస్యపై రెండు దేశాల ప్రభుత్వాలు నియమించిన ప్రత్యేక ప్రతినిధులు వాంగ్, ధోవల్‌లు. గతేడాది డిసెంబర్‌లో అజిత్ ధోవల్ చైనా వెళ్లి వాంగ్‌తో చర్చలు జరిపారు. ఈ దఫా అజిత్ ధోవల్ ఆహ్వానం మేరకు వాంగ్ యీ భారత్‌కు వస్తున్నారని విదేశాంగ శాఖ తెలిపింది. ప్రధానంగా సరిహద్దు సమస్యపైనే వీరు చర్చలు సాగనున్నాయి. రెండు రోజుల పర్యటన సమయంలో విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ కూడా వాంగ్ యీతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ఎస్‌సీవో శిఖరాగ్రం చైనాలోని టియాంజిన్‌లో ఆగస్ట్ 31, సెప్టెంబర్ 1వ తేదీల్లో జరగనున్నాయి. చైనా ప్రస్తుత ఎస్‌సీవో అధ్యక్ష బాధ్యతల్లో ఉంది. ప్రధాని మోదీ ఈ నెల 29వ తేదీన జపాన్‌లో పర్యటించనున్నారు. అట్నుంచి చైనాలోని టియాంజిన్‌కు వెళ్తారు. 2020 మేలో తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో వాస్తవాధీన రేఖ వెంబడి రెండు దేశాల సైనికుల నడుమ తీవ్ర ఘర్షణలు చోటుచేసుకున్నప్పటి నుంచి సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రెండు దేశాలు వేలాదిగా సైనికులను సరిహద్దులకు అత్యంత సమీపంలో మోహరించడం, అనంతరం కొన్ని పాయింట్లలో ఉపసంహరించుకోవడం తెల్సిందే. మిగతా ఘర్షణాత్మక ప్రాంతాల్లో సైన్యం ఉపసంహరణ, ఉద్రిక్తతల సడలింపుపై ప్రస్తుతం చర్చలు నడుస్తున్నాయి.

## నదిలో పడిన బస్సు...18 మంది మృతి

**అల్జీర్స్:** అల్జీరియాలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకున్న ఘోర ప్రమాదంలో 18 మంది సజీవ సమాధి అయ్యారు. ప్రయాణికులతో వెళ్తున్న బస్సొకటి తూర్పు అల్జీర్స్‌లోని మహ్మదియా జిల్లాలో వంతెన మీదుగా వెళ్తూ అదుపుతప్పి ఓయద్ ఎల్ హర్రాచ్ నదిలో పడిపోయింది. ఘటనలో 18 మంది ప్రాణాలు కోల్పోగా, 9 మంది గాయపడ్డారు. వీరిలో తీవ్రంగా గాయపడిన ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. రక్షణ, ప్రమాదానికి కారణాలపై దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

# 'అణా గ్రంథమాల' సంపాదకుడి పేరు?

**అరుదైన కోవకు చెందిన మన తరం మహానుభావుడు కాళోజీ. ఆయన నిజాయతీగా మాట్లాడారు. అనుకున్నది కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. ప్రభుత్వంతో ఏనాడూ రాజీపడలేదు. పదవుల కోసం పాకులాడలేదు. సామాన్య ప్రజలను మర్చిపోలేదు. ఎల్లప్పుడూ ప్రజల పక్షం వహించి అనేక ప్రజాసమస్యలపై పోరాడారు. ప్రజల గొడవ.. తన గొడవగా, జనం వాణి.. తన బాణీగా వినిపిస్తూ.. నిరంతరం ఉద్యమాన్ని నడిపించారు. లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణను ఉద్దేశించి కాళోజీ 'పుట్టుక నీది.. చావు నీది.. బతుకంతా దేశానిది' అని పేర్కొన్నారు. ఈ మాటలు ఆయనకూ వర్తిస్తాయి.**

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
**జనరల్ స్టడీస్**
తెలంగాణ చరిత్ర

## తెలంగాణ వైతాళికులు

### కాళోజీ నారాయణరావు

ప్రజాకవి కాళోజీ నారాయణరావు 1914 సెప్టెంబర్ 9న జన్మించారు. ఈయన కుటుంబం కర్ణాటకలోని బీజాపూర్ నుంచి తెలంగాణాలోని వరంగల్ జిల్లాకు వలస వచ్చి మడికొండ గ్రామంలో స్థిరపడింది. కాళోజీ తల్లిదండ్రులు రంగారావు, రమాబాయమ్మ. ఈయన హైదరాబాద్‌లోని చౌమొహల్లా పాఠశాల, సిటీ కాలేజీలో విద్యాభ్యాసం చేశారు. 1939లో హైదరాబాద్ హైకోర్టుకు అనుబంధంగా ఉన్న న్యాయ కళాశాల నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ భాషల్లో ప్రముఖ కవిగా గుర్తింపు పొందారు.


కాళోజీ జాతీయోద్యమాల్లో చురుగ్గా పాల్గొని అనేక పర్యాయాలు జైలుకు వెళ్లారు. నిజాం ప్రభుత్వ కాలంలో తన రచనల ద్వారా తెలంగాణా ప్రజల్లో దేశభక్తి రేకెత్తించారు. సామాన్య ప్రజలను విశేషంగా ఆకర్షించడం ఈయన కవిత్వానికి ఉన్న ప్రత్యేకత. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని రెండున్నరేళ్ల పాటు జైలు శిక్ష అనుభవించారు. హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన వందేమాతరం ఉద్యమంలో పాల్గొనడం వల్ల బహిష్కరణకు గురైన విద్యార్థులను నాగపూర్ విశ్వవిద్యాలయంలో చేర్పించారు.

### అన్యాయాన్ని ఎదిరిస్తూ కలమెత్తిన ప్రజాకవి..

కాళోజీ 1948 భారత విలీనోద్యమంలో ఏడు నెలల పాటు వరంగల్, గుల్బర్గా జైళ్లలో శిక్ష అనుభవించారు. వరంగల్‌లో నిజాం రజాకార్లు జాతీయవాది అయిన మొగులయ్యను హత్య చేసినప్పుడు కాళోజీ రాసిన గేయం ప్రజలను కదిలించింది. నిజాం ప్రధానమంత్రి మీర్జా ఇస్మాయిల్ వరంగల్ సందర్శించినప్పుడు 'ఎన్నాళ్ల నుండియో..' అనే గేయం రాశారు. 'అన్య భాషలు నేర్చి ఆంధ్రమ్ము రాదంటు సకిలించు ఆంధ్రుడా.. చావవెందుకురా', 'అతిథివోలె వుండి.. అవని విడిచి వెళ్లుతాను' లాంటి కాళోజీ కవితా పంక్తులు ప్రసిద్ధి చెందాయి.

విద్యార్థి దశలోనే నిజాం ప్రభుత్వ నిషేధాజ్ఞలను ఉల్లంఘించి కాళోజీ వరంగల్‌లో గణపతి ఉత్సవాలు నిర్వహించారు. వరంగల్ కోటలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడానికి ప్రయత్నించినందుకు ఆయణ్ని నగరం నుంచి బహిష్కరించారు. హైదరాబాద్‌లో 'ఆంధ్ర సారస్వత పరిషత్' స్థాపకుల్లో ఒకరైన కాళోజీ తెలంగాణా రచయితల సంఘం ఏర్పాటులోనూ ప్రముఖపాత్ర పోషించారు.

కేంద్ర ప్రభుత్వం కాళోజీ సేవలను గుర్తించి 1992లో పద్మవిభూషణ్ బిరుదునిచ్చి సత్కరించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయనకు 'ప్రజాకవి' బిరుదు ఇచ్చింది. 1992లో వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయం కాళోజీకి గౌరవ డాక్టరేట్ బహుకరించింది.



### రచనలు

కాళోజీ 'మనమే నయం', 'తెలియక ప్రేమ.. తెలిసి ద్వేషం', 'విభూతి లేక ఫేస్ పౌడర్' తదితర శీర్షికలతో కథలు రాశారు. వ్యంగ్యం, అధిక్షేపాలను కలగలిపి వీటిని రచించారు. సమాజంలో నిరుపేదలు, కష్టజీవుల బతుకులు దుర్భరంగా ఉన్నాయనే వాస్తవికతను కాళోజీ ఈ కథల్లో వ్యంగ్యంగా చిత్రీకరించారు. కె.సి. గుప్తా 1943లో సుల్తాన్ బజార్‌లోని ఆంధ్ర పబ్లిషింగ్ కంపెనీ తరఫున 'అణా గ్రంథమాల' ప్రచురణల వరసలో 24వ గ్రంథంగా 'కాళోజీ కథలు' పేరుతో పుస్తకాన్ని ముద్రించాడు. అప్పట్లో దీని వెల ఒక కల్దారు అణా మాత్రమే. నాడు హైదరాబాద్ రాష్ట్రంలో హాలీ చిక్కాలు (నాణేలు) అమల్లో ఉన్నప్పటికీ దీని ధరను కల్దారులో ప్రకటించారు. 'సుభాష్ చంద్రబోస్' అనే గ్రంథాన్ని ప్రచురించినందుకు ప్రభుత్వం కె.సి. గుప్తాకు ఒక నెల కఠిన శిక్షతో పాటు రూ. 250 జరిమానా, రచయితకు 18 నెలల కఠిన శిక్ష విధించింది. అల్లూరి సీతారామరాజుపై వెలువరించిన గ్రంథాన్ని కూడా నిషేధించింది. ఇలాంటి స్థితిగతులూ, ప్రభుత్వ నిర్బంధ విధానాలు ఉన్నప్పటికీ కాళోజీ ధైర్యంగా తన కలాన్ని కదిలించారు.

కాళోజీ 1941లో 'అణా కథలు', 1946లో 'కాళోజీ కథలు', 1953లో 'నా గొడవ' రచించారు. 1969-70లో తెలంగాణా ఉద్యమ కవితలు రచించారు. కాళోజీ ఆత్మకథ 'ఇది నా గొడవ'. దీన్ని 1995లో రచించారు.

కాళోజీ నారాయణరావు 2002 నవంబర్ 13న మరణించారు. ఆయన తన దేహాన్ని కాకతీయ మెడికల్ కాలేజీకి దానం చేశారు. తెలంగాణా రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత ఈ కళాశాల పేరును కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయంగా మార్చారు.

రాష్ట్ర ప్రభుత్వం కాళోజీ నారాయణరావు జయంతిని 'తెలంగాణా భాషా దినోత్సవం'గా ప్రకటించింది. 2015 సెప్టెంబర్ 9న తొలిసారిగా తెలంగాణా భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ స్మారక పురస్కారం అందించారు. దీన్ని మొదటిసారిగా ప్రముఖ కవి డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్‌కు 2015 సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో ప్రదానం చేశారు.

### మాదిరి ప్రశ్నలు

1. ప్రజాకవి కాళోజీ నారాయణరావు ఏ సంవత్సరంలో జన్మించారు?
   1) 1914 సెప్టెంబర్ 9
   2) 1923 నవంబర్ 10
   3) 1925 అక్టోబర్ 1
   4) 1910 డిసెంబర్ 12
2. 'అణా గ్రంథమాల' సంపాదకుడి పేరు?
   1) వట్టికోట ఆళ్వార్ స్వామి
   2) అడవి బాపిరాజు
   3) సురవరం ప్రతాపరెడ్డి
   4) కె.సి.గుప్తా
3. 'ఇది నా గొడవ' అనే పేరుతో కాళోజీ నారాయణరావు ఆత్మకథ ఏ సంవత్సరంలో రచించారు?
   1) 1946 2) 1941 3) 1995 4) 1953
4. కాళోజీ నారాయణరావు స్మారక ప్రథమ పురస్కార గ్రహీత ఎవరు?
   1) డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్
   2) డాక్టర్ ఎన్. గోపి
   3) డాక్టర్ వల్లూరి శివారెడ్డి 4) అందెశ్రీ

**సమాధానాలు**

1) 1; 2) 4; 3) 3; 4) 1.

### ఆచార్య సి. నారాయణ రెడ్డి

ఆచార్య సింగిరెడ్డి నారాయణ రెడ్డి (సినారె) ఈ శతాబ్దపు మహాకవుల్లో ప్రముఖులు. దాదాపు ఐదు దశాబ్దాలుగా సినారెకి తెలుగు సాహితీవనంలో ప్రత్యేక స్థానం ఉంది. ఈయన తెలంగాణలోని కరీంనగర్ జిల్లా సిరిసిల్ల తాలూకా హన్మాజీపేటలో 1931 అక్టోబర్ 29న జన్మించారు. ఈయన తల్లిదండ్రులు సింగిరెడ్డి బుచ్చమ్మ, మల్లారెడ్డి. సిరిసిల్ల, కరీంనగర్‌లో సినారె ప్రాథమిక, మాధ్యమిక విద్య అభ్యసించారు. హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పూర్తిచేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి బి.ఎ., ఎం.ఎ. పట్టాలు పొందారు. 1962లో 'ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయాలు-ప్రయోగాలు' అనే సిద్ధాంత వ్యాసానికి పీహెచ్‌డీ పట్టా పొందారు. ఈ గ్రంథాన్ని 20వ శతాబ్ది పూర్వార్థ ప్రామాణికమైన సాహిత్య చరిత్రగా పేర్కొనవచ్చు. ఆయన కవిత్వాన్నే ఎన్నుకొని ఆయా నవీన కవితా రీతులు సమగ్రంగా విశ్లేషించి ఆధునిక సాహిత్య నేపథ్యాన్ని సమన్వయించి చూపారు.

వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో కందుకూరి, గురజాడ, గిడుగు కృషి వల్ల నూతన సాహిత్య పోకడలు ఆవిష్కృతమయ్యాయి. సాహిత్యంతోపాటు కళాత్మక విలువలు కూడా పెంపొందాయి. కవితా మాధ్యమం, శిల్పమూ, ఛందమూ నూతన అందాలు సంతరించుకున్నాయి. ఈ శతాబ్దంలో మాత్రా ఛందస్సులు, గీతికలు, గేయాలు, రొమాంటిసిజంతో కాల్పనిక కవులు, రచయితలు ప్రభావితులయ్యారు. వారిలో ఆచార్య సినారె కూడా ఒకరని చెప్పుకోవచ్చు.

### సాహిత్యం

ఆచార్య సి. నారాయణ రెడ్డి తెలుగు భాషకు సమగ్రపుష్టి. ప్రధానంగా ఈయన నాదకవి. సినారె రచనల్లో అనేక ప్రక్రియలు కనిపిస్తాయి. గీతికలు, గేయాలు, అభినవ కవితలు హృదయాన్ని హత్తుకుంటాయి. ఈయన రచించిన 'దివ్వెల మువ్వలు' లాంటి ముక్తకాల నుంచి 'నాగార్జున సాగరం', 'కర్పూర వసంతరాయలు' లాంటి కథాకావ్యాలు, 'నవ్వని పువ్వు', 'రామప్ప విశ్వదీపం' తదితర సంగీత రూపకాల వరకూ ఈయన కవితా రచనలో నాద తరంగిణి వినిపిస్తుంది. ఈయన స్వయంగా కర్పూర వసంతరాయలు కావ్యం గానం చేస్తుంటే హృదయం పులకరిస్తుంది. ఐదు దశాబ్దాలపాటు సినారె కొన్ని వందల గేయాలు, గీతాలు రచించారు. అనేక సినిమా పాటలు కూడా రాశారు. ఆధునిక సాహిత్యంలో గేయరచనకు స్థిరస్థానం కల్పించారు. డా. సి. నారాయణరెడ్డి పేరు వినగానే కర్పూర వసంతరాయలు, నాగార్జున సాగరం, విశ్వంభర మొదలైన గేయ కథాకావ్యాలు గుర్తుకు వస్తాయి. 'తెలుగు గజళ్లు', 'ప్రపంచ పదులు' లాంటి వినూత్న రచనలు ఆయన ప్రతిభకు తార్కాణాలు. 'విశ్వంభర', 'మట్టీమనిషీ ఆకాశం' లాంటి దీర్ఘకావ్యాలు సినారె తాత్వికతకు నిదర్శనాలు. 'మట్టీ మనిషీ ఆకాశం' హిందీ, ఆంగ్ల భాషల్లోకి అనువాదమైంది. పుస్తక సమీక్షలు కూడా వచ్చాయి. డా. ముదిగొండ వీరభద్రయ్య దాని మీద వందపేజీల వ్యాఖ్యా గ్రంథం రాశారని సినారె స్వయంగా చెప్పారు. ఇవే కాకుండా ఎన్నో వచన కవితలు, గీతాలు, గజళ్లు, ప్రపంచ పదులు, ద్విపదలు రచించారు.

"తెలుగు కళ్ళకు తెలుసు నా లలిత కళా రూపం
తెలుగిళ్ళకు తెలుసు నా కల గీతికా దీపం"



సినారె కవిత్వం ఒక నిరంతర ప్రస్థానం. ఎల్లలెరుగని విశ్వమానవీయత ఆయన తత్వం. అనాదిగా మానవజీవితం విశ్వంలో ఏ విధంగా ప్రతిస్పందిస్తుందీ, విశ్వంతర ప్రకృతిలో మానవ మహితాత్మ ఎలా నిరంతర యాత్ర సాగిస్తోందీ.. అనే విషయాలను తన విశ్వంభర సుదీర్ఘ కావ్యంలో ప్రతిపాదించారు. ఈ కావ్యం సినారెను ఆధునిక భారతదేశ సాహిత్య చరిత్రలో మహాకవిగా, ఆధునికాంధ్ర సార్వభౌముడిగా నిలబెట్టింది. 1988లో 'జ్ఞానపీఠ్ పురస్కారం' సాధించిపెట్టింది. ఇప్పటివరకు తెలుగు సాహిత్యంలో ముగ్గురికి మాత్రమే 'జ్ఞానపీఠ్ పురస్కారం' లభించింది. సినారెతో పాటు కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ (రామాయణ కల్పవృక్షం - 1970లో), రావూరి భరద్వాజ (పాకుడు రాళ్లు - 2012లో) ఈ పురస్కారం అందుకున్నారు. 1990-91లో యుగోస్లేవియాలో జరిగిన 'విశ్వకవి' సమ్మేళనంలో సినారె పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా నలభై దేశాలు, నలభై భాషల కవులు పాల్గొన్న సమ్మేళనంలో మనదేశం తరఫున భారతీయ భాషల ప్రతినిధిగా నారాయణరెడ్డిని భారత ప్రభుత్వం పంపించింది. అక్కడ నియమం ప్రకారం ఆ కవి రాసిన భాషలోనే తన కవిత చదవాలి. అలా చదివిన తర్వాత దాని అనువాదం ఉంటుంది. అది విన్న పండితులు, కవులు, హర్షధ్వానాలతో నారాయణ రెడ్డిని స్వాగతించారు. ప్రపంచవ్యాప్తంగా విశేష పాఠకాదరణ ఉన్న ఇరవైమంది భారతీయ సాహితీవేత్తల్లో ఆచార్య నారాయణరెడ్డి ఒకరని 'దేశ్' అనే బెంగాలీ పత్రిక తన సర్వేలో తెలిపింది.

ఈ శతాబ్ద సాహిత్యమూర్తుల్లో విలక్షణ వ్యక్తిత్వం నారాయణ రెడ్డిది. కవితా తాత్వికుడిగా, కళావేత్తగా, గాన, సాహిత్యవేత్తగా పేరొందారు. తెలుగు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడిగా, ఆంధ్రసారస్వత పరిషత్తు అధ్యక్షుడిగా, రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారు. ఈయన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది.

### మాదిరి ప్రశ్నలు

1. ఆచార్య సి. నారాయణరెడ్డి తెలంగాణలో ఏ జిల్లాలో, ఎక్కడ జన్మించారు?
   1) కరీంనగర్ జిల్లా-హన్మాజీ పేట
   2) వరంగల్ జిల్లా- హనుమకొండ
   3) మహబూబ్ నగర్ అలంపురం
   4) నల్లగొండ జిల్లా - కొలనుపాక
2. ఆచార్య సి. నారాయణరెడ్డికి ఏ గ్రంథానికి 1988లో జ్ఞానపీఠ్ పురస్కారం లభించింది?
   1) కర్పూర వసంతరాయలు
   2) నాగార్జున సాగరం 3)మట్టీ మనిషీ ఆకాశం
   4) విశ్వంభర గేయ కథాకావ్యం
3. కిందివారిలో ఎవరు నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు, లాంటి రచనలు చేశారు?
   1) విశ్వనాథ సత్యనారాయణ
   2) డా. సి. నారాయణ రెడ్డి
   3) తిరుమల రామచంద్ర
   4) గుంటూరు శేషేంద్రవర్మ

**సమాధానాలు**

1) 1; 2) 4; 3) 2.

# అర్ధ చంద్రాకార భారీ ఇసుక దిబ్బలే బార్కాన్‌లు

**తిర్యక్ ఇసుక దిబ్బల అక్షం పవన దిశకు లంబంగా ఉంటుంది. ఎడారుల్లో పవన దిశ తరచుగా మారడంతో ఇసుక దిబ్బలు వివిధ ఆకృతుల్లో ఏర్పడతాయి. అర్ధ చంద్రాకారంలో ఉండే భారీ ఇసుక దిబ్బలను 'బార్కాన్'లు అంటారు. ఇవి కొన్ని సందర్భాల్లో 50 మీటర్ల ఎత్తు వరకు ఉంటాయి.**

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
భూగోళశాస్త్రం

## ఎడారులు - పవన క్రమక్షయం

పాక్షిక శుష్క, శుష్క శీతోష్ణస్థితి ఉష్ణమండల ఎడారుల్లో పవనాలు బలమైన క్రమక్షయ కారకాలు. వేగంగా వీచే పవనాలు మూడు పద్ధతుల్లో క్రమక్షయాన్ని కలుగజేస్తాయి. అవి.. పవన అనావరణం (ఎగురవేత), అపఘర్షణ, రాపిడి. పవనాలు తమ గతిశక్తి ద్వారా ఉపరితలంపై తేలికైన ఇసుక రేణువులను ఎగురేసుకుపోవడమే అనావరణం. అనావరణం వల్ల క్రమక్షయానికి గురైన ఇసుక రేణువులు.. కఠిన శిలా భాగాల మీద గరుకు కాగితంలా పని చేసి క్రమక్షయాన్ని కలిగించడాన్ని 'అపఘర్షణ' అంటారు. శిథిల శిలా పదార్థాలు ఒకదానితో మరోటి ఢీకొని, సూక్ష్మ రేణువులుగా క్రమక్షయం చెందడాన్ని రాపిడిగా పేర్కొంటారు.

### అనావరణ హరివాణాలు

పవన అనావరణం కారణంగా కొన్నిచోట్ల ఇసుక పూర్తిగా ఎగరడం వల్ల ఏర్పడే విశాల హరివాణాలను 'అనావరణ హరివాణాలు' అంటారు. ఈ హరివాణాల్లో కొన్నిసార్లు నీరు నిల్వ ఉండటం వల్ల 'ఒయాసిస్'లు ఏర్పడతాయి. విస్తృత అనావరణం వల్ల తేలికైన దుమ్ము, ధూళి, ఇసుక పూర్తిగా క్రమక్షయమై.. ఉపరితలంపై గట్టి గులక రాళ్ల మాత్రమే మిగిలిన ప్రాంతాలను 'ఎడారి పేవ్‌మెంట్స్' అంటారు. పేవ్‌మెంట్స్ శిలలు.. ఐరన్, మాంగనీస్ ఆక్సైడ్‌లతో కూడి ఉండి ఎరుపు లేదా జేగురు వర్ణం అలికిన ప్రాంతాలుగా కనిపిస్తాయి. వీటిని 'ఎడారి వార్నిష్'లుగా వ్యవహరిస్తారు.

### స్టోన్‌లాటిస్

గరుకైన ఇసుకతో కూడిన బలమైన పవనాలను శిలలు అడ్డగించినప్పుడు భేద క్రమక్షయం వల్ల వివిధ రకాల భూస్వరూపాలు ఏర్పడతాయి. భారీ బండరాళ్లలో మృదువైన శిలా పదార్థం పవనాల ద్వారా పూర్తిగా క్రమక్షయం కావడంతో ఆ శిలలు తూట్లుపడినట్లుగా తయారవుతాయి. వీటిని 'స్టోన్ లాటిస్' అంటారు. వీటి ద్వారా గాలి వీచినప్పుడు శిల వేణువుతో శబ్దం చేసినట్టుగా వింత ధ్వనులను కలిగిస్తుంది. ఆ శిలలను 'ఫ్లూటెడ్ శిలలు' అంటారు.

పవనాల్లో స్థూల ఇసుక రేణువులు శిలల కింద భాగాన్ని ఎక్కువగా క్రమక్షయం చేస్తాయి. శిలల పైభాగాల్లో క్రమక్షయ రేటు తక్కువగా ఉంటుంది. ఈ విధమైన భేదక క్రమక్షయం వల్ల శిల కుక్క గొడుగు ఆకారాన్ని సంతరించుకుంటుంది. ఇలాంటి శిలలను 'కుక్కగొడుగు శిలలు' అంటారు.

### యార్డాంగ్‌లు

ఒకే శిల మృదువైన, కఠిన శిలా పదార్థాలతో ఉన్నప్పుడు అది భేదక క్రమక్షయం వల్ల విచిత్రమైన ఆకారంలో ఉంటుంది. భూ దృశ్యం దువ్వెనపళ్ల ఆకృతిని పొందుతుంది. ఈ విధమైన శిలాకృతులను 'యార్డాంగ్'లుగా వ్యవహరిస్తారు. తుర్క్‌మెనిస్తాన్ ఎడారిలో ఇవి ఎక్కువగా ఉన్నాయి. భేదక క్రమక్షయం వల్ల వింత శబ్దాలతో భయాన్ని గొలిపే శిలలను 'డెమియోసెల్స్' అంటారు. తీవ్ర స్థాయిలో దీర్ఘకాలం పవన క్రమక్షయం వల్ల ఎడారిలోని కొన్ని ప్రాంతాల్లో ఇసుక పూర్తిగా తొలగి, కఠిన శిలా ప్రాంతాలు బయల్పడతాయి. ఈ విశాల కఠిన శిలా భూ దృశ్యాలనే 'హమాడాలు' అంటారు.

### పవన నిక్షేపం



పవనాలు తమతో తీసుకుపోయే శిథిల శిలా పదార్థాలను అనువైన ప్రదేశాల్లో నిక్షేపం చేస్తాయి. సాధారణంగా.. శిలా భారం ఎక్కువైనప్పుడు, పవనాల వేగం మందగించినప్పుడు, పవనాల దిశ మారినప్పుడు లేదా పవనాలకు అవరోధాలు ఎదురైనప్పుడు పవన నిక్షేపం జరుగుతుంది.

పవన నిక్షేపణ వల్ల కూడా ఎడారుల్లో వివిధ రకాల భూస్వరూపాలు ఏర్పడతాయి. పవనాలు నిక్షేపించిన ఇసుక కొన్ని సందర్భాల్లో అలల మాదిరిగా ఏర్పడుతుంది. దున్నిన పొలంలా కన్పించే ఈ భూస్వరూపాన్ని 'రిపిల్స్' అంటారు. పవనాలు ఒకేచోట పెద్ద మొత్తాల్లో ఇసుక నిక్షేపం చేయడం వల్ల ఎత్తయిన ఇసుక దిబ్బలు ఏర్పడతాయి. ఎడారులనగానే మనకు గుర్తుకొచ్చేవి భూస్వరూపాలు-ఇసుకదిబ్బలు. పవనాలు వీచే దిశకు ఇసుక దిబ్బ అక్షం సమాంతరంగా ఉన్నవాటిని అనుదైర్ఘ్య ఇసుక దిబ్బలు అంటారు.

థార్ ఎడారిలోని ఇసుక దిబ్బలు ఎక్కువ భాగం బార్కాన్‌ల తరగతికి చెందినవి. పొడవాటి కత్తి ఆకారంలో ఏర్పడే ఇసుక దిబ్బలను 'సీఫ్'లు అంటారు. ఇవి అనుదైర్ఘ్య తరగతికి చెందుతాయి. అరేబియా ఎడారిలో ఇవి ఎక్కువగా కనిపిస్తాయి. శీర్ష భాగాలు సమతలంగా ఉన్న విశాల ఇసుకదిబ్బలను 'వేల్‌బ్యాక్'లు అంటారు. సహారా ఎడారిలో నక్షత్ర ఆకార ఇసుక దిబ్బలు కూడా కన్పిస్తాయి.

పవనాలు మెత్తని ఇసుక ధూళిని కొన్ని వేల మైళ్ల దూరం తీసుకెళ్లి నిక్షేపం చేయడం వల్ల ఏర్పడే సమతల మైదానాలను 'లోయస్' మైదానాలు అంటారు. మధ్యాసియాలోని గోబి ఎడారి నుంచి వీచే పవనాలు నిక్షేపం చేసిన ధూళి వల్ల ఉత్తర చైనాలో విశాల లోయస్ మైదానాలు ఏర్పడ్డాయి.

ఎడారుల్లో ఇసుక దిబ్బల మధ్యలో ఇసుక ఉండని ప్రాంతాలను 'గాస్'లు అంటారు. ఇవి ఎడారుల్లో రవాణా మార్గాలుగా ఉన్నాయి. అరేబియా ఎడారిలో ప్రాచీన కాలంలోనే ఈ ఇవి వాణిజ్య మార్గాలుగా అభివృద్ధి చెందాయి.

## భూగర్భ జల క్రమక్షయం - కార్స్ట్ భూదృశ్యాలు

ఏడ్రియాటిక్ సముద్రతీరంలో సెర్బియాకి చెందిన 'కార్స్ట్' ప్రాంతంలో విశిష్టంగా ఈ రకమైన భూదృశ్యం ఏర్పడింది. అందువల్ల ప్రపంచంలో ఉన్న ఈ రకమైన వాటిని 'కార్స్ట్' భూస్వరూపాలుగా వ్యవహరిస్తున్నారు. ఫ్రాన్స్‌లోని కాస్, మెక్సికోలోని యుకటాన్ (కార్ల్స్‌బాడ్), యూ ఎస్ఏలోని కెంటకీ ప్రాంతాల్లో కూడా ఈ భూస్వరూపాలు అభివృద్ధి చెందాయి. డెహ్రాడూన్, జబల్‌పూర్, ఆంధ్రప్రదేశ్‌లోని బొర్రా గుహలు, బెలూం గుహలు ఈ కోవకు చెందినవే.

### కార్స్ట్ భూస్వరూపాలు ఏర్పడటానికి కారణాలు

సున్నపురాయి శిలా ప్రాంతం, అధిక వర్షపాతంతో కూడిన ఆర్ద్ర శీతోష్ణస్థితి, శాశ్వతనదులు, పగుళ్లు, బీటలతో కూడిన నైసర్గిక స్వరూపం తదితర భౌగోళిక అంశాలు కార్స్ట్ భూస్వరూపాలు ఏర్పడటానికి అనుకూలిస్తాయి. ప్రధానంగా సున్నపురాయి శిలలతో భూగర్భ జలప్రవాహాలు రసాయనిక చర్య పొంది, ద్రావణీకరణ ప్రక్రియ ద్వారా రసాయనిక క్రమక్షయాన్ని కలుగజేస్తాయి. సున్నపురాయి శిలలు ద్రావణం రూపంలోకి మారడంతో భూ ఉపరితలం, భూగర్భంలో వివిధ రకాల క్రమక్షయ భూస్వరూపాలు ఏర్పడతాయి. అలాగే ద్రావణం రూపంలోని శిలా పదార్థం భూగర్భంలోని అనువైన ప్రాంతాల్లో నిక్షేపమవడం వల్ల కూడా వివిధ రకాల భూస్వరూపాలు రూపొందుతాయి.

### బ్యాడ్‌లాండ్స్

భూ ఉపరితలంపై సున్నపురాయి శిలా పదార్థం నదుల్లో కరిగి శిథిలమవడంతో ఆయా ప్రాంతాల్లో నిట్టనిలువు పగుళ్లు, గుంటలతో కూడిన ఎగుడు దిగుడు నైసర్గిక స్వరూపం ఏర్పడుతుంది. ఈ ప్రాంతం 'బ్యాడ్‌లాండ్స్'గా రూపొందుతుంది. దీన్ని ఫ్రాన్స్‌లో 'లాపీస్' అని, జర్మనీలో 'కారెన్' అని, ఏడ్రియాటిక్ తీర ప్రాంతాల్లో 'బోగాజ్'గా వ్యవహరిస్తారు.

సున్నపురాయి నీటిలో కరగడంతో భూ ఉపరితలంపై ఏర్పడిన విశాలమైన గోతులు, గుంటలను 'పోనార్' అంటారు. ఫ్రాన్స్‌లో వీటిని 'ఎరాబట్'గా వ్యవహరిస్తారు. పానోర్స్ నిరంతర క్రమక్షయం వల్ల మరింత విశాలమైతే 'డొలైన్స్'గా వ్యవహరిస్తారు. కొన్ని సందర్భాల్లో వీటిలోకి నీరు చేరడంతో సరస్సులుగా రూపాంతరం చెందుతాయి. వీటిని 'కార్స్ట్ సరస్సులు' అంటారు. సమీపంలోని డొలైన్స్.. క్రమక్షయం వల్ల విస్తరించి, ఒకదానితో మరోటి కలిసి ఏర్పడే విశాల హరివాణాలను 'ఉవాలా'లు అంటారు. సున్నపురాయి శిలలు కరగడం వల్ల ఉపరితలంపై ఏర్పడే తిన్నని వాలులతో కూడిన లోయలను 'బ్లైండ్ వ్యాలీ'లు లేదా 'కిటికీ'లు అంటారు.

వీటి ద్వారా ఉపరితల నదులు, ప్రవాహాలు భూగర్భంలోకి ప్రవేశించి భూగర్భ నదులుగా మారతాయి. ఈ భూగర్భ నదులు భూగర్భంలోని సున్నపురాయి శిలలను క్రమక్షయం చేయడం వల్ల విశాలమైన గుహలు ఏర్పడతాయి. ఈ గుహలను 'కావెర్న్' అంటారు. ఇవి మరింత విశాలమై కూలిపోవడంతో ఉపరితలంపై ఏర్పడే గుంటలను 'పోల్జ్'లు అంటారు.

సున్నపురాయి గుహ(కావెర్న్)ల్లో సున్నపురాయి ద్రావణపు నీరు ఆవిరై గుహ పైకప్పు, అడుగు పక్క భాగాల్లో కాల్షియం కార్బనేట్ నిక్షేపించడంతో వివిధ రకాల భూస్వరూపాలు ఏర్పడతాయి.

### స్టాలక్టైట్-స్టాలగ్మైట్

గుహల లోపల పైకప్పుల మీద సున్నపురాయి నిక్షేపించి క్రమంగా కిందకు వేలాడుతూ విస్తరించే నిక్షేపాలను 'స్టాలక్టైట్' గా వ్యవహరిస్తారు. అడుగు భాగం మీద నిక్షేపించిన సున్నపు రాయి క్రమంగా పైకి పెరిగి 'స్టాలగ్మైట్'గా రూపొందుతుంది. స్టాలక్టైటులు, స్టాలగ్మైట్లు క్రమంగా వ్యాపించి కలిసిపోయి గుహలో 'స్తంభాలు'గా ఏర్పడతాయి. గుహల్లో వాలుగా, తెరలుగా నిక్షేపించే పదార్థాన్నే 'డ్రేప్స్' లేదా 'కర్టెన్స్' అంటారు.

ఇవి కావెర్న్‌లను చిన్న చిన్న భాగాలుగా విభజిస్తాయి. గుహ పైకప్పు నుంచి వాలుగా వేలాడే సున్నపురాయి నిక్షేపాలను హెలిక్టైట్స్‌గా వ్యవహరిస్తారు. గోళాకారంలో ఉండే నిక్షేపాలను గ్లోబ్యులైట్స్ అంటారు.

# భవిష్యత్ విధాత.. భారత రాజ్యాంగం

పోటీపరీక్షల ప్రత్యేకం
పాలిటీ

ఆర్టికల్ 356 ప్రకారం రాష్ట్రాల్లో అత్యవసర పరిస్థితి విధించే అధికారం కేంద్రానికి ఉంది. గత ప్రభుత్వాలు రాజకీయ కారణాలతో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాయి. 1994లో ఎస్.ఆర్.బొమ్మై వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు తీర్పు తర్వాత ఆర్టికల్ 356 దుర్వినియోగం చాలా వరకు తగ్గిందని చెప్పవచ్చు. మరో ముఖ్య తీర్పు.. 2007లో వచ్చిన ఐ.ఆర్. కోయిల్హో వర్సెస్ స్టేట్ ఆఫ్ తమిళనాడు కేసు తీర్పు. ఈ కేసులో 1973 ఏప్రిల్ 24 (కేశవానంద భారతి కేసు తీర్పు అనంతరం) తర్వాత తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చిన చట్టాలు కూడా న్యాయ సమీక్షాధికార పరిధిలోకి వస్తాయనీ, వాటిని కోర్టుల్లో ప్రశ్నించవచ్చని న్యాయస్థానం తీర్పునిచ్చింది. 2015లో రామ్‌సింగ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో తీర్పునిస్తూ .. జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ సిఫారసులకు వ్యతిరేకంగా జాట్‌లను ఓబీసీల్లో చేర్చడాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ దశలో న్యాయ వ్యవస్థ క్రియాశీలత ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. పర్యావరణ పరిరక్షణ, వ్యక్తిగత స్వేచ్ఛ, భావ ప్రకటన స్వేచ్ఛను కాపాడటం, ఆర్టికల్ 356 దుర్వినియోగాన్ని అరికట్టడం తదితర తీర్పులు కనిపిస్తాయి. శ్రేయా సింఘాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో ఐటీ చట్టంలోని సెక్షన్ 66ఎను కొట్టివేయడం దీనికి ఉదాహరణ. ఉన్నత న్యాయస్థానాల్లో జడ్జీల నియామకాలను తమ పరిధిలోనే ఉంచుకోవడం సుప్రీంకోర్టు సాహసోపేతతీర్పుగా పేర్కొనవచ్చు. 2015 అక్టోబర్ తీర్పు రెండు విపరీత ధోరణులకు తావిచ్చింది. రాజ్యాంగం ప్రకారం ఏ వ్యవస్థకు కూడా రాజ్యాంగానికి మించిన ఔన్నత్యం లేదు. ఔన్నత్యం, ఆధిపత్యం(supremacy) అనేది కేవలం రాజ్యాంగానికి మాత్రమే ఉంటుంది. ఈ విషయాన్ని విస్మరించి వ్యవస్థలు తమ అధికార పరిధిని విస్తరించుకుంటున్నాయి. దీనిపై గతంలో చర్చ జరిగినప్పుడు బి.ఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ.. 'కార్యనిర్వాహక శాఖ నుంచి న్యాయ వ్యవస్థకు స్వతంత్రత అవసరమే. కానీ స్వతంత్రత పేరుతో ఒక సామ్రాజ్యంలో మరో సామ్రాజ్యాన్ని సృష్టించకూడదు' అని అన్నారు. రాజ్యాంగ రచనా కమిటీలో కీలక సభ్యుడైన అల్లాడి కృష్ణస్వామి అయ్యర్.. 'ఈ దేశ రాజ్యాంగ భవిష్యత్తు సుప్రీంకోర్టు ఇచ్చే దిశా నిర్దేశాలపై ఆధారపడి ఉంటుంది. సుప్రీంకోర్టు తన విధులు నిర్వర్తిస్తున్నప్పుడు సామాజిక, ఆర్థిక, రాజకీయ ధోరణులను కూడా దృష్టిలో ఉంచుకోవాలి' అని పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రజల నుంచి వచ్చింది. ప్రతి ఒక్కరు రాజ్యాంగం మీద ప్రమాణం చేస్తారు. రాజ్యాంగం ద్వారానే అధికారం స్వీకరిస్తారు. రాజ్యాంగం పేరిటే విధులు నిర్వహిస్తారు. కాబట్టి రాజ్యాంగానికి ఔన్నత్యం ఆపాదించాలి కానీ వ్యవస్థలకు కాదు!!

# లాలాజలంలో ఉండే ఎంజైములు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

**జనరల్ స్టడీస్**

**బయాలజీ**



### జీర్ణవ్యవస్థ

జీవుల పెరుగుదల, వివిధ కణాల విధుల నిర్వహణ, శక్తి కోసం ఆహారం అవసరం. ఎంజైముల చర్యలతో సంక్లిష్ట ఆహార పదార్థాలు సరళ పదార్థాలుగా మారతాయి. దీన్ని జీర్ణక్రియ అంటారు. జీర్ణక్రియలో పాల్గొనే అవయవాలన్నింటిని కలిపి జీర్ణ వ్యవస్థగా పేర్కొంటారు. మానవుడి జీర్ణ వ్యవస్థను మూడు భాగాలుగా విభజించొచ్చు. అవి..

1) ఆహారనాళం లేదా జీర్ణనాళం
2) జీర్ణగ్రంథులు
3) జీర్ణక్రియా విధానం

### ఆహారనాళం

ఆహారనాళం పొడవు 9 మీటర్లు. ఇది నోటితో ప్రారంభమై, పాయువుతో అంతమవుతుంది. ఆహారనాళంలోని భాగాలు వరుసగా..

1) నోరు 2) ఆస్యకుహరం
3) గ్రసని 4) ఆహార వాహిక
5) జీర్ణాశయం
6) చిన్న పేగు, 7) పెద్ద పేగు
8) పురీషనాళం 9) పాయువు

### నోరు

ఇది ఆహారనాళం మొదటి భాగం. నోటి ద్వారా ఆహారం తీసుకునే ప్రక్రియను అంతఃగ్రహణం అంటారు. నోటిలో ఆహారం 15 నుంచి 30 సెకన్ల వరకు ఉంటుంది.

### ఆస్యకుహరం

రెండు దవడల మధ్య ఉన్న ఖాళీ ప్రదేశాన్ని ఆస్యకుహరం అంటారు. దీనిలో మూడు భాగాలుంటాయి. అవి..

1) దంతాలు 2) లాలాజల గ్రంథులు
3) నాలుక

### దంతాలు

దంతాల అధ్యయనాన్ని ఒడెంటాలజీ అంటారు. ఎక్కువ సంఖ్యలో దంతాలున్న జీవులు..

అపోజం – 50
గుర్రం, పంది – 44

దంతాలు డెంటిన్‌తో ఏర్పడతాయి. దంతాల్లోని సజీవ కణాలు ఒడంటోబ్లాస్టులు. ఈ కణాలు డెంటిన్‌ను స్రవిస్తాయి. దంతం కిరీట భాగాన్ని కప్పుతూ ఉండే మెరిసే పొరను ఎనామిల్ లేదా పింగాణి పొర అంటారు. ఈ ఎనామిల్ దంతాలకు దృఢత్వాన్నిస్తుంది. పింగాణి పొర ఏర్పడటానికి ఫ్లోరిన్ (తక్కువ మోతాదులో) అవసరం. మానవ శరీరంలో అతి దృఢమైన పదార్థం ఎనామిల్ (పింగాణి).

### దంత నిర్మాణం

దంత నిర్మాణంలో 3 భాగాలుంటాయి.

1) కిరీటం 2) మెడ 3) మూలం

**కిరీటం (క్రౌన్):** పైకి కనిపించే దంతభాగం.

**మెడ:** చిగురు వద్ద ఉండే దంత భాగం.

**మూలం (రూట్):** దవడ గుంతల్లో ఉండే దంత భాగం.

మానవ దంతాలు దవడ ఎముక గుంతల్లో అమరి ఉంటాయి. ఇలాంటి అమరికను థీకోడాంట్ దంత విన్యాసం అంటారు. మానవుడి జీవిత కాలంలో రెండుసార్లు దంతాలు ఏర్పడతాయి. దీన్ని ద్వివార దంత విన్యాసం అంటారు. చేపల జీవితకాలంలో అనేకసార్లు దంతాలు ఏర్పడతాయి. దీన్ని బహువార దంత విన్యాసం అంటారు. పక్షుల్లో దంతాలు ఉండవు.

### దంతాలు - రకాలు

మానవుడిలో రెండు రకాల దంతాలు ఏర్పడతాయి. 1) పాలదంతాలు
2) శాశ్వత దంతాలు

### పాల దంతాలు

ఇవి 6 నుంచి 7 నెలల వయసులో ఏర్పడి, 8 నుంచి 9 సంవత్సరాల వయసులో ఊడిపోతాయి. పాల దంతాల సంఖ్య – 20

పాలదంతాల ఫార్ములా:

చిన్న పిల్లల పాలదంతాల్లో లోపించిన దంతాల సంఖ్య – 12

అవి.. అగ్ర చర్వణకాలు– 8, జ్ఞానదంతాలు– 4

### శాశ్వత దంతాలు

పాలదంతాలు ఊడిపోయి వాటి స్థానంలో శాశ్వత దంతాలు వస్తాయి.

శాశ్వత దంతాల అర్ధ దవడ ఫార్ములా:

శాశ్వత దంతాలు వివిధ ఆకార, పరిమాణాల్లో ఉంటాయి. కాబట్టి వీటిని విషమ దంతాలు అంటారు.

- ఏనుగు పైదవడలోని కుంతకాలు, ఏనుగు దంతాలు(టస్క్)గా మార్పు చెందుతాయి.
- రదనికలు మాంసాహార జీవుల్లో బాగా అభివృద్ధి చెంది ఉంటాయి. రదనికల అగ్రభాగం మొనదేలి ఎముకల నుంచి మాంసాన్ని చీల్చడానికి ఉపయోగపడుతుంది.
- కుందేలులాంటి శాకాహార జీవుల్లో రదనికలు లోపించి దవడలో ఏర్పడే ఖాళీ ప్రదేశాన్ని 'డయాస్టీమా' అంటారు. డయాస్టీమా లోపించిన జీవులు.. పులి, సింహం, కుక్క.
- సముద్ర క్షీరదాలైన సీల్, వాల్‌రస్‌లో ఏర్పడే రెండు పొడవైన దంతాలు.. రదనికల రూపాంతరాలు.
- పాములోని రెండు కోరలు కూడా రదనికల రూపాంతరాలే.
- చర్వణకాల్లోని చివరి దంతాన్ని జ్ఞానదంతం (విస్‌డమ్ టీత్) అంటారు. ఇది యుక్త వయసులో (21 ఏళ్ల తర్వాత) ఏర్పడుతుంది.

**రూట్ కెనాల్ థెరపీ:** శాశ్వత దంతాలు ఊడిపోయినప్పుడు దంతవైద్యులు కృత్రిమ దంతాలను దవడ గుంతల్లో అమర్చే ప్రక్రియ.

### దంత వ్యాధులు

**ఫ్లోరోసిస్:** ఫ్లోరిన్ (2 పీపీఎం కంటే ఎక్కువ) నీటిని తాగడం వల్ల దంతాలు పసుపు రంగులోకి మారుతాయి. ఎముకలు వికృత రూపం దాల్చుతాయి.

**పయేరియా:** దంతాలు, చిగుళ్ల నుంచి చీము వస్తుంది.

**జింజివైటిస్:** రెండు దంతాల మధ్యలోని చిగురులో వాపు.

**దంతక్షయం:** బ్యాక్టీరియా చర్యలతో దంతాలపై ఎనామిల్ క్షీణించడం.

### లాలాజల గ్రంథులు

మానవుడిలో మూడు జతల లాలాజల గ్రంథులు ఉంటాయి. కుందేలులో నాలుగు జతలుంటాయి. పాములో లాలాజల గ్రంథులు విష గ్రంథులుగా రూపాంతరం చెందుతాయి. లాలా జల గ్రంథులు రోజుకు ఒక లీటరు లాలాజలాన్ని ఉత్పత్తి చేస్తాయి. లాలాజలం ఆమ్లం స్వభావం (pH–6.8) లో ఉంటుంది.

దీనిలో టయలిన్ (లాలాజల అమైలేజ్), లైసోజోమ్ అనే ఎంజైములు ఉంటాయి. టయలిన్ పిండి పదార్థాలను డెక్ట్రిన్, మాల్టోజ్ చక్కెరలుగా మారుస్తుంది. లైసోజైమ్ సూక్ష్మజీవ నాశినిగా పని చేసి నోటి దుర్వాసనను దూరం చేస్తుంది.

### నాలుక

నాలుక రుచులను గుర్తించే జ్ఞానేంద్రియం. దీనిపై రుచులను గుర్తించే నాలుగు రకాల రుచి మొగ్గలు ఉంటాయి. అవి..

- నాలుక కొన – తీపి రుచి మొగ్గలు
- నాలుక కొన వెనక భాగం – ఉప్పు
- నాలుక పక్క భాగాలు – పులుపు
- నాలుక లోపలి భాగం (గొంతులో)– చేదు రుచి మొగ్గలు ఉంటాయి.

### గ్రసని

ఆహార, వాయు నాళ మార్గాల కూడలిని గ్రసని అంటారు. గ్రసనిలో ఎలాంటి జీర్ణక్రియ జరగదు.

### ఆహార వాహిక

ఇది గ్రసనితో ప్రారంభమై జీర్ణాశయంలోకి తెరుచుకుంటుంది. ఆహార వాహికలోనూ ఎలాంటి జీర్ణక్రియ జరగదు. ఆహారం మింగినప్పుడు అది ఆహార వాహికలోకి చేరుతుంది.

- ఆహారాన్ని మింగడం నియంత్రిత చర్య.
- ఆహార వాహికలో ఆహారం 10 నుంచి 15 సెకన్లు ఉంటుంది.
- ఆహార వాహికలోని పెరిస్టాలిటిక్ చలనాలతో ఆహారం జీర్ణాశయంలోకి చేరుతుంది.

### జీర్ణాశయం

జీర్ణాశయం సంచి లాంటి కండర నిర్మిత భాగం. ఇది ఉదరంలో ఎడమ వైపు ఉంటుంది. జీర్ణాశయం గోడల్లోని జఠర గ్రంథులు జఠర రసాన్ని స్రవిస్తాయి. జఠర రసంలో హైడ్రోక్లోరిక్ ఆమ్లం (HCl), పెప్సిన్, రెనిన్ అనే ఎంజైములు, మ్యూసిన్ ఉంటాయి.

- జీర్ణాశయంలోని హైడ్రోక్లోరిక్ ఆమ్లం ఆహారంలోని సూక్ష్మజీవులను చంపుతుంది. ఆహారానికి ఆమ్ల స్వభావాన్ని కలిగిస్తుంది.
- జీర్ణాశయంలో ఆమ్లం అధికంగా ఉత్పత్తి అయితే పెప్టిక్ అల్సర్ వస్తుంది.
- పెప్టిక్ అల్సర్ నివారణకు మిల్క్ ఆఫ్ మెగ్నిషియాన్ని ఔషధంగా వాడుతారు. దీనిలో మెగ్నిషియం హైడ్రాక్సైడ్ ఉంటుంది.
- హెలికో బ్యాక్టర్ పైలోరి అనే బ్యాక్టీరియా వల్ల జీర్ణాశయ అల్సర్ వస్తుందని రోబిన్ వారెన్, బెరి మార్షల్ కనుగొన్నారు. వీరి పరిశోధనకు 2005లో నోబెల్ బహుమతి లభించింది.

**విధులు**

- ఆహారాన్ని తాత్కాలికంగా నిల్వ చేయడం (2 నుంచి 4 గంటలు)
- ఆహారంలోని పదార్థాలను కలపడం.
- ఆహారంలో భౌతిక రసాయన మార్పులను కలిగించడం.
- జీర్ణాశయ గోడల్లోని వర్తుల కండరాలు ఆహారాన్ని మెత్తగా చేస్తాయి.
- జీర్ణాశయంలో పాక్షికంగా జీర్ణమై ద్రవరూపంలోకి మారిన ఆహారాన్ని కైమ్ అంటారు. (కైమ్ ఆమ్ల స్థితిలో ఉంటుంది).

మానవుడి జీర్ణాశయంలో మూడు గదులుంటాయి. కానీ, నెమరువేసే జంతువుల్లో నాలుగు గదులుంటాయి. అవి.. 1) ప్రథమ ఆమాశయం 2) జాలకం 3) తృతీయ ఆమాశయం 4) చతుర్థ ఆమాశయం.

వీటిలో ప్రథమ ఆమాశయం పెద్దది. ఈ గదిలో సెల్యులోజ్‌ను ఉత్పత్తి చేసే సూక్ష్మజీవులుంటాయి. ఈ గది మానవుడిలో లోపించి ఉంటుంది.

**గ్యాస్ట్రో ఎంటరాలజీ:** జీర్ణాశయం, ఉదరంలోని భాగాల అధ్యయనాన్ని గ్యాస్ట్రో ఎంటరాలజీ అంటారు.

అన్నవాహికను ఎక్స్‌రే తీసే ముందు రోగికి బేరియం ద్రావణాన్ని తాగిస్తారు. బేరియం ఎక్స్ కిరణాలను బాగా గ్రహిస్తుంది.

### బేరియాట్రిక్ సర్జరీ

ఊబకాయుల్లో బరువును తగ్గించడానికి బేరియాట్రిక్ సర్జరీ చేస్తారు. ఉదరంలోని అన్నకోశం (జీర్ణాశయం) సైజు తగ్గించడం దీని ప్రధాన లక్ష్యం. లైపోసక్షన్ ఇందుకు పూర్తి భిన్నం. దీనిలో వివిధ శరీర భాగాల్లో అదనంగా పేరుకున్న కొవ్వును తొలగిస్తారు. .

### గతంలో అడిగిన ప్రశ్నలు

1. గ్యాస్ట్రో ఎంటరాలజీ దేని అధ్యయనం?
   1) మెదడు అధ్యయనం
   2) కిడ్నీ అధ్యయనం
   3) ఉదరం లోపలి భాగాల అధ్యయనం
   4) పైవన్నీ
2. మానవుడిలో దంతాల సంఖ్య?
   1) 23 2) 43 3) 28 4) 32
3. ఎనామిల్ దేన్ని కప్పి ఉంచుతుంది?
   1) దంతం
   2) దంత కిరీటంపైనా, లోపల
   3) డెంటిన్ ఉన్న భాగం 4) పైవన్నీ
4. పిల్లల పాల దంతాల్లో లోపించినవి?
   1) ఇన్‌సిజర్స్ 2) కైనైన్స్
   3) ప్రిమోలార్స్ 4) మోలార్స్
5. లాలాజలం స్వభావం?
   1) తటస్థ 2) ఆమ్ల
   3) క్షార 4) పైవన్నీ
6. రూట్ కెనాల్ థెరపీ అనేది?
   1) పాడైన పళ్లు 2) పాడైన కిడ్నీ
   3) పాడైన గుండె 4) పాడైన గోళ్లు
7. బేరియాట్రిక్ శస్త్ర చికిత్స అంటే ఏమిటి?
   1) గుండె బైపాస్ సర్జరీ
   2) ఉదరం బైపాస్ సర్జరీ
   3) మెదడు సర్జరీ
   4) గుండె ఓపెన్ హార్ట్ సర్జరీ
8. కింది వాటిలో ఎంజైమ్?
   1) గ్లూకగాన్ 2) ఇన్సులిన్
   3) ట్రిప్సిన్ 4) సొమాటోట్రోపిన్
9. మానవుడి జీర్ణాశయంలో ఉత్పత్తి అయ్యే ఆమ్లం?
   1) ఎసిటికామ్లం 2) హైడ్రోక్లోరికామ్లం
   3) పార్మిక్ ఆమ్లం 4) నైట్రికామ్లం
10. పయేరియా వ్యాధి దేనికి సంబంధించింది?
    1) చిగుళ్లు 2) ముక్కు
    3) గుండె 4) ఊపిరితిత్తులు
11. మానవ శరీరంలో ఆహారనాళం సగటు పొడవెంత?
    1) 2 మీటర్లు 2) 4 మీటర్లు
    3) 6 మీటర్లు 4) 9 మీటర్లు
12. నీటిలో ఏ పదార్థం ఎక్కువగా ఉండటంతో ఎముకల్లో వంకర్లు వస్తాయి?
    1) ఫ్లోరైడ్ 2) క్లోరైడ్
    3) లెడ్ 4) ఏదీకాదు
13. నీటిలో ఫ్లోరైడ్ ఎక్కువగా ఉండటంతో వచ్చే వ్యాధి?
    1) క్షయ 2) కాలేయ జబ్బు
    3) ఎముకల్లో బలహీనమైన కీళ్లు
    4) ఏదీకాదు

**సమాధానాలు**

1) 3; 2) 4; 3) 2; 4) 3; 5) 2; 6) 1; 7) 2; 8) 3; 9) 2; 10) 1; 11) 4; 12)1; 13) 3.

# Spiral Model was developed by?

BANK EXAMS

COMPUTER AWARENESS

### SDLC (Software Development Life Cycle)

SDLC, Software Development Life Cycle is a process used by software industry to design, develop and test high quality softwares. It is also called as Software development process.

- ISO/IEC 12207 is an international standard for software life-cycle processes. It aims to be the standard that defines all the tasks required for developing and maintaining software.

A typical Software Development life cycle consists of the following stages:


**Stage1:** Planning and Requirement Analysis
**Stage 2:** Defining Requirements
**Stage 3:** Designing the product architecture
**Stage 4:** Building or Developing the Product
**Stage 5:** Testing the Product
**Stage 6:** Deployment in the Market and Maintenance

**SDLC Models**

- Waterfall Model
- Iterative Model
- Spiral Model
- V-Model
- Big Bang Model

The other related methodologies are Agile Model, RAD Model, Rapid Application Development and Prototyping Models.

**SDLC Waterfall Model**





The sequential phases in Waterfall model are:

- **Requirement Gathering and analysis:** All possible requirements of the system to be developed are captured in this phase and documented in a requirement specification doc.
- **System Design:** The requirement specifications from first phase are studied in this phase and system design is prepared. System Design helps in specifying hardware and system requirements and also helps in defining overall system architecture.
- **Implementation:** With inputs from system design, the system is first developed in small programs called units, which are integrated in the next phase. Each unit is developed and tested for its functionality which is referred to as Unit Testing.
- **Integration and Testing:** All the units developed in the implementation phase are integrated into a system after testing of each unit. Post integration the entire system is tested for any faults and failures.
- **Deployment of system:** Once the functional and non functional testing is done, the product is deployed in the customer environment or released into the market.
- **Maintenance:** There are some issues which come up in the client environment. To fix those issues patches are released. Also to enhance the product some better versions are released. Maintenance is done to deliver these changes in the customer environment.

All these phases are cascaded to each other in which progress is seen as flowing steadily downwards (like a waterfall) through the phases. The next phase is started only after the defined set of goals are achieved for previous phase and it is signed off, so the name "Waterfall Model". In this model phases do not overlap.

**SDLC Iterative Model**




This model is most often used in the following scenarios:

- Requirements of the complete system are clearly defined and understood.
- Major requirements must be defined; however, some functionalities or requested enhancements may evolve with time.
- A new technology is being used and is being learnt by the development team while working on the project.
- Resources with needed skill set are not available and are planned to be used on contract basis for specific iterations.
- There are some high risk features and goals which may change in the future.

**SDLC Spiral Model**




- **Identification:** This phase starts with gathering the business requirements in the baseline spiral. In the subsequent spirals as the product matures, identification of system requirements, subsystem requirements and unit requirements are all done in this phase.

At the end of the spiral the product is deployed in the identified market.

- **Design:** Design phase starts with the conceptual design in the baseline spiral and involves architectural design, logical design of modules, physical product design and final design in the subsequent spirals.
- **Construct or Build:** Construct phase refers to production of the actual software product at every spiral. In the baseline spiral when the product is just thought of and the design is being developed a POC (Proof of Concept) is developed in this phase to get customer feedback.
- **Evaluation and Risk Analysis:** Risk Analysis includes identifying, estimating, and monitoring technical feasibility and management risks, such as schedule slippage and cost overrun.

**Summary**

- Waterfall and V model are traditional SDLC models and are of sequential type. Sequential means that the next phase can start only after the completion of first phase. Such models are suitable for projects with very clear product requirements and where the requirements will not change dynamically during the course of project completion.
- Iterative and Spiral models are more accommodative in terms of change and are suitable for projects where the requirements are not so well defined, or the market requirements change quite frequently.
- Big Bang model is a random approach to Software development and is suitable for small or academic projects.
- Agile is the most popular model used in the industry. Agile introduces the concept of fast delivery to customers using prototype approach.

### MODEL QUESTIONS

1. Spiral Model was developed by?
   1) Bev Littlewood
   2) Berry Bohem
   3) Roger Pressman
   4) Victor Bisili
   5) None of Above
2. Which model is popular for students small projects ?
   1) Waterfall Model
   2) Spiral Model
   3) Quick and Fix model
   4) Prototyping Model
   5) None of Above
3. Which is not a software life cycle model?
   1) Spiral Model
   2) Waterfall Model
   3) Iterative Model
   4) Capability maturity Model
   5) V-Shape Model
4. Project risk factor is considered in ?
   1) Spiral Model
   2) Waterfall Model
   3) Prototyping Model
   4) Iterative enhancement Model
   5) None of Above
5. SDLC stands for?
   1) Software design life cycle
   2) Software development life cycle
   3) System design life cycle
   4) System development life cycle
   5) None of Above
6. SPIRAL model has?
   1) 3 Phases 2) 1 Phase
   3) 2 Phases 4) 4 Phases
   5) None of Above
7. SRS stands for?
   1) Software requirement specification
   2) Software requirement solution
   3) System requirement specification
   4) System requirement ossification
   5) None of Above
8. Waterfall model is not suitable for?
   1) Small Projects
   2) Complex Projects
   3) Accommodating change
   4) Diminutive Projects
   5) None of Above
9. RAD stands for?
   1) Rapid Application Development
   2) Relative Application Development
   3) Ready Application Development
   4) Repeated Application Development
   5) None of Above
10. RAD Model was purposed by?
    1) IBM 2) Motorola
    3) Microsoft
    4) Lucent Technologies
    5) None of Above
11. Software engineering aims at developing?
    1) Reliable Software
    2) Cost Effective Software
    3) Reliable and cost effective Software
    4) All of above
    5) None of Above
12. A good specification should be?
    1) Unambiguous
    2) Distinctly Specific
    3) Functional 4) All of Above
    5) None of Above
13. Which of the following is a tool in design phase?
    1) Abstraction
    2) Refinement
    3) Information Hiding
    4) All of Above
    5) None of Above
14. Information hiding is to hide from user, details ?
    1) That are relevant to him
    2) That are not relevant to him
    3) That may be maliciously handled by him
    4) That are confidential
    5) None of Above

**KEY**

1) 2 2) 1 3) 4 4) 1
5) 2 6) 4 7) 1 8) 3
9) 1 10) 1 11) 3 12) 4
13) 4 14) 3